www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సోమవారం | 12-2-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 58 సంచిక: 298 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి రా. 8.05 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పూర్వాషాఢ రా. 2.04 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: ఉ. 9.49-11.37; దుర్ముహూర్తం: మ. 12.53-1.39, మ. 3.10-3.56; అమృతఘడియలు: రా. 8.39-10.27; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.48; సూర్యాస్తమయం: 6.13 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai


గుంటూరులో గల్లా జయదేవ్ ర్యాలీ

అబద్ధాలు చెబితే ఊరుకోవద్దు

"చేసిన సాయం విషయంలో అబద్ధాలు అవసరం లేదు. రాజకీయాలు కూడా అక్కర్లేదు. అసలేం జరిగిందో ప్రజలకు తెలియాలి. లెక్కలు, వాస్తవాలు వారి ముందు పెట్టండి. వారే నిర్ణయిస్తారు."

- టీడీపీ నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు

14



కేంద్రాన్ని అడుక్కోవాలా?

ప్రత్యేకంగా ఏమిచ్చారు?.. బీజేపీ లెక్కలపై టీడీపీ ఫైర్

- అన్ని రాష్ట్రాలకూ ఇచ్చిందే కదా.. అదేదో గొప్పగా చెబుతారేం?
- రోడ్లకు లక్ష కోట్లు అవాస్తవం.. మూడేళ్లలో 5,900 కోట్లే ఇచ్చారు
- అవీ కేంద్ర ప్రభుత్వం జేబులోవి కాదు.. పబ్లిక్-ప్రైవేటు, టోల్ రోడ్లే
- ఇళ్లు దేశమంతా ఇచ్చారు.. ఆంధ్రప్రదేశ్‌కే ఇచ్చినట్లు మాట్లాడతారేం?
- జాతీయ సంస్థలకు వేల కోట్ల భూములిచ్చాం.. కేంద్రమిచ్చింది 450 కోట్లే
- దుగరాజపట్నానికి బదులు రామాయపట్నం.. ఎప్పుడో చెప్పినా పట్టలేదే
- పోలవరం, అమరావతి, లోటు, ప్యాకేజీ, రైల్వేజోన్‌పై మాట్లాడరేం?
- 'అద్భుత రాజధాని' కల తప్పా?.. బీజేపీపై అన్ని పార్టీల్లో అనుమానాలు
- మోసం చేస్తుందేమోనని డౌట్.. మీడియాతో కళా, గల్లా, రామ్మోహన్

'మిగతా రాష్ట్రాలకు ఇచ్చినట్లే మన రాష్ట్రానికీ నిధులిచ్చారు. అదేదో ప్రత్యేకంగా నవ్యాంధ్రకే ఇచ్చినట్లు చెబుతున్నారు. ఏపీ కూడా దేశంలో భాగంగా ఉంది. మనకు రావలసిన దానికోసం ప్రతిసారీ కేంద్రాన్ని అడుక్కోవాలా? భిక్షాపాత్ర పట్టుకుని వెళ్లాలా? ఏమనుకుంటున్నారసలు?'

...అంటూ బీజేపీ నేతలపై టీడీపీ ఆగ్రహం వ్యక్తంచేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారమిక్కడ తన నివాసంలో పార్టీ నేతలు, ఎంపీలతో చర్చించారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళావెంకట్రావు, ఎంపీలు గల్లా జయదేవ్, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు లక్షల కోట్లు ఇచ్చామంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు విడుదల చేసిన 27 పేజీల నివేదికపైనే

మిగతా 14వ పేజీలో...


మీడియా సమావేశంలో కుటుంబరావు, రామ్మోహన్ నాయుడు, కళా వెంకట్రావు, గల్లా జయదేవ్

లోటుపై వైవీ రెడ్డితో కమిటీ!

యుద్ధం ఇప్పుడే మొదలైంది

- ఢిల్లీలో ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తాం
- రాష్ట్రానికి న్యాయం జరిగే వరకూ పోరాటం: గల్లా
- గొంతెమ్మ కోర్కెలు కాదు.. 5లోగా తేల్చాల్సిందే
- అవసరమైతే కేంద్రానికి రాం రాం : మంత్రులు, ఎంపీలు

5


ఉండవల్లితో పవన్

15 డెడ్‌లైన్

ఈలోగా ఇరుపక్షాలూ నిధుల వివరాలు నాకివ్వాలి

ఆ లెక్కల వివరాలు కమిటీ ముందు ఉంచుతాం

- పరస్పర విరుద్ధంగా టీడీపీ, బీజేపీ వాదనలు
- ప్రజలతోపాటు నాకూ అయోమయంగా ఉంది
- లెక్కలిస్తే అబద్ధం చెబుతున్నదెవరో తేలుస్తాం
- లెక్కలు ఇవ్వకుంటే ఏం చేయాలో ఆలోచిస్తా
- ప్రధానిని ప్రభావితం చేసే శక్తి నాకు ఉందా?
- తిరుగుబాటు కాదు.. న్యాయ పోరాటం: పవన్
- పవన్ నిజమైన రాజకీయం మొదలు పెట్టారు
- ఆయనవల్లే టీడీపీ, బీజేపీ గెలిచాయి: ఉండవల్లి


హైదరాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): 'ఏపీకి కేంద్రం నుంచి నిధుల విడుదలపై బీజేపీ, టీడీపీ చెబుతున్న విషయాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. ప్రజలతోపాటు నాకూ అయోమయంగా ఉంది. నిధులపై టీడీపీ, బీజేపీల్లో ఏదో ఒక పార్టీ అబద్ధం చెబుతోందన్న మాట వాస్తవం.' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్

మిగతా 5వ పేజీలో...

కమలదళం విలవిల!

బడ్జెట్‌లో మొండిచేయిపై ప్రజాగ్రహం

- మోదీపై తీవ్ర వ్యతిరేకత.. సాయం చేయకుండా ప్రజల్లోకి ఎలా వెళ్తాం?
- ఒంటరి పోరు చేయలేం.. వైసీపీతో దోస్తీ ప్రమాదం
- టీడీపీ వదిలేస్తే ఇబ్బందే.. నిధులిస్తే జారిపోదు
- అధిష్ఠానానికి బీజేపీ శ్రేణుల సందేశాలు!!



14



గాలిలో ప్రాణాలు

- ఎదురెదురుగా రెండు విమానాలు
- దూరం 100 అడుగులే
- రెండు విమానాల్లో 261 మంది
- ఇద్దరు విస్తారా పైలెట్లపై చర్యలు

16

రష్యాలో కూలిన విమానం

71 మంది దుర్మరణం?

- మాస్కో నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఘోర ప్రమాదం
- చెల్లాచెదురుగా శకలాలు


అబుదాబీలో ప్రవాస భారతీయుల సదస్సులో మోదీ అభివాదం

గత ప్రభుత్వాలు సాధించింది శూన్యం

16

- తీగలుండేవి.. కరెంటు ఉండేది కాదు.. డ్యామ్‌లు కడితే కాలువలు లేవు
- కుంభకోణాలతో భారత్‌పై మచ్చ.. పోగొట్టేందుకు కష్టపడుతున్నాం
- ప్రతి ప్రవాసీ భారత రాయబారే: ఒమాన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ

నక్సల్స్ చేతిలో స్నైపర్లు!


నక్సల్స్ తయారుచేసిన ఐఈడీ బాణాలు. స్నైపర్ రైఫిల్

వెదురు బాణాలకు ఐఈడీలు కూడా

- 2 కి.మీ. లక్ష్యాన్నీ ఛేదించగల స్నైపర్ రైఫిల్
- ప్రజాప్రతినిధులకు పొంచి ఉన్న ముప్పు
- ఆ బాణాలతో మందుపాతర స్థాయి విధ్వంసం
- 'ఆపరేషన్ సమాధాన్'ను తిప్పికొట్టేందుకే

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్నైపర్ రైఫిల్.. 2 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని సైతం గురిచూసి ఛేదించగల అత్యాధునిక ఆయుధం. ఈ విధ్వంసకర అస్త్రం ఇప్పుడు మావోయిస్టుల చేతికి చిక్కింది. 'ఆపరేషన్ సమాధాన్'తో మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలను భద్రతాదళాలు జల్లెడపడుతుండటంతో మావోయిస్టు పార్టీ పెద్ద ఎత్తున కేడర్‌ను కోల్పోతోంది. ఈ పరిస్థితుల్లో తమ ఉనికిని, కేడర్‌ను కాపాడుకునేందుకు

మిగతా 5వ పేజీలో...

• బుల్లెట్ ప్రూఫ్ బేబీ



ఈ పాప బుల్లెట్‌ను జయించి జన్మించింది. జమ్మూలోని సుంజువాన్ సైనిక శిబిరంపై శనివారం ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఓ నిండు గర్భిణి తీవ్రంగా గాయపడింది. బుల్లెట్ ఆమె వెన్నెముకకు తగిలింది. అయితే ఆమె కడుపులోని పాప చిన్నగాయం కూడా లేకుండా ఆదివారం ఈ లోకంలోకి వచ్చింది.

• ఏటీఎంలో పిల్ల నోట్లు

ఈ నోటు చూడండి. చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఫుల్ ఆఫ్ ఫన్ అని ఉన్న ఇలాంటి నోట్లను పిల్లలు బిజినెస్ వంటి ఆటల్లో ఉపయోగిస్తుంటారు. అయితే ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో యాక్సిస్ బ్యాంకు ఏటీఎం నుంచి ఇలాంటి నోట్లు బయటకొచ్చాయి. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు ఏటీఎంను మూసివేశారు.



• వాట్సాప్‌లో చెల్లింపు

వాట్సాప్ వినియోగదారులకు శుభవార్త! వాట్సాప్ ద్వారా ఇక నగదు చెల్లింపులు కూడా చేసుకోవచ్చు! ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఈ సౌకర్యం ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది!

మీ రేషన్.. మా ఇష్టం!



సక్రమంగా తెరుచుకోని షాపులు.. రోజూ సగటున 4 వేలు క్లోజ్

కార్డుదారులకు ఇబ్బందులు.. పట్టించుకోని అధికారులు

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): 'ఈ రోజు కోటా బియ్యం చివరిరోజు. రేపటి నుంచి ఇవ్వరు. కావాల్సిన వారు వెంటనే తీసుకెళ్లాలి' అని ఒకప్పుడు గ్రామాల్లో చాటింపులు వినిపించేవి. ప్రతినెలా పదిహేను రోజులు రేషన్ పంపిణీ చేయాల్సి ఉన్నా తొలి ఐదురోజుల్లో ఇచ్చిన వరకు ఇచ్చి చాప చుట్టేసేవారు. అప్పట్లో దాన్ని ప్రశ్నించేవారు కూడా పెద్దగా లేకపోవడం, కార్డుదారుల అవగాహనలేమి వల్ల డీలర్లు ఆడిందే ఆట అన్నట్టుగా సాగేది. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక పక్కా నిబంధనలు అమలుచేయాలని ఈపోస్ తెచ్చినా డీలర్ల తీరు మాత్రం మారడం లేదు. నెలలో మొదటి పదిహేను రోజులు తప్పనిసరిగా

మిగతా 5వ పేజీలో...

రేషన్ డీలర్ల మాయాజాలం

- వేలిముద్రతో 'డబుల్' వసూళ్లు
- మోసం తెలియక లబ్ధిదారుల గగ్గోలు
- బ్యాంకులకు పరుగులు
- గుంటూరు జిల్లాలో నాలుగు ఫిర్యాదులు
- జనం అమాయకత్వమే డీలర్లకు పెట్టుబడి

4 వేల పంచాయతీ కార్యదర్శుల భర్తీ!

ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకం.. ప్రతి పంచాయతీకీ ఒక్కో సెక్రటరీ.. ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు

2

కేసు పెండింగ్.. నో పోటీ!

- తీవ్ర నేరారోపణలపై విచారణ జరుగుతున్నా ఎన్నికల్లో పోటీకి అనుమతించరాదు
- చట్టసవరణకు ప్రభుత్వం పూనుకోవాలి
- పార్టీల రిజిస్ట్రేషన్ రద్దు అధికారమూ ఇవ్వాలి
- సుప్రీంకోర్టులో ఎన్నికల కమిషన్ అఫిడవిట్

16

SBI

ఎస్‌బీఐలో రూ. 20 వేల కోట్ల రుణాలమాఫీ

2016-17లో రూ.81,683 కోట్లకు పీఎస్‌బీల రైట్ ఆఫ్స్

12



కాలస్వరూపిణి.. దక్షిణ కాళి



పరంజ్యోతి

అనంతమైన కాలం స్త్రీ రూపాన్ని ధరిస్తే కాళీరూపంగా భాసిల్లుతుంది. ఏ వ్యక్తి అయినా ఎన్ని శక్తులున్నా కాలం అధీనంలో ఉండాల్సిందే. కాలం తీరాక కాలగర్భంలో కలిసిపోవాల్సిందే. అయితే కాల స్వరూపం అయిన కాళిని ఎవరు అర్చిస్తారో, ఆ తల్లి అనుగ్రహాన్ని, మంత్ర సిద్ధిని ఎవరు పొందుతారో వారు అకాల మృత్యుగండాన్ని తప్పించుకోగలుగుతారు. మృత్యుంజయ స్వరూపిణిగా ఆమెను ఆరాధించే రూపం 'దక్షిణ కాళి' రూపం. బెంగాల్‌కు చెందిన కృష్ణానంద ఆగమ వాగీశ అనే ప్రముఖ పండితుడు వైదిక, తంత్ర శాస్త్రాలలో అపార జ్ఞానం కలిగిన వ్యక్తి. 16వ శతాబ్దానికి చెందిన ఆయన తంత్రసార మొదలైన అద్భుత గ్రంథాలను రచించారు. కాళీదేవి ఆయనకు కలలో దక్షిణ కాళిగా దర్శనమిచ్చి ఆ రూపానికి ప్రజల్లో ప్రాచుర్యం కల్పించాలని చెప్పింది. ఆ రూపంలో ఉన్న అమ్మవారి ఆరాధనను కృష్ణానంద దశదిశలా వ్యాపింపజేశారు. కాళీదేవి అనుగ్రహం వల్ల విక్రమార్కుడు, భట్టి.. కాళీ మంత్ర సిద్ధి పొందిన తెలుగు యోగి త్రైలింగ స్వామి.. దీర్ఘకాలంపాటు జీవించారు. కాళీమాత ఆజ్ఞతో రామకృష్ణ పరమహంస.. త్రైలింగ స్వామిని దర్శించుకున్నారు. అలాగే అమ్మవారి అనుగ్రహంతో సుదీర్ఘకాలం జీవించిన మరో కాళీ మంత్ర సిద్ధుడు కీనారాం అఘోరీ. కాశీలో అమ్మవారి సంకల్పంతో హరిశ్చంద్రఘాట్‌కు దగ్గరలో కాళీదేవి ఆలయాన్ని నిర్మించాడు. అమ్మవారు ప్రసాదించిన శక్తులతో ఎందరికో సాయం చేశాడు. మొగల్ పాదుషా షాజహాన్.. కీనారాం అఘోరీ భక్తుడు. ఇలా ఎందరో కాళీ భక్తులు.. దక్షిణ కాళిగా అమ్మవారి అనుగ్రహాన్ని పొందారు.

- మాతా రమ్యానంద భారతి

విశాఖ మన్యంలో ఆంత్రాక్స్

▸ పెదపాకలు వాసికి వ్యాధి లక్షణాలు.. చికిత్స కోసం కేజీహెచ్‌కి

పెదపాకలు(చింతపల్లి), ఫిబ్రవరి 11: విశాఖ మన్యంలో ఆంత్రాక్స్ లక్షణాలు బయటపడ్డాయి. చింతపల్లి మండలం కొత్తపాలెం పంచాయతీ పెదపాకలులో ఓ గిరిజనుడి శరీరంపై ఆంత్రాక్స్ పోలిన పుండ్లు కనిపించాయి. పెదపాకలులో 50 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. 5రోజుల కిందట చినపోయిన ఓ పశువు మాంసాన్ని వీరు ఆహారంగా తీసుకున్నట్టు తెలుస్తోంది. గురువారం గ్రామానికి చెందిన బాలేసు(38) కుడిచేయి, రెండుకాళ్లకు చిన్నపాటి కురుపులు వచ్చాయి. అవి పగిలిపోయి నల్లని మచ్చగా ఏర్పడి పుండు పెద్దదైంది. జ్వరం కూడా వచ్చింది. సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఏఎన్ఎం, ఆరోగ్య విస్తరణ అధికారి గ్రామాన్ని సందర్శించారు. బాలేసు జ్వరంతో బాధపడుతున్నాడని తెలుసుకుని అతడిని పరీక్షించారు. ఈ పుండ్లు ఆంత్రాక్స్‌ని పోలి ఉన్నాయని గుర్తించి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

వారంలో కూతురి పెళ్లి.. రైతు మృతి

▸ విద్యుదాఘాతంతో పోయిన ప్రాణం

గిద్దలూరు, ఫిబ్రవరి 11: వారంలో కుమార్తె వివాహం.. పెళ్లి పనుల్లో ఆ రైతు బిజీగా ఉన్నాడు. ఇంతలోనే అతడిని విద్యుదాఘాతం రూపంలో మృత్యువు కబళించింది. గిద్దలూరు మండలం ముండ్లపాడుకు చెందిన నంద్యాల నారాయణరెడ్డి(42) రెండో కుమార్తె వివాహం ఈనెల 18న జరగాల్సి ఉంది. కాబోయే అల్లుడు ఆర్మీలో ఉద్యోగం చేస్తుండడంతో సంతోషంగా పెళ్లి పనులు చేసుకుంటున్నారు. ఆదివారం తెల్లవారు జామున మొక్కజొన్న పైరుకు నీరు పెట్టేందుకు నారాయణరెడ్డి పొలం వెళ్లాడు. వ్యవసాయ బోరు స్టార్టర్ ఆన్‌చేసే సమయంలో అక్కడ తెగి పడి ఉన్న తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. సమీప పొలాల్లోని రైతులు ఆయన్ను వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మాజీ మిలటరీ ఉద్యోగి ఆత్మహత్య

▸ రియల్టర్లు మోసగించారంటూ సూసైడ్ నోట్

గిద్దలూరు, ఫిబ్రవరి 11: ప్రకాశం జిల్లా గిద్దలూరులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద నివాసం ఉంటున్న రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి దుగ్గా రంగారెడ్డి (65) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి స్థలానికి పూర్తిగా డబ్బులు చెల్లించినప్పటికీ వ్యాపారులు రిజిస్ట్రేషన్ చేయకపోడంతో మనస్తాపానికి గురైన ఆయన పురుగుమందు తాగి ఉసురు తీసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాచర్ల మండలం ఆకవీడుకు చెందిన రంగారెడ్డి మిలటరీలో పని చేసి 1985లో ఉద్యోగ విరమణ చేశారు. 1992లో స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో రంగారెడ్డి 5సెంట్ల ప్లాటుకోసం డబ్బు చెల్లించినా రిజిస్ట్రేషన్ జరగలేదు. రిజిస్ట్రేషన్ చేయాలని నాలుగేళ్లుగా కోరుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రంగారెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు. తన ఆత్మహత్యకు పెసల నారాయణ, అతని బావమరుదులు, సూర్యనారాయణరెడ్డే కారకులని, వారిని కఠినంగా శిక్షించి తన కుటుంబానికి న్యాయం చేయాలని సూసైడ్ నోట్ రాశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ప్రతి ఇంటికీ కుళాయి నీరు

▸ 2019-20కి కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

▸ ప్రణాళికలు పంపాలని రాష్ట్రాలకు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ తాగునీటి సరఫరా పథకం(ఎన్ఆర్‌డీడబ్ల్యూపీ) ద్వారా రాష్ట్రాల్లో చేపడుతున్న తాగునీటి పథకాలకు సంబంధించి 2018-19 కార్యాచరణ ప్రణాళిక తయారుచేసి పంపాలని అన్ని రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఏపీ తాగునీటి కార్యాచరణ ప్రణాళిక ఆమోదం కోసం మార్చి 21న నిర్వహించనున్న సమావేశానికి హాజరుకావాలని రాష్ట్ర తాగునీటి సరఫరాశాఖ అధికారులకు కేంద్ర తాగునీటి సరఫరా మంత్రిత్వశాఖ లేఖ రాసింది. అందుబాటులో ఉన్న నిధుల మేర అంచనాలు తయారు చేసుకోవాలని, ముందుగా అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. 14వ ఆర్థిక సంఘం నిధులతో 2019-20 నాటికి గ్రామ పంచాయతీల్లో కుళాయిల ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటిని అందించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంది. ఇక నుంచి ఎన్ఆర్‌డీడబ్ల్యూపీ నిధుల నుంచి చేతి పంపులు, బోరువెల్స్ చేపట్టరాదని, ప్రతి కుటుంబానికి కుళాయిల ద్వారా నీరు అందించేందుకు ఇవి వినియోగించాలని ఆదేశించింది. ఇప్పటికే 25శాతం పూర్తయిన నీటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలు సొంత నిధులతో పూర్తి చేసుకోవాలని సూచించింది. ఎన్ఆర్‌డీడబ్ల్యూపీ నిధులను 22శాతం ఎస్సీ నివాసిత ప్రాంతాల్లో, 10 శాతం ఎస్టీ నివాసిత ప్రాంతాల్లో తాగునీటి కోసం వినియోగించాలని ఆదేశించింది.

నేటి నుంచి జల సంరక్షణ ఉద్యమం

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. తాగు, సాగు నీటి అవసరాలు తీర్చడం.. పారిశ్రామిక అవసరాల కోసం నీటిని అందించే లక్ష్యంతో.. నీరు-ప్రగతి, నీరు-చెట్టు వంటి కార్యక్రమాలను ఉద్యమ రూపంలోకి తీసుకువెళ్లాలని నిర్ణయించింది. అందులో భాగంగా సోమవారం నుంచి 'జల సంరక్షణ' పేరిట జలవనరుల శాఖ ఓ కార్యక్రమాన్ని సిద్ధం చేసింది. సీఎం చంద్రబాబు చేతులమీదుగా సోమవారం ప్రారంభమయ్యే ఉద్యమం 116 రోజుల పాటు ఉధృతంగా సాగనుంది. దీనిలో భాగంగా నదీ జలాలను ప్రాజెక్టులలోనూ, చెరువుల్లోనూ నిల్వ చేయడంపై దృష్టి సారిస్తారు. అమరావతి పరిధిలో పాలవాగు వద్ద సీఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కార్యదర్శి శశిభూషణ్ కుమార్ పాల్గొంటారు. చెరువుల్లో పూడికతీత, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, వ్యవసాయ క్షేత్రంలో కుంటల తవ్వకం, అటవీ ప్రాంతాల్లో ప్రత్యేక జల సంరక్షణ, భూగర్భ జలాలను పెంచడం వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నారు.

'సన్నీ'పైనే దృష్టి.. పంటకు లేదు దిష్టి!



పంట చేనుకు దిష్టికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నరదిష్టికి నల్లరాయి అయినా పగిలిపోతుందని గ్రామాల్లో ఓ (మూఢ)నమ్మకం! పంటల దిగుబడి కూడా దిష్టి వల్ల గణనీయంగా పడిపోతుందని భావించే రైతులు అందుకు ప్రత్యామ్నాయంగా రకరకాల ఏర్పాట్లు చేస్తుంటారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం బండకిందపల్లి, బ్రహ్మేశ్వరం గ్రామాల్లో రైతులు బెండ, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటి కాయగూరల సాగు చేపట్టారు. మొక్కలు ఏపుగా పెరగడంతో దారి వెంబడి పోయేవారి దృష్టంతా పంట పంటపై పడుతోంది. దీంతో పంటలకు దిష్టి తగలకుండా.. శృంగార తార సన్నీలియాన్ పోస్టర్‌ను అక్కడ ఏర్పాటు చేశారు. ఆ పోస్టర్‌పై 'ఒరేయ్ నన్ను చూసి ఏడవకురా!?' అంటూ స్లోగన్ రాయించారు. ఇంకేముంది అటువైపు వెళ్లే వారి దృష్టంతా పంటపై కాకుండా ఆ పోస్టర్‌పై పడుతోంది.

- ఉదయగిరి

3 కోట్లతో 17 ప్రభలు

▸ కోటప్పకొండకు ప్రభల శోభ

▸ శివరాత్రి తిరునాళ్లకు తరలివస్తున్న భక్తజనం

కోటప్పకొండ (నరసరావుపేట), ఫిబ్రవరి 11: మహిమాన్విత శైవక్షేత్రం కోటప్పకొండ. ఇక్కడ ఆ పరమశివుడు త్రికోటేశ్వరస్వామిగా కొలువుదీరి భక్తజన రక్షకుడిగా పూజలందుకుంటున్నాడు. కొండపై కొలువున్న కోటయ్య స్వామి కిందకు దిగి రావాలంటే కోటిన్నొక్క ప్రభ నిర్మించాలన్న నానుడి ప్రచారంలో ఉండడంతో ఏటా శివరాత్రి నాడు జరిగే తిరునాళ్లకు భారీ ఎత్తున ప్రభలు నిర్మించి తరలించడం ఆనవాయితీగా మారింది. శివరాత్రి తిరునాళ్లకు ఇంకా ఒక్కరోజే మిగిలి ఉండడంతో ప్రభలన్నీ కోటప్పకొండవైపు దారితీస్తున్నాయి. గుంటూరు జిల్లా, నరసరావుపేట మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండకు విద్యుత్ ప్రభల తాకిడి మొదలైంది. మహాశివరాత్రి పర్వదినాన మంగళవారం ఇక్కడి త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో తిరునాళ్ల జరగనుండడంతో భారీ విద్యుత్ ప్రభలు కొలువు దీరుతున్నాయి. ప్రభల పండుగగా పేరొందిన ఈ తిరునాళ్లకు పోటాపోటీగా 17 భారీ ప్రభల నిర్మాణం చేపడుతున్నారు. ఒక్కో ప్రభ 90 అడుగులకు పైగా ఎత్తు ఉంటుంది. ఒక్కోదానికయ్యే ఖర్చు రూ.20 నుంచి రూ.25 లక్షల వరకు ఉండగా, మొత్తం ఖర్చు రూ.3 కోట్ల పైమాటేనని నిర్వాహకులు చెబుతున్నారు.

నెల రోజుల ముందు నుంచే...

తిరునాళ్లకు నెల రోజుల ముందు నుంచే గ్రామాల్లో భారీ విద్యుత్ ప్రభల సందడి మొదలవుతుంది. ఊరంతా కలసికట్టుగా ప్రభ పనుల్లో పాల్గొంటారు. పూర్తయిన వాటిని కోటప్పకొండకు తరలిస్తారు. ఈ నెలరోజులూ వందలాది మంది కార్మికులకు ఉపాధి లభిస్తుంది. ప్రస్తుతం చిలకలూరిపేట మండలంలోని కావూరు, మద్దిరాల, ఎడవల్లి గ్రామాల తరఫున ఒక్కొక్క భారీ విద్యుత్ ప్రభ నిర్మిస్తున్నారు. కమ్మవారిపాలెంలో రెండు భారీ విద్యుత్ ప్రభలు నిర్మించారు. పురుషోత్తపట్నం గ్రామంలో తొమ్మిది భారీ విద్యుత్ ప్రభలు నిర్మించారు. కావూరులో 72 సంవత్సరాల నుంచి, అమీన్‌సాహెబ్‌పాలెంలో 60 సంవత్సరాల నుంచి ఏటా కోటప్పకొండకు ప్రభలను తరలిస్తున్నారు. రాతి గంటలతో తయారు చేసిన రథాలపై ప్రభలను ఏర్పాటు చేసి కొండకు తరలిస్తారు. ప్రభ పగ్గాలు పట్టేందుకు వందలాది మంది పాల్గొంటారు. రథం ఇరుసు విరిగితే వెంటనే తయారు చేసేందుకు సంబంధిత పనివారు వెంట నడుస్తారు. ప్రభకు ఏర్పాటు చేసే లైట్లు, తోరణాల అమరికలో కూడా ప్రత్యేకత ఉంటుంది. రంగు రంగుల లైట్లు, వీటిని వెలిగించే విధానం చూపరులను కట్టి పడేస్తుంది. ప్రభలపై తిరునాళ్లలో సంగీత విభావరి, నృత్యాలు నిర్వహిస్తారు.



కోటప్పకొండకు తరలించేందుకు సిద్ధమవుతున్న కావూరు ప్రభ

4వేల పంచాయతీ కార్యదర్శుల భర్తీ!

ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకం

పంచాయతీకి ఒక సెక్రటరీ చొప్పున..

ఆర్థికశాఖ అనుమతికి ప్రతిపాదనలు

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న నాలుగు వేల పంచాయతీ కార్యదర్శుల పోస్టులను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. పంచాయతీరాజ్ పునర్వ్యవస్థీకరణపై దృష్టిపెట్టిన ఆ శాఖ మంత్రి లోకేశ్, ప్రతి పంచాయతీకీ ఒక కార్యదర్శి ఉండాలని భావిస్తున్నారు. దీనికోసం ఇప్పటికే వెయ్యి పంచాయతీ కార్యదర్శుల పోస్టుల నియామకం చేపట్టేందుకు ఏపీపీఎస్సీద్వారా ప్రక్రియను పూర్తి చేశారు. కొద్దిరోజుల్లో వారిని గ్రామ పంచాయతీల్లో నియమించనున్నారు. మిగతా పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయాలని ఈ శాఖ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు తమ ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు పంపించినట్టు సమాచారం. అయితే, రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీలకుగాను, 8,473 పంచాయతీల్లో మాత్రమే కార్యదర్శులు ఉన్నారు. మిగిలిన 4,175 పంచాయతీల్లో ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. దీనివల్ల ఒక్కో కార్యదర్శి రెండు, మూడు పంచాయతీల భారం మోయాల్సి వస్తోంది. దీంతో గతంలోలా క్లస్టర్లతో సంబంధం లేకుండా ప్రతి పంచాయతీకీ ఒక కార్యదర్శిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులోభాగంగానే ఔట్ సోర్సింగ్ ఆలోచన చేస్తోంది. ఇదిలాఉండగా, పంచాయతీరాజ్‌శాఖ ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి ప్రక్రియని ప్రారంభించింది. తాజాగా పలువురు సీనియర్ అసిస్టెంట్లు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లకు పదోన్నతి కల్పించారు.

నొప్పి తెలియని బాలిక!

▸ అరుదైన వ్యాధే కారణం

▸ 10 లక్షల్లో ఒకరికి ఎనాల్జిసియా

▸ ఎప్పుడూ నీడలోనే ఉండాలి

▸ ఎండ తగిలితే జ్వరం, చర్మ వ్యాధులు



మహితను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీదేవి

గుంటూరు (మెడికల్), ఫిబ్రవరి 11: చిన్న పిల్లలు సూది మందును చూడగానే ఏడుస్తారు. ఈ విషయంలో ఆ బాలిక చిన్నప్పటి నుంచీ భిన్నం. టీకా వేసినా, ఇంజెక్షన్ చేసినా నవ్వుతూనే ఉంటుంది. నిప్పులకు దూరంగా ఉండు.. లేదంటే కాలుతుందని పెద్దలు పిల్లల్ని అప్రమత్తం చేస్తుంటారు. కానీ ఆ బాలికకు ఇదే మాట చెబితే... 'కాలడం అంటే ఏమిటమ్మా!' అని అమాయకంగా అడుగుతుంది. ఎందుకంటే ఆ చిన్నారికి కాలిన నొప్పి తెలియదు. పుట్టుకతోనే అత్యంత అరుదైన 'కంజెనిటల్ ఇన్‌సెన్సిటివిటి పెయిన్ అండ్ ఎన్‌హైడ్రోసిస్' (ఇంజెనిటల్ ఎనాల్జిసియా) వ్యాధి బారిన పడడమే ఇందుకు కారణం. కృష్ణా జిల్లా చాత్రాయి మండలం పోతనపల్లికి చెందిన ధరావత్తు మహిత (8) ఈ వ్యాధితో వైద్య వర్గాలకు పజిల్‌గా మారింది. తల్లిదండ్రులు లోక్యా నాయక్, యమునది మేనరికపు వివాహం. వారికి పుట్టిన ఇద్దరు పిల్లల్లో చిన్నదైన మహితకు ఈ వ్యాధి చిన్ననాటి నుంచీ ఉంది. దెబ్బ తగిలితే శరీరంలో ఉండే నాడీ కణాలు వెంటనే ఆ సమాచారాన్ని మెదడుకు చేరవేస్తాయి. ఇందుకు సీ, ఏ డెల్టా ఫైబర్స్ అనే నాడీ కణాలు తోడ్పడతాయి. పుట్టుకతోనే ఈ బాలికలో డెల్టా ఫైబర్ కణాలు లోపించాయి. దీంతో బాలికకు నొప్పి సంకేతాలు మెదడుకు చేరవు. మొదట్లో కుటుంబసభ్యులకు వింతగా అనిపించినా.. వైద్యులను కలిసిన తర్వాత విషయం తెలుసుకుని ఆందోళన చెందుతున్నారు.

శీతలమే ఉపశమనం!

రెండేళ్ల కిందట చికిత్స కోసం మహితను గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి బాలికను పరీక్షించి అరుదైన జన్యు వ్యాధి బారిన పడ్డట్లు నిర్ధారించారు. మరికొన్ని పరీక్షల కోసం చర్మవ్యాధుల విభాగానికి పంపారు. డీవీఎల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి పరీక్షలు నిర్వహించి మహిత శరీరంలో స్వేద గ్రంథులు ఏర్పడలేదని గుర్తించారు. ఈ కారణంగా బాలిక ఎండలో తిరిగితే వెంటనే జ్వరం వస్తుంది. చెమట పట్టకపోతే శరీరం చల్లబడదు. వేసవిలో చిన్నారిని చల్లటి ప్రాంతంలోనే ఉంచాలి. ఏసీ, ఎయిర్ కూలర్ వంటివి ఉండాల్సిందే. గాయాలైతే తగ్గవు. శక్తివంతమైన యాంటీ బయోటిక్ మందులు వాడాలని డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ఈ వ్యాధికి చికిత్స లేదని, బాలికను నీడ పట్టున ఉంచడం, గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహిత ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా వికలాంగుల కోటాలో పింఛనుకు సిఫారసు చేస్తున్నట్లు డాక్టర్ తెలిపారు.

'ఊపిరి' తీస్తున్న రోగం

▸ సాయం కోసం ఓ కుటుంబం వేడుకోలు



సాయం కోసం అభ్యర్థిస్తున్న థామస్ దంపతులు

చిత్తూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రెక్కాడితేగానీ పూట గడవని కుటుంబం. అలాంటి వారిపై విధి కన్నెర్ర చేసింది. వివరాల్లోకివెళితే.. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం పేయనపల్లె శివారు పాల్‌పురంలో ఉంటోన్న థామస్ ఒకప్పుడు బెంగళూరులో స్కూలు బస్సు డ్రైవర్. భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఒకసారి ఆయాసంగా అనిపించడంతో ఆస్పత్రిలో పరీక్షించగా.. ఊపిరితిత్తులు పాడయ్యాయని, గుండె పనితీరు కూడా కొంత దెబ్బతిందని వైద్యులు చెప్పారు. వెంటనే అవయవమార్పిడి ద్వారా ఊపిరితిత్తులు మార్చకపోతే ఆరోగ్యం మరింత క్షీణిస్తుందని హెచ్చరించారు. శస్త్రచికిత్సకు రూ.40 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. దీంతో థామస్ కుటుంబం దిక్కుతోచని స్థితిలోపడింది. స్నేహితులు, బంధువులు నెలకు రూ.5 వేలు సాయం చేస్తుండటంతో ఆ మొత్తంతో ఆక్సిజన్ పెట్టుకుని థామస్ ప్రాణాలు నిలబెట్టుకుంటున్నారు. శస్త్రచికిత్స చేయించుకునేందుకు ప్రభుత్వం, దాతలు సాయం చేయాలని ప్రాధేయపడుతున్నారు. చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులు చొరవతీసుకుని సీఎం సహాయ నిధినుంచి తోడ్పాటందించాలని కోరుతున్నారు. సాయం చేయదల్చుకున్నవారు.. ఏసయ్య (థామస్ మేనమామ) ఫోన్ 94411 52209ను సంప్రదించొచ్చు. బ్యాంకు వివరాలు.. సి. థామస్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నంబరు 849610110006961, జేబీ నగర్‌శాఖ, బెంగళూరు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: బీకేఐడీ0008496.

న్యాయవాదులు సమాజ నిర్మాతలు

▸ నవ్యాంధ్రలో పటిష్ఠ న్యాయవ్యవస్థ నిర్మాణం కావాలి

▸ బీబీఏ వ్యవస్థాపక సభలో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ రంజన్ గొగోయ్

▸ బెజవాడలో దక్షిణాది రాష్ట్రాల కన్స్యూమర్ కోర్టు బెంచ్: జస్టిస్ ఎన్వీ రమణ



జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ రంజన్ గొగోయ్‌లను సత్కరిస్తున్న దృశ్యం

విజయవాడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): 'న్యాయవాదులు సోషల్ ఇంజనీర్లు. సమాజ నిర్మాణంలో వారిదే కీలకపాత్ర. కేసుల పరిష్కారంలో వారికి ఎంతో పాత్ర ఉంది' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి రంజన్ గొగోయ్ అన్నారు. బీబీఏ(బెజవాడ బార్ అసోసియేషన్) 111వ వ్యవస్థాపక దినోత్సవం విజయవాడలోని 'ఏ' కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి జస్టిస్ గొగోయ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సామాజిక వివాదాలు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించడంలో బార్ అసోసియేషన్ల పాత్ర చాలా కీలకమని చెప్పారు. నవ్యాంధ్రలో పటిష్ఠ న్యాయవ్యవస్థను నెలకొల్పడానికి న్యాయవాదులు, ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు. మరో ముఖ్య అతిథి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ, దేశంలో దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన వినియోగదారుల కోర్టు బెంచ్‌ను విజయవాడలో ఏర్పాటు చేయడానికి అనువైన స్థల పరిశీలనకు ఒక కమిటీని నియమించామన్నారు. దీనిపై ప్రభుత్వమూ దృష్టిసారించాలన్నారు. నవ్యాంధ్రలో ట్రిబ్యునల్స్, హైకోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయస్థానాల్లో జరుగుతున్న కార్యకలాపాల గురించి ప్రజలకు తెలియాలంటే తెలుగులో న్యాయపరిపాలన సాగాలని స్పష్టం చేశారు.

1830లోనే తెలుగులో తీర్పు

1800నాటి కాలంలోనే న్యాయమూర్తులు తెలుగులో తీర్పు వెలువరించారు. తాళపత్రాలపై తీర్పులు కూడా రాశారు. జ్యుడిషియల్ ఎగ్జిబిషన్‌లో న్యాయవ్యవస్థకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకొచ్చాయి. స్వాతంత్ర్యానికి ముందు ప్రస్తుత మచిలీపట్నంను మసులీపట్నం అని, ఇక్కడున్న కోర్టును మసులీపట్నం జిల్లా అగ్జిలరీ అని పిలిచేవారు. 1830, 1842, 1873 సంవత్సరాల్లో ఈ కోర్టు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో వెలువరించిన తీర్పుల కాపీలను ప్రదర్శనకు ఉంచారు. మద్రాసు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పుడు కర్నూలు జిల్లా బనగానపల్లె జిల్లా మేజిస్ట్రేట్ కోర్టు దఫేదార్, ప్యూన్ డ్రెస్ కోడ్‌లో ఉపయోగించిన వస్తువులను ఇక్కడ ప్రదర్శించారు.

లోకం తీరు




ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
శ్రీకాకుళం	16.0	31.0
హైదరాబాద్	18.8	31.2
గుంటూరు	19.5	31.5
అనంతపురం	19.6	30.8
కడప	20.0	35.0
చిత్తూరు	20.5	34.0
విశాఖపట్నం	20.8	29.6
విజయవాడ	21.4	30.2

రెండు రాష్ట్రాలకు వర్షసూచన

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అరేబియా నుంచి కేరళ వరకు అల్పపీడనద్రోణి కొనసాగుతున్నది. ఇదే సమయంలో ఉత్తరాది నుంచి పయనిస్తున్న వెస్టర్న్ డిస్ట్రబెన్స్ నుంచి వస్తున్న గాలులు, సముద్రాల నుంచి వీస్తున్న తేమగాలులు కలుస్తుండడంతో దేశంలో వాతావరణ అనిశ్చిత నెలకొంది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో మేఘాలు ఆవరించడంతో పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రెండు రాష్ట్రాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. తెలంగాణలో ఈదురుగాలులు, ఉరుములతో వర్షాలు కురిసే అవకాశం వుందని పేర్కొన్నారు. కాగా మేఘాల ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా, రాత్రి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో 11 డిగ్రీలు నమోదైంది.



చీర కట్టును విస్మరించడం సిగ్గుచేటు

దేశంలో మహిళలు ముఖ్యంగా యువతులు చీర కట్టును విస్మరించడం విచారకరం. చీర కట్టుకోవడం రాదని చెప్పారంటే అంతకన్నా సిగ్గుచేటైన విషయం ఉండదు. చీర కట్టుడు దేశ సంస్కృతిలో భాగం. దానిని కాపాడుకోవాలి.


- ఫ్యాషన్ డిజైనర్ సవ్యసాచి ముఖర్జీ



సిద్ధాంతాల ప్రాతిపదికన కమ్యూనిస్టుల ఎన్నికల పోరు

ఎన్నికల్లో సిద్ధాంతాలను ప్రాతిపదికగా చేసుకుని పోరాడేది కమ్యూనిస్టులే. మిగిలిన ఏ పార్టీ ఆ పని చేయడం లేదు. బీజేపీలో ఉన్నా.. ఆరెస్సెస్‌లో ఉన్నా నేను చెప్పేది ఇదే.

- బీజేపీ సీనియర్ నేత శేషాద్రిచారి



రజనీది 'కాషాయ'మైతే పొత్తుకు నో

రజనీకాంత్ రాజకీయ పార్టీ కాషాయరంగు పులుముకుంటే ఆ పార్టీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదు. రజనీ, నేను స్నేహితులుగానే కొనసాగుతాం, అయితే రాజకీయాలు వేరు. గాంధీ, పెరియార్‌ను ఆదర్శంగా తీసుకుని పార్టీ పేరు ప్రకటించబోతున్నాం. నా పార్టీ రంగు నలుపు, ద్రావిడమే నా సిద్ధాంతం. ద్రావిడమంటే పార్టీలకు సంబంధించిన విషయం కాదు. అది జాతీయపరమైనది.

- సినీ నటుడు కమల్‌హాసన్

శ్రీవారి దర్శనానికి రేపు వృద్ధులు, దివ్యాంగులకు అదనపు అవకాశం

తిరుమలలో వృద్ధులు, దివ్యాంగుల దర్శనంలో మంగళవారం అదనపు అవకాశం కల్పిస్తున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. బుధవారం ఐదేళ్లలోపు చంటిబిడ్డ తల్లిదండ్రులకూ ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



▸ మల్లన్నకు పుష్పపల్లకి సేవ

శ్రీశైలం, ఫిబ్రవరి 11: శ్రీశైల మల్లన్న పుష్పపల్లకీ సేవ దివ్యపరిమళభరితంగా సాగింది. శ్రీగిరి లక్షల మంది భక్తుల తో పోటెత్తింది. శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆరో రోజున భ్రమరాంబసమేత మల్లికార్జునుడు పుష్పపల్లకిపై దర్శనమిచ్చాడు.



▸ ముక్కంటికి వేమిరెడ్డి బంగారు వాహనాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: శ్రీకాళహస్తీశ్వరుడికి నెల్లూరుకు చెందిన పారిశ్రామిక వేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి 8 బంగారు వాహనాలను ఆదివారం సమర్పించారు. వీటి విలువ 1.60 కోట్లపై మాటే. నందీశ్వరుడు, సింహ, అశ్వ, మయూర, హంస, యాళి, గజ, శేష వాహనాలు వీటిలో ఉన్నాయి.



▸ మల్లన్నకు ప్రత్తిపాటి బంగారు శంఖం

శ్రీశైలం, ఫిబ్రవరి 11: భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్ల కు మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు దంపతులు ఆదివారం బంగారు తొడుగు ఉన్న శంఖాన్ని అందజేశారు.

పంచాయతీరాజ్ గూటికి..

స్మార్ట్ విలేజ్-స్మార్ట్ వార్డు!



▸ ప్రణాళికశాఖ నుంచి మార్పులంటూ ప్రతిపాదనలు

▸ మంత్రి లోకేశ్ సూచనలతో దత్తత గ్రామాల అభివృద్ధి

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ విలేజ్-స్మార్ట్ వార్డు కార్యక్రమాలు చూసే స్మార్ట్ ఆంధ్ర ఫౌండేషన్‌ను మళ్లీ పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదట్లో ఈ కార్యక్రమాన్ని పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినప్పటికీ అప్పట్లో ప్రణాళికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎస్పీ టక్కర్ ఆదేశాలతో దాన్ని ప్రణాళికాశాఖ బోర్డు పరిధిలోకి తెచ్చారు. 2016 డిసెంబరు 13 నుంచి ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రణాళికాశాఖ జిల్లా స్థాయి సమావేశాలు ఒకటో, రెండో మినహా పెద్దగా ఈ కార్యక్రమాలకు ఊపు తెచ్చిన దాఖలాల్లేవు. దేశ విదేశాల్లో నివసిస్తున్న వ్యక్తులు తమ సొంత గ్రామాలను అభివృద్ధి చేసేందుకు చొరవచూపేలా ప్రోత్సహించేందుకు స్మార్ట్ ఆంధ్ర ఫౌండేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. తమ సొంత గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చిన భాగస్వాములను ప్రోత్సహించేందుకు కావాల్సిన యంత్రాంగం ప్రణాళిక శాఖ వద్ద లేకపోవడంతో ఈ పథకం ముందుకు సాగలేదు. ప్రణాళిక శాఖ పరిధిలోకి స్మార్ట్ ఆంధ్ర ఫౌండేషన్ వెళ్లడంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరించడంతో ఈ పథకం నీరుగారిపోతోంది. ఇటీవల పంచాయతీరాజ్ కమిషనర్, ఉత్తర అమెరికా ప్రవాసాంధ్ర ప్రతినిధి కోమటి జయరాం ఈ విషయాన్ని ఆ శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వేగంగా స్పందించారు. వెంటనే ఆ విభాగాన్ని పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోకి తీసుకురావడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. త్వరలో స్మార్ట్ ఆంధ్ర ప్రదేశ్ ఫౌండేషన్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలోకి వచ్చే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు.

ఇదీ పరిస్థితి...

రాష్ట్రంలో 16311 గ్రామ పంచాయతీలు, వార్డులున్నాయి. అప్పట్లో 9561 మంది సాధారణ పార్టనర్లుగా, 5282 విభాగాల పార్టనర్లుగా నమోదయ్యారు. 3930 మంది స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు 3885, అధికారులు 1734, సంస్థలు 877, నాన్‌రెసిడెన్స్ విలేజర్స్ 618, నాన్‌రెసిడెన్స్ ఇండియా 614, ఎన్నికైన ప్రజాప్రతినిధులు 554, కార్పొరేట్లు 412, ఇతరులు 1528 మంది దత్తత తీసుకున్న వారిలో ఉన్నారు. మూడో విడత జన్మభూమి, మా ఊరు కార్యక్రమం అయిన తర్వాత జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 2 నుంచి 10వ తేది వరకు వర్క్‌షాపులు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1086 మంది పార్టనర్లు ఈ వర్క్‌షాపులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారి నుంచి పలు సూచనలందాయి. అయితే ఒక్కటీ అమలు కాలేదు. ముందుకు సాగలేదు.

ప్రణాళిక.. పర్యవేక్షణ కరువు!

2015 ఆగస్టులో స్మార్ట్ వార్డు, స్మార్ట్ విలేజ్ కాన్సెప్ట్‌ను అమల్లోకి తెస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. జనవరి 2016లో ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్‌ను సొసైటీ యాక్టు కింద రిజిస్టర్ చేశారు. కానీ అదే ఏడాది దీన్ని డిసెంబర్‌లో ప్రణాళిక శాఖకు మార్చారు. రాష్ట్రాభివృద్ధిలో భాగంగా గ్రామాలు, వార్డులు అభివృద్ధి చేయడానికి స్మార్ట్ విలేజ్-స్మార్ట్ వార్డు కార్యక్రమం భారీఎత్తున చేపట్టాలని, అందుకోసం ప్రభుత్వం దాతల నుంచి విరాళాలు స్వీకరించాలని భావించింది. వివిధ కంపెనీ ప్రతినిధులతో అప్పట్లో ఆర్థిక, ప్రణాళికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో పనులు నిర్వహించే నాథుడే కరువయ్యారు. గ్రామానికి సంబంధించిన సమస్యలపై చర్చించాలంటే స్థానికంగా ఉన్న అధికారులు ముఖం చాటేయడంతో చాలా మంది భాగస్వాములు గ్రామాల వైపు వెళ్లడం లేదు. దీంతో పార్టనర్స్ ఇతరులకు స్ఫూర్తి కలిగించడటం అటుంచి గ్రామాలను దత్తత తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అప్పట్లో ఒక ఏడాది సంక్రాంతి సందర్భంగా స్మార్ట్ వార్డు-స్మార్ట్ విలేజ్ పార్టనర్లను సన్మానించి ప్రోత్సహించారు. ఆ తర్వాత దానిని మరచిపోయారు. గ్రామాలను, వార్డులను దత్తత తీసుకున్న వారిలో ఎక్కువ మంది స్థానికులే.

ప్రవాసాంధ్రుల ఉత్సాహాన్ని చంపేస్తున్న అధికారులు!

ఎన్‌ఆర్‌ఐలు పార్టనర్లుగా వ్యవహరించే ఈ పథకం విజయవంతానికి వివిధ కంపెనీల ప్రతినిధులతో అప్పట్లో ఆర్థిక, ప్రణాళికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో ఎన్ని కమిటీలు వేసినా, ఎన్ని విధాన నిర్ణయాలు తీసుకున్నా.... క్షేత్రస్థాయిలో పనులు నిర్వహించే నాథుడు కరువయ్యారు. దీంతో.. దత్తతకు సంబంధించిన ఏ అంశాన్ని అధిగమించడం కోసం ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారో, ఆ ప్రయోజనం నెరవేరని పరిస్థితి నెలకొంది. పార్టనర్లకు తమ గ్రామాల్లో సహకారం కొరవడింది.



యువత వ్యవసాయంపై దృష్టి సారించాలి

▸ కొండవీటి జ్యోతిర్మయి

విజయవాడ (వన్‌టౌన్), ఫిబ్రవరి 11: చదువుకున్న యువత కంప్యూటర్, ఇంజనీరింగ్ రంగాలతో పాటు వ్యవసాయ రంగంపైనా దృష్టి సారిస్తే ఆ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. విజయవాడలో జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఆదివారం 'ఇంటికో యువరైతు' పేరిట యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి చదువుకున్న యువతను వ్యవసాయ రంగం వైపు మళ్లించేందుకు ఈ యాత్ర చేపట్టినట్టు చెప్పారు.

ఆయేషా కేసు విచారణకు తెనాలికి సిట్

తెనాలి, ఫిబ్రవరి 11: దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన తెనాలికి చెందిన బీ ఫార్మసీ విద్యార్థిని ఆయేషామీరా హత్యకేసులో ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ బృందం ఆదివారం గుంటూరు జిల్లా తెనాలికి వచ్చింది. ఆయేషా తల్లిదండ్రులు సంషాద్ బేగం, ఇక్బాల్ బాషాలను సుమారు ఐదు గంటలపాటు ఈ బృందం విచారించింది. వారి వాంగ్మూలాన్ని వీడియో రికార్డుచేశారు. డీఐజీ శ్రీకాంత్, హైమావతి, శ్రీలక్ష్మి, కొందరు ఏఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులు విచారణ బృందంలో ఉన్నారు.

పరిణామాలను మహిళా కోణంలో చూడాలి

▸ ఆంధ్రజ్యోతి సంపాదకుడు కె.శ్రీనివాస్



తిరుపతి, ఫిబ్రవరి 11: మహిళా కోణంలో వార్తలను చూసే దృష్టి మీడియాలో పెరగాల్సి ఉందని ఆంధ్రజ్యోతి సంపాదకుడు కె.శ్రీనివాస్ అన్నారు. తిరుపతిలో రెండు రోజులుగా జరుగుతున్న ప్రజాస్వామిక రచయిత్రల వేదిక (ప్రరవే) నాలుగవ మహాసభల ముగింపు సమావేశంలో ఆదివారం ఆయన ప్రసంగించారు. వివిధ అంశాలపై వస్తున్న వార్తలు మహిళాకోణాన్ని ప్రతిబింబిస్తున్నాయా లేదా చూడాలని సూచించారు. ఉదాహరణకు బడ్జెట్ ప్రకటించగానే అది మహిళలకు ఏవిధంగా మేలు చేస్తుంది అనే కోణంలో వార్త రాయవలసిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో భూమిక పత్రిక సంపాదకురాలు కొండవీటి సత్యవతి సమాపన ప్రసంగం చేశారు. మరింత నిర్మాణాత్మకంగా రచయిత్రులను చేరదీసి, మహిళలకు, ప్రజలకు అవసరమైన అవగాహనను, చైతన్యాన్ని అందించాలన్నారు.

డాక్టర్ సూర్యారావుకు లయన్స్ జాతీయ సేవా పురస్కారం

ఎంవీపీకాలనీ(విశాఖ సిటీ), ఫిబ్రవరి 11: విశాఖ లయన్స్ క్లబ్ జాతీయ విశిష్ట సేవా పురస్కారాన్ని ఆదివారం పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావుకు ప్రదానం చేసింది. ఏయూ టీఎల్ఎన్ సభాహాలులో లయన్స్ క్లబ్ విశాఖపట్నం సౌత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో.. వైద్యరంగంలో ఉత్తమసేవలు, పరిశోధనలు చేసిన డాక్టర్ సూర్యారావుకు పురస్కారంతో పాటు స్వర్ణసింహాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యారావు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ నుంచి పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

చినుకు

మస్తిష్క నేత్రాలతో చూస్తున్న
అనుభవం నాది
పసిపాపా...
మనసు పొరలలో స్పృశిస్తున్న
అనుభూతి నీది

చినుకుపై రాయడం నాకు ఆనందం
చినుకులో తడవడం నీకు ఆనందం

నీకు వర్షానికి భాష్యం
చెప్పడం చేతగాదు
కానీ చినుకుల్లో కరుగుతావు
నువ్వే చినుకైపోతావు
చినుకే నువ్వైపోతుంది
హద్దుల్లేని ఆనందం నీది
ఆ క్షణంలోకి

నువ్వు ఒదిగిపోతావు
రాలుతున్న చినుకుల్ని
నీ సొంతం చేసుకుంటావు
రాలబోయే చినుకుల్ని
నీ వైపు తిప్పుకుంటావు
నా కవిత్వం సాగిపోతుంది
రీడింగ్ రూంలో-
టేబిల్ లాంతరు వెలుగులో
నా ఆలోచన సాగిపోతుంది
ఆకాశం క్రమంగా లొంగిపోతుంది

కాగితపు నదిమీద
రాత్రంతా అక్షరాల జల్లుకురుస్తుంది
బల్లచూరు చివరి నుండి
బొట్లు బొట్లుగా సిరా చినుకులు రాలుతాయి
కానీ ఎంత వెతికినా
ఇంద్రియ ధనుస్సేగాని
ఇంద్ర ధనుస్సు కనిపించదు కాగితంమీద
చివరకు వాన కవిత రాసిన
ఆ కాగితాన్నే పడవచేసుకుని
నీ వద్దకు బయల్దేరుతాను

ఓ తెల్లవారు ఝామున
దారిలో నువ్వూ
ఆ పడవలోకి ఎక్కి
నన్ను తీసుకుపో
వర్షాతిరేకంలోకి
ఆనంద ప్రవాహంలోకి
నా బాల్య అనుభూతుల్లోకి.

■ **కిల్లాడ సత్యనారాయణ**
83339 87838




గోలకొండ పత్రికలో తొలి దళిత కథ

1920వ దశకం దళిత, బహుజన అస్తిత్వ చైతన్యం వికసించిన దశకం. వర్ణవివక్షకు వ్యతిరేకంగా ఒకవైపు త్రిపురనేని రామస్వామి చౌదరి ప్రారంభించిన బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం, మరోవైపు భాగ్యరెడ్డివర్మ, అరిగె రామస్వామి వంటివాళ్లు నడుపుతున్న దళిత అస్తిత్వ ఆత్మగౌరవ ఉద్యమం-తెలుగునాట ప్రజాస్వామిక భావాల వ్యాప్తికి కారణమయ్యాయి. ఈ వెలుగులోనే దళిత సమస్య సమకాలీన సాహిత్యంలో స్థానం సంపాదించింది. అస్పృశ్యత సమస్యపై శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'పుల్లంరాజు కథ' (ప్రబుద్ధాంధ్ర, జూన్ 1925) రాశారు. అస్పృశ్యత నిర్మూలనకోసం చక్రవర్తి ముందుకొస్తే.. చివరికి తియ్యటి మాటలు చెబుతూనే మాల, మాదిగల మధ్య తెలివిగా చిచ్చుపెట్టిన రామచంద్రయ్యను ఆధునిక మనువుగా ఇందులో రచయిత ఆవిష్కరించాడు. దళిత సమస్యను చిత్రించిన తొలి కథగా ఈ కథ సాహిత్య చరిత్రలో నమోదైంది. ఆ తర్వాత దళిత సమస్యపై దళితుడే రాసిన తొలి కథగా భాగ్యరెడ్డి వర్మ 'వెట్టి మాదిగ'(1931)ను సాహిత్యకారులు పేర్కొంటున్నారు. కానీ ఈ కథ కన్నా ముందే 1928 ఫిబ్రవరి 15న గోలకొండ పత్రికలో యానంకు చెందిన శ్రీనివాసులు అనే ఆదిమాంధ్రుడు రాసిన 'నేరేడుపండ్లు కంటు' కథ అచ్చయ్యింది. రచయిత కోస్తాంధ్ర ప్రాంతానికి చెందిన వాడైనప్పటికీ తెలంగాణ నుంచి వెలువడే గోలకొండ పత్రికు కథ రాసి పంపడం, సంపాదకవర్గం అచ్చువేయడం విశేషం.



విద్యవల్ల చైతన్యవంతురాలైన మహిళ కోణం నుంచి అస్పృశ్యతా సమస్య వస్తువుగా వచ్చిన కథ ఇది. 'నేరేడుపండ్లు కంటు' కథ విషయానికొస్తే.. చిరిగిన వస్త్రాలు ధరించి నేరేడు పండ్ల బుట్టతో వెళుతున్న స్త్రీని ఒక బ్రాహ్మణస్త్రీ 'ఏమే మాలా! ఇటు రా!' అంటూ పిలిచి తన భర్తను పండ్లు కొనమంటుంది. ఆ బ్రాహ్మణుడు మాల స్త్రీవద్ద పండ్లు కొనాలనుకుంటున్నందుకు భార్యను మందలిస్తాడు. ఎదుటివారు చూస్తే ఆక్షేపిస్తారంటాడు. ఆ మాటలు లక్ష్యపెట్టక కొన్ని పండ్లు కొనిపెట్టమని భర్తను ఒత్తిడి చేస్తుంది. నీ మతి రెండు మాసాల క్రితమే చెడిందని, చదువుకోవటం వల్ల గ్రంథాలు చదివి ప్రగల్భాలు పలుకుతున్నావంటాడు భర్త. నీ లాంటి ఆడ వాళ్లు ఇద్దరుముగ్గురు ఈ సమీపంలో వుంటే బ్రాహ్మణ కులానికి కళంకం వాటిల్లుతుందని స్త్రీవిద్యపై అక్కసును వెళ్ళగక్కుతాడు.

పూర్వాచారాలెట్లున్నా ప్రస్తుతం వారు చదువుకుని నవనాగరీకు లవుతున్నారని కనుక అంటరానివాళ్ళగా వాళ్ళను వేరుచేసి చూడ వద్దని ఆమె భర్త హితవు చెప్తుంది. ఒక ఆదిమాంధ్రుడు బహుమతిగా ఇచ్చిన ఒక సిల్కు కండువా, గొడుగు, పట్టె కోటు తీసుకున్న విషయం గుర్తుచేసి, ఇప్పుడీ పండ్లమ్ముకొనే ముసలిదాని మీద ద్వేషం ఎందుకని ప్రశ్నిస్తుంది. వాడిచ్చిన వస్తువులు కొత్తవి వాటికి అంటు లేదు అని అతడు సమధానమిస్తాడు. "ఓహో! బహుమతులు కొత్తవైనా, పాతవైనా వాటికి అంటు లేదు. దూరదేశ ప్రయాణాల్లో చేసే వ్యభిచారాన్ని లెక్కించటానికి వీలులేదు. దేశాచారము ననో, ఇష్టానుసారంగానో మత్తు పదార్థాలు తాగడం, కారపు పదార్థాలారగించటం, సాయంకాలం విహారాల్లో చేసే దుర్వ్యభిచారాలు దోషం కాదు కానీ మాల స్త్రీల దగ్గర నేరేడు పండ్లు కొనటమే అంటు అవుతుందా అని ఆమె చేసిన తర్కం అతడిని ఇరకాటంలో పెట్టింది. నీ ఇష్టం వచ్చినవి కొనుక్కో నన్ను కష్టాలపాల్జేయ్యొద్దని లోపలికెళతాడతడు. చెప్పే మాటలకు, ఆచరణకు అందని అగ్రవర్ణ పురుషుల ద్వంద్వ నీతిని విమర్శకు పెట్టడం ఇందులో ప్రధానం. అంటరానివాళ్ళంటూ సాటి మనుషులు మీద, ఇంట్లో స్త్రీల మీద మగవాళ్లు చేసే పెత్తనాన్ని ఏకకాలంలో నిరసించిందామె. ఇంట్లో స్త్రీలను వంచించి, బయట అగ్రవర్ణ పురుషుల ఆచరణలోని అనైతికతను అస్పృశ్యత సమస్య నెపం మీద ఎత్తి చూపి తిప్పికొట్టటం చదువుకున్నందువల్ల కలిగిన వివేకం, ధైర్యం కారణంగా ఆ భార్యకు సాధ్యమైంది. స్త్రీ విద్య ఇటు కుటుంబాన్ని, అటు సమాజాన్ని కూడా సంస్కరించుకొనటానికి 'అనివార్యమైన షరతు' అన్న విషయాన్ని ఈ కథ చెప్పగలిగింది. ఆదిమాంధ్ర రచయిత శ్రీనివాసులు ఈ కథలో బ్రాహ్మణ స్త్రీ పాత్రతో అస్పృశ్యత సమస్యను చర్చకు పెట్టడం ద్వారా అగ్రవర్ణాల నుంచి దళితులు ఆశిస్తున్న సంస్కారం కనిపిస్తుంది.


“నేరేడుపండ్లు కంటు”
గోలకొండ పత్రిక

కథ ప్రచురితమైన గోలకొండ సంచిక

'నేరేడుపండ్లు కంటు' కథ కంటే ముందు 'యౌవన భ్రాంతి' (16 జులై, 1927) కథలో దళిత సమస్యను ఆవిష్కరించాడు రచయిత కటంగూరి నరసింహారెడ్డి. ఈ కథలో రావు బహాదురు ముత్తయ్య హైకోర్టు న్యాయాధిపతి. ఆయన నిమ్న జాతికి చెందిన వాడైనప్పటికీ అతని ఉద్యోగ హోదాను బట్టి అందరూ గౌరవించే వారు. అయితే ఉత్తమ హిందూ కుటుంబాలు ఆయనను తమ దరికి రానివ్వకపోవటంతో బ్రహ్మసమాజంలో చేరతాడు. ఆ సమాజంలోని విద్యావంతురాలైన యువతిని పెళ్లి చేసుకొంటాడు. పెద్దమ్మాయి తారను ఒక డాక్టర్‌కిచ్చి పెళ్లిచేస్తారు. రెండో పుత్రిక నళిని చదువు కొనసాగిస్తుంటుంది. ప్రతిరోజు కాలేజీకి వెళ్లేటప్పుడు రావు బహాదూరు ఇంటి ముందు నుండి వెళ్లే సుదర్శనుడు నళినిని ఇష్టపడతాడు. కళాశాల వార్షికోత్సవంలో రావుహాదూర్‌తో జరిగిన పరిచయంతో వారింటికి వెళ్ళే చొరవ పెరిగి వారి కుటుంబ సభ్యుడిలా మెలిగే పరిస్థితి వస్తుంది. ఈ స్థితిలో లండన్‌లో బారిస్టర్ చదివి వచ్చిన చౌదరి తన లండన్ వినోదాల గురించి రావుబహాదూర్‌కు చెప్తుంటే ఆయన కూతుళ్లు సంభాషణలో భాగస్వాములవుతారు. వారి కిలకిల నవ్వులు సుదర్శనుడి హృదయానికి శూలాలై గుచ్చుకొని విషాద హృదయంతో తన బోర్డింగుకు వెళతాడు. కొన్నాళ్లకు నళిని బారిష్టరు చౌదరి వివాహ వార్తను పత్రికలో చూస్తాడు. తర్వాత ఈస్టిండియా రైల్వేలో టికెట్ కలెక్టర్‌గా చేరిన అతడు ఒక రోజు రైలు ప్రయాణంలో నళినిని చూడడమేగా కాదు దుండగుల బారి నుండి కాపాడి భార్యను కాపాడుకోలేని చౌదరి అహంకారాన్ని పరోక్షంగా విమర్శిస్తాడు. అప్పుడు అతడికి తనపట్ల ఉన్న ఆరాధన తెలుసుకొని నళిని దుఃఖించడంతో కథ ముగుస్తుంది.

కథలో 'ముత్తయ్య' ఎంత చదువుకుని, ప్రభుత్వ మన్ననలను పొందినవాడైనప్పటికీ వర్ణవివక్ష ఆయనను వెన్నాడింది. 'ఉత్తమ హిందూ కుటుంబాలు' దరి చేరనియ్యకపోవడం ఆయన ఆత్మాభిమానాన్ని దెబ్బ తీసింది. కుల వ్యవస్థ నిర్దేశించిన అవమానకర స్థానాన్ని నిరాకరించి ఆత్మగౌరవంతో జీవించడానికి బ్రహ్మ సమాజంలో చేరడం అతడికి అనివార్యం. బ్రహ్మ సమాజం కరుడుగట్టిన హిందూమత వ్యవస్థను సంస్కరించడానికి 1828లో రాజారామ మోహన్‌రాయ్ ప్రారంభించిన సంస్థ. కులంతో నిమిత్తం లేకుండా బ్రహ్మ సామాజికులందరూ ఒక్కటే. కనుకనే తెలంగాణలోనూ భాగ్యరెడ్డివర్మ వంటివారిని బ్రహ్మ సమాజం ఆకర్షించింది. ఈ సమకాలీన నేపథ్యం నుంచి నారసింహారెడ్డి ఈ కథలో ముత్తయ్యను బ్రహ్మసామాజికుడిగా మార్చారని అనుకోవచ్చు.

బ్రహ్మ సమాజ కార్యకలాపాలలో స్త్రీవిద్య, స్త్రీల జీవితాన్ని సౌకర్యవంతం చేసే వివాహ సంస్కరణ కూడా భాగమే. 1878లో వీరేశలింగం పంతులు ద్వారా తెలుగుదేశంలోకి విస్తరించిన బ్రహ్మసమాజ భావజాల ప్రభావం ముత్తయ్య విద్యావంతురాలైన యువతిని పెళ్లి చేసుకొనటంలోనూ, కూతుళ్లకు చదువు చెప్పించటంలోనూ, సాంఘికంగా స్వేచ్ఛగా మెలిగే పరిస్థితులు కల్పించడంలోనూ కనిపిస్తుంది. ప్రేమ వైఫల్యం అలా ఉంచితే నళినిని పెళ్లాడిన 'చౌదరి' కులం సుస్పష్టమే. బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమ ప్రభావం నుంచి అభ్యుదయ దృష్టిని అలవరచుకొంటున్న కమ్మ కులస్థులకు అతనిని ప్రతినిధిగా రచయిత చూపించదలిచాడనిపిస్తుంది. సుదర్శనుడి కులం సూచన లేదు కానీ మధ్యతరగతి వర్గ లక్షణం నుండే అతడు ముత్తయ్య, చౌదరి వంటి వాళ్ల ఉద్యోగ, ఆర్థిక హోదాల ముందు న్యూనతకు గురైనాడనిపిస్తుంది. అందువల్లనే నళినిపట్ల ప్రేమను వ్యక్తం చేయలేకపోయాడని అనుకోవచ్చు.

ఈ రెండు కథలూ కుల సమస్యను చర్చకు తెచ్చి, విద్య అన్ని రకాల అసమానతలను రూపుమాపే ఔషధమని ప్రతిపాదించాయి. మరుగునపడిన ఈ రెండు కథలను దళిత కథా సాహిత్య చరిత్రలో చేర్చాల్సి ఉంది. అంతేగాక దళితుడు రాసిన తొలి దళిత కథగా 'నేరేడుపండ్లు కంటు'ను, తొలి దళిత కథా రచయితగా శ్రీనివాసులును గుర్తించాల్సి ఉంది.

■ **నుగ్గునూతుల యాకయ్య**
90102 00249

('నేరేడుపండ్లు కంటు' కథ అచ్చయి ఫిబ్రవరి 15కు తొంభై ఏళ్లు)

రంగినేని ఎల్లమ్మ పురస్కార ప్రదానం

రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం -2017 ప్రదానోత్సవం ఫిబ్రవరి 12 ఉ.10గం.లకు రంగినేని చారిటబుల్ ట్రస్ట్, కరీంనగర్ రోడ్, సిరిసిల్లనందు జరుగుతుంది. ముఖ్య అతిథి సిహెచ్ విద్యాసాగర్ రావు; విశిష్ట అతిథి కల్వకుంట్ల తారకరామారావు; గౌరవ అతిథులు తుల ఉమ, బి. వినోద్ కుమార్, సిహెచ్ రమేశ్‌బాబు, కృష్ణ భాస్కర్. సభలో రంగినేని మోహన్ రావు, నలిమెల భాస్కర్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, మద్దికుంట లక్ష్మణ్ తదితరులు పాల్గొంటారు.

- **రంగినేని మోహన్ రావు**

'కలల దారుల్లో' కవితా సంకలనం

తెలంగాణ సాహిత్య విభాగం ప్రచురించిన 'కలల దారుల్లో' కవితా సంకలనం ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 15 సా.6గం.లకు రవీంద్ర భారతి మినీహాల్, హైదరాబాద్ నందు జరుగుతుంది. అమ్మంగి వేణుగోపాల్, గుడిపాటి, కాంచనపల్లి, ఏనుగు నరసింహారెడ్డి, మామిడి హరికృష్ణ పాల్గొంటారు.

- **కాంచనపల్లి**

'యుద్ధకాలంలో స్వప్నాలు' ఆవిష్కరణ

గుగి వా థియాంగో బాల్య జ్ఞాపకాల రచనకు జి.ఎన్. సాయిబాబా తెలుగు అనువాదం 'యుద్ధకాలంలో స్వప్నాలు' ఆవిష్కరణ ఫిబ్రవరి 18 సా.5గం.లకు నందమూరి తారక రామారావు ఆడిటోరియం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ నందు జరుగుతుంది. ముఖ్య అతిథి గుగి వా థియాంగో; అధ్యక్షత ఎన్. వేణుగోపాల్; పుస్తక ఆవిష్కరణ సుజితారు; వక్తలు కె. శ్రీనివాస్, ఎ.కె. ప్రభాకర్.

- **మలుపు ప్రచురణలు**

సోమేపల్లి పురస్కార ప్రదానోత్సవం

తెలుగు చిన్న కథల పోటీ విజేతలకు సోమేపల్లి సాహిత్య పురస్కార ప్రదానోత్సవం ఫిబ్రవరి 18 ఉ.10.30ని.లకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గన్నవరం గ్రామం, యద్దనపూడి మండలం, ప్రకాశం జిల్లా, ఆం.ప్ర నందు జరుగుతుంది. పొన్నూరు వెంకట శ్రీనివాసులు, మండలి బుద్ధప్రసాద్, ఏలూరి సాంబశివరావు, నల్లపనేని వీరమ్మ, తదితరులు పాల్గొంటారు.

- **చలపాక ప్రకాష్**

పఠాభి శత జయంతి ఉత్సవం

కవిసంధ్య నిర్వహణలో కవి పఠాభి శత జయంతి ఉత్సవం ఫిబ్రవరి 19న యానాంలో జరుగుతుంది. ఈ సందర్భంగా 'పఠాభి సాహిత్యం-ప్రాసంగికత' అంశంపై ఒక రోజు జాతీయ సాహిత్య సదస్సు జరుగుతుంది. అత్తలూరి నరసింహారావు, సీతారాం, అదృష్ట దీపక్, వంశీకృష్ణ, వాడ్రేవు వీరలక్ష్మి దేవి, జోశ్యుల కృష్ణబాబు, దాట్ల దేవదానం రాజు తదితరులు పత్ర సమర్పణ చేస్తారు. శిఖామణి కీలక ప్రసంగం చేస్తారు.

- **కవిసంధ్య**

వుప్పల లక్ష్మణరావు వర్ధంతి

వుప్పల లక్ష్మణరావు వర్ధంతి, 'స్మారక జీవన సాఫల్య సాహితీ పురస్కార సభ' ఫిబ్రవరి 22 సా.5గం.లకు విశాఖ పౌర గ్రంథాలయం, మినీహాల్, విశాఖపట్నం నందు జరుగుతుంది. సాఫల్య పురస్కారాన్ని దేవరకొండ సహదేవరావు అందుకొంటారు. సభలో పి.అనంతరావు, అడపా రామకృష్ణ, డి.ఎస్.ఎన్. రాజు, కె.ఎల్. ప్రసాద్ పాల్గొంటారు.

- **అంగర కృష్ణారావు**

పెన్నా సాహిత్య పురస్కారం

వార్షికోత్సవం సందర్భంగా పెన్నా రచయితల సంఘం ఇవ్వనున్న 'పెన్నా సాహిత్య పురస్కారం-2017'కు కవులు 2016, 2017 లలో ప్రచురితమైన తమ కవితా సంపుటాలు 4ప్రతులను మార్చి 15లోగా చిరునామా: గుండాల నరేంద్ర బాబు, 25-1-890, నేతాజీనగర్, 3వ వీధి, ఎ.కె. నగర్ పోస్ట్, నెల్లూరు-524004కు పంపాలి. వివరాలకు 94932 35992.

- **అవ్వారు శ్రీధర్‌బాబు**

కవితల పోటీ

మార్చి 21న ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా 'వంతెన' కవిత్వ బులిటిన్ నిర్వహించే పోటీకి 25 పంక్తులు మించని కవితలను ఫిబ్రవరి 28లోగా చిత్తలూరి, కేరాఫ్ అమూల్యాచందు కప్పగంతు, డోర్.నం.29-27-23, సూర్యనారాయణ వీధి, సూర్యారావుపేట, విజయవాడ-2కు పంపాలి. ఫోన్: 9059824800.

- **చిత్తలూరి**

మృత్యుసాగరం

వలస జీవుల రక్తాన్ని
తాగిన ఆ కడలి నుంచి
ఎరుపును పులుముకొని
సూర్యుడు ఉదయిస్తాడు

స్వాతిచినుకులేవీ ఆ సముద్రగర్భంలో
ముత్యాలుగా మెరిసిపోవు
పసిపిల్లల మృతదేహాలై
తీరానికి కొట్టుకొస్తాయి

అలలేవీ లాహిరి పాటలు
పాడవు ఆ కడలిలో..
రాకాసి ఆక్టోపస్‌లై
ప్రాణాలను మింగేస్తాయి

ఆ సాగరపు తీరాన
ఇసుకతిన్నెలు కనిపించవు
అడుగుకో శవాన్ని పాతిపెట్టిన
సమాధులే దర్శనమిస్తాయి

చావు నుంచి బతుక్కి సాగే
ఆ పడవ ప్రయాణంలో
గమ్యమెప్పుడూ ఓ ఎండమావే
మృత్యువెప్పుడూ వెంటాడే నీడే

తీరం చేరినవాడు శరణార్థి..!
మధ్యదారిలోనే ముగిసినవాడు
యుద్ధోన్మాదపు బలిచక్రవర్తి..!

■ **గుంటుక చక్రవర్తి**
90102 72772




అతడు అడవిని జయించలేకపోయాడు!

కేశవరెడ్డి సుప్రసిద్ధ రచన 'అతడు అడవిని జయించాడు' తెలుగు సాహిత్యంలో అటవీ సాహిత్యంగా, అస్తిత్వవాద సాహిత్యానికి ప్రతీకగా పేరుకెక్కింది. విమర్శకుల ప్రశంసలు అందుకున్నది. ఒక అనామకుడు, అనాగరికుడు అయిన ముసలివాడు ఒకానొక దినం అస్వస్థతకు గురై తన యావదాస్తి అయిన పందులను మేపుకొని రావడానికి పసివాడైన మనవణ్ణి పంపుతాడు. ఆ గుంపులో ఈనడానికి సిద్ధంగా వున్న సుక్కపంది కూడా ఉంది. సాయంత్రమైనా పందులు, పిల్లవాడు రాకపోవడం గమనించి ముసలివాడు అడవికి బయలు దేరుతాడు. దారిమధ్యలో పందులు, పిల్లవాడు ఎదురొచ్చినా సుక్కపంది రాకపోవడం గమనించి దాన్ని వెతికి తీసుకురావడానికి ముసలివాడు అడవిలోకి పోతాడు. తన అనుభవంతో పందిని వెతికి కనుక్కుంటాడు. క్రూరమృగాల బారి నుంచి దాన్ని, అది ఈనిన గున్నలను కాపాడాలని శక్తియుక్తులన్నీ ఒడ్డి ప్రయత్నిస్తాడు. చివరకు కనీసం గున్నలనయినా కాపాడుకుందామని తనకు ఇష్టమైన సుక్కపందినే చంపుకుంటాడు. గున్నలను వెదురు తట్టిలో ఇంటికి తీసుకు వస్తూ అలసటకు గురై వాటినీ రాబందుల పాలు చేసుకుని నిరాశా నిస్పృహలతో తెల్లారేసరికి ఇంటికి చేరి నిద్రలోకి జారుకుంటాడు. ఈ అస్తమయ ఉదయాల మధ్య తన పందులను కాపాడుకోవడంలో అతడు పడిన శారీరక, మానసిక సంఘర్షణతోనే నవలికకు కావలసిన దీర్ఘత్వాన్ని రచయిత సాధించాడు. ఈ నవలలో కథోచిత, పాత్రోచిత భాష ఎంతవరకు వాడబడింది? అసంగత విషయాలు ఏమైనా ఉన్నాయా? అని విచికిత్స చెయ్యడమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

రాయలసీమ రచయితలు చాలామంది సీమ మాండలికాన్ని వాడితే ఎక్కడ తమను అనాగరికులుగా భావిస్తారో అని భయపడతారు. పాత్రోచితంగా గ్రామీణ భాషను వాడాల్సి వస్తే అప్పుడు కూడా కోస్తా గ్రామీణ భాషను వాడతారే తప్ప సీమ యాస వాడరు. భాషకు సంబంధించి సీమ రచయితలకు ఉన్న బెరుకు కేశవరెడ్డి గారికి పుష్కలంగానే ఉంది. ముందు పాత్రోచితంకాని భాష గురించి మాట్లాడుకుందాం. అనాగరికుడైన ముసలివాని పాత్ర స్వగతాల్లో రచయిత ప్రామాణిక భాషను వాడినాడు. మచ్చుకు- ముసలివాడు పిల్లవాణ్ణి, పందులను వెతకడంకోసం అడవికి పోయేటప్పుడు తనలో "ఇక్కడ నుండి బయలుదేరితే మార్గం తనంతటదే గోచరిస్తుంది. కర్తవ్యం బోధపడుతుంది", "పందుల్ని, పిల్లవాడ్ని ఎలాంటి పరిస్థితిలో చూస్తానో తెలియదు. సాయుధుడనై వెళ్ళడం శ్రేయస్కరం" అనుకుంటాడు. ఇది పూర్తిగా రచయిత భాషే. ఇవే వాక్యాలను పాత్రోచిత భాషలో రాయాలంటే... "ఇక్కట్నించి బయల్జేరిపోతే దావ దానంతలకదే కనిపిస్తాది. ఏం జెయ్యాల్లో తెలస్తాది.." ఇలాగ ఉంటుంది. పాత్రోచితం కాని, ప్రామాణిక ప్రయోగాలు ఎన్నో ముసలివాని చేత రచయిత చేయించాడు. సీమలో పందులను "దా...! దా...! గూచ్, గూచ్" అని పిలుస్తారు. కాని రచయిత నాగరికంగా ఉండాలని కాబోలు ముసలివాని చేత "హుచ్, హుచ్" అని పిలిపించాడు. అలాగే పాత్రాతీత భాషనూ కొన్ని చోట్ల వాడారు. ఈ నవలిక చివరన 'సింహావలోకనం'లో సంజీవదేవ్‌గారు ముసలివాడు స్వగతంగా అనుకున్న "అడవి నిగూఢమైనది. ఏ అనుభవానికీ, ఏ మేధస్సుకూ అంతుచిక్కని రహస్యాలు ఇక్కడ చాలా ఉన్నాయి" అన్న మాటలు నిరక్షరాస్యుడైన ముసలివాని మాటల్లా లేవని, విద్యావంతుని మాటల్లా ఉన్నాయని పేర్కొన్నారు.

అలాగే కొందరు సీమ రచయితలు సీమ యాసను తప్పక వాడాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు ధైర్యం చెయ్యలేక భాషను సంకీర్ణం చేసేస్తారు. ముసలివాడు "సుక్కపంది ఏమయిందిరా?" అని అడిగినప్పుడు పిల్లవాడు "ఏడేడా ఎతికినా పైటేళకాడ నుండి కనపళ్ళేదు. ఈతెత్తుకుని ఇంటికొచ్చేసిందేవోననుకున్నా" అంటాడు. ముసలివాడు పిల్లవానితో "మళ్ళీ ముండమోపి మాదిరి ఏడిసేదేవిటికి? ఇవిట్ని బద్దరంగా తోలుకొనిపోయి దొడ్డిలోకి చేర్చు. నేను సుక్కపంది ఏవయిందో సూసొస్తా" అంటాడు. అలాగే ముసలివాడు అడవి దారుల గుండా పోతూ "ఈ దారులు ఎటూ కానిచోట ప్రారంభమై ఎటూ కానిచోట అంతమౌతాయి. ఇలాంటి దారుల వెంబడి నడవడం శుద్ధ దండగ" అనుకుంటాడు. ఇది సీమ, కోస్తా, ప్రామాణిక మాండలికాలు కలగలిసిన సంకీర్ణభాష. కేవలం సీమ యాసలో అయితే "ఈ దావలు ఎక్కడా గానితావ బయిల్జేరి, ఎక్కడా గానితావ మాయిమైపోతాయి" ఇలా ఉండాలి.

అలాగే కొన్ని పాత్రాతీత భావనలు ఇందులో ఉన్నాయి. ముసలివాడు అడవిలో సుక్కపంది జాడల్ని వెతుకుతూ "నేను భ్రమిస్తున్నానేమో? అయిష్టమైన సంభవం భ్రాంతిగానూ, ప్రీతిపాత్రమైన భ్రాంతి సంభవంగానూ మానవుడికి తోచడం కద్దు" అనుకుంటాడు. చెట్టుపైనుండి అతడు "నాగరికుడైన ఒక మానవుని సుఖదుఃఖాలు ఒక మొరటు జంతువుపైన ఆధారపడి ఉండడం ఎంత విచిత్రం! జీవితం నానా విధాలైన వైరుధ్యాలతో నిండి ఉంది", "నా చుట్టూ ఉన్న వాతావరణం చాలా చెడ్డది. కళ్ళు తెరిస్తే మృత్యువు పాలైన ప్రాణులు, హింస పాలైన ప్రాణులు కనిపిస్తున్నాయి. ఈ అడవిలోని ప్రతి పొదలోనూ, గుహలోనూ లోభత్వము, నీచత్వము దాగి ఉన్నాయి. ఈ గాలిలో మృత్యువు తాండవిస్తున్నది" అనుకుంటాడు. పంది గున్నల్తో ఇంటికి తిరిగివస్తూ చీకటిని గురించి "బహుశా చీకటికి చావు పుట్టుకలు లేవేమో. అది నిరంతరాయంగా ఉంటుంది కాబోలు. దైవ సంబంధమైన వెలుగు తాత్కాలికమై ఉండగా పైశాచికమైన చీకటి అజరామరమై ఉండడం ఎంత దారుణం!" అనుకుంటాడు. ముసలివాడు ఇలాంటి లోతైన తాత్విక భావనలు ఎన్నో పోతాడు. ఇలా పాత్రాతీత భావనలను ముసలివాడి చేత రచయిత మస్తుగా చేయించాడు.



గ్రామీణ జీవితం పట్ల కేశవరెడ్డి అవగాహన గొప్పదే. కానీ ఇక్కడ కొన్ని విషయాలను తడిమి చూడాలి. ముసలివాని జ్ఞాపకాల్లో వచ్చే తప్పిపోయిన ఎరుకలవాని పంది అవశేషాలను అడవిలో చూసిన కాపులు దాన్ని ఎలుగుబంటి గాని, పెద్దనక్క గాని చంపి తిని ఉంటుందని భావించారని ఆయన రాశారు. ఎలుగుబంటి శాకాహారి అని తెలియకపోవడం రచయిత అవగాహనా లోపం. ముసలివానికి ఆ రాత్రిపూట అడవిలోని పొదల్లో పూరేళ్ళు, పాములు, ముంగిసలు, వాటి అడుగుజాడలు లాంటి అటవీ జీవితం అంతా కనబడిందని (వెన్నెల ఉంటే ఉండు గాక) చెప్పడం అంత సంగతం కాదు. అలాగే ముసలివాడు తుమ్మ, బలస కంపలను; కొమ్మలను, తీగలను; వెదురు పొదలను తన బొడ్డులోని కత్తితో నరికాడని చెప్పడం సంగతం కాదు. కత్తితో దేన్నీ నరకలేరు. అతని వద్ద ఉన్నది కొడవలి అని చెప్పి ఉంటే సరిపోయేది. ఈ అల్లిబిల్లి మాటల్తో పట్టణవాసుల్ని నమ్మించ వచ్చేమో గాని పల్లెటూరివాళ్ళను నమ్మించలేరు. ఇంకా ముసలివాడు కుందేలుమాంసాన్ని బూడిదలో అద్దుకుని తిన్నాడని, ఆ చేతుల్ని తన తొడలకు తుడుచుకున్నాడని చెప్పడం, అప్పుడు దాహం మాట ప్రస్తావించక పోవడం ఎంత వరకు సంగతమో ఆలోచించాలి. ఇంకో విషయం ఏమిటంటే చెట్టుపైన కూచొని ఈటెను ప్రయోగించడం చాలా కష్టం. ఈటెను తిప్పుకోడానికి కూడా కొమ్మలు అడ్డు వస్తాయి. సుంకేసు చెట్టుపై నుండి ముసలివాడు తోడేలును, పందిని గురి తప్పకుండా కొట్టాడని చెప్పబడింది.

అప్పుడే పుట్టిన పంది పిల్లల్ని రచయిత సలుగులు అంటాడు. అలా అనడం పెద్ద తప్పు. అప్పటికి వాటిని గున్నలు అని మాత్రం అనాలి అంతే. పంది గున్నలు పెరిగి పెద్దవి అయ్యాక వాటిలో మగవాటిని, మగతనంతో పోతరించిన వాటిని 'సలుగులు' అంటారు. పెంటివి అయితే 'మరకలు'అని అంటారు. అలాగే ముసలివాని సుక్కపంది వద్దకు వచ్చిన కట్టుబోతు సలుగులను ఈయన గున్నలు అంటాడు. గున్నలు కట్టుబోతులు కాలేవు. ఇది తెలియక విరుద్ధ భాషా ప్రయోగం.

పంది చేతిలో ముసలివాడు చావు దెబ్బ తిన్నాడని చెప్పడం పొరబాటే. పంది ఏ తావులో ఉన్నా, ఏ పరిస్థితుల్లో ఉన్నా తన యజమాని ఉనికిని, గొంతును గుర్తించగలదు. ఒకవేళ అది యజమానిని గుర్తించలేక (చీకటి కాబట్టి) మీదికి వస్తుంటే దాని చేతికి (నిజానికి మూతికి, కోరలకు) చిక్కి చావు దెబ్బ తినేంతటి తెలివి తక్కువతనం దాని మేపరికి ఉందనడం రచయిత అవగాహనా లోపమే గాని అతని లోపం కాదు. అతడు నాలుగడుగులు దూరంపోతే చాలు. అది వెనక్కివెళ్లి తన పిల్లలను చేరుకుంటుంది. ఈ చిన్న విషయం తెలియకపోతే అతడు ఎంత అస్వస్థతలోఉన్నా గ్రామీణుడే కాడు. పందుల కాపరే కాడు. సుక్కపంది తన గున్నలను వదిలి ముసలివాడు ఎక్కిన చెట్టు చుట్టూ చాలాసేపటి దాకా తిరుగుతూ ఉందనడం సరికాదు.

ముసలివాడు ఏ పందిని కాపాడుకోవాలని అడవికి వచ్చాడో దాన్నే చివరకు చంపుకున్నాడు. దానికి రచయిత చెప్పిన కారణం తోడేళ్ళ బారినుంచి కనీసం గున్నల్ని (ఆయన భాషలో సలుగుల్ని) కాపాడుకుందాం అని అతడు భావించడం. అలాంటి అగత్యం ఎంత మాత్రం లేదు. ముసలివాడైనా మరెవరైనా ఆ పరిస్థితుల్లో పందిని, పిల్లల్ని కూడా కాపాడుకునే అవకాశం పుష్కలంగా ఉంది. పంది పిల్లలను ఈనినప్పుడు దాని ప్రవర్తన వింతగా ఉండడం వాస్తవమే. అంతవరకూ మనుష్యులకు (యజమానికి తప్ప), ఇతర జంతువులకు దూరంగా పారిపోయే పంది ఈనినప్పుడు మాత్రం మనుష్యుల్నిగాని జంతువుల్నిగాని తన దరిదాపులకు రాకుండా తరుముతుంది. ఎందుకంటే పిల్లల్ని వదిలి అది పారిపోలేదు కనుక. సదరు పిల్లలు తనతో బాటు పారిపోయి రాలేవు గనుక. కానీ ఆ తరమడానికి అది తన పిల్లల్ని వదిలి మహా అంటే ఇరవై అడుగుల దూరం మాత్రమే రాగలుగుతుంది. అంతకంటే దూరం వస్తే తన పిల్లలకు మరే ఇతర ఉపద్రవం ముంచుకొస్తుందో అని దాని భయం. కాబట్టి ముసలివాడు ఎంచక్కా చెట్టు దిగి (అసలు ఎక్కవలసిన అగత్యమే ఉండి ఉంటే) తోడేళ్ళను ఆ దరిదాపులకు రాకుండా తరుముకొని ఉండవచ్చు. తద్వారా ఆ రాత్రి పందిని, గున్నలను కాపాడుకొని ఉండవచ్చు. తెల్లారినాక మెల్లమెల్లగా దాన్ని సమీపిస్తూ, తాను తన యజమానినని గుర్తు చేస్తూ, తన వలన గున్నలకు ప్రమాదం లేదని నిరూపించుకుంటూ దాన్ని సాధు చేసుకుని ఇంటికి తీసుకుని రావచ్చు.

రచయిత బహుశా పల్లెలో పుట్టి, పందుల కాపరులను, పందులను నిశితంగా పరిశీలించి రాశాడు. పల్లెల్లో పుట్టిన మన అందరిలాగే తనూ ఈనిన పందితో చెలగాటమాడి ఉంటాడు. దాని తాలూకు భయం అతనిలో గూడు కట్టుకుని ఉంది. అలా ఆయన తన పరిశీలన కొంచెం దూరం నుండే చేసినట్లు ఉన్నాడు. దానికి అతని సామాజిక వర్గస్థితి కారణం కావచ్చు. అసలు అతనికి వర్గ దృక్పథంగాని, మార్క్సిస్ట్ భావాలుగాని ఉన్నట్టు ఈ రచనలో కనబడదు. దాన్ని అతనికి గల 'బలం'గా అయినా చెప్పుకోవచ్చు, లోపంగానైనా చెప్పుకోవచ్చు. కానీ సుక్కపందిని వెతుకుతూ ముసలివాడు ఒకచోట "స్వామి తలుచుకుంటే నాకు సుక్కపంది ఉనికిని తెలియజేయగలడు. కానీ నేను మూర్ఖుడను. అపండితుడను. నా వంటి వారితో స్వామి మంతనాలు జరపడు. సూదులు గుచ్చబడిన అరచేతుల మీద తలకిందులుగా నిలబడి తమ చుట్టూ పుట్టలుపెరిగిపోయేట్టుగా తపస్సు చేసేవాళ్ళకు స్వామి దర్శనమిస్తాడు, వరాలిస్తాడు" అని అమాయకంగా అనుకుంటాడు. ఇక్కడ రచయిత అగ్రవర్ణ భావజాలం మీద చిన్నవ్యంగ్య బాణం సంధించినట్టు, పేదల పక్షం వహించినట్టు, కొంత వర్గ దృక్పథం చూపినట్టు కనబడుతుంది. ఇంతకీ చెప్పేదేమిటంటే అదే రచయిత ఒక పందుల కాపరి కడుపులో, ఇంకా చెప్పాలంటే ఒక దళితుడి కడుపులో పుట్టి; పందులతో గడిపి; వాటిని మేపి; వాటి వీపులు తీడి, మొగాలు నిమిరి; వాటి ప్రవర్తనను జీర్ణించుకుని, కాస్త వర్గ దృక్పథం కలిగి ఉండి రాసుంటే ఈ నవలలో ముసలివాడు మరింత విభిన్నంగా కనబడి ఉండేవాడు. పంది కూడా మరింత వైవిధ్యంతో కూడిన స్వభావంతో అగుపించి ఉండేది. కథ సుఖాంతమై ఉండేది. నిజంగా "అతడు అడవిని జయించాడు" అని అనిపించుకుని ఉండేవాడు. నవల పేరు సార్థకమయ్యేది.

ముసలివాడు సుక్కపంది శవాన్ని అడవిలోనే వదిలి గున్నలను మాత్రమే ఇంటికి ఎత్తుకుని రావాల్సి వచ్చినప్పుడు రచయిత అతని చేత "ఏ మానవుడూ పరిపూర్ణంగా అదృష్టవంతుడు కాదు. ఏ మానవుడూ తను వేలుపెట్టిన చోటల్లా విజయుడై రాలేడు. జయాపజయాల సమన్వయమే జీవితం. కన్నీళ్లు దుఃఖభారాన్ని తగ్గించినట్టుగా ఈ సమన్వయ భావం ఓటమిలో ఊరటనిస్తుంది" అని అనిపించాడు. బహుశా రచయిత కేశవరెడ్డి ఓటమి ఇలా ఒప్పుకుని ఈ సాంత్వన వచనాలతో సంతృప్తిపడ్డారు కాబోలు.

■ **కవితశ్రీ**
9494696990

గ్రామీణుల ఆదాయం 11 శాతం పెంపు

▸ ఉపాధి పనుల్లో సహజ వనరుల నిర్వహణ ఫలితం

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా దేశంలో గ్రామీణుల ఆదాయం గత రెండేళ్లలో 11 శాతం పెరిగిందని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఉపాధిలో సహజ వనరుల నిర్వహణ పనులకు సంబంధించి దేశంలోని 30 జిల్లాల్లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనమిక్ గ్రోత్ సంస్థ అధ్యయనం చేసింది. 28 శాతం ఉపాధి కూలీల కుటుంబాలను శాంపిల్‌గా తీసుకుని సర్వే చేయగా, అందులో 76 శాతం మంది ఉపాధిలో నాణ్యమైన పనులు చేపట్టారని, సహజ వనరుల నిర్వహణ ద్వారా భూగర్భ జలాలు కూడా పెరిగి ఉత్పాదక పెరిగిందని చెప్పారు. 0.5 శాతం మంది మాత్రమే నాణ్యత లేని పనులు చేపట్టారని తెలిపారు. 11 శాతం వరి, 25 శాతం నూనెగింజలు, 28 శాతం మంది ఉద్యానవన పంటల ద్వారా ఆదాయం పెరిగిందని చెప్పారు. ఈ అధ్యయన నివేదిక పరిశీలించిన కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మూడేళ్లలో ఉపాధి పథకం నిర్వహణ తీరుపై ఓ నివేదిక విడుదల చేసింది. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన ఆస్తుల కల్పనతో పాటు గ్రామీణుల సామర్థ్యం పెంచడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

15 నుంచి ఢిల్లీలో సుస్థిర అభివృద్ధి సదస్సు

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో ఈనెల 15 నుంచి 17 వరకు నిర్వహించనున్న ప్రపంచ సుస్థిర అభివృద్ధి సదస్సు(డబ్ల్యూఎస్‌డీఎస్)లో పాల్గొనాల్సిందిగా సీఎం చంద్రబాబును కేంద్ర ఇంధన వనరుల సంస్థ(టీఈఆర్‌ఐ) ఆహ్వానించింది. అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొనే ఈ సదస్సులో ప్రసంగించాలని చంద్రబాబును ఆ సంస్థ ఛైర్మన్ డాక్టర్ అజయ్ మాథుర్ కోరారు. ఇంధన సామర్థ్యంలో ఏపీ అనుసరించిన అత్యుత్తమ విధానాలను సదస్సులో వివరించాలని, వాతావరణ మార్పులను సమర్థంగా ఎదుర్కొనేందుకు చేసే తీర్మానాల అమలులో భాగస్వాములవ్వాలని కోరారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు భారత ప్రభుత్వం చేపట్టే చర్యలకు తాము సంపూర్ణ మద్దతిస్తామని సీఎం స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం 100శాతం కాలుష్య రహిత వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తుందని చెప్పారు. సీఆర్‌డీఏ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, కమిషనర్ శ్రీధర్‌ను ఈ సదస్సుకు హాజరుకావాలని చంద్రబాబు ఆదేశించినట్లు సీఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి.

స్మార్ట్ ఖాతాలో ఏపీకి రూ. 588 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ మిషన్ కింద కేంద్రం రూ.588 కోట్లను ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేసింది. ఈ మిషన్ కింద కేంద్రం ఈ ఏడాది మొత్తం రూ.9940 కోట్లను విడుదల చేయగా అందులో మహారాష్ట్ర రూ.1378 కోట్ల మెజారిటీ వాటా దక్కించుకుంది. మధ్యప్రదేశ్‌కు రూ.984 కోట్లు కేటాయించారు. తమిళనాడుకు రూ. 848, కర్ణాటకకు 836 కోట్లు కేటాయించారు. కేంద్రం ఇప్పటి వరకు 99 స్మార్ట్‌సిటీలు ప్రకటించింది. దాదాపు రూ.2.03 లక్షల కోట్లతో ఆయా నగరాలను అభివృద్ధి చేయనున్నారు. వీటిలో ఏపీ నుంచి విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, తిరుపతికి స్థానం దక్కింది. తెలంగాణ నుంచి కరీంనగర్, వరంగల్‌కు అవకాశం కల్పించారు. ఆయా నగరాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు, సాంకేతికంగా వాటిని తీర్చిదిద్దుతారు. దీనికోసం ఒక్కో నగరానికి రూ.500 కోట్లు కేటాయించనున్నారు. మొదటి ఏడాది రూ.200 కోట్లు, ఆ తర్వాత ఒక్కో ఏడాదికి రూ.100 కోట్ల చొప్పున విడుదల చేయనున్నారు. కాగా.. ఈ ఏడాది తెలంగాణకు ఎంత కేటాయించారో వివరాలు తెలియాల్సి ఉంది.

జ్ఞానార్జన సాధనంగా విద్య: యార్లగడ్డ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యను, సాహిత్య అధ్యయాన్ని కేవలం ఉపాధి, వ్యాపార ప్రయోజనాలకు కాకుండా జ్ఞానార్జన సాధనంగా ఉపయోగించాలని హార్వర్డ్ విద్యార్థుల సమ్మేళనంలో కేంద్రీయ హిందీ సమితి అధ్యక్షుడు, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సూచించారు. అమెరికా మసాచూసెట్స్ రాష్ట్రం బోస్టన్ నగరంలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో ఈనెల 10, 11 తేదీల్లో జరిగిన 15వ భారతీయ మహాసభలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ఆధునిక భారతంలో సాహిత్యం: భాషలు, ఉనికి, అవగాహన' అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో 150 మందికి పైగా వక్తలు పాల్గొనగా.. యార్లగడ్డ మాత్రమే తెలుగువారు కావడం విశేషం.

దేశంలో పౌష్టికాహార లోపం: కేంద్రం

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపంతో దేశంలో పసిపిల్లలు అనేక రుగ్మతలకు గురవుతున్నారని, వాటిని ఎదుర్కొనేందుకు సమష్టిగా కృషి చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ రాష్ట్రాలకు సూచించింది. గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ, ఆరోగ్య సంక్షేమశాఖలు సమన్వయంతో పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని పేర్కొంది. దేశంలో ప్రతి ఇద్దరు గర్భిణుల్లో ఒకరు రక్తహీనత, ఐదేళ్లలోపు ప్రతి ముగ్గురు పిల్లల్లో ఒకరు ఎదుగుదల లోపం, ప్రతి ఐదుగురిలో ఒకరు పోషకాహార లోపంతో ఉన్నట్లు జాతీయ కుటుంబ సర్వేలో వెల్లడైనట్టు తెలిపింది.

16న అర్చకుల ఆత్మావలోకన సదస్సు

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అర్చకుల దీర్ఘకాలిక సమస్యలు, గతంలో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీల గురించి చర్చించేందుకు 'అర్చక ఆత్మావలోకన సదస్సు' నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య నిర్ణయించింది. ఈనెల 16న విజయవాడ శివారులోని గొల్లపూడిలో ఉన్న దేవదాయ కమిషనర్ కార్యాలయం సమీపంలో రెండువేలమంది అర్చకులతో ఈ సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దింటి రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. అర్చకులకు వారసత్వ హక్కు, నందాదీపం బకాయిల విడుదల, హెల్త్‌కార్డులు తదితర అంశాలపైనా సదస్సులో చర్చిస్తామని వివరించారు.

చట్టబద్ధత కల్పించకపోతే ఉద్యమం: ముద్రగడ

చిత్తూరు, ఫిబ్రవరి 11: కాపుల ఉద్యమ ఫలితంగా ముఖ్యమంత్రి చంద్రబాబు విద్య, ఉద్యోగ రంగాల్లో 5 శాతం రిజర్వేషన్ కల్పించారని, ఇచ్చిన రిజర్వేషన్‌కు మార్చి నెలాఖరులోపు చట్టబద్ధత కల్పించకపోతే మరో ఉద్యమం తప్పదని కాపు ఉద్యమనేత ముద్రగత పద్మనాభం చిత్తూరులో హెచ్చరించారు. ఎన్నికల హామీలను చంద్రబాబు పెడచెవిన పెట్టడంతోనే ఉద్యమం చేయాల్సి వచ్చిందని చెప్పారు. పదవుల కోసం ఉద్యమాలు చేయలేదని, తన జాతి బిడ్డల భవిష్యత్తు కోసం చేసిన ఫలితంగా సీఎం చంద్రబాబు స్పందించి విద్య, ఉద్యోగాల్లో ఐదుశాతం రిజర్వేషన్ కల్పించారన్నారు.

ఇతర కులాలను ఎస్టీల్లో చేర్చొద్దు: గిరిజనులు

ఎంవీపీకాలనీ(విశాఖ సిటీ), ఫిబ్రవరి 11: బోయవాల్మీకులను, మత్స్యకారులను ఎస్టీ జాబితో చేర్చే ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలని గిరిజన సంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. ఆదివారం గిరిజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో గిరిజన సంఘాల ప్రతినిధులు స్థానిక గిరిజన భవన్‌లో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు. ఎస్టీల్లో 35 ఉపకులాలకు చెందిన 32 లక్షల మంది గిరిజనులు ఉన్నారని, రాజ్యాంగం కల్పించిన హక్కులు, ఫలాలు వారికి పూర్తిగా చేరడం లేదని, ఇటువంటి పరిస్థితుల్లో ఇతర కులాలలను ఎస్టీ జాబితాలో చేరిస్తే తమకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బోయలు 42 లక్షలు, మత్స్యకారులు 40 లక్షలు ఉన్నారని, వీరిని ఎస్టీల్లో చేరిస్తే ఇప్పటి వరకు జాబితాల్లో వున్న గిరిజనులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు రాష్ట్రాలు సహకరించుకోవాలి: హరీశ్

తిరుమల, ఫిబ్రవరి 11: ప్రజల్లో భక్తిభావం ఎంత పెంపొందించగలిగితే ఆ రాష్ట్రం అంతగా సుఖసంతోషాలతో సుభిక్షంగా వృద్ధి చెందుతుందని తెలంగాణ రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. హరీశ్‌రావు కుటుంబ సమేతంగా ఆదివారం ఉదయం తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టీటీడీ జేఈవో శ్రీనివాసరాజు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి ఆలయంలో శ్రీవారి చిత్రపటం, డైరీ, క్యాలెండరు బహూకరించారు. అలాగే, పరస్పర సహకారంతో రెండు రాష్ట్రాలు బాగా అభివృద్ధి చెందేలా దీవించమని శ్రీవారిని ప్రార్థించినట్లు చెప్పారు.



హరీశ్‌రావుకు శ్రీవారి చిత్రపటం బహూకరిస్తున్న జేఈవో



గల్లా జయదేవ్‌కు దిష్టి తీస్తున్న ఆయన తల్లి గల్లా అరుణ

యుద్ధం ఇప్పుడే మొదలైంది: జయదేవ్

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై టీడీపీ ఎంపీలు చేస్తున్న పోరాటానికి ఢిల్లీలో అందరూ మద్దతిస్తున్నారు. రైల్వేజోన్ విషయంలో మిత్రపక్షం మాటకాదని ఒడిశా అభ్యంతరం చెబుతోందనడం సహేతుకం కాదు. ఏపీ ప్రజలు ఫూల్స్ కారని, ఎల్లకాలం మోసపోరని ప్రధాని మోదీ, అమిత్‌షా గుర్తుపెట్టుకోవాలి..' అని ఎంపీ గల్లా జయదేవ్ మరోసారి స్పష్టం చేశారు. గతవారం లోక్‌సభ బడ్జెట్ సమావేశాల్లో ఏపీకి జరుగుతున్న అన్యాయంపై తనదైన శైలిలో ప్రసంగించి, రాష్ట్ర ప్రజల జేజేలు అందుకుంటున్న ఎంపీ జయదేవ్ ఆదివారం తన సొంత నియోజకవర్గం గుంటూరు వచ్చారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద టీడీపీ నాయకులు ఆయనకు ఎదురెళ్లి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయం వరకు వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జయదేవ్ ప్రసంగించారు. 'యుద్ధం ఇప్పుడే ప్రారంభమైంది. పోరాటానికి టీడీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి. ఢిల్లీకి వెళ్లి ఆందోళన చేసేందుకు సంసిద్ధులు కావాల'ని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి వ్యక్తిగతంగా బాధ్యత తీసుకొని చేస్తేనే ఏపీకి న్యాయం జరుగుతుందన్నారు. ప్రతిపక్ష వైసీపీ పార్లమెంట్‌లో గోడ మీద పిల్లిలా వ్యవహరిస్తోందని విమర్శించారు. 'మా ఆందోళనలను ప్రధాని చూశారు. ఆయన ప్రసంగంలో ఏపీ గురించి ఏమైనా మాట్లాడతారేమోనన్న ఆశతో ఆ సమయంలో మేం వెనక్కు తగ్గాం. వైసీపీ ఎందుకు వాకౌట్ చేసిందో ప్రజలకు సమాధానం చెప్పాలి. ఎంపీ విజయసాయిరెడ్డి బీజేపీతో చేతులు కలిపేందుకు ఆరాటపడుతూ నిరంతరం ప్రధానమంత్రి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నార'ని జయదేవ్ విమర్శించారు. ఏపీకి కేంద్రం ఏవేవో చేసిందని బీజేపీ ఎంపీ కంభంపాటి హరిబాబు మాట్లాడటం సరికాదన్నారు. ఐదు సంస్థలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని జయదేవ్ వివరించారు. ర్యాలీ గుంటూరు చేరుకోగానే ఎంపీ పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు.

15 డెడ్‌లైన్!

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని జనసేన కార్యాలయంలో.. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్‌తో పవన్ సుమారు గంటపాటు భేటీ అయ్యారు. అనంతరం అరుణ్ కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి వచ్చిన నిధులు.. వాటిని ఎలా ఖర్చు చేశారన్న దానిపై సమగ్ర వివరాలను రాష్ట్ర ప్రభుత్వం తనకు ఇవ్వాలని పవన్ కల్యాణ్ కోరారు. అలాగే కేంద్రం కూడా రాష్ట్రానికి ఇచ్చిన నిధుల వివరాలు ఇవ్వాలన్నారు. ఈ నెల 15లోగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వివరాలు ఇవ్వాలని పవన్ స్పష్టం చేశారు. వివరాలు ఇవ్వకపోతే ఏం చేయాలన్న దానిపై కార్యాచరణ రూపొందిస్తానని తెలిపారు. గతంలో పోలవరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం కోరితే వెబ్‌సైట్లో వివరాలు చూసుకోవాలన్నారని, ఎంత వెతికినా వివరాలు దొరకలేదని పవన్ పేర్కొన్నారు. అప్పుడు ఇవ్వని వాళ్లు ఇప్పుడు కూడా ఇస్తారనే నమ్మకం తనకు లేదన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం తలచుకుంటే రెండు గంటల్లో వివరాలు ఇవ్వగలదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన వివరాలను కమిటీ ముందు ఉంచుతానని, కమిటీ నిజానిజాలు వెలికితీస్తుందన్నారు. అప్పుడు అబద్ధం ఎవరు చెబుతున్నారో తేలిపోతుందన్నారు. 'నేను ఏదైనా మాట్లాడితే.. బీజేపీ అనుకూలం, టీడీపీకి అనుకూలం, మాట్లాడాల్సినంత మాట్లాడలేదు. తక్కువ చేసి మాట్లాడాడు. అని అంటున్నారు. అందుకే కమిటీలో కూడా నేను ఉండకూదని నిర్ణయించుకున్నా' అని తెలిపారు. జేఏసీ అంటే రాజకీయం అవుతుందని, అందుకే జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ అని పేరు పెట్టామన్నారు. నిధుల విషయంలో నెలకొన్న గందరగోళానికి తెరదించేందుకే జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పవన్ తెలిపారు. కమిటీలో ఎవరుంటే బాగుటుందని ఆలోచించినప్పుడు తనకు రాజకీయ అస్త్ర సన్యాసం చేసిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, ఐఏఎస్‌గా పనిచేసిన లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ గుర్తుకి వచ్చారని పవన్ తెలిపారు. వాళ్లే కాకుండా ఇంకా చాలా మంది మేధావులతో మాట్లాడుతున్నానని, వాళ్లందరి పేర్లని ఒకటి రెండు రోజుల్లో వెల్లడిస్తానని చెప్పారు. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీలో తాను ఉండబోమని స్పష్టం చేశారు. 'నిధులు ఇచ్చామని బీజేపీ నేతలు అంటున్నారు. అసలు మాకు ఏం ఇవ్వలేదు అని టీడీపీ ఎంపీలు అంటున్నారు. ఈ రెండు పార్టీలకు నేను మద్దతిచ్చాను. ప్రస్తుత పరిస్థితికి జనసేనని కూడా నిందించాలి.' అని పవన్ పేర్కొన్నారు. ఇప్పుడిప్పుడే స్థిరపడుతున్న ఏపీలో ప్రతి చిన్న విషయానికీ గొడవ చేయకూడదన్న ఉద్దేశంతోనే తాను సంయమనం పాటిస్తూ వస్తున్నానని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా రావడం లేదనే అసంతృప్తి ఏపీ ప్రజలతోపాటు తనకి కూడా ఉందన్నారు. ఏపీ అభివృద్ధి గురించి అందరి కంటే ఎక్కువ బాధ్యత తనపై ఉందన్నారు. బాధ్యత తీసుకున్నందుకే, రాష్ట్రానికి ఏదో ఒకటి చేయాలనే ఉద్దేశంతో తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఏపీకి హోదా గురించి అడిగితే అటు కేంద్రం, ఇటు రాష్ట్రం నుంచి స్పష్టత రాలేదన్నారు. మొదటి నుంచీ ఆందోళన చేయకుండా ఎందుకు కాలయాపన చేశారని టీడీపీ ఎంపీలని ప్రశ్నించారు. రాష్ట్రం కోసం లెఫ్ట్ పార్టీలతోపాటు మిగతా పార్టీలని కూడా కలుపుకొని ముందుకు వెళ్తామన్నారు.

రాష్ట్రానికి నిధుల కేటాయింపులు, ప్రత్యేక హోదా విషయంలో టీడీపీ ఎంపీలు పార్లమెంటులో ఆందోళన పేరుతో డ్రామా చేస్తున్నారని తాను ఎలా చెప్పగలనని, వాళ్ల మనసులో ఏముందో తనకెలా తెలుస్తుందని పవన్ కల్యాణ్ అన్నారు. లేడికి లేచిందే పరుగు అనే తరహాలో తాను ప్రవర్తించబోనని, ఒక్కొక్క విషయాన్ని అర్థం చేసుకున్న తర్వాతే కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళ్తున్నానని తెలిపారు. ఏపీ కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలన్నారు. ఏ కమిటీ అవసరం లేదంటూ ఎంపీ కేశినేని నాని, మంత్రి పుల్లారావు చేసిన వ్యాఖ్యలపై తాను స్పందించబోనన్నారు. మోదీ ప్రధాని కాకముందు ఆయనతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా, అయితే ఇప్పుడు ఆయన్ని కలిసే పరిస్థితి లేదని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. 'ముఖ్యమంత్రే తనకు ప్రధాని అపాయింట్‌మెంట్ దొరకడం లేదంటున్నారని, ఇక నా స్థాయి ఏమిటి? నేను ప్రధానిని ప్రభావితం చేయగల వ్యక్తినా?' అని పవన్ ప్రశ్నించారు. తనకు రాజకీయ అనుభవం లేకనే ఏపీ వాదనని సమర్థంగా వినిపిస్తారనే ఉద్దేశంతో గత ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ ఎంపీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేశానని స్పష్టం చేశారు. "సౌత్ ఇండియా ఉద్యమం అవసరమా? ప్రత్యేక దేశం కోసం కాదు? న్యాయం కోసం గళమెత్తాలి.' అని పవన్ వ్యాఖ్యానించారు.

'తెలంగాణకి జరగాల్సిన న్యాయం జరిగిపోయింది. తెలంగాణ ఇచ్చేందుకే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చేశారు. తెలంగాణ వాళ్లకి కొత్త రాష్ట్రం ఇస్తామన్నారు. ఇచ్చేశారు. ఆంధ్రప్రదేశ్ వాళ్లకి హోదా ఇస్తామన్నారు. ఇవ్వలేదు.' అని పవన్ వ్యాఖ్యానించారు. తాను చేస్తోంది తిరుగుబాటు కాదని, తనపై నమ్మకం ఉంచిన ప్రజలకి న్యాయం చేసే ప్రయత్నం అని తెలిపారు.

ఉత్సాహాన్ని కొనసాగించాలి: ఉండవల్లి

ప్రజాస్వామ్యంలో ప్రజలని భాగస్వాముల్ని చేయడమే పారదర్శకత అని, పవన్ నిజమైన రాజకీయాలు చేయడం ప్రారంభించారని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. ఇదే ఉత్సాహాన్ని కొనసాగించాలని పవన్‌కి సూచించారు. అత్యంత కష్టమైన పనిని పవన్ ఎంచుకున్నారని, తనకి చాలా సంతోషంగా ఉందని అరుణ్ కుమార్ చెప్పారు. ప్రభుత్వాలు ఎప్పుడూ అబద్ధం ఆడవని, అయితే నిజం మాత్రం చెప్పవని ఎద్దేవా చేశారు. రాజకీయాల నుంచి తప్పుకున్న తనను పవన్ పిలవడంతో ఆయన్ను చూసే అవకాశం లభిస్తుందని ఇక్కడికి వచ్చానని ఉండవల్లి వ్యాఖ్యానించారు. టీడీపీ, బీజేపీ గోదావరి జిల్లాల్లో గెలిచింది పవన్ వల్లే అని, టీడీపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది కూడా ఆయన వల్లే అన్నారు. ఆ రెండు పార్టీల వాళ్లకి జేజేలు కొట్టి మరీ పవన్ గెలిపించారని తెలిపారు. నిధుల లెక్కలు పవన్ అడిగితే తప్పక ఇస్తారన్న నమ్మకం తనకు ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఏపీలో గడ్డు రోజులు ఉన్నాయని అన్నారు.

మావి గొంతెమ్మ కోర్కెలు కాదు

▸ 5లోగా ప్రకటన రావాల్సిందే!

▸ లేకపోతే పోరాటం ఉధృతం

▸ అవసరమైతే కేంద్రానికి రాం రాం: టీడీపీ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కేంద్రసాయంపై మార్చి 5వ తేదీలోగా స్పష్టత లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని మంత్రులు, టీడీపీ ఎంపీలు, నాయకులు స్పష్టం చేశారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను తూ.చ. తప్పకుండా పాటించాల్సిందేనని వారు డిమాండ్ చేశారు. చట్టంలో చెప్పిన విషయాలకు నాలుగేళ్లయినా మోక్షం లేదని ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి విమర్శించారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలో ఆదివారం పర్యటించిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. విజయవాడ, విశాఖ మెట్రోరైల్ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడంపై కేఈ ఆగ్రహం వ్యక్తం చేశారు. తామేమీ 'గొంతెమ్మ కోరికలు కోరటం లేదని, రాష్ట్ర హక్కుల గురించి పోరాటం చేస్తున్నామని' మంత్రి నక్కా ఆనందబాబు కేంద్రంపై మండిపడ్డారు. ఆదివారం ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడారు. 'బీజేపీ ఎన్నికల రాజకీయాలు చేస్తూ రాష్ట్రానికి అన్యాయం చేస్తుంటే ఇంకా సహనం పాటించాలా?' అని ఆయన ప్రశ్నించారు. విభజన చట్టంలోని హామీలన్నీ నెరవేర్చే విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సీఎం చంద్రబాబు చర్చలు జరపడానికి 29 సార్లు ఢిల్లీకి వెళ్లారని, ఇదే ఆయన సహనానికి నిదర్శనమని అనంతపురం ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన పుట్టపర్తిలో విలేకరులతో మాట్లాడారు. మార్చి 5 తర్వాత సీఎం నిర్ణయానికి అనుగుణంగా తమ కార్యాచరణ ఉంటుందన్నారు. ఆలోపు సంతృప్తికరమైన ప్రకటన రాకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఎంపీ మురళీమోహన్ స్పష్టం చేశారు. అప్పటికీ అదే వైఖరితో ఉంటే కేంద్రానికి రాం రాం చెబుతామని అన్నారు. బీజేపీతో వైసీపీ లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకోవడం వల్లే రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని టీడీపీ నేత జూపూడి ప్రభాకరరావు విమర్శించారు.

బడ్జెట్‌లో గొప్పలు తప్ప నిధులేవీ?

▸ సందేహాలకు తావిచ్చేలా బీమా పథకం

▸ మద్దతు ధరపై మోదీ ప్రభుత్వానివి మాటలే

▸ రాష్ట్ర ప్రయోజనాలపై నాలుగేళ్లుగా టీడీపీ నిద్ర: కరత్

భీమవరం, ఫిబ్రవరి 11: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్భాటాలు, గొప్పలు ప్రకటించుకోవడం తప్ప నిధుల్లేవని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర 25వ మహాసభలకు వచ్చిన ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం కొత్త బడ్జెట్‌లో రైతులకు ఉత్పత్తి ఖర్చులపై 50 శాతాన్ని కలిపి కనీస మద్దతు ధరగా ఇస్తామని ప్రకటించారని, కానీ కేటాయించిన రూ.2వేల కోట్లు ఏ మాత్రమూ సరిపోవన్నారు. మద్దతుధర అమలుకావాలంటే కనీసం లక్ష కోట్ల రూపాయలు అవసరమని కరత్ అన్నారు. మరోవైపు బీమా పథకంపైనా అనేక అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. ఈ పథకం ప్రైవేటు ఆస్పత్రులకు, బీమా సంస్థలకు లబ్ధి కలిగించేలా ఉందని ఆయన ఆరోపించారు. బెంగళూరులోని ప్రతిష్ఠాత్మక హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌ను దెబ్బతీసేలా రాఫెల్ విమానాల కొనుగోళ్లకు ఇతర సంస్థను ఆశ్రయించడం కుంభకోణానికి తావిస్తోందని ప్రకాశ్ కరత్ అన్నారు. పాకిస్థాన్ సైన్యం, తీవ్రవాదులు చేస్తున్న దాడులను ఎదుర్కోవడంలో కేంద్రానికి సరైన ప్రణాళిక లేదన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రకాశ్ కరత్

టీడీపీ ఇన్నేళ్లు ఏం చేసింది?

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఇప్పుడు ఆందోళనలు చేస్తున్న టీడీపీ... మరి ఈ నాలుగేళ్లు నిద్రపోయిందా అని కరత్ ప్రశ్నించారు. ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్నా... రాష్టానికి రావాల్సిన ప్రయోజనాలపై కేంద్రాన్ని ఎందుకు నిలదీయలేకపోయిందని ప్రశ్నించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని కరత్ వ్యాఖ్యానించారు.

రేషన్ డీలర్ల మాయాజాలం!

▸ వేలిముద్రతో 'డబుల్' వసూళ్లు

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లుగా రేషన్ డీలర్ల వైఖరి ఉంది. లబ్ధిదారుల అవగాహన లేమిని ఆసరాగా చేసుకుని రెండుసార్లు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒకే లావాదేవీకి నగదు రహితంగా, నగదు రూపంలోనూ డబ్బులు దండుకుంటున్నారు. తాజాగా గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గంలో ఓ బ్యాంకుకు ఈ తరహాలో నాలుగు ఫిర్యాదులు అందాయి. రేషన్‌కు తమ వద్ద నగదు తీసుకున్నారని, కానీ బ్యాంకు ఖాతాలో కూడా డబ్బులు కట్ అయ్యాయంటూ బాధితులు బ్యాంకులో ఫిర్యాదు చేశారు. అయితే వీటితో తమకు సంబంధం లేదని బ్యాంకర్లు బదులిచ్చారు. మరికొన్ని జిల్లాల్లో కూడా ఇలాగే జరిగిందని అంటున్నారు. క్యాష్‌లెస్ విధానం ప్రవేశపెట్టిన తొలినాళ్లలో సరైన అవగాహన లేకపోవడం, సాంకేతిక సమస్యల వల్ల లబ్ధిదారుల ఖాతాల నుంచి డబ్బు కట్ అయినా, నగదు రూపంలోనూ తీసుకునే వారు. కానీ కొంద రు డీలర్లు అదే పద్ధతిలో వెళ్తూ మోసాలకు పాల్పడుతున్నారు. ఇక, ఈ-పోస్ యంత్రాన్నే రెండు రకాలుగా ఉపయోగించుకోవడంతో అక్రమాలు జరుగుతున్నాయి. ప్రతి కార్డుదారు వేలిముద్ర వేస్తేనే రేషన్ పంపిణీ జరుగుతుంది. క్యాష్‌లెస్ విధానం అమలుకు కూడా అదే ఈ-పోస్ యంత్రంలో వేలిముద్ర ఇవ్వాలి. అందులో రెండు ఆప్షన్లు ఉంటాయి. ఒకటి క్యాష్, మరొకటి క్యాస్‌లెస్. రెండింటికీ వేలిముద్ర తప్పనిసరి కావడంతో కొందరు డీలర్లు క్యాష్‌లెస్ మోడ్‌లో పెట్టినా కార్డుదారుల నుంచి నగదు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయడం వల్ల వేలిముద్ర వేస్తే వెంటనే నగదు బ్యాంకు నుంచి డీలరు ఖాతాకు జమ అవుతుంది. ఈ విషయం కార్డుదారులకు పెద్దగా తెలియకపోవడంతో డీలర్ల జేబులు నిండుతున్నాయి. ఈ మోసం ఎక్కడ జరిగిందో అర్థంకాక బ్యాంకుల్లో ఫిర్యాదు చేస్తున్నారు.

నక్సల్స్ చేతిలో స్నైపర్లు!

(మొదటి పేజీ తరువాయి)

మావోయిస్టు పార్టీ దృష్టి కేంద్రీకరించింది. అందులో భాగంగా విధ్వంసకర స్నైపర్ రైఫిళ్లను భారీగా సమకూర్చుకుంది. అదే సమయంలో బాణాలతోనూ భారీ ఆయుధాలకు రూపకల్పన చేసింది. వెదురుతో తయారు చేసిన బాణాల చివర శక్తివంతమైన పేలుడు పదార్థాల(ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోసివ్ డివైస్- ఐఈడీ)ను అమర్చి, చిన్నపాటి రాకెట్ లాంచర్లుగా తయారు చేసింది. స్నైపర్ రైఫిళ్లు, ఐఈడీ బాణాలతో... కూంబింగ్‌కు వస్తున్న భద్రతాదళాలపై విరుచుకుపడేందుకు సిద్ధమవుతోంది. అత్యాధునిక స్నైపర్ రైఫిళ్లను మావోయిస్టులు సమకూర్చుకోవడం భద్రతాదళాలను ఆందోళనకు గురి చేస్తోంది. తాజా పరిణామాలతో కూంబింగ్‌కు వెళ్లే భద్రతాదళాలు తమ వ్యూహాలను మార్చుకోక తప్పదని పోలీసు ఉన్నతాధికారులు అంటున్నారు. స్నైపర్ రైఫిళ్లతో కేవలం భద్రతాదళాలకే కాక ప్రజాప్రతినిధులకు సైతం ముప్పు పొంచి ఉందని వారు విశ్లేషిస్తున్నారు.

పోటాపోటీ వ్యూహాలు

మావోయిస్టుల ఏరివేత కోసం గత పదేళ్లుగా కేంద్రం 'ఆపరేషన్ గ్రీన్‌హంట్'ను అమలు చేస్తోంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా భద్రతాదళాలు.. కీలకమైన మావోయిస్టు నేతలను మట్టుబెట్టడంతోపాటు మావోయిస్టులకు కంచుకోట లాంటి అబూజ్‌మడ్, లాల్‌గఢ్ వంటి ప్రాంతాల్లోకి చొచ్చుకువెళ్లాయి. అదే సమయంలో ఉనికి కోసం మావోయిస్టులు సైతం భారీగానే ప్రతీకార దాడులకు దిగుతున్నారు. గత ఏడాది.. దండకారణ్యంలోని బుర్కాపాల్‌లో సీఆర్‌పీఎఫ్ దళాలపై దాడిచేసి 28 మందిని మావోయిస్టులు హతమార్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో 2022 నాటికి మావోయిస్టులను పూర్తిగా ఏరిపారేయాలన్న సంకల్పంతో కేంద్రం గత ఏడాది మే 17న 'ఆపరేషన్ సమాధాన్'ను ప్రారంభించింది. దాడులను మరింత ఉధృతం చేసింది. ఆపరేషన్ సమధాన్‌కు దీటుగా బదులిచ్చేందుకు మావోయిస్టులు సైతం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించారు. అందులో భాగంగా అత్యాధునిక ఆయుధాలు, టెక్నాలజీని సమకూర్చుకోవాలని మావోయిస్టు పార్టీ గెరిల్లా దళాల బాధ్యతలు చూసే సెంట్రల్ మిలటరీ కమిషన్(సీఎంసీ) నిర్ణయించింది.

ఏమిటీ వణుకు పుట్టించే ప్రణాళిక!

సీఎంసీ తన సర్క్యులర్‌లో పేర్కొన్న 'వణుకు పుట్టించే ప్రణాళిక' ఏమిటన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కూంబింగ్ కోసం అడవులకు వచ్చే భద్రతాదళాలను నిలువరించేందుకు గెరిల్లా యుద్ధ వ్యూహాలు, ఎత్తుగడలను సిద్ధం చేసినట్లు సీఎంసీ తన సర్క్యులర్‌లో పేర్కొంది. అందులో కీలకమైనవి రెండు. ఒకటి స్నైపర్ దాడులు. రెండోది 'ఆరోతరం ఐఈడీ'ల వినియోగం. అయితే.. సీఎంసీ వ్యూహాత్మకంగా ఈ రెండు అంశాలనే బయటపెట్టిందని, ఇంకా రహస్య అస్త్రాలు చాలానే ఉండి ఉంటాయని పోలీసు ఉన్నతాధికారులు విశ్లేషిస్తున్నారు. పీఎల్‌జీఏల్లో చురుగ్గా ఉండే కమెండోలకు స్నైపర్ రైఫిళ్ల వినియోగంపై ప్రస్తుతం మావోయిస్టులు విస్తృతంగా శిక్షణ ఇస్తున్నారు.

ఆయుధాలతో విధ్వంసం

ఇప్పటి వరకు పీఎల్‌జీఏ బలగాలు.. ల్యాండ్ మైన్స్ పెట్టడం, ఆ తర్వాత మాటువేసి భద్రతాదళాలపై దాడులు చేయడం వంటి వాటికే పరిమితమవుతూ వచ్చాయి. ఆపరేషన్ సమాధాన్ నేపథ్యంలో మావోయిస్టులు పోరాట పంథాను మార్చుకున్నారు. గిరిజనులు వాడే సంప్రదాయ ఆయుధాలైన వెదురు బాణాలతో భారీ విధ్వంసకర ఆయుధాలను తయారు చేస్తున్నారు. ఇంప్రవైజ్డ్ ఎక్స్‌ప్లోసివ్ డివైజ్‌(ఐఈడీ)తో కూడిన ఈ బాణాలు భూమిని లేదా వాహనాలను తాకిన వెంటనే భారీ విస్ఫోటనాన్ని కలిగించేలా డిజైన్ చేశారు. ఈ బాణాలకు వినియోగించే ఐఈడీ కూడా ఆరోతరం ఐఈడీ కావడం గమనార్హం. గత ఏడాది సుకుమా జిల్లాల్లో 25 మంది సీఆర్‌పీఎఫ్ కమెండోలను అంతమొందించిన ఘటనలో మావోయిస్టులు దీన్నే ఉపయోగించినట్లు సమాచారం. తక్కువ పరిమాణంతో ఎక్కువ విధ్వంసం ఆరోతరం ఐఈడీల ప్రత్యేకత. రెండు లేదా మూడు ఐఈడీ బాణాలను వదిలితే ఓ భారీ ల్యాండ్‌మైన్‌ను పేల్చినంత విధ్వంసం జరుగుతుంది. బుర్కాపాల్ అంబుష్‌లో వీటిని విజయవంతంగా వినియోగించినట్లుగా పార్టీ అంతర్గత పత్రికలో ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ బాణాలను ఎక్కువ దూరం పంపించేందుకు అత్యాధునిక విల్లులను కూడా రూపొందించినట్లు సమాచారం. వీటిని ఎక్కడికైనా సులువుగా తరలించవచ్చు. ఇవి ప్రమాదకరమైనవేనని భద్రతాదళాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

మీ రేషన్.. మా ఇష్టం!

(మొదటి పేజీ తరువాయి)

షాపులు తెరవాలని నిబంధనలు చెబుతున్నా చాలా మంది వాటిని ఖాతరు చేయడం లేదు. రాష్ట్రంలో మొత్తం 28,057 రేషన్ షాపులుంటే.. ప్రతిరోజూ సగటున 4 వేల షాపులు తెరవడం లేదంటే డీలర్లు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో మొత్తం కోటీ 41 లక్షల కార్డులున్నాయి. కార్డుదారులకు పదిహేను రోజులపాటు రేషన్ పంపిణీ చేయాలి. కానీ సగటున వారం నుంచి పదిరోజుల్లోపే పంపిణీని ఆపేస్తున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ నెలలో 11వ తేదీ వరకు సగటున ప్రతిరోజూ 3900 షాపులు మూసేసి ఉన్నాయి. ఆదివారం సెలవు లేకపోయినా 9800 మంది డీలర్లు షాపులు తెరవలేదు. ఇప్పటికే రాష్ట్రంలో అనేక కారణాలతో సగటున 20 లక్షల మంది రేషన్ తీసుకోవడం లేదు. ఇందులో వేలిముద్రలు పడక ఇబ్బంది పడుతున్నవారు సుమారు లక్ష మంది ఉన్నారు. కాగా ఈపోస్‌లో సర్వర్ సమస్యలు, షాపులు ఇష్టానుసారం తీయడం వల్ల మిగిలిన వారు రేషన్‌కు దూరమవుతున్నారు.

పోర్టబులిటీ ఉన్నా...


ఈపోస్‌తో పాటు రేషన్‌లో పోర్టబులిటీ విధానం కార్డుదారులకు కొంత ఉపశమనం కలిగిస్తోంది. షాపులు అందుబాటులో లేనిచోట కార్డుదారులు వేరే షాపుల ద్వారా రేషన్ తీసుకుంటున్నారు. గ్రామాల్లో ఒకట్రెండు షాపులు మాత్రమే ఉంటాయి. ఆ డీలర్లు వారి పరిధిలోని కార్డులకు సరిపడా సరుకులనే అందుబాటులో ఉంచుతారు. తమ పరిధిలో వారికి కాకుండా ఇతరులకు రేషన్ ఇచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. సంక్రాంతి కానుక, రంజాన్ కానుకల సమయాల్లో పోర్టబులిటీని అస్సలు అమలుచేయడం లేదు. కాగా షాపులు తీయకపోయినా అధికారులు మాత్రం పెద్దగా చర్యలు చేపడుతున్న దాఖలాలు కనిపించడం లేదు. కొంతమంది డీలర్లు కేవలం మూడు నాలుగు రోజులే తెరిచి సరిపెడుతున్నారు. కడప జిల్లాలో ఇద్దరు డీలర్లు నెలలో ఒక్కరోజు కూడా షాపు తెరవలేదని గతంలో అధికారుల దృష్టికొచ్చింది. కాగా ప్రతినెలా ఇంతమంది షాపులు తెరవకున్నా వాటి గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు.

ఈ నెలలోనూ అంతంతే..

ఈ నెలలో 2వ తేదీన 2670, మూడున 1988, నాలుగున 2442, ఐదున 1835, ఆరున 2158, ఏడున 2908, ఎనిమిదిన 3726, తొమ్మిదిన 4681, పదిన 5828 షాపులు తెరవలేదు. ఇప్పటివరకూ మొత్తం 80.82 శాతం రేషన్ పంపిణీ జరగగా ఇంకా 28 లక్షల మంది రేషన్ తీసుకోవాల్సి ఉంది.

జనరల్ స్టడీస్ ఎకానమీ

పోటీ పరీక్షల కోణంలో...
కేంద్ర బడ్జెట్



కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2018 - 19 సంవత్సరానికి సంబంధించిన సాధారణ బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టారు. సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు '2018 - 19 విత్త విధాన దృక్పథం' అంశంలో భాగంగా పన్నుల విధానం, వ్యయ విధానం, ప్రజా ఆర్థిక నిర్వహణ విధానం, ప్రభుత్వ అప్పులు, రంగాలవారీ కేటాయింపులు, తదితరాల గురించి తెలుసుకోవడం అవసరం. ఈ నేపథ్యంలో ఆయా అంశాలపై విశ్లేషణ..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2017 - 18 ద్వితీయార్థంలో తయారీ, సేవా రంగాలు, ఎగుమతులు వృద్ధి చెంది జీడీపీ వృద్ధి రేటు 7.2 నుంచి 7.5 శాతానికి పెరుగుతుందని ప్రభుత్వం పేర్కొంది. తయారీ, సేవా రంగాల్లో 8 శాతానికి పైగా, ఎగుమతుల్లో 15 శాతం వరకు వృద్ధిని అంచనా వేసింది. అలాగే ప్రస్తుత ప్రభుత్వం గత మూడేళ్లలో సగటున 7.5 శాతం వృద్ధిని సాధించిందని, భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం 2.5 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం తెలిపింది. మనది ప్రపంచంలోనే ఏడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అనీ, త్వరలోనే ఇది అయిదో స్థానానికి చేరుకుంటుందనీ, పర్చేజింగ్ పవర్ పారిటీ (పీపీపీ) ప్రాతిపదికన చూస్తే భారతదేశం ఇప్పటికే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందనీ కేంద్రం పేర్కొంది.

2018 - 19 సాధారణ బడ్జెట్ వివరాలు

మొత్తం బడ్జెట్‌ను రూ. 24,42,213 కోట్లుగా అంచనా వేశారు. ఇది 2017 - 18 సవరించిన బడ్జెట్ అంచనా అయిన రూ. 22,17,750 కోట్ల కంటే రూ. 2,24,463 కోట్లు... అంటే 10.1 శాతం అధికం.

బడ్జెట్ రాబడులు

- బడ్జెట్‌కు కేటాయించిన మొత్తంలో రూ. 17,25,738 కోట్లు రెవెన్యూ రాబడుల ద్వారా, 7,16,475 కోట్లు మూలధన రాబడుల ద్వారా వస్తాయని అంచనా . ఈ రెవెన్యూ రాబడుల్లో కేంద్రానికి లభించే పన్ను ఆదాయానికి సంబంధించి నికర పన్ను ఆదాయం రూ. 14,80,649 కోట్లు కాగా పన్నేతర ఆదాయం రూ. 2,45,089 కోట్లు. మూలధన రాబడుల్లో రుణాలు, ఇతర లయబిలిటీస్ నుంచి రూ. 6,24,276 కోట్లు; లోన్ల రికవరీ ద్వారా రూ. 12,199 కోట్లు; ఇతర వసూళ్ల ద్వారా రూ. 80,000 కోట్లు లభిస్తాయి.
- మొత్తం బడ్జెట్ రాబడుల్లో రెవెన్యూ రాబడుల ఆదాయం వాటా 70.66 శాతం. మూలధన రాబడుల ఆదాయం 29.34 శాతం. రెవెన్యూ రాబడుల ఆదాయంలో పన్నుల ఆదాయం వాటా 85.80 శాతం కాగా పన్నేతర ఆదాయం వాటా 14.20 శాతం. అలాగే మొత్తం మూలధన ఆదాయంలో 87.13 శాతం వరకు రుణాలు, ఇతర లయబిలిటీస్ ద్వారా లభిస్తుంది.
- పన్ను ఆదాయంలో భాగంగా తాజా బడ్జెట్‌లో స్థూల పన్ను ఆదాయాన్ని రూ. 22,71,242 కోట్లుగా అంచనా వేశారు. దీనిలో అత్యధికంగా జిఎస్‌టి ద్వారా రూ. 7,43,900 కోట్లు రాగా కార్పొరేషన్ పన్ను ద్వారా రూ. 6,21,000 కోట్లు; ఆదాయపు పన్ను ద్వారా రూ. 29,000 కోట్లు; కేంద్ర ఎక్సైజ్ డ్యూటీల ద్వారా రూ. 2,59,600 కోట్లు; కస్టమ్స్ ద్వారా రూ. 1,12,500 కోట్లు; కేంద్ర పాలిత ప్రాంతాలపై విధించే పన్నుల ద్వారా రూ. 5,242 కోట్లు లభిస్తాయని అంచనా. అయితే మొత్తం స్థూల పన్ను ఆదాయం నుంచి రాష్ట్రాల పన్నుల వాటా 7,88,093 కోట్లు (2018-19), ఎన్‌సిసిఎఫ్/ ఎన్‌డిఆర్ఎఫ్‌కు ఎన్‌సిసిడి బదిలీచేసే రూ. 2500 కోట్లను తీసివేయగా తాజా బడ్జెట్‌లో కేంద్రానికి లభించే నికర పన్ను ఆదాయం రూ. 14,80,649 కోట్లు.
- ప్రస్తుత బడ్జెట్‌కు లభించే ఆదాయంలో భాగంగా ప్రతి రూపాయిలో వస్తు సేవల పన్ను, ఇతర పన్నుల నుంచి 23 పైసలు; రుణాలు, ఇతర లయబిలిటీస్ నుంచి 19 పైసలు; కార్పొరేషన్ పన్ను ద్వారా 19 పైసలు; ఆదాయపు పన్ను ద్వారా 16 పైసలు; కేంద్ర ఎక్సైజ్ డ్యూటీల ద్వారా 8 పైసలు; పన్నేతర ఆదాయం ద్వారా 8 పైసలు; కస్టమ్స్ ద్వారా 4 పైసలు; రుణేతర మూలధన రాబడుల ద్వారా 3 పైసలు లభిస్తాయి.
- మూలధన రాబడుల్లో భాగంగా 2018 - 19 సంవత్సరానికి గాను పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా మొత్తం రూ. 80,000 కోట్లను సమకూర్చడాన్ని లక్ష్యంగా పెట్టుకొన్నారు. అలాగే నగదు సంతులనం రూ. 43,066 కోట్లుగా ఉంది.

బడ్జెట్ సమగ్ర స్వరూపం (రూ. కోట్లలో)

అంశం	2016 - 17 (వాస్తవాలు)	2017 - 18 (బడ్జెట్ అంచనాలు)	2017 - 18 (సవరించిన అంచనాలు)	2018 - 19 (బడ్జెట్ అంచనాలు)
I రెవెన్యూ రాబడులు	13,74,203	15,15,771	15,05,428	17,25,738
I మూలధన రాబడులు	6,00,991	6,30,964	7,12,322	7,16,475
I మొత్తం రాబడులు	19,75,194	21,46,735	22,17,750	24,42,213
I రెవెన్యూ వ్యయం	16,90,584	18,36,934	19,44,305	21,41,772
V మూలధన వ్యయం	2,84,610	3,09,801	2,73,445	3,00,441
V మొత్తం వ్యయం	19,75,194	21,46,735	22,17,750	24,42,213
V రెవెన్యూ లోటు	3,16,381	3,21,163	4,38,877	4,16,034
V కోశ/ విత్త లోటు	5,35,618	5,46,531	5,94,849	6,24,276
I ప్రాథమిక లోటు	54,904	23,453	64,006	48,481

★ ప్రాథమిక లోటు (విత్తలోటు - వడ్డీ చెల్లింపులు)

జీడీపీలో పన్ను రాబడుల ధోరణులు (శాతంలో)

అంశం	2015 - 16	2016 - 17	2017 - 18 (సవరించిన అంచనా)	2018 - 19 (బడ్జెట్ అంచనా)
ప్రత్యక్ష పన్నులు	5.4	5.6	6.0	6.1
పరోక్ష పన్నులు	5.2	5.7	5.6	6.0
స్థూల పన్ను రాబడులు	10.6	11.3	11.6	12.1



వి. కరుణ
సబ్జెక్టు నిపుణులు

2018 - 19 సాధారణ బడ్జెట్‌కు లభించే ప్రతి రూపాయిలో ఆదాయ, వ్యయాలకు సంబంధించిన ఆధారాలు

రూపాయి రాక	(పైసల్లో)	రూపాయి పోక	(పైసల్లో)
వస్తు సేవలు, ఇతర పన్నులు	23	పన్నులు, డ్యూటీల్లో రాష్ట్రాల వాటా	24
కార్పొరేషన్ పన్ను	19	వడ్డీ చెల్లింపులు	18
రుణాలు, ఇతర లయబిలిటీస్	19	కేంద్ర ప్రభుత్వ పథకాలు	10
ఆదాయపు పన్ను	16	సబ్సిడీలు	9
కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ	8	కేంద్ర ప్రాయోజిత పథకాలు	9
పన్నేతర ఆదాయం	8	రక్షణ రంగం	9
కస్టమ్స్	4	ఆర్థిక సంఘ & ఇతర బదిలీలు	8
రుణేతర మూలధన రాబడులు	3	ఇతర వ్యయం	8
		పెన్షన్లు	5
మొత్తం రాబడి	100	మొత్తం వ్యయం	100

తాజా బడ్జెట్ వ్యయాలు

- మొత్తం బడ్జెట్ వ్యయాన్ని 24,42,213 కోట్లుగా అంచనా వేశారు. ఇందులో రెవెన్యూ వ్యయం 21,41,772 కోట్లు అంటే 87.70 శాతంగా మూలధన వ్యయం 3,00,441 కోట్లు అంటే 12.30 శాతంగా అంచనా వేశారు. మొత్తం వ్యయంలో వడ్డీ చెల్లింపులకే రూ. 5,75,795 కోట్లు అంటే 23.58 శాతాన్ని కేటాయించారు. మూలధన ఆస్తుల కల్పన, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కోసం 1,95,345 కోట్లు అంటే 8 శాతం నిధులను కేటాయించారు.
- బడ్జెట్ వ్యయంలో కేంద్ర పథకాలు / ప్రాజెక్టులకు రూ. 7,08,934 కోట్లు, బదిలీల్లో భాగంగా కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ. 3,05,517 కోట్లు; ఆర్థిక సంఘ గ్రాంట్ల కింద రూ. 1,09,373 కోట్లు కేటాయించారు.
- బడ్జెట్ వ్యయంలో భాగంగా ఒక్కో రూపాయికి పన్నులు, డ్యూటీల్లో రాష్ట్రాల వాటా కింద 24 పైసలు, వడ్డీ చెల్లింపుల కింద 18 పైసలు, కేంద్ర పథకాల కోసం 10 పైసలు, సబ్సిడీల కోసం 9 పైసలు వ్యయం చేస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంది.

ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారం రేపటి దిక్సూచిలో...

రైల్వే గ్రూప్-డి పోస్టులకు
ఎంపిక ఇలా..



భారతీయ రైల్వే వివిధ జోన్లలో ఖాళీగా ఉన్న 62,907 గ్రేడ్ - 4 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అభ్యర్థులు ఏ రైల్వే జోన్‌కు దరఖాస్తు చేయాలో నిర్ణయించుకుని, ఆయా రైల్వే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తిచేసి, ఫీజు చెల్లించాలి. ఏదైనా ఒక రైల్వే జోన్‌కు మాత్రమే దరఖాస్తు చేయాలి. ఒక అభ్యర్థి ఒక దరఖాస్తును మాత్రమే పూర్తి చేయాలి.

భర్తీ చేసే పోస్టులు

గ్రేడ్-4 (ట్రాక్‌మ్యాన్), గేట్‌మ్యాన్, పాయింట్స్‌మ్యాన్, హెల్పర్ (ఎలక్ట్రికల్ / ఇంజనీరింగ్ / మెకానికల్ / సిగ్నల్ / టెలి కమ్యూనికేషన్) పోర్టర్ తదితరాలు. ఈ పోస్టులకు సంబంధించిన సంక్షిప్త నోటిఫికేషన్ వివరాలు శుక్రవారం (9 ఫిబ్రవరి) నాటి దిక్సూచిలో లభిస్తాయి. సిలబస్, ఎంపిక ప్రక్రియను ఆర్ఆర్‌బీ శనివారం విడుదల చేసింది. ఈ వివరాలు చూద్దాం...

ఎంపిక ప్రక్రియ

ఎంపిక ప్రక్రియ ఆయా పోస్టులను అనుసరించి వేర్వేరుగా ఉంటుంది. ఇందులో రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ దశలు ఉంటాయి.

రాత పరీక్ష

రాత పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష తేదీ, సమయం, పరీక్ష కేంద్రాలు, కాల్ లెటర్ డౌన్‌లోడ్ వంటి విషయాలను సంబంధిత ఆర్ఆర్‌బీ వెబ్‌సైట్ ద్వారా పొందొచ్చు. కాల్ లెటర్ డౌన్‌లోడ్ సంబంధిత సమాచారాన్ని అభ్యర్థుల ఈ-మెయిల్‌కు కూడా పంపిస్తారు. రాత పరీక్ష కోసం మల్టిపుల్ ఛాయిస్ పద్ధతిలో ప్రశ్నపత్రాన్ని రూపొందిస్తారు. ఇందులో 100 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 90 నిమిషాల్లో (గంటన్నర) సమాధానాలను గుర్తించాలి. ఈ పరీక్షలో ప్రశ్నల క్లిష్టత ఆయా పోస్టులకు పేర్కొన్న అర్హత మేరకు ఉంటుంది. ఇందులో మ్యాథమెటిక్స్, జనరల్ ఇంటెలిజెన్స్ - రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్, జనరల్ సైన్స్ అనే నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. రాత పరీక్షలో నెగిటివ్ మార్కులు కూడా ఉంటాయి. ప్రతి తప్పునకు 1/3 మార్కు కోత విధిస్తారు.

తెలుగులో కూడా

హిందీ, ఇంగ్లీష్‌తోపాటు స్థానిక భాషల్లో కూడా పరీక్షను నిర్వహిస్తారు. ఈ క్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే - సికింద్రాబాద్ డివిజన్, సదరన్ రైల్వే - చెన్నై డివిజన్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే - భువనేశ్వర్ డివిజన్, సౌత్‌వెస్ట్ రైల్వే - బెంగళూరు డివిజన్‌లలో తెలుగు భాషలో పరీక్ష ఉంటుంది.

కనీస అర్హత మార్కులు

రాత పరీక్షలో నిర్దేశించిన విధంగా కనీస అర్హత మార్కులను సాధించాలి. ఇందులో జనరల్ అభ్యర్థులు - 40 శాతం, ఓబీసీ అభ్యర్థులు - 30 శాతం, ఎస్సీ అభ్యర్థులు - 30 శాతం, ఎస్టీ అభ్యర్థులు - 30 శాతం మార్కులను స్కోర్ చేయాలి. దివ్యాంగులకు కనీస అర్హత మార్కుల్లో రెండు శాతం మినహాయింపు ఇస్తారు.

పీఈటీ వివరాలు...

సీబీటీ ఆధారంగా 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ (పీఈటీ)కి పిలుస్తారు. ఇందులో నిర్దేశించిన విధంగా ఫిజికల్‌గా ఫిట్‌గా ఉండాలి. లేని పక్షంలో అనర్హుడిగా ప్రకటిస్తారు. కాబట్టి దరఖాస్తు సమయంలో సంబంధిత వివరాలను క్షుణ్నంగా గమనించడం మంచిది. ఇందులో ఉండే ఈవెంట్స్...

- పురుష అభ్యర్థులు 35 కిలోల బరువును మోస్తూ 100 మీటర్ల దూరాన్ని 2 నిమిషాల్లో చేరుకోవాలి. పరుగు పోటీలో భాగంగా 1000 మీటర్ల దూరాన్ని 4 నిమిషాల 15 సెకన్లలో పూర్తి చేయాలి.
- మహిళా అభ్యర్థులు 20 కిలోల బరువును మోస్తూ 100 మీటర్ల దూరాన్ని 2 నిమిషాల్లో చేరుకోవాలి. పరుగు పోటీలో భాగంగా 1000 మీటర్ల దూరాన్ని 5 నిమిషాల 40 సెకన్లలో పూర్తి చేయాలి.

చివరి దశ...

సీబీటీ, పీఈటీ ఆధారంగా అర్హత సాధించిన అభ్యర్థులను డాక్యుమెంట్ వెరిఫికేషన్‌కు పిలుస్తారు. ఇద్దరు అభ్యర్థులకు సమానమైన మార్కులు వచ్చిన పక్షంలో.. ఇద్దరిలో ఎక్కువ వయసు ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తారు. ఈ దశలో అర్హత సాధించిన వారికి మెడికల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ పరీక్షలో నిర్దేశించిన విధంగా ప్రమాణాలు ఉంటేనే పోస్టింగ్ ఇస్తారు.

ఇలా సిద్ధమవ్వాలి...

రాత పరీక్షలో 90 నిమిషాల్లోనే 100 ప్రశ్నలకు సమాధానాలను గుర్తించాలి. అంటే తక్కువ సమయంలో ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలను ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి ప్రశ్నకు నిమిషం కంటే తక్కువ సమయం మాత్రమే లభిస్తుంది. కాబట్టి వేగంగా కచ్చితత్వంతో సమాధానాన్ని గుర్తించే విధంగా నైపుణ్యాన్ని పెంచుకోవాలి. ఇందుకు ఏకైక మార్గం ప్రాక్టీస్. ఈ క్రమంలో గత ప్రశ్నపత్రాలను, మాదిరి ప్రశ్నపత్రాలను సమగ్రంగా ప్రాక్టీస్ చేయాలి. ఇందులో సిలబస్‌లో పేర్కొన్న అంశాలపై ప్రాథమిక పరిజ్ఞానాన్ని పరీక్షించే ప్రశ్నలు ఇస్తారు. కాబట్టి ఆయా అంశాలను అనుసరించి ఎన్‌సీఈఆర్‌టీ 1 - 12 తరగతి వరకు ఉన్న పుస్తకాలను అధ్యయనం చేయడం ప్రయోజనకరం. మ్యాథమెటిక్స్, జనరల్ ఇంటెలిజెన్స్ - రీజనింగ్‌లలో సాధించిన మార్కులే కీలకంగా మారే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆయా అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. సాధ్యమైనన్ని షార్ట్‌కట్ మెథడ్స్ నేర్చుకోవాలి. ఎలిమినేషన్ స్కిల్‌ను అలవర్చుకోవాలి.

దృష్టి సారించాల్సిన అంశాలు

- మ్యాథమెటిక్స్: సంఖ్యలు, గ.సా.భా., క.సా.గు., సూక్ష్మీకరణం, వర్గమానాలు, సగటు, శాతం, నిష్పత్తి - అనులోమానుపాతం, వయసులు, భాగస్వామ్యాలు, లాభనష్టాలు, కాలం - పని, కాలం - దూరం, రైళ్ళు, పడవలు - ప్రవాహాలు, పైపులు - తొట్టెలు, వడ్డీలు, క్షేత్రగణితం, ఎత్తులు - దూరాలు, తదితరాలు.
- రీజనింగ్: కోడింగ్ - డీకోడింగ్, శ్రేణులు, భిన్న పరీక్ష, పోలిక పరీక్ష, రక్త సంబంధాలు, దిశ పరీక్ష, వెన్ డయాగ్రమ్స్, మ్యాథమేటికల్ ఆపరేషన్స్, మిసింగ్ నంబర్స్ తదితరాలు.
- జనరల్ స్టడీస్: ఇందులో భారతీయ రైల్వేలపై ప్రశ్నలు అడగొచ్చు. భారత భూగోళశాస్త్రం, ప్రపంచ భూగోళశాస్త్రం, అంతర్జాతీయ సరిహద్దులు, భారతదేశ చరిత్ర (ప్రాచీనం నుంచి స్వాతంత్ర్య ఉద్యమం వరకు), భారత రాజ్యాంగ సంబంధిత ప్రశ్నలు, జాతీయ చిహ్నాలు, క్రీడలు, బిరుదులు, రచయితలు, పక్షి సంరక్షణ కేంద్రాలు, కేంద్ర సంస్థలు, విద్యుత్ కేంద్రాలు, నదులు, డ్యాములు, సరస్సులు, ప్రసిద్ధ కట్టడాలు, వ్యక్తులు, భారత ఆర్థిక వ్యవస్థ మొదలైనవాటి నుంచి ప్రశ్నలుంటాయి.
- జనరల్‌సైన్స్: భౌతిక, రసాయన, జీవశాస్త్ర అంశాలను చదవాలి. ముఖ్యంగా భౌతికశాస్త్ర అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.
- కరెంట్ ఎఫైర్స్: పరీక్ష జరిగేముందు ఒక ఏడాది కాలంలో చోటుచేసుకున్న ప్రధాన సంఘటనలు, భారతీయ రైల్వేల్లో జరిగిన మార్పులు, సమావేశాలు, వార్తల్లో నిలిచిన వ్యక్తులు, అవార్డులు, క్రీడా పతకాల గురించి తెలుసుకోవాలి.

ముఖ్య సమాచారం

- అర్హత: 10వ తరగతి / నేషనల్ కౌన్సిల్ ఫర్ వొకేషనల్ ట్రైనింగ్ (ఎన్‌సీవీటీ) లేదా స్టేట్ కౌన్సిల్ ఫర్ వొకేషనల్ ట్రైనింగ్ (ఎస్‌సీవీటీ) గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి ఐటీఐ / తత్సమానం లేదా ఎన్‌సీవీటీ అప్రెంటిషిప్ సర్టిఫికెట్ లేదా 10వ తరగతితోపాటు ఎన్‌సీవీటీ / ఎస్‌సీవీటీ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి ఐటీఐ / 10వ తరగతితోపాటు ఎన్‌సీవీటీ నేషనల్ అప్రెంటిషిప్ సర్టిఫికెట్. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అనర్హులు.
- వయసు: 18 - 31 ఏళ్లు (జూలై 1, 2018 నాటికి).
- దరఖాస్తు ముగింపు: మార్చి 12, 2018.
- వెబ్‌సైట్: h t c t p

జాబ్ కార్నర్

ఇండియన్ నేవీ

ఇండియన్ నేవీ - సివిలియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీలు:** 74
- **పోస్టుల వారీగా ఖాళీలు:** ఫైర్ ఇంజిన్ డ్రైవర్స్ 3, టెలిఫోన్ ఆపరేటర్ 2, ఫైర్‌మన్ 27, ఫొటో ప్రింటర్ 1, సినిమా ప్రొజెక్షనిస్ట్ 2, కుక్ 5, బేరర్ 3, పెస్ట్ కంట్రోల్ వర్కర్ 12, గ్రూమ్ 17, శాడ్లర్ 2
- **అర్హత:** మెట్రిక్యులేషన్ / 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పోస్టుకు నిర్దేశించిన మేర అనుభవం ఉండాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 27, 2018.
- **వెబ్‌సైట్:** w w

ఐఐఎస్ఈఆర్ తిరుపతి

తిరుపతిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) - ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్
- **విభాగాలు:** సైన్స్/ ఫిజిక్స్/ కెమిస్ట్రీ/ మేథమెటిక్స్/ బయాలజీ/ ఎర్త్ అండ్ క్లయిమేట్ సైన్స్/ హ్యూమానిటీస్/ సోషల్ సైన్స్
- అర్హత: ఫస్టు క్లాసు మార్కులతో పిహెచ్‌డి పూర్తిచేసి ఉండాలి. పారిశ్రామిక/ పరిశోధన/ బోధన రంగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు మూడేళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్లకు ఆరేళ్లు, ప్రొఫెసర్లకు పదేళ్ల అనుభవం ఉండాలి. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు మాత్రం కనీసం మూడేళ్లు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన అనుభవం తప్పనిసరి
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ప్రొఫెసర్ పోస్టులకు ఫిబ్రవరి 22, మిగిలిన పోస్టులకు మార్చి 10.
- వెబ్‌సైట్: w w

ఇంజనీర్లు

అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** సీనియర్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్), అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్), జూనియర్ ఇంజనీర్ (సివిల్), ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ (ఫెసిలిటీ ఆఫీస్), ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ (ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్/ ఇ లెర్నింగ్), మార్కెటింగ్ అసోసియేట్ - ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్, క్లయింట్ అకౌంట్స్ అసోసియేట్, అకౌంట్స్ అసిస్టెంట్, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, మార్కెటింగ్ అసిస్టెంట్
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 21, 2018.
- **వెబ్‌సైట్:** w n / / / w r



'కబడ్డీ కబడ్డీ'లో..
'ఔను..వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు'లో..
'మృగం'లో..



జీవా పేరు చెప్పగానే ఎర్రటి జీరతో ఉండే పెద్ద కళ్లు భయపెడతాయి. ఆ కళ్లు చూసి హీరోయిన్లే కాదు ప్రేక్షకులు కూడా భయపడతారు. విలన్‌గా అనేక సినిమాల్లో తనదైన ముద్ర వేసిన జీవా ఈమధ్య కామెడీతో కూడా ఆకట్టుకుంటున్నారు. ఇంతకీ ఆయన అసలు పేరేంటి? జీవా అనే పేరు ఎవరు పెట్టారు? ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆయన భార్య ఏ సినిమా చూసి భయపడింది? విలన్ వేషాల నుంచి కామెడీవైపు ఎలా వచ్చారు? 43 ఏళ్లుగా ఇండస్ట్రీతో తనకున్న అనుబంధాన్ని జీవా 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే'లో పంచుకున్నారు. ఆ విశేషాలే ఇవి...

నా పేరు మార్చింది ఆయనే!

❖ నమస్కారం జీవా గారు!

నమస్కారం

❖ సినిమా ఇండస్ట్రీలో నలభై ఏళ్లకు పైగా ఉన్నారు. వెయ్యికి పైగా సినిమాలు చేశారు. కానీ మీ గురించి ఎవరికీ తెలియదు... ఎక్కడా పెద్దగా ఇంటర్వ్యూలు ఇవ్వలేదు. ఎందుకలా?

1975లో సినిమా రంగంలోకి ఎంట్రీ ఇచ్చాను. సినిమాలు లెక్కపెట్టుకోలేదు. ఇంటర్వ్యూలు పెద్దగా ఇవ్వకపోవడానికి ప్రత్యేకమైన కారణాలు ఏమీ లేవు గానీ... నాకు మొహమాటం ఎక్కువ. బిడియం కూడా. ఆర్టిస్టుకు ఉండకూడని లక్షణమేదో అది ఉంది నాకు! ఇప్పటికి కూడా నా పనేంటో అదే చూసుకుని వచ్చేస్తా. మీలాంటి వాళ్లు మాట్లాడుతుంటే చాలా విషయాలు తెలుస్తాయి. అది వినడం ఇష్టం.

❖ వ్యక్తిగా మీ గురించి తెలిసినవాళ్లు 'జీవా అంత మంచివాళ్లు ఎవరూ ఉండరు' అంటారు!

మీరనుకున్నంత మంచివాడిని కాను (నవ్వు). 'తప్పు చేయనివాడు లేడు లేడు... తప్పు చేయని మనిషి మనిషి కాడు' అంటాడు ఉమర్ ఖయాం. అయితే అదే తప్పును మళ్లీ చేయకూడదు. ఎదుటి వాడికి నష్టం కలిగించకూడదు.

❖ మీరు చేసిన తప్పులేమైనా ఉన్నాయా?

తప్పులంటే అవేవో క్షమించరాని నేరాలు కాదు. చిన్న చిన్నవే!

❖ విలన్, కమెడియన్‌గా మెప్పించారు కానీ టాప్ విలన్, టాప్ కమెడియన్ అనిపించుకోలేదు ఎందుకు? ఆ వెలితి లేదా మీకు?

ఇన్నేళ్లుగా ఓ ఆర్టిస్టుగా మనుగడ సాధిస్తున్నా అదే గ్రేట్. బహుశా నాలోనే వెలితి ఉండొచ్చు. పరిపూర్ణంగా న్యాయం చేయలేదేమో జీవా అని దర్శకులు అనుకుని ఉండొచ్చు. కానీ అప్పుడు నాలో ఓ ప్రశ్న ఉద్భవిస్తుంది. మరి బాలచందర్‌గారికి ఎలా నచ్చాను... రాముగారికి (ఆర్జీవీ) ఎలా నచ్చాను... ముంబయిలో ఆర్టిస్టులు లేకనా? అనిపిస్తుంది. నచ్చలేదని నిరాశ ఏమీ లేదు.

నాకు ఆవేశం ఎక్కువ. ఎవరన్నా ఏమన్నా అంటే 'ఎందుకయ్యా అలా అంటావ్' అంటూ ప్రశ్నించేవాడిని. వయసులో ఉన్నప్పుడు ఒక దెబ్బ కూడా కొట్టేవాడిని. మా నాన్న తిట్టేవాడు. మేం 8 మంది సంతానం. నలుగురు ఆడ పిల్లలు. నలుగురు మగపిల్లలం. ఆయన దృష్టిలో నేను పాడైపోతున్నానేమోనన్న ఆందోళన ఉండేది. మళ్లీ 11వ తరగతి వరకూ ఎక్కడా తప్పకుండా చదువుకుంది నేనే! ఆ బాధ ఏంటో నాకు ఇప్పుడు తెలుస్తోంది... తండ్రినయ్యాక! క్రిస్మస్ పండగ సమయంలో నాటకాలకు రిహార్సల్స్ చేయాల్సి వచ్చేది. అవి అయ్యి ఇంటికెళ్లే సరికి ఆలస్యమయ్యేది. మా అమ్మతో నాన్న అనేవారు... 'వాడికి కూడుకొచ్చేనా... గుడ్డకొచ్చేనా? ఎందుకా రిహార్సల్స్' అని! వాస్తవమేంటంటే... అదే ఇప్పుడు నాకు కూడు, గుడ్డ ఇస్తోంది. ఆ విషయం చెప్పడానికి మా నాన్న లేరు.

❖ మీకు సినిమా అవకాశం ఎలా వచ్చింది?

మీ 'ఆంధ్రజ్యోతి' పత్రికలోనే 'స్వర్గం-నరకం' సినిమాకు నటులు కావాలనే ప్రకటన వచ్చింది. దాసరి నారాయణరావు గారు దర్శకుడు. స్టూడియోకి వెళితే స్క్రీన్ టెస్ట్ చేశారు. నేను, మోహన్‌బాబుగారు - ఇలా పాటు పది పదిహేనుమంది వచ్చారు. ఆ వేషం నాకే వస్తుందని మా వాళ్లందరి నమ్మకం. అక్కడున్న టెక్నీషియన్స్ కూడా భుజం తట్టారు. కట్ చేస్తే ఆ వేషం మంచు భక్తాచౌదరి గారు వేస్తున్నారని విన్నాను. అతగాడెవర్రా అంటే... 'ఆయన అంతకు ముందు నుంచే ఫీల్డ్‌లో ఉన్నారు. కో-డైరెక్టర్‌గా చేశారు' అన్నారు. మాది ఎక్కడో గుంటూరు. నాకేమో బొత్తిగా అనుభవం, పరిచయాలూ లేవు. అతగాడు ఎలా ఉంటాడోనని చూశాను. బాగా పొడుగు, గిడుగు బ్రహ్మాండంగా ఉన్నాడు. దీనికి ఇతనే కరెక్ట్ అనుకున్నా. కానీ... నాకా చాన్స్ రాలేదని బాధ. అయితే అందులో స్టూడెంట్ పాత్ర ఇచ్చారు. దానికి రెండేళ్ల ముందు చలం నవల 'మైదానం'ను సినిమా తీయడానికి సి.వైకుంఠరామశర్మ గారు పేపర్ ప్రకటన ఇచ్చారు. అది చూసి రంగస్థల ప్రముఖుడు గుంటూరు శాస్త్రిగారు నాకు చెప్పారు. 'మెయిన్ పాత్రలు రెండుంటాయి అందులో... దానికి ఫొటోలు నీ పంపించు' అన్నారు. పంపించాను. సెలెక్ట్ చేసి, రమ్మన్నారు. వైకుంఠరామశర్మ గారు నా పాత్ర 'అమీర్' అని చెప్పారు. తరువాత 'ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) వాళ్లు అభ్యంతరం పెట్టడంతో సినిమా ఆగిపోయింది.

మళ్లీ 'ఆంధ్రజ్యోతి'లో ప్రకటన... 'కానూరు రంజిత్‌కుమార్ గారి నిర్మాణంలో కె.బాలచందర్ గారి డైరెక్షన్‌లో కొత్త సినిమాకి విలన్, హీరోలు కావలెను' అని! గుంటూరులో నా స్నేహితులందరూ దానికి పంపించమని చెప్పారు. నా మిత్రుడికి ఫొటో స్టూడియో ఉంది. అతనే ఫొటోలు తీసి పంపించాడు. అలా వచ్చినవన్నీ నచ్చక వాళ్లు డంప్ చేశారు. అప్పుడు బాలచందర్ గారు వెతుకుతుంటే ఆ కుప్పలో ఉన్న ఫొటోల్లో రెండు కళ్లు కనిపించాయట. అది బయటకు తీసి... 'వీడిని పిలిపించండి' అని చెప్పారట. అవి నా కళ్లే! (నవ్వు). వెంటనే నాకు టెలిగ్రామ్ వచ్చింది... రమ్మని. 'సరస్వతీ స్టోర్స్' దగ్గర షూటింగ్ జరుగుతోంది. 'ఇది కథ కాదు' తమిళవెర్షన్. కమలహాసన్, రజనీకాంత్, జయసుధ అందులో నటిస్తున్నారు. అక్కడికి వెళ్లాను. అక్కడ రైటర్ గణేశ్‌పాత్రో ఉన్నారు. నేను వేసిన 'ఆశ్రయం' నాటకంలో డైలాగ్ చెప్పాను. బాగుందన్నారు. అందులో నాది విలన్ వేషం. సాయంత్రం మళ్లీ ఆఫీసుకు రమ్మంటే వెళ్లాను. 'తాగి వచ్చి భార్యతో ఫోన్‌లో మాట్లాడాలి'... చేసి చూపించమని పాత్రో గారు చెప్పారు. 'సరే సార్... బాగా తాగాడా? తక్కువగా తాగాడా' అని అడిగాను. ఇది బాలచందర్ గారు గమనించారు. ఆయనేదో తమిళంలో చెప్పారు. పాత్రోగారు 'నువ్వు ఇరుక్కున్నావురా! తాగి చేయమంటే... బాగా తాగాడా... కొద్దిగా తాగాడా అని అడిగావుగా..! రెండూ చేయమంటున్నాడు ఆయన' అన్నారు. ఉన్న చోట ఉండకుండా అతిగా వ్యవహరించానని నాలో నేనే తిట్టుకున్నా (నవ్వు). బాలచందర్ గారు పెద్ద దర్శకుడని మాత్రమే తెలుసు. ఇక చేసేదేముంది... ఆయన మెప్పు పొందాలని కసిగా రెండూ చేశాను. వెంటనే బాలచందర్ గారు కుర్చీలో నుంచి లేచి షేక్‌హ్యాండ్ ఇచ్చారు. నాకు కళ్ల వెంబడి నీళ్లు, వణుకు! అర్థం కాలేదు ఏం జరుగుతోందో! తరువాత రంజిత్‌కుమార్ గారు 'మేము తీయబోయే సినిమాకు సెలక్టయ్యావు. మెయిన్ క్యారెక్టర్ నీది' అని చెప్పారు.

❖ ఫస్ట్ రెమ్యూనిరేషన్ ఎంతిచ్చారు?

చాలా రోజులు చేశాను. అది తెలుగు, తమిళ్... డబుల్ వెర్షన్. పదిహేను వేల రూపాయలు ఇచ్చారు. అప్పట్లో అది ఎక్కువ. తెలుగులో 'తొలి కోడి కూసింది' టైటిల్. మొదటి రోజు షూటింగ్ లొకేషన్ దోసకాయలపాడు. అక్కడికి వెళ్లాక మళ్లీ పెద్ద పరీక్ష. ఫస్ట్ షాట్ తమిళ్ వెర్షన్ షూటింగ్. సీమ, సరిత, మాధవి హీరోయిన్లు. సీన్ ఏంటంటే... ఆ ఊరుని మా తాత ముత్తాతల నుంచి పరిపాలిస్తున్నారన్నమాట. నాకేం చెప్పారంటే... 'ఈ ఊరు నీది. ఏలుకో'మని! నాకు అది నాటుకుపోయింది. అటువంటి నా ఊళ్లో ఎలక్షన్ సందర్భంగా నా పోస్టర్‌పై ఎవడో పేడ ముద్ద వేశాడు. నాకు అవమానం జరిగింది. 'ఆ కోపం కావాలి నాకు' అన్నారు. అటో పదిమంది... ఇటో పది మంది ఉంటారు.

❖ మీ భార్య నుంచి ఏ క్యారెక్టర్‌కు కాంప్లిమెంట్ వచ్చింది?


'గులాబి' చిత్రానికి! రావమ్మా నా సినిమా చూద్దువుగానీ అని థియేటర్‌కు తీసుకెళ్లా గుంటూరులో భాస్కర డీలక్స్‌కు. అందులో నా ఇంట్రడక్షన్ సీన్ ఉంటుంది. ఒకమ్మాయి నా దగ్గర పనిచేసే అమ్మాయి... మరో అమ్మాయిని ఎత్తుకెళ్తుంది. 'ఎక్కడ అమ్మాయి' అంటా.... 'తప్పు కదమ్మా... నువ్వెందుకలా చేశావు' అంటూ ఆమెపై అగ్గిపుల్ల వేస్తా. తెర మీద ఆ సీన్ చూడగానే మా ఆవిడ నాక్కాస్త దూరంగా జరిగింది. అంతగా భయపడిందావిడ.

వాళ్లని అడగాలి... 'పేడ ముద్ద ఎవరు వేశారు' అని. కానీ... కోపం కనిపించకూడదు. డైలాగు చెబుతూ చుట్ట తాగాలి. చేతిలో ఓ స్టిక్. అది ఎగరేస్తే ఓ రౌండ్ తిరిగి నా చేతిలో పడాలి. చుట్ట పొగేమో అటూ ఇటూ కాకుండా నా కళ్లలోకే వెళుతోంది. స్టిక్... పొగ... తమిళ్! సీనంతా ఒకటే షాట్. పొద్దుటి నుంచి మధ్యాహ్నం దాకా చేశాను. దాని ఫలితాలు నాకేం చెప్పలేదు. బాలచందర్‌గారి ముఖం గమనిస్తే ఏం ఎక్స్‌ప్రెషన్స్ కనిపించడం లేదు. ఇదేదో తేడా వచ్చిందనుకున్నాను. 'పిలిచి అవకాశమిస్తే సరిగ్గా చేయకుండా ఆయన్ను బాధపెట్టానా' అని నాలో నేను మథనపడుతున్నా. మరుసటి రోజు పొద్దున్నే లొకేషన్‌కు వెళ్లా. బాలచందర్‌గారు... 'సినిమాలో నువ్వే విలన్' అని చెప్పారు. థ్యాంక్స్ చెప్పాను. ఇక అక్కడి నుంచి నటుడిగా నా సుదీర్ఘ జర్నీ మొదలైంది. సీమ, సరిత కూడా నాకు ధైర్యం చెప్పి, సహకరించారు.

❖ మీ అసలు పేరేంటి? 'జీవా' అని పెట్టిందెవరు?

నా అసలు పేరు కొచ్చర్ల దయారత్నం. 'జీవా' బాలచందర్ గారు పెట్టిన పేరు. ఆయన నా పేరేంటని అడిగారు. చెప్పాను. 'దయారత్నం' అంటే ఏమిటని పాత్రోని అడిగారు. "దయ' అంటే కైండ్ సర్... 'రత్నం' అంటే డైమండ్. హీ బిలాంగ్స్ టూ క్రిస్టియానిటీ' అని చెప్పారు. అప్పుడు ఆయన పేపర్ మీద 'జీవా' అని ఇంగ్లిష్‌లో గ్రీన్ ఇంక్‌తో రాశారు. నేనడగలేదు ఆయన్ని పేరు పెట్టమని (నవ్వు). అలా పేరు పెట్టడం ఆయనకో సెంటిమెంట్‌ట! నేనూ ఓకే అన్నాను. పాత్రో గారు చెప్పారు... 'జీవా అంటే జీవం. ఈ కథకు నీ క్యారెక్టరే లైఫ్' అని. సినిమావాళ్లు కూడా 'బాలచందర్ పేరు మారిస్తే సెంటిమెంట్‌గా చాలా గొప్పగా ఉంటుంది' అన్నారు. అలా నా నామకరణం జరిగింది. బాలచందర్ దగ్గర చిత్ర పరిశ్రమలో ఎలా మెలగాలనేది నేర్చుకున్నాను. తొలి సినిమా పెద్దగా ఆడకపోయినా నాకు గుర్తింపు వచ్చింది. నాలుగైదు అవకాశాలు వచ్చాయి. వాల్‌పోస్టర్స్‌లో నా బొమ్మలు చూసుకున్నప్పుడు ఆనందం వర్ణనాతీతం.





❖ అప్పటికి మీకు పెళ్లి అయిందా?

లేదు. కానీ ప్రేమలో ఉన్నాను. ఆవిడనే పెళ్లి చేసుకున్నాను. మా ఇంటి దగ్గర బండ్లమూడి హనుమాయమ్మ స్కూల్ ఉండేది. అక్కడ తను చదువుకునేది. నేనే ప్రపోజ్ చేశాను ముందు. తను జిల్లా గ్రంథాలయ సంస్థ జూనియర్ అసిస్టెంట్‌గా రిటైర్ అయింది. నేను చిత్ర పరిశ్రమలోకి వెళ్లిన తొలి రోజుల్లో డబ్బులు ఉండేవి కావు. అప్పుడు ఆవిడ ఉద్యోగం చేసేది. చెన్నైలో ఉన్నప్పుడు డబ్బులకు ఇబ్బందిగా ఉంటే లెటర్ రాసేవాడిని. నాకు ఇప్పుడు కూడా నాలుగైదు రోజులు గ్యాప్ వస్తే గుంటూరుకు వెళతా. ఆ ఊరంటే అంత మమకారం. అక్కడికి వెళితే పాత స్నేహితులు... పాత రోజులు గుర్తుకు వస్తాయి. రీచార్జ్ అవుతా.

❖ సాధారణంగా రామ్‌గోపాల్‌వర్మకు ఒక పట్టాన ఎవరూ నచ్చరు. కానీ మీరు నచ్చారు. మీలో ఆయన గమనించిన ప్రత్యేకత ఏమిటి?

నాకా సమయంలో సినిమాలు తగ్గాయి. గుంటూరులో ఉన్నాను. కృష్ణవంశీ గారి 'గులాబి' సినిమాకి విలన్ కావాలని వెతుకుతున్నారు. ఆయన నన్నెప్పుడో పాండీ బజార్‌లో చూశారు. రామ్‌గోపాల్‌వర్మ నిర్మాత. 'సర్...! జీవా అని ఒకడున్నాడు. వాడిని పిలిపిద్దామండీ' అని రాముగారితో అన్నారట. రామ్‌గోపాల్‌వర్మ అప్పట్లో హిందీ సినిమాలు చేస్తున్నారు. కావాలంటే 'హిందీ వాళ్లు ఉన్నారు కదా' అన్నారట. 'నాకు జీవానే కావాలి' అన్నారుట కృష్ణవంశీగారు. సరేనని పిలిపించారు. హైదరాబాద్‌లో రాము గారి ఆఫీసుకు వెళితే కథ చెప్పారు. తరువాత నా నటన ఆయనకు నచ్చింది. 'సత్య' హిందీ సినిమాకు కూడా రాము గారు నన్ను పిలిపించారు. అలాగే అమితాబ్‌బచ్చన్ 'సర్కార్'లో మంచి పాత్ర ఇచ్చారు. చేశాను. నాకో దురలవాటు ఉంది... సీన్ చేసిన తరువాత దర్శకుడి ముఖం చూస్తా. అతడి ఎక్స్‌ప్రెషన్ ఏంటో గమనిస్తా.

❖ అమితాబ్ కూడా మిమ్మల్ని మెచ్చుకున్నట్టున్నారట!

'సర్కార్' సినిమాకి రాము గారు నన్ను తీసుకెళ్లి అమితాబ్ గారికి పరిచయం చేశారు. 'అరే ఇసే కౌన్ నహీ జానా యార్! ఇస్‌కా ఫిల్మ్ దేఖా హై హమ్' అన్నారు. ఆయన 'గులాబి' చూశారుట. గొప్ప మనిషి.

❖ సినిమాల్లో ఆటుపోట్లు ఎదురైనప్పుడు ఆదుకున్నదెవరు?

నేనెవర్నీ అర్థించలేదు. నన్నెవరూ ఆదుకోలేదు. ఎవరికీ ఇబ్బంది కలిగించలేదు. సినిమాలు లేనప్పుడు సైలెంట్‌గా గుంటూరు వెళ్లిపోయేవాడిని. భరించే వాడు భర్తయితే... నాది రివర్స్... నా భార్యే నన్ను భరించేది (నవ్వు). వర్మ తరువాత కృష్ణ గారు, విజయనిర్మల గారు... నన్ను ప్రత్యేకించి పిలిపించేవారు. అలాగే... నిర్మాత సుబ్బరాజు గారు, పీసీ రెడ్డి గారు నన్నే కావాలనేవారు. ఐదు భాషల్లో సినిమాలు చేశాను. నా ముఖంలో కామెడీ పలికించడమంటే అదో పెద్ద పని అనుకుంటాను. కన్నడ సినిమా చేస్తున్నప్పుడు బెంగళూరులో ఉన్నా. ఓ రాత్రి ఫోన్ వచ్చింది... 'నేను వంశీ. డైరెక్టర్‌ని. ఏంచేస్తున్నారు' అన్నారు. 'నమస్తే సార్. మందు కొడుతున్నా సార్' అన్నా (నవ్వు). నాకు అబద్ధమాడటం రాదు. నిజం చెబితే ఎప్పుడు అడిగినా అదే సమాధానం చెప్పవచ్చు. అదే అబద్ధం చెబితే... అప్పుడేం చెప్పానో గుర్తుపెట్టుకుని మళ్లీ అదే చెప్పాలి (నవ్వు). సో... 'మీరు కామెడీ చేస్తున్నారు' అన్నారు వంశీగారు. ఆయన మాటలు గమ్మత్తుగా ఉంటాయి. 'కామెడీ నాకు తెలీదు సార్' అన్నాను. 'నేను చెప్పినట్టు చెయ్యండి. మంచి క్యారెక్టర్ జీవా గారూ.. రండి' అంటే... 'ఓకే సార్' అని చెప్పాను. సారథి స్టూడియోకి వెళ్లాను. వంశీ గారు నన్ను మంగలి షాపుకి తీసుకువెళ్లారు. వాడు నాకు డిప్ప కటింగ్ చేశాడు. అద్దంలో చూసుకున్నా... ఆయన వైపు తిరిగా! 'సూపర్‌గా ఉంది' అన్నారు. అప్పట్లో నాకు జుట్టు బాగుండేది. కడుపులో మండిపోయింది. అయినా... 'సరే సార్' అన్నాను. ఇక సినిమా (ఔను వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు!) షూటింగ్. వంశీగారు మహానుభావుడు. ప్రతి మాడ్యులేషన్ ఆయనే నేర్పారు. సినిమా పెద్ద హిట్. ఆ తరువాతన్నీ వరుసపెట్టి కామెడీ వేషాలు వచ్చేశాయి.

ఒక గమ్మత్తు సంఘటన జరిగింది. ఎప్పుడూ నేను ఏసీ ఛైర్‌కార్‌లో గుంటూరు వెళ్లేవాడిని. చుట్టుపక్కలవారు వచ్చి పలకరించేవారు. ఒక్కోసారి కొందరు అతి చేస్తారు. కానీ... అవన్నీ భరించాలి. అలా శ్రుతి మించుతుందనుకున్నప్పుడు కళ్లు పెద్దవి చేసేవాడిని. ఎవరూ దగ్గరకి వచ్చేవారు కాదు. వంశీగారి సినిమా తరువాత రైల్లో వెళుతుంటే ఓ పెద్దావిడ వచ్చి... 'ఒరే అబ్బాయ్... భలే చేశావురా నువ్వు కామెడీ' అంటూ రపామని గుండు మీద కొట్టింది. అమ్మనీ... కామెడీ వేషంతో జనాల్లో ఎంత తేడా వచ్చిందీ అనుకున్నా (నవ్వు).

దర్శకుడు వెంకీ గారి 'కబడ్డీ కబడ్డీ', వంశీగారి 'ఔను వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు', పూరి జగన్నాథ్‌గారి 'ఇడియట్' సినిమా... ఇవి మూడు వరుసగా హిట్టయ్యాయి. ఇక అప్పటి నుంచి ట్రాక్ (కామెడీ) అలా మారింది. ఆ తర్వాత వీడితో కామెడీ కూడా చేయించవచ్చని దర్శకులనుకున్నారు.

❖ మీరు కంటిన్యుయస్‌గా విలన్ క్యారెక్టర్లు వేసేవారు. వాటి ప్రభావం మీపై పడుతుండేదా?

అవకాశమే లేదు. అది కేవలం నటన. పాత్ర ప్రభావం అంటే అది ట్రాష్. నేనొప్పుకోను. కృష్ణుడి వేషం వేస్తే కృష్ణుడిలాగే వెళ్తుంటారా? ఎన్టీ రామారావు లాంటి కొందరు మహానుభావుల గురించి నేను విన్నాను. ఆయన ఒక పాత్ర చేస్తున్నారంటే కొన్ని నియమాలు పాటిస్తారని విన్నాను. ఆయనతో చేసే అదృష్టం నాకు రాలేదు కానీ నాగేశ్వరరావుగారితో చేశాను. వాళ్లంటే మహానుభావులు. మీరన్నట్టుగా నేను విలన్ వేషాలు వేస్తాను కాబట్టి విలన్‌లాగే ప్రవర్తిస్తానంటే అమాయకత్వం.

❖ మీ పిల్లలిద్దరిదీ కూడా ఇదే లైనా...?

పెద్దోడి పేరు మా అమ్మ, నాన్న పేర్లు కలిసొచ్చేలా రత్న కృప చక్రవర్తి పెట్టాను. బెంగళూరులో ఉంటున్నాడు. రెండో కొడుకు పుట్టినప్పుడు 'తొలి కోడి కూసింది' విడుదలైంది. బాలచందర్‌గారికి ఫోన్ చేశా. 'సార్ నాకు కొడుకు పుట్టాడు. మీ పేరు పెడదాం అనుకుంటున్నా' అన్నా. 'యూ నో మీనింగ్ ఆఫ్ బాలచందర్' అన్నారాయన. 'నాకు అవసరం లేదు. మిమ్మల్ని అడిగా. మీరు ఓకే అన్నా, కాదన్నా మీ పేరు పెడుతున్నా' అన్నా. పెద్దగా నవ్వారాయన. 'యాజ్ యూ లైక్... గ్లాడ్ బ్లెస్ యూ' అన్నారు. నా రెండో కుమారుడికి ఆయన పేరే బాలచందర్ అని పెట్టా. నాకు సమస్య ఏంటంటే కోపం వస్తే నేను వాడిని తిట్టలేకపోతున్నా. గురువుగారి పేరు కదా! నాకు కోపమొస్తే వాడు విలన్‌లా నవ్వుతాడు. 'ఏమీ చెయ్యలేవు డాడీ' అని. వాడు ఇండస్ట్రీలో దర్శకుడిగా ప్రయత్నాలు చేస్తున్నాడు.

❖ విలన్ పాత్రలు చేస్తుంటారు కాబట్టి... బయటికెళ్లినప్పుడు మిమ్మల్ని చూసి ఎవరైనా జంకిన సందర్భాలున్నాయా?

జీవా కెమెరా ముందు వేరు... నేను బయటికెళ్లినప్పుడు ఎవర్నీ కళ్లలోకి కళ్లు పెట్టి చూడను. తలవంచుకుని వెళ్తుంటా. ఆ ఛాయలెక్కడా పడనివ్వను.

❖ ఇన్ని సినిమాలు చేశారు. ఆర్థికంగా ఎక్కడున్నారు?

లైఫ్ హ్యాపీగా గడిచిపోతోంది. శేషజీవితం కూడా ప్రశాంతంగా గడుస్తుందనే నమ్మకం ఉంది. ఇప్పుడు నాకు 68 సంవత్సరాలు. సినిమాలు ఇంకా వస్తున్నాయి. నేను ఇక చాలు నటించడం అని నా అంతట నేను అనుకున్నప్పుడు మానేస్తా. ఊరుకెళ్తా కానీ వారం కాగానే బోర్ కొడుతుంది. మళ్లీ పోవాల్రోయ్ (రంగేసుకునేందుకు) అనుకుంటా. ఇక్కడుంటే అక్కడికి (ఊరికి) వెళ్లాలనిపిస్తుంది. అందుకే వెళ్తూ వస్తుంటా.

❖ ఈమధ్య మీరెప్పుడైనా సిక్ అయ్యారా?

సోషల్ మీడియాలో వచ్చింది. లేనిపోని జబ్బులు రాశారని మా మేకప్‌మ్యాన్ చెప్పాడు. అందరూ నాకు ఫోన్ చేస్తుంటే షాక్. మీడియాలో ఉన్న అలాంటివాళ్లను పట్టుకోలేమా? ఆ వార్త రాసినవాడు కావాలని చాలామందిని అడిగాను. అలా ఎందుకు రాస్తారో... అదేం పిచ్చో అర్థం కాదు. ఇలాంటివాటివల్ల నిజమైన వార్తలను నమ్మలేని పరిస్థితి వస్తుంది.

❖ మీకు మంచి మిత్రులంటే ఎవరు?

నాకు చిత్రపరిశ్రమలో గిరిబాబుగారు ఆప్తుడు. సత్యనారాయణగారు సలహాలిస్తుండేవారు. నా దగ్గర డబ్బులు లేవంటే ప్రభాకర్‌రెడ్డిగారు డబ్బులిచ్చి బ్యాంకులో వేసుకోమన్నారు. మహానుభావుడు. గుమ్మడిగారు నన్ను బాగా ప్రేమించారు. అక్కినేని నాగేశ్వరరావు 'నీ కళ్లు ఎప్పుడూ ఇలాగే ఉంటాయా' అనేవారు. 'సార్... మా నాన్నగారివి అంతే, మా తాతగారివి కూడా అంతేనండీ' అన్నాను.

చేతి నిండా సినిమాలున్నాయి... మీ ఒంట్లో ఓపిక ఉంది... ఇట్లాగే కంటిన్యూగా మంచి క్యారెక్టర్లు వేయాలని కోరుకుంటూ థాంక్యూ...

బ్యూటీ కేర్

తెల్లజుట్టు రాకుండా...

ఇటీవల కాలంలో చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా చాలామందికి తొందరగా వెంట్రుకలు నెరసిపోతున్నాయి. దాంతో నలుగురిలో తిరగడానికి మొహమాటపడుతుంటారు. ఈ సమస్యను అధిగమించడానికి కొన్ని వంటింటి చిట్కాలు ఉన్నాయి. అవి:



- ఉసిరి పొడి తీసుకుని అందులో కొద్దిగా నిమ్మరసం వేసి, పేస్టులా చేసి మాడు మీద రాయాలి. ఈ పేస్టును కొన్ని రోజుల పాటు తలకు రాసుకుంటే తెల్ల వెంట్రుకలు పోతాయి.
- ఉల్లిపాయ పేస్టు తెల్లవెంట్రుకల మీద బాగా పనిచేస్తుంది. కాకపోతే ఈ పేస్టును మాడుకు పట్టించి పూర్తిగా ఆరిపోయే వరకూ అలాగే ఉంచాలి. ఉల్లిపాయ పేస్టు వాసనపోయేలా షాంపుతో తలను బాగా రుద్దాలి.
- కొబ్బరినూనెలో కొద్దిగా నిమ్మరసం పిండి దాన్ని మాడుకు రాసుకుంటే మంచిది. తెల్ల వెంట్రుకల మీద ఇది మంచి ప్రభావం చూపిస్తుంది. శిరోజాలను అందంగా, కాంతివంతంగా కూడా చేస్తుంది.
- క్యారట్ జ్యూసు ఆరోగ్యానికి మంచిది. క్యారట్ డ్రింకు రుచిగా ఉంటుంది. తెల్ల వెంట్రుకలున్న వారు నిత్యం ఒక గ్లాసు క్యారట్ జ్యూసు తాగాలి.
- నువ్వులను మెత్తగా చేసి అందులో బాదం ఆయిల్ వేసి పేస్టులా చేయాలి. ఈ పేస్టును కొన్ని వారాల పాటు మాడుకు రాసుకోవాలి. ఇలా చేస్తే జుట్టు నల్లగా మారుతుంది.

డిఫసెంట్

సుగంధాల సమ్మోహనం!

ఎప్పుడూ ఒకే రకం సెంటు కాకుండా విభిన్న రకాల సెంట్లను కలిపి శరీరంపై స్ప్రే చేసుకోవచ్చు. దానికి కొన్ని టిప్స్ ఉన్నాయి. అవేంటంటే...



- దుస్తుల మీద మైల్డ్ పెర్ఫ్యూమ్స్, చర్మం మీద ఘాటుగా ఉన్న సెంటు స్ప్రే చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల బట్టల మీద వేసుకున్న సెంటు ఆవిరైపోయినా, చర్మం మీద స్ప్రే చేసుకున్న సెంటు పరిమళాలు మాత్రం శరీరాన్ని అంటిపెట్టుకుని ఉంటాయి.
- సింగిల్ లేదా లైటర్ నోట్‌కు చెందిన సెంట్లు లేయర్లుగా వేసుకుంటే ఎలాంటి ఇబ్బందీ ఉండదు. కానీ భిన్న నోట్స్ నుంచి విభిన్న పరిమళాలను కలిపితే మాత్రం తలనొప్పి వచ్చే అవకాశం ఉంది. అందుకే ఫేవరేట్ పెర్ఫ్యూమ్‌ను రెండు లేదా అంతకన్నా ఎక్కువ కలిపి ఒక పొరలా వేయాలి.
- సెంట్స్‌ను కలిపేటప్పుడు సృజనాత్మకత అవసరం. ఒకే ఫ్యామిలీకి చెందిన సెంటు... ఉదాహరణకు ఉడీ, ఫ్లోరల్, ఫ్రెష్, సిట్రస్ వంటివి ఒకదాంట్లో మరొకటి సులభంగా కలిసిపోతాయి.
- సెంటు పరిమళాలు ఎక్కువ సేపు ఉండాలంటే పెర్ఫ్యూమ్‌ను వాడే ముందు మంచి బాడీ లోషన్ లేదా సువాసనలు చిందించే నూనెను రాసుకోవాలి.
- పెర్ఫ్యూమ్‌ను మీరు ఎలా వాడారు, ఏ విధంగా వాటిని కలిపారు అనేది కూడా చాలా ముఖ్యం. సెంట్లను శరీరంలోని రకరకాల పల్స్ పాయింట్ల దగ్గర అంటే మెడ, మోచేయి, మణికట్టు వంటి చోట్ల అప్లై చేయాలి.



ఇది యాప్ లవ్

ప్రేమను వ్యక్తం చేయడానికి మాటలు వెతుక్కుంటున్నారా? మనసులో మాటను చెప్పడానికి తటపటాయిస్తున్నారా? అయితే ఈ యాప్స్‌తో ట్రై చేయండి. కొత్తగా ప్రేమను వ్యక్తం చేస్తున్న వారికి ఇవి లవ్ సక్సెస్‌కు దారి చూపిస్తాయి. ఇప్పటికే ప్రేమలో ఉన్న వారికి ఈ వాలెంటైన్స్ డే ఎప్పటికీ గుర్తుండిపోయేలా మధురానుభూతిని అందించేలా చేస్తాయి.

కొంచెం కొత్తగా...

'నువ్వంటే నాకు చాలా ఇష్టం', 'నువ్వు లేకుండా నేను ఉండలేను', 'నువ్వంటే ప్రాణం'.. ఇలాంటి రొటీన్ డైలాగులతో ప్రియుడి/ప్రేయసి మనసు ఏం దోచుకుంటారు. స్మార్ట్‌ఫోన్‌లో 'వాలెంటైన్స్ డే స్పెషల్' యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుని కొత్తగా ట్రై చేయండి. ఇందులో మీ ప్రియుడి/ప్రేయసి హృదయానికి హత్తుకునే సందేశాలు, హృదయాన్ని కరిగించే మాటలు బోలెడు ఉన్నాయి. ప్రేమను వ్యక్తం చేయడానికి మాటల కోసం వెతుక్కోవాల్సిన అవసరం ఉండదు. రొమాంటిక్ సందేశాలు, ప్రేమ పద్యాలు....ఇలా మీకు ఏది కావాలంటే అది ఎంచుకోవచ్చు.

పూలతో గెలుచుకోవాలంటే..!

ప్రియురాలి మనసు గెలుచుకోవాలంటే పూలకు మించి మరో మంచి మార్గం లేదు. ప్రేమికుల రోజున ఏ ప్రేమ జంటను చూసినా ఎరుపు రంగు పూలే కనిపిస్తాయి. మరి మీ ప్రియురాలికి ఇష్టమైన పూలను వ్యక్తిగతంగా కలిసి ఇస్తే పరవాలేదు. లేదంటే '1-800- ఫ్లవర్స్' యాప్‌ను ఎంచుకోండి. ప్రపంచ వ్యాప్తంగా 195 దేశాలలో ఈ యాప్ సేవలందిస్తోంది. రకరకాల పూలు, మీ బడ్జెట్‌లో మీ ప్రియురాలు మెచ్చే పూలు ఇందులో ఎంపిక చేసుకోవచ్చు. మీరు ఆర్డర్ చేసిందే తడవుగా ఆ పూలు మీ ప్రియురాలికి చేరిపోతాయి. మీరు ఏ సమయంలో తనకు పూలు అందాలో చెబితే ఠంచనుగా అదే సమయంలో పూలు ఆమెకు అందుతాయి.

ప్రేమసందేశాల కోసం ప్రత్యేకం

ప్రేమికులు ఊసులు మరొకరు వినడం ఎందుకు? మరొకరు చదవడం ఎందుకు? ప్రేమికుల మధ్య ఎన్నో రహస్య సంభాషణలుంటాయి. మరి అవన్నీ మూడో కంటికి చేరకూడదంటే 'బిట్వీన్' యాప్‌ని ఎంచుకోవాల్సిందే. సంభాషణలే కాదు మీరు పంపుకునే ఫొటోలకు పూర్తి ప్రైవసీ ఉంటుంది. ప్రేమ సందేశాలు పంపుకోవడానికి ఇది బెస్ట్ యాప్.

రొమాంటిక్ డిన్నర్ కోసం..

క్యాండిల్స్ వెలుగుల్లో, తనకిష్టమైన పూల పరిమళాల చెంతన డిన్నర్ చేస్తూ 'ఐ లవ్ యు' అని చెబితే ఆ మాట జీవితాంతం గుర్తుండిపోతుంది. మరి అలాంటి డైనింగ్ కావాలంటే 'ఓపెన్ టేబుల్' యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోండి. ప్రేమికుల రోజున మంచి రెస్టారెంట్‌లో టేబుల్ రిజర్వేషన్ చేసుకోవడానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది.

ఎమోజీలతో చెబుతారా!

పది వాక్యాల భావాన్ని ఒక్క ఎమోజీతో ప్రకటించవచ్చు. ప్రేమికుల రోజున సందేశాలే కాకుండా ఎమోజీలతో మీ ప్రేమను వ్యక్తపరిస్తే కొత్తగా ఉంటుంది. ఇందుకోసం వాలెంటైన్ లవ్ ఎమోజీ యాప్ ఉంటే చాలు. మనసులోని భావాలను వ్యక్తపరచడానికి ఎమోజీలు బాగా పనికొస్తాయి. ఫీలింగ్స్‌ను ఎలా చెప్పాలో తెలియక సతమతమవుతున్న వారు ఎమోజీలను ఎంచుకుంటే మీ ఫీలింగ్ వారికి నేరుగా చేరిపోతుంది.

ఉత్తరాలతో సర్‌ప్రైజ్ చేస్తారా!

ఫేస్‌బుక్‌లో లేక వాట్సప్‌లో మెసేజ్‌లు పంపుకోవడం అందరూ చేసేదే. మీరు కాస్త ప్రత్యేకం అనిపించుకోవాలంటే సోషల్ మీడియాలోనే లవ్ లెటర్‌ను పంపి మీ స్వీట్‌హార్ట్ మనసు గెలుచుకోండి. ఇందుకోసం టామ్స్ లవ్ లెటర్ యాప్ మీకు బాగా ఉపయోగపడుతుంది. ఈ యాప్ సహాయంతో మీకు నచ్చిన విధంగా పోస్ట్‌కార్డులను తయారుచేసుకుని పంపుకోవచ్చు. మీ లవ్‌స్టోరీకి అదనపు మసాలా జోడించుకోవచ్చు.



ప్రేమను రొమాంటిక్‌గా...

మీ ప్రేమను కాస్త రొమాంటిక్ వేలో వ్యక్తపరచాలా! అయితే మీ ప్రేమకు అందమైన ఫొటోలను జోడించండి. ఇందుకోసం 'టచ్ మి లవ్ యు' యాప్‌ని ఎంచుకోండి. ఈ యాప్‌లో రొమాంటిక్ వాల్‌పేపర్స్, గ్రీటింగ్ కార్డులు, లవ్ సింబల్స్, కలర్‌ఫుల్ క్యాలెండర్లు, ప్రేమ గడియారాలు... ఇలా బోలెడు లవ్‌థీమ్స్ ఉన్నాయి. వీటితో మీ ప్రేమ మరింత రొమాంటిక్‌గా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

బహుమతులతో చెబుతారా!

ప్రేమ ఓ అద్భుతం. దాన్ని వ్యక్తపరచడానికి మాటలు చాలవు. అలాంటప్పుడు మంచి బహుమతిని ఇవ్వడం ద్వారా ప్రేమను వ్యక్తపరచవచ్చు. ఎలాంటి బహుమతి ఇవ్వాలి అంటే దానికీ ఓ యాప్ ఉంది. 'గిఫ్ట్‌గ్రామ్'ను ఎంచుకోవడం ద్వారా రకరకాల గిఫ్ట్ ఐడియాలు తెలుసుకోవచ్చు.

టెక్ సందేహాలు

ఫోన్ బ్యాటరీ ఎందుకు తగ్గుతోంది?

రాత్రిపూట వంద శాతం ఉన్న ఫోన్ బ్యాటరీ చార్జింగ్ పొద్దున్న లేచేటప్పటికి 30, 40 శాతానికి పడిపోతోంది. దీనికి పరిష్కారం సూచించగలరు.

- వినయ్‌కుమార్, గూడూరు



సహజంగా అన్ని రకాల ఆండ్రాయిడ్ ఫోన్లలో వాట్సప్, ఫేస్‌బుక్, జీమెయిల్ లాంటి అప్లికేషన్లు బ్యాక్‌గ్రౌండ్ లో సర్వర్‌కి కనెక్ట్ అవుతూ ఎప్పటికప్పుడు డేటాని సింక్రనైజ్ చేసుకుంటూ ఉంటాయి. అయితే ఆయా అప్లికేషన్లు వీలైనంతవరకు ఆప్టిమైజ్ చేయబడి ఉండటం వలన పెద్దగా సిస్టం వనరులుగానీ, బ్యాటరీని గానీ వినియోగించుకోవు. తాజా ఆండ్రాయిడ్ వెర్షన్లలో అయితే చాలావరకు అప్లికేషన్లు డోజ్ మోడ్ అనే ఓ ప్రత్యేకమైన మోడ్‌లోకి పంపించబడుతుంటాయి. ఈ మోడ్‌లో ఉన్నప్పుడు బ్యాటరీ వినియోగం కూడా చాలా తక్కువగా ఉంటుంది. కానీ కొన్నిరకాల బగ్స్‌తో కూడుకొన్న అప్లికేషన్లు మాత్రం బ్యాటరీని విపరీతంగా ఖర్చు చేస్తూ ఉంటాయి. ఫోన్ అనేది స్లీప్ మోడ్ లోకి వెళ్లకుండా ఆయా యాప్స్ నిరంతరం వేక్ లాక్స్ అనే ప్రాసెస్‌ని రన్ చేస్తూ ఉంటాయి. ఫోన్ స్క్రీన్ ఆఫ్ చేసినా కూడా ఆ అప్లికేషన్లు భారీ మొత్తంలో బ్యాటరీని ఖర్చు చేస్తాయి. మీ ఫోన్ రూట్ చెయ్యబడి ఉంటే, 'వేక్‌లాక్ డిటెక్టర్' అనే ఆండ్రాయిడ్ అప్లికేషన్‌ని డౌన్లోడ్ చేసుకుంటే ఏ యాప్స్ వల్ల ఇలా వేక్‌లాక్స్ తయారవుతున్నాయో గుర్తించి మనకు వివరాలు తెలియజేస్తుంది. వాటిని అన్‌ఇన్‌స్టాల్ చేసుకుంటే సరిపోతుంది.

యాప్స్ ఎందుకలా?

నేను ఏమీ చేయకుండానే రకరకాల అప్లికేషన్లు నా ఫోన్లో ఇన్‌స్టాల్ అవుతున్నాయి. ఎందుకిలా జరుగుతోందో అర్థం కావట్లేదు.

- రఘువీర్, హైదరాబాద్




మన ప్రమేయం లేకుండా ఫోన్లో అప్లికేషన్లు ఇన్స్టాల్ అవడానికి అనేక కారణాలుంటాయి. వీటిలో ప్రధానమైనవి ఏదైనా మాల్వేర్ గానీ, స్పైవేర్ గానీ మన ఫోన్‌లో వచ్చి చేరితే ఇకపై అది మనకు తెలీకుండానే రకరకాల అప్లికేషన్లను డౌన్లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేస్తుంటుంది. ఇలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా ఉండాలంటే అశ్లీల వెబ్‌సైట్లను, పైరేటెడ్ సమాచారంతో ఉన్న సైట్ల జోలికి వెళ్లకపోవడమే మంచిది. మన దగ్గర యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్ ఉన్నా చాలా సందర్భాల్లో అది మొబైల్ మాల్వేర్‌ని సక్రమంగా గుర్తించలేదు. అందుకే మన జాగ్రత్తలో మనం ఉండడం మంచిది. ఇకపోతే మరికొన్ని సందర్భాల్లో మన ఫోన్ తయారుచేసిన కంపెనీని వివిధ అప్లికేషన్ డెవలపర్లతో ఒప్పందాలు కుదుర్చుకొని వారి నుండి కొంత డబ్బుని స్వీకరించి దానికి ప్రతిఫలంగా మనందరి ఫోన్లలో ఇలాగ అవసరం లేని అప్లికేషన్లని ఇన్‌స్టాల్ చేస్తూ ఉంటుంది. అలాంటప్పుడు మనం చేయగలిగిందేమీ లేదు. ముున్ముందు ఆయా కంపెనీలకు చెందిన ఫోన్లను కొనుగోలు చేయకుండా ఉండటమే తగిన పరిష్కారం.

కీబోర్డ్‌లో ఆ ఫీచర్ ఎలా?

నా ఫోన్లో కీబోర్డ్ కొన్ని పదాలను టైప్ చేసేటప్పుడు ఆటో సజెషన్ల రూపంలో అవి చూపించబడుతూ ఉండడం చాలా సౌకర్యంగా ఉంది. అయితే నేను తరచూ వాడే కొన్ని పదాలను ఇలా సజెషన్ల రూపంలో ఆ కీబోర్డ్ చూపించట్లేదు. ఆయా పదాలకు కూడా సజెషన్లు పొందే అవకాశం ఏదైనా ఉంటే తెలుపగలరు.

- శ్రీనివాస వర్మ, రాజమండ్రి



సహజంగా మన ఫోన్ లతో పాటు వచ్చే డీఫాల్ట్ కీబోర్డ్ యాప్స్ అంతర్గతంగా ఉండే ఓ డిక్షనరీ ఆధారంగా మనం టైప్ చెయ్యబోయే పదాలకు సజెషన్లని ఇస్తుంటాయి. వాటిలో మెషిన్ లెర్నింగ్ ఏర్పాటు లేకపోవడం వలన కొత్త పదాలను అవి డిక్షనరీలోకి చేర్చుకోవడం కానీ, కస్టమ్ డిక్షనరీ ఏర్పాటు గానీ ఉండదు. అలాంటపుడు స్విఫ్ట్‌కీ వంటి ప్రత్యేకమైన కీబోర్డును వాడితే అది మనం తరచూ వాడే పదాలను కస్టమ్ డిక్షనరీ లోకి స్వీకరించి ఇకపై ఆ పదాలకు కూడా పూర్తిగా టైపు చేయవలసిన పని లేకుండానే సజెషన్లని చూపిస్తుంటుంది. కొన్ని కీ బోర్డు యాప్స్‌లో కస్టమ్ డిక్షనరీ క్రింద మనకు కావాల్సిన స్వంత పదాలను స్వయంగా మనమే చేర్చుకునే ఏర్పాటు కూడా లభిస్తూ ఉంటుంది. అలాంటివాటిని వెదికి పట్టుకుని ప్రయత్నించండి.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం navya@andhrajyothy.com

టెక్ గురు

పే చెయ్యడానికి పలు మార్గాలు

ఒకప్పుడు ఎవరికైనా నగదు పంపించాలంటే చాల ఇబ్బంది పడాల్సి వచ్చేది. డిజిటల్ చెల్లింపులు అందుబాటులోకి వచ్చాక, అందులోనూ ముఖ్యంగా ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వచ్చాక పరిస్థితి చాలా సులభతరం అయిపోయింది.

ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్

దేశంలోని అన్ని ప్రైవేట్, పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ సదుపాయాన్ని అందిస్తున్నాయి. దీనిలో ప్రధానంగా నెఫ్ట్, ఆర్టీజీఎస్, ఐయంపిస్ అనేవి అంతర్భాగంగా ఉంటాయి. క్షణాల్లో ఏదైనా అకౌంట్‌కి నగదుని పంపించాలంటే ఐయంపిస్ సౌకర్యవంతంగా ఉంటుంది. ఈ పద్ధతి ద్వారా గరిష్టంగా 50 వేల వరకూ అవతల వారికి ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. అయితే దీన్ని వాడాలంటే ముందుగా అవతలి వారి అకౌంట్‌ని బెనిఫిషియరీగా రిజిస్టర్ చేసుకోవలసి ఉంటుంది. మొబైల్ బ్యాంకింగ్‌ని ఏక్టివేట్ చేసుకున్న వారికి మాత్రమే ఈ ఐయంపిస్ లభిస్తుంది. ఏటియం, మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా ఈ ఐయంపిఎస్ లావాదేవీలను పూర్తి చేసుకోవచ్చు.

నెఫ్ట్ పద్ధతిలో

ఇంటర్నెట్ బ్యాంకింగ్‌లో చాల మందికి సుపరిచితమైన పద్ధతి 'నెఫ్ట్'. ఈ పద్ధతి ద్వారా గరిష్టంగా 10 లక్షల రూపాయల వరకు నగదు బదిలీ చేసుకోవచ్చు. రోజు మొత్తం మీద 12 టైమ్ స్లాట్లుగా విభజించబడి బెనిఫిషియరీ అకౌంట్లోకి అమౌంట్ ట్రాన్స్‌ఫర్ అవుతుంది. రాత్రి సమయాల్లోనూ, పబ్లిక్ హాలిడేస్ రోజుల్లోనూ నెఫ్ట్ ద్వారా పంపించే నగదు తదుపరి వర్కింగ్ డే ప్రాసెస్ చేయబడుతుంది.

భారీ చెల్లింపులకి

భారీ మొత్తంలో ఒక అకౌంటు నుండి మరో అకౌంటుకి నగదు పంపించవలసిన వ్యాపార సంస్థలు, ఇతరత్రా అవసరాలకు ఆర్‌టిజిఎస్ అనుకూలంగా ఉంటుంది. నెఫ్ట్ మాదిరిగానే ఇది కూడా ఆదివారాలు, పబ్లిక్ హాలిడేస్‌లో పనిచేయదు. ఎవరుబడితే వారు ఆర్‌టిజిఎస్ వాడడానికి వీలుపడదు. కనీసం రెండు లక్షల రూపాయలకు మించిన లావాదేవీలు మాత్రమే ఆర్‌టిజిఎస్ ద్వారా చేసుకునే అవకాశముంది.

ప్లాస్టిక్ మనీ ద్వారా

డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డుల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. అయితే ఒకరి నుండి మరొకరికి నగదు బదిలీ కన్నా బిల్లు చెల్లింపులు, ఆన్‌లైన్ కొనుగోళ్లు, ఇతర పేమెంట్ అవసరాలకు ఈ మాధ్యమం ఎక్కువగా వినియోగింపబడుతూ ఉంటుంది. కార్డు లావాదేవీలకు మర్చంట్ నుండి వీసా, మాస్టర్ కార్డ్ వంటి సంస్థలు ప్రతి లావాదేవీకి కొద్ది మొత్తంలో రుసుము వసూలు చేస్తుంటాయి.

యుపిఐ మరింత సరళతరం

సామాన్యులు నగదు చెల్లింపుల విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ ద్వారా గత ఏడాది ప్రవేశపెట్టిన సరికొత్త పేమెంట్ పద్ధతే.. 'యుపిఐ'. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ అనే పదానికి సంక్షిప్త రూపమే ఇది. ఒక వ్యక్తి నుండి మరో వ్యక్తికి ఎంత సులభంగా మెయిల్స్ పంపించుకోవడం సాధ్యపడుతుందో అంత సులువుగా నగదు బదిలీని కూడా సరళతరం చేయడం కోసం ఇది తీసుకు రాబడింది. యుపిఐ పద్ధతిలో వివిధ బ్యాంకులు స్వంతంగా యుపిఐ ఆధారిత అప్లికేషన్లను కలిగి ఉండొచ్చు, అలాగే ఇతర బ్యాంకుల సహకారంతో ఎవరైనా అప్లికేషన్లని ప్రవేశపెట్టవచ్చు. సరిగ్గా ఈ విధంగానే ఫ్లిప్‌కార్ట్ సంస్థ ఫోన్ పే యాప్‌నీ, గూగుల్ సంస్థ తేజ్ యాప్‌నీ, తాజాగా వాట్సప్ సంస్థ వాట్సప్ పేమెంట్స్ సదుపాయాన్ని తీసుకురావడం జరిగింది. వీటన్నిటితోపాటు భారత ప్రభుత్వం స్వయంగా విడుదల చేసిన భీమ్ యాప్ కూడా ఉంది.

యుపిఐ ద్వారా గరిష్టంగా లక్ష రూపాయల వరకూ ఒక అకౌంట్ నుండి మరో ఎకౌంట్‌కి ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. కొన్ని బ్యాంకులు వాటికి నచ్చినట్లుగా రోజువారీ పరిమితిని విధించవచ్చు. ఈ యుపిఐ సదుపాయాన్ని వినియోగించుకోవాలంటే మన ఫోన్లో ఏదైనా యుపిఐ యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత మనకు ఏ బ్యాంకులో అయితే అకౌంటు ఉందో ఆ బ్యాంకుని ఎంపిక చేసుకొని మన అకౌంట్‌ని వెరిఫై చేసుకుని.. చివరిగా ఓ మెయిల్ ఐడీ తరహాలో మనకోసం ఓ యుపిఐ ఐడీని క్రియేట్ చేసుకోవాలి. ఇకపై ఆ ఐడి నుండి ఇతరుల ఐడిలకు నగదు పంపించుకోవచ్చు. అవతల వారి నుండి మీ ఐడీకి రిసీవ్ చేసుకోవచ్చు.

వాట్సప్ పేమెంట్స్

ఇప్పటివరకూ యుపిఐ పద్ధతి 'ఫోన్‌పే, గూగుల్ తేజ్' వంటి రకరకాల యాప్స్‌లో అందుబాటులో ఉన్నా తాజాగా ప్రవేశపెట్టబడిన వాట్సప్ పేమెంట్స్ ద్వారా అది భారీ స్థాయిలో వినియోగించుకోబడే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా వాట్సప్‌ని కోట్లాదిమంది వాడుతున్న నేపథ్యంలో ఫోటోలు వీడియోలు పంపించినంత సులభంగా ఈ వాట్సప్ పేమెంట్స్ ద్వారా అవతలి వారికి నగదు పంపించడం సాధ్య పడుతుంది కాబట్టి ఇకపై ఎవరికైనా డబ్బు పంపాలంటే ఈ పద్ధతిని ఎక్కువమంది వినియోగించుకునే అవకాశం ఉంది.

మొబైల్ వాలెట్లు

పేటీయం, మొబిక్విక్ వంటి మొబైల్ వాలెట్‌లు కూడా సుదీర్ఘకాలంగా ఒకరి నుండి మరొకరికి నగదు ట్రాన్స్‌ఫర్ చేసుకోవడానికి వినియోగించబడుతున్నాయి. షాపింగ్ మాల్స్, రెస్టారెంట్లు, సినిమా థియేటర్లు, కిరాణా షాపులు వంటి రకరకాల ప్రదేశాల్లో పేటీయం వంటివి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సులభంగా చెల్లింపులు జరుపుకునే విధంగా వెసులుబాటు కల్పిస్తున్నాయి. పేటీయం, ఎయిర్‌టెల్ వంటి సంస్థలు పేమెంట్ బ్యాంకులు కూడా మొదలు పెట్టడం మనకు తెలిసిందే. ఆయా పేమెంట్ బ్యాంకు అకౌంట్లలో డిపాజిట్ చేసిన మొత్తానికి వడ్డీ కూడా ఇవ్వబడుతుంది.

వీటితో పాటు శాంసంగ్ పే, యాపిల్ పే, ఆండ్రాయిడ్ పే వంటివి కూడా ఇప్పుడు దాదాపు ప్రతీ ఫోన్లోనూ లభిస్తున్నాయి. చేతిలో నగదు తీసుకెళ్లకపోయినా రోజులు గడిచిపోతాయనడంలో సందేహమే లేదు.



శాంసంగ్, యాపిల్, ఆండ్రాయిడ్ పే..

ఎన్ని పేమెంట్ పద్ధతులు అందుబాటులో ఉన్నా ఇప్పటికీ చాలామందికి తమ పర్సులో నుండి డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డులను బయటకు తీసి స్వైపింగ్ మిషన్ దగ్గర స్వైప్ చేస్తే గానీ సంతృప్తి ఉండదు. అయితే ఇలా ఫిజికల్‌గా డెబిట్, క్రెడిట్ కార్డులను బయటకు తీసుకు వెళ్లడం వలన అవి స్కిమ్మింగ్ చెయ్యబడే ప్రమాదాలున్నాయి, కార్డు ఎక్కడో పెట్టి మర్చిపోవడం, లేదా చోరీ కావడం జరగొచ్చు. ఇలాంటి ఇబ్బందులేమీ లేకుండా కొన్ని శక్తివంతమైన శాంసంగ్ ఫోన్లు వాడుతున్న వారికి శాంసంగ్ పే అనే సౌకర్యం లభిస్తోంది. ఒక్కసారి మన డెబిట్, క్రెడిట్ కార్డులను దానిలో వర్చ్యువల్‌గా కాన్ఫిగర్ చేశాక ఇకపై ఆయా కార్డులను మనం ఎక్కడికీ తీసుకెళ్లనవసరం లేదు. స్వైపింగ్ మిషన్‌కి మన ఫోన్‌ని టచ్ చేసి ఫింగర్‌ప్రింట్‌లో ఆ లావాదేవీని అథంటికేట్ చేస్తే సరిపోతుంది. ఆండ్రాయిడ్ ఫోన్ల కోసం గూగుల్ సంస్థ తీసుకువచ్చిన ఆండ్రాయిడ్ పే, అలాగే యాపిల్ ఫోన్ల కోసం ప్రవేశపెట్టబడిన యాపిల్‌పే వంటివి కూడా ఇంచుమించుగా ఇదే విధంగా పనిచేస్తాయి.



నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar



జీవితమే రంగస్థలం



షేక్స్‌పియర్ సాహిత్యం అంటే మొత్తంగా మానవ జీవితం! బతుకు పుస్తకంలోని వర్ణాలన్నీ ఆయన రచనల్లో కనిపిస్తాయి. ద్వేషం-ప్రేమ, కక్ష-కారుణ్యం, గాంభీర్యం-హాస్యం, నీచత్వం-ఔన్నత్యం, కంగారు-సహనం- ఇలా అన్నింటినీ చిత్రించాడాయన.

1564లో స్ట్రాట్‌ఫర్డ్‌లో జన్మించాడు షేక్స్‌పియర్. లండన్‌కి 160 కిలోమీటర్ల దూరంలోని గ్రామం అది. తండ్రి స్థానికంగా పలుకుబడి గలవాడే. కొద్దోగొప్పో ఆస్తి ఉన్నవాడే. షేక్స్‌పియర్ స్థానిక గ్రామర్ స్కూల్లో చేరాడు. అక్కడ క్రమశిక్షణ చాలా ఎక్కువ. ఉదయం ఆరింటికి లేవాలి. ప్రార్థన చెయ్యాలి. తొమ్మిదింటికి ఫలహారం. మళ్లీ చదువు. ఆపై భోజనం. మళ్లీ చదువు. విసుగెత్తించే పాఠాలు. చిన్న చిన్న తప్పులకే దండనలు. ఏడాదికి 40 రోజులు మాత్రమే సెలవులు. అందుకే షేక్స్‌పియర్‌కి స్కూలంటే చిరాకు. ఇంటిదగ్గరే ఉండి పుస్తకాలతో గడి పేసేవాడు. తన తండ్రి స్నేహితుడు బ్రెచ్ గర్డిల్ దగ్గర వందలకొద్దీ పుస్తకాలు ఉండేవి. షేక్స్‌పియర్‌కి ఆ పేరుపెట్టిన వ్యక్తి ఈయనే. గర్డిల్ ఇచ్చిన పుస్తకాల్ని చదివాడు షేక్స్‌పియర్. రోమ్ రచయిత ఓవిడ్ పుస్తకాల ప్రభావం బాగా పడింది ఇతనిపై. ఇక బడికి వెళ్లడం దాదాపు మానేశాడు. వింతగా ఆకాశంలోకి తొంగి చూస్తూ ఆడుతూ పాడుతూ తిరిగేవాడు. ఏకాంతంగా ప్రకృతి మధ్యన మసలేవాడు. ఏవాన్ నది ఒడ్డున విహరించేవాడు. చేపలు పట్టడం, స్నానాలు చేయడం, కుందేళ్ల వేట, పాల్కన్ పక్షుల్ని తరమడం, కీటకాల్ని, జంతువుల్ని చూస్తూ గడపడం, గుర్రంపై లండన్ వెళ్లడం, దోవలో విలువిద్య నేర్చుకొనేవారిని చూడడం, నత్తగుల్లల్ని పరిశీలించడం - ఇదీ వరస!

మనసు లోపల ఏవేవో భావాలు రగులుతుండగా, అంతరంగాన్ని పరిశీలించుకొంటూ, ఏదేదో చేసేయాలని ఉబలాటపడుతూ, సౌంద ర్యాన్ని అన్వేషిస్తూ సాగిపోయేవాడు.

అప్పుడు నాటకం -షేక్స్‌పియర్‌ని పట్టి కుదిపింది. కుదిపి ఆపింది. అప్పటి ఇంగ్లండ్ పాలకురాలు ఎలిజబెత్ రాణి. ఆంగ్లదేశ చరిత్రలో ఆమెది వైభవోజ్జ్వల శకం. ఆనాటి సంఘం నాటకాన్ని కించపరిచేది. నటుల్ని హీనాతిహీనంగా చూసేది. జూదగాళ్లు, దొంగలు, నీచులు, రౌడీలు ఎలాగో.. నాటకాలరాయుళ్లు అలాగ! అలాంటి సమయంలో నాటకాలకు పెద్దపీట వేసింది ఎలిజబెత్ రాణి. అసలు రాణే స్వయంగా ఒక నాటక సమాజాన్ని ఏర్పాటు చేసింది. అందుకే నాటకాలు చూడడం నిత్యకృత్యమైంది షేక్స్‌పియర్‌కి. అంతలో యానీ అనే అమ్మాయితో పెళ్లయింది షేక్స్‌పియర్‌కి. అప్పటికి యానీ వయసు 26. కానీ షేక్స్‌పియర్‌కి 18 ఏళ్లే! పరిస్థితులు ఏమైనా - హడావిడిగా మాత్రం వారి పెళ్లయ్యింది. అయిన ఆరు నెలలకే వారికి సుసానా అనే అమ్మాయి జన్మించింది. అందుకే ఆ పెళ్లికి అంత తొందరొచ్చింది! ఇంతలో సంసారం పెరుగుతోంది. తండ్రి ఆదాయం తగ్గుతోంది. స్థానిక సంస్థల్లో తండ్రి హోదా కరుగుతోంది. పైగా బాధ్యతలు పెరుగుతున్నాయి. ఏదో ఒక పని చేసి సంపాదించాల్సిన స్థితి షేక్స్‌పియర్‌కి!

23 ఏళ్ల వయసులో షేక్స్‌పియర్ ఓ వేసంగిలో కెంప్, టారెల్‌టన్ లాంటి హాస్యనటుల ప్రదర్శనలు చూశాడు. తానూ నాటక రచనల ద్వారా ఉపాధి పొందాలనుకొన్నాడు. ఇంట్లో చెప్పి భార్యను ఒప్పించి, అజ్ఞాతవాసిగా లండన్‌లో అడుగుపెట్టాడు. ఐదారేళ్లపాటు ఏం చేశాడో తెలీదు. ఈ సమయంలో టీచర్‌గానో, జవాన్‌గానో, మాంసం దుకాణంలో పనివాడుగానో, నాటకశాలల్లో గుర్రాల కాపరిగానో పనిచేశాడు.

23 ఏళ్ల వయసులో షేక్స్‌పియర్ ఓ వేసంగిలో కెంప్, టారెల్‌టన్ లాంటి హాస్యనటుల ప్రదర్శనలు చూశాడు. తానూ నాటక రచనల ద్వారా ఉపాధి పొందాలనుకొన్నాడు. ఇంట్లో చెప్పి భార్యను ఒప్పించి, అజ్ఞాతవాసిగా లండన్‌లో అడుగుపెట్టాడు. ఐదారేళ్లపాటు ఏం చేశాడో తెలీదు.

• • •


ఎన్ని పనులు చేసినా లండన్ చేరిన తొలినాళ్ల నుంచే షేక్స్‌పియర్ రచనలు వెలువడ్డాయి. ఈ దశలో రాసిన నాటకాల్లో - కథ, సన్నివేశం, పాత్ర చిత్రణ - ఇలా ఎందులోనూ స్పష్టమైన మార్గం కనిపించదు. ఒక్కో నాటకంలో ఒక్కోమార్గం. ఒక్కో ప్రయత్నంలో ఒక్కో పద్ధతి. అంతే. పైగా తన కన్నా ముందు వచ్చిన నాటకాల్లోంచి కొన్ని తీసుకొని అవన్నీ తెలివిగా తనవిగా చేసుకొన్నాడు. అయినా 'కామెడీ ఆఫ్ ఎర్రర్స్' లాంటి విశిష్ట నాటకం ఈ దశలో వచ్చినదే!

క్రమంగా షేక్స్‌పియర్ ఆలోచనల్లో మార్పు వచ్చింది. తన చుట్టూ ఉన్న సంఘం, దాని అవసరాలు, ప్రజల మారుతున్న కోరికలు, అభిరుచులు - అన్నింటినీ ఇంకా లోతుగా చదవడం మొదలెట్టాడు. క్రమంగా అనుభవం, వయసు, అభ్యాసం - పెరిగాయి. ప్రపంచపు పోకడ అర్థమైంది. ఆత్మవిశ్వాసం బలపడింది. శక్తిసామర్థ్యాలు రెట్టింపయ్యాయి. అనుకరణకు చరమగీతం పాడాడు. తనదైన రచనాశిల్పాన్ని సృష్టించుకొన్నాడు. చవకబారు హాస్యం ఇక రాయకూడదనుకొన్నాడు. సునిశిత మృదుహాస్యానికి తెర ఎత్తాడు. భాషకన్నా భావానికీ, కృతకశైలి కన్నా సరసశైలికీ, కుంటుపడే ప్లుత గీతికన్నా సరళమైన ఛందస్సుకి ప్రాధాన్యమిచ్చాడు. ఈ పరిణతికి తొలి ఉదాహరణ - 'వీనస్ అండ్ ఎడోనిస్' అనే పద్యగ్రంథం. షేక్స్‌పియర్ పేరిట స్పష్టంగా వెలువడిన తొలి రచన ఇది. ఆ రోజుల్లో కాపీరైట్ హక్కుల కోసం 9 పెన్నీల డబ్బు చెల్లించి, 'స్టేషనర్స్ రిజిస్టర్' అనే పుస్తకంలో నమోదు చేసేవారు. ఇది షేక్స్‌పియర్‌కి చెందిన మొట్టమొదటి లిఖితపూర్వక ఆధారం. ఇది జరిగింది 1593లో.

• • •

ఇక ఆపై షేక్స్‌పియర్‌ని ఏ శక్తీ ఆపలేదు. 'రోమియో అండ్ జులియట్, మర్చంట్ ఆఫ్ వెనీస్, మచ్ ఎడో ఎబౌట్ నథింగ్, యాజ్ యు లైకిట్, హేమ్‌లెట్, ఒథెల్లో, మేక్‌బెత్, యాంటొనీ అండ్ క్లియోపాత్రా - ఇలా ఒకటా రెండా పాతికేళ్లలో 37 నాటకాలు, రెండు పద్యగ్రంథాలు రచించాడు. రాసిన వాక్యాన్ని కొట్టివేయకుండా, కానీ తిరగరాయడం కానీ ఎన్నడూ చేయలేదు. మహారాజులు - దరిద్రులు, కోపిష్ఠులు-శాంతస్వభావులు, స్వార్థపరులు- త్యాగశీలురు, కపటులు, అమాయకులు, గడసరులు- చేతకానివాళ్లు, శౌర్యవంతులు- పిరికివాళ్లు, మేధావులు- బుద్ధిహీనులు- ఇలా అందరినీ తన పాత్రలలో సృష్టించాడు.

ఇక చాలు అనుకొన్నాడు 1610లో 46 ఏళ్ల షేక్స్‌పియర్ తిరిగి స్వగ్రామం స్ట్రాట్‌ఫర్డ్‌కి వెళ్లిపోయాడు. ఐశ్వర్యంతో, విజయగర్వంతో సొంత ఊరికి వెళ్లాడు. తన పలుకుబడితో తన తండ్రి కోల్పోయిన సంపదనూ, హోదాల్నీ తిరిగి వచ్చేలా చేశాడు. చనిపోయే ముందు వీలునామాలో స్పష్టంగా "నేను విలియం షేక్స్‌పియర్‌ని" అంటూ ఆస్తిని కుటుంబ సభ్యులకు, బంధువులకు రాసేశాడు. చాలా ఆస్తిని బీదవారికి కూడా ఇస్తూ స్పష్టంగా వీలునామాలో పేర్కొన్నాడు. ఇంత కన్నా ఏం కావాలి!? 1616లో 52 ఏళ్లకే మరణించాడు షేక్స్‌పియర్.



● ఆకెళ్ల రాఘవేంద్ర

కౌన్సెలింగ్


ఈ వయసులోనే కీళ్లనొప్పులా?

నా వయసు 43. గత రెండేళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. మోకాలు కదిలినప్పుడల్లా నొప్పి పుడుతుంది. నడవడం మొదలెడితే నొప్పి ఎక్కువై నడవలేని స్థితి ఏర్పడుతోంది.. ముఖ్యంగా మెట్లు ఎక్కుతున్నప్పుడు నొప్పి మరీ ఎక్కువగా ఉంటోంది. ఆర్థోపెడిక్ డాక్టర్‌ను సంప్రదిస్తే సర్జరీ చేయక తప్పదన్నారు. ఏ అరవై ఏళ్ల తర్వాత రావలసిన ఈ కీళ్లనొప్పులు నాకు ఇంత చిన్న వయసులోనే రావడానికి కారణం ఏమిటి? నా సమస్యకు నిజంగానే సర్జరీ తప్పదంటారా?

- డి. ఆనంద్, కాకినాడ

కీళ్లలోపల ఉండే సైనోవియల్ అనే పొర లోంచి సైనోవియల్ ఫ్లూయిడ్ స్రవిస్తూ ఉంటుంది. ఇది ఎముకలపైన ఒత్తిడి పడకుండా జాయింట్ కదలడానికి తోడ్పడుతుంది. అయితే వివిధ కారణాల వల్ల కొందరిలో సైనోవియల్ ఫ్లూయిడ్ తగ్గిపోతుంది. ఆ తర్వాత కీలు లోపల మెత్తగా తడిగా ఉండే పొరలు ఎండిపోయి ఎముకలు రెండూ ఒకదానితో ఒకటి ఒరుసుకుపోతాయి. ఫలితంగా ఆ భాగాన నొప్పి, వాపు ఏర్పడి కదలడానికి ఇబ్బంది కలుగుతుంది. . ఈ ఆర్థరైటిస్ సమస్య ఏ జాయింట్‌కు అయినా రావడానికి ఆస్కారం ఉంటుంది. వయసును బట్టి, కారణాలను బట్టి శరీరంలో వివిధ భాగాలు ఆర్థరైటిస్‌కు గురి అవుతూ ఉంటాయి. ఈ సమస్యకు అధిక బరువు, అధిక శారీరక శ్రమ, లేదా అసలే వ్యాయామం లేకపోవడం, వయసు పైబడటం వంటివి కారణంగా ఉంటాయి.

మోకాళ్లు, జాయింటు నొప్పులకు హోమియో చికిత్స ద్వారా అద్భుతమైన పరిష్కారం లభిస్తుంది. శస్త్రచికిత్స అవసరమనుకున్న చాలా కేసులలో ఈ చికిత్స మెరుగైన జీవితాన్ని అందించగలుగుతుంది. నొప్పికి వాడే మాత్రలు తాత్కాలిక ఉపశమనం కలిగించినా తిరిగి మరింత బాధపెడుతాయి.



కీలుమార్పిడి శస్త్రచికిత్స కొంతమందిలో ప్రయోజనం ఉన్నా ఆ తర్వాత కొన్ని ఇతర సమస్యలు మొదలవుతాయి. నిజానికి, సర్జరీ అవసరం లేకుండానే హోమియో చికిత్సతో అద్భుతమైన ఫలితాలను పొందవచ్చు.

- డాక్టర్ బి. సోహన్ సింగ్, రిటైర్డ్ సూపరింటెండెంట్
ప్రభుత్వ హోమియో వైద్యశాల, హైదరాబాద్

మీకు మీరే డాక్టర్

నేరేడుతో లాభాలెన్నో..

- ముదిరిన నేరేడు పండ్ల గింజలను శుభ్రపరిచి, నీడన ఎండించి పొడిచేసి, రెండు స్పూన్‌ల మోతాదులో భోజనం తర్వాత రోజూ రెండు పూటలా సేవిస్తే మధుమేహం వల్ల వచ్చే అతి మూత్ర వ్యాధి సమస్య తగ్గిపోతుంది. లేదా ముదిరిన నేరేడు కాండం లోపలి గుజ్జును నీడన ఎండించి కాల్చిన బూడిదెను, ఒక స్పూను మోతాదులో రోజుకు రెండు సార్లు నీటిలో కలిపి సేవించినా ఈ అతిమూత్ర వ్యాధి సమస్య తొలగిపోతుంది.



- నేరేడు కాండపు ముక్కలను నీటితో దంచి రసాన్ని తీసి, 5 స్పూన్‌ల రసాన్ని మేక పాలలో కలిపి, ప్రతి రోజూ పరగడుపున వారం రోజుల పాటు సేవిస్తే, విరిగిన ఎముకలు త్వరగా అతుకుతాయి.
- ప్రసవించిన స్త్రీలు, నేరేడు చెక్కను చిన్న చిన్న ముక్కలుగా చేసి, కషాయంగా కాచి ఆ కషాయంతో జననాంగాన్ని రోజుకు రెండు సార్లు శుభ్రం చేసుకుంటే, ఏమైనా దుర్గంధం ఉంటే తొలగిపోతుంది. ఆ భాగంలో పుండ్లు కూడా ఏర్పడవు.
- నేరేడు చెట్టు లేత ఆకులను ముద్దగా నూరి, రోజూ మూడు పూటలా తీసుకుంటే రక్త విరేచనాలు తగ్గుతాయి.
- నేరేడు గింజల కషాయాన్ని తేనెతో సేవిస్తే, వివిధ కారణాల వల్ల కలిగే వాంతులు తగ్గుతాయి. వాంతుల వల్ల ఏర్పడే దప్పిక కూడా పోతుంది.

డైలీ సుడోకు - 104

4					1		6	
	1							
		9	5		7		3	
9				8		6		
5	6						2	8
		2		1				9
	5		9		2	7		
							5	
	9		6					1

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు-103 సమాధానం

[illegible]

నవజీవనగీతం

అది నేర్పిందే నువ్వు!

ఒక్కోసారి మనకు మనంగా, మన కోసం మనం ఏమీ చేయలేని స్థితిలో పడిపోతాం. సరిగ్గా అదే సమయంలో ఎవరో మనకు తారసపడి కొండంత బరోసా ఇచ్చారనుకోండి... మనం ఆనందంలో ఉక్కిరిబిక్కిరి అయిపోతాం. ఆ సమయంలో మిగతా ప్రపంచమంతా ఒక ఎత్తు, ఆ ఒక్క వ్యక్తీ ఒక ఎత్తు అనిపిస్తుంది. ఆ క్షణం నుంచి లోకం కొత్తగా, ఎంతో అందంగా కనిపిస్తుంది. జీవితం మనోహరంగా అనిపిస్తుంది. ఈ భావుకతే 2006లో విడుదలైన 'ఉమ్రావ్ జాన్' సినిమా కోసం జావేద్ అఖ్తర్ రాసిన పాటలో కనిపిస్తుంది. అనూమలిక్ సంగీత సారథ్యంలో అల్కా యాజ్ఞిక్, సోనూ నిగమ్ ఎంతో మృదుమధురంగా గానం చేశారు.

• • • • •

దేఖా హమే కుఛ్ ఐసా కీ - బహెకా దియా హమే
తుమ్ నే తో ఖ్వాబ్ దేఖ్‌నా - సిఖ్‌లా దియా హమే
ఇస్ జిందగీ కే కైసే - సితమ్ కా గిలా కరే
ఇస్ జిందగీ నే ఆప్ సే మిల్‌వా దియా హమే /దేఖా హమే/
(నువ్వు నాకేసి అదోలా చూసి, నన్ను కలవరపరిచావు
నువ్వే నాకు కలలు కనడం ఎలాగో నేర్పించావు
ఈ జీవితం నాకు అన్యాయం చేసిందని ఎలా అనను!
ఈ జీవితమే నీతో కలిపింది నన్ను)

ఎవరో సృష్టించి నీ ముందుంచిన లోకాన్ని నిరంతరం చూస్తూనే ఉంటాం. చూసీ చూసీ ఒక దశలో కొందరికి ఏముందిలే ఈ లోకం అనిపించవచ్చు. అలాంటప్పుడు ఈ లోకానికి భిన్నమైన, ఒక అతీతమైన స్వప్నలోకం కావాలనిపిస్తుంది. అయినా దాన్ని అందుకునే ఏ ప్రయత్నమూ చేయకుండా, దైనందిన జీవిత ప్రవాహంలో కొట్టుకుపోతుంటాం. ఆ స్థితిలో ఒక్కోసారి, ఎవరో మన హృదయ వీణను మీటి, ఆ రాగ ధ్వనుల్లో కదలాడే ఒక సుందర స్వప్నలోకాన్ని దర్శించడం ఎలాగో నేర్పుతారు. అప్పుడింక కష్టాలూ, కడగండ్లు ఎంత వేధించినా మనకు జీవితాన్ని నిందించాలని ఎంత మాత్రం అనిపించదు. ఎందుకంటే ఈ జీవితమే కదా... స్వప్నలోకంలో నడిపించే ఆ అరుదైన వ్యక్తిని పరిచయం చేసేది!

• • • • •



ఆంఖోఁ మే నశీలే భఁవర్ - జుల్ఫ్ మే లహర్
దరియా యే కైసా హుస్న్ కా - దిఖ్‌లా దియా హమే
అర్‌మానోంకా జహాఁ - మొహబ్బత్ కీ దాస్తాఁ
హమ్ క్యా కహేఁ కీ ఆప్‌నే క్యా క్యా దియా హమే /దేఖా హమే/
(కళ్లల్లో మైకపు భ్రమరాలు - శిరోజాల్లో తరంగాలు
ఎంతటి సుందర సంద్రాన్ని చూపావు నువ్వు
ఆకాంక్షల లోకం - ప్రేమాన్విత కావ్యం
నువ్వు నాకు ఏమేమిచ్చావూ అంటే నేనేం చెప్పను!)

మత్తెక్కిన తేనెటీగలేవో కళ్లల్లో తిరుగాడుతూ, కళ్ల మీద వాలిపోతున్న కురులు కెరటాల్లా తెలియాడుతూ ఉంటే, అతనెవరో భలే అందమైన తీరానికి చేర్చాడు కదా అనిపిస్తుంది. అప్పటిదాకా కారుమబ్బులు కమ్మిన ఆకాశమంతా, కోటి కాంతి పుంజాలతో నిండిపోయినట్లు, అప్పటిదాకా మసకబారిపోయిన జీవితమంతా ఆనందనర్తనం చేస్తున్నట్లు కనిపిస్తుంది.



అనూమలిక్

ఇంతకాలం మనసు మూలల్లో ఎక్కడో మగ్గిపోతున్న ప్రేమదీపం మహాకావ్యమై గానం చేస్తుంది. ఆ పారవశ్యపు వేళల్లో అతడు నీకేమిచ్చాడు.... అని అడిగితే ఎవరైనా ఎం చెబుతారు? ఏవో ఒకటీ, రెండూ అయితే 'ఇదీ, అదీ' అని చెప్పవచ్చు. ఆశించినదానికి వేయింతలు లభ్యమైన గాఢానుభూతిలో ఏదైనా చెప్పడానికి మాటలెలా వస్తాయి?

• • • • •

మంజర్ తమామ్ రంగ్ మే డూబే హుయే- సే హై
తుమ్‌నే యే కిస్ ముకామ్ పర్ - పహుంచా దియా హమే
యే ఆప్ హై కి ఆయా హై - మౌసమ్ బహార్ కా
శహదాబ్ కర్ దియా హమే- బహెకా దియా హమే / దేఖా హమే/
(సమస్త దృశ్యాలు - రంగుల్లో మునిగి తేలుతున్నాయి.
నన్ను ఇదేమి తీరానికి చేరవేశావు నువ్వు
వచ్చి వాలిన వసంతంలా ఉన్నావు నువ్వు
మధురిమలతో నింపి నా మదిని కలవరపరిచావు నువ్వు)

రాగాలు కూర్చడానికి ముందు స్వరకర్త తానే ఒక వాద్యం అవుతాడంటారు. నిజమే మరి! హృదయంలో వసంతాలు పూయించడానికి ముందు రసజ్ఞుడు కూడా తానే వసంతుడవుతాడు. ఆ తర్వాత, ఆ వసంత కాంతిలో అప్పటిదాకా బూడిద బూడిదగా కనిపించినవన్నీ సప్త వర్ణాలతో సుశోభితమై కనిపిస్తాయి. అంతకు ముందెన్నడూ కనీ వినీ ఎరుగని సౌందర్యాలు కళ్ల ముందు సాక్షాత్కరిస్తాయి. అయితే, కాసేపు నిశితంగా గమనిస్తే, ఆ వసంత సీమలు ఎక్కడినుంచో వచ్చిపడినవి కాదని...అతడే వసంతుడని తెలిసిపోతుంది. రసోజ్వలమైన ఆ అస్తిత్వమే లేకపోతే, ఆ అందమైన ఆ స్వప్నలోకాల్ని హృదయంలో దర్శింపచేయడం అతనికి ఎలా సాధ్యమవుతుంది? అలాంటి అరుదైన వ్యక్తి తారసపడితే అక్కున చేర్చుకుంటారే గానీ, వదిలేస్తారా ఎవరైనా!!!

● బమ్మెర

నవ్య సకల

సింగర్స్ స్పెషల్

నేను కొత్తగా తెచ్చే పేరేమీ లేదు

పాటల పూదోటలో పుట్టాడు. పాటలు వింటూ పెరిగాడు. ఇప్పుడు పాటగాడిగా మారాడు. లలిత సంగీత ప్రపంచంలో పరిచయం అక్కర్లేని పేరు రామాచారి. ఆయన తనయుడిగా ప్రేక్షకులకు పరిచయమైన సాకేత్ కొమాండూరి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే దిశగా అడుగులేస్తున్నారు. తండ్రి ఇచ్చిన సంగీత విద్యను రెక్కలుగా భావించి స్వయం కృషితో ఎదుగుతానంటోన్న ఆయనతో ఈ వారం సింగర్స్ స్పెషల్...



నాన్న రామాచారిగారంటే లలిత సంగీత శిక్షణ ప్రపంచంలో తెలియనివారుండరు. పుట్టింది సంగీత కుటుంబంలో కాబట్టి చిన్నప్పటి నుంచీ పాటలు, సంగీతమంటే చచ్చేంత ఇష్టం. రెండో తరగతిలోనే మొదటి కచేరీ చేశా.. ఓరుగంటి లీలావతిగారు నా తొలి గురువు. ఆ తర్వాత నీతా చంద్రశేఖర్, మోహనకృష్ణగారి దగ్గర కర్ణాటక క్లాసికల్ నేర్చుకున్నా. డా.వైజర్సు బాల సుబ్రహ్మణ్యంగారు ప్రస్తుత నా గురువు. రాయల్ స్కూల్ ఆఫ్ లండన్, బెంజిమన్ మార్తండ్, థామస్‌గారి దగ్గర పియానో 5 గ్రేడ్స్ చేశా. వెస్ట్రన్ వోకల్స్‌లో త్రీగ్రేడ్స్, ఆడియో ఇంజనీరింగ్, మాస్టరింగ్ ఆశీర్వద్ లూక్ దగ్గర నేర్చుకున్నా. లలిత సంగీతానికి నాన్న గారే నా గురువు. లిటిల్ మ్యూజీషియన్స్ అకాడమీలో నాకేదో స్పెషల్‌గా బోధించేవారు కాదు. అందరితో సమానంగానే నన్నూ చూసేవారు. ఏదన్నా పోటీలు ఉన్నా చివర్లో నాచేత పాడించేవారు. ఎందుకంటే 'తన కొడుకు కాబట్టి సాకేత్‌తో మొదట పాడించి బహుమతి అందుకున్నారు' అన్న మాట వస్తుందని. దాంతో నేర్చుకోవాలనే కసి మరీ పెరిగింది.

❒ ఓ పాట బాగా రావాలంటే దాని సిట్యువేషన్‌కి తగ్గ వాయిస్, సాంగ్ టఫ్‌నెస్, మ్యూజిక్ డైరెక్టర్ కమాండ్ చాలా ముఖ్యం. పాటలో బెటర్‌మెంట్ ఏం చెయ్యాలో చెప్పకుండా 'ఇంకేదన్నా చెయ్యండి' అంటే సంగీత దర్శకుడికి ఏం కావాలో క్లారిటీ లేనట్లే. అలాంటి సందర్భాల్లోనే పాటలు సరిగ్గారావని నా అభిప్రాయం.

❒ సంగీతాన్ని వ్యాపారంగా చూసినప్పుడు క్వాలిటీ ఆటోమేటిక్‌గా తగ్గిపోతుంది. గొంతు సమస్య ఉన్నప్పుడు చాలా డిప్రెషన్‌లోకి వెళ్లిపోతా.

గుర్తింపు తెచ్చిన పాటలు

లెట్స్ డూ (ఇంటెలిజెంట్)
బొమ్మ అదిరింది, టైటిల్ సాంగ్ (జవాన్)
మహా పద్మ (ఓం నమో వెంకటేశాయ)
జంతర్‌మంతర్ (ద్వారక)
సెల్ఫీరాజా టైటిల్ సాంగ్.

నా వెనుక అమ్మే ఉంది...

చిన్నప్పుడు అల్లరి పిల్లలందరికీ నేను బ్రాండ్ అంబాసిడర్‌ని. నా అల్లరిని భరించి సంగీతరంగంలో ఆసక్తిపెరిగేలా చేసింది అమ్మే. వృత్తిరీత్యా నాన్న బిజీగా ఉండటం వల్ల ఎక్కడ సంగీత పోటీలు ఉన్నా అమ్మే నన్ను తీసుకెళ్లేది. 'పాడాలనివుంది', 'సప్తస్వరాలు' వంటి ఎన్నో పోటీల్లో పాల్గొన్నా. 'సూపర్‌సింగర్స్ 8'కు మెంటర్‌గా వ్యవహరించా. 'సూపర్‌సింగర్స్ జూనియర్స్', 'కలర్స్ ఆఫ్ మ్యూజిక్' కార్యక్రమాలకు హోస్ట్‌గా చేశా. నేనీ రోజున సంగీతం స్థిరపడ్డానంటే నా వెనకున్న అమ్మే కారణం.

బాల్యం నుంచీ పాడుతున్నా...

చిన్నప్పుడు ఆర్.పి పట్నాయక్, మణిశర్మగారి దగ్గర కోరస్‌తో కెరీర్ ప్రారంభించా. పెద్దయ్యాక కీరవాణిగారి టీమ్‌లో చేరా. 'బద్రీనాథ్' నుంచీ 'బాహుబలి' వరకూ ఆయన దగ్గర పాడుతూనే ఉన్నా. పూర్తిస్థాయి ప్లేబ్యాక్ సింగర్‌గా మారాక నాకు అవకాశమిచ్చింది సాయికార్తీక్‌గారు. మొత్తం మీద 30 సినిమాల్లో పాడాను. ఫైనల్ మిక్సింగ్ అండ్ మాస్టరింగ్ కూడా చేశా. కీరవాణి, తమన్, సాయికార్తీక్, గోపీసుందర్ వంటి సంగీత దర్శకుల దగ్గర రెగ్యులర్‌గా పాడుతున్నా. కార్తీక్ కొడకండ్ల సంగీతం అందించిన 'బంధూక్' చిత్రంలో నేను పాడిన 'పూసిన పున్నమివెన్నెలమేన తెలంగాణ వీణా' పాట నాకెంతో గుర్తింపు తీసుకొచ్చింది.

మరువలేని క్షణమది...

చిన్నప్పటి నుంచీ నాకు శంకర్ మహదేవన్‌గారంటే పిచ్చి. ఆయన ప్రభావం నాపై ఎక్కువగా ఉండేది. 'ఆల్‌రెడీ ఇండస్ట్రీలో ఓ శంకర్ మహాదేవన్ ఉన్నాడు. ఇంకో శంకర్ మహదేవన్ ఉంటే ఆయన పాటలు నీకు వస్తాయి. నువ్వు డిట్టో ఆయనలాగే పాడుతున్నావ్. ఆ స్టైల్ మార్చుకుని నీ స్టైల్లో పాడు' అని కీరవాణిగారు చెప్పారు. అప్పటి నుంచీ నాలో మార్పు వచ్చింది. సంగీతదర్శక త్రయం శంకర్, ఎహసాన్, లాయ్ అంటే చాలా ఇష్టం. నా స్టూడియోలో వారి ఫొటో ఉంటుంది. 'నమో వెంకటేశాయ'లో శంకర్ మహదేవన్ ఓ పాట పాడుతుంటే కీరవాణిగారు పిలిచి 'మీ గురువు వచ్చారు ఎలా పాడుతున్నారో చూసి నేర్చుకో' అని స్టూడియోలో కూర్చోబెట్టారు. ఆ క్షణాల్ని ఎప్పటికీ మరచిపోలేను.

చెల్లి నా ధైర్యం...

చెల్లికి నేను బలం అయితే తను నా ధైర్యం. నాకు మ్యూజిక్ మీద ఎంత పట్టుందో తనకు లౌక్యం మీద అంత పట్టుంది. నేను ముక్కుసూటి మనిషిని. లౌక్యంగా మాట్లాడటం చేతకాదు. 'ముక్కుసూటిగా ఉండకు.. కాస్త లౌక్యంగా ఉండరా' అని తరచూ చెబుతుంటుంది. అలా ఎలా ఉండాలో చెల్లెలి దగ్గర నేర్చుకుంటున్నా. ఆ విషయంలో తనే నా గురువు. అమ్మా, నాన్న, నేను, చెల్లి ఫ్రెండ్స్‌లా ఉంటాం. నాకు భార్యగా వచ్చే అమ్మాయి కూడా అలాగే ఉండాలి.

చివరి శ్వాసవరకూ...

లలిత సంగీత శిక్షణలో రామాచారిగారు ఓ బ్రాండ్. ఆయనకు నేనేమీ పెద్ద పేరు తీసుకు రానవసరం లేదు. ఉన్న పేరుని తగ్గించకుండా ఉంటే చాలు. అలాగే నా శ్వాస ఉన్నంత వరకూ లిటిల్ మ్యూజీషియన్స్ అకాడమీని నడుపుతా. రామాచారిగారి అబ్బాయిగా నాకున్న లక్ష్యాలివి. మంచి పాటలు పాడాలి, టాప్ సింగర్‌గా ఎదగాలి. పేరుతోపాటు డబ్బు కూడా సంపాదించాలి అన్నది సింగర్‌గా నాకున్న కోరికలు. డబ్బుంటేనే కదా ఫ్యామిలీని బాగా చూసుకోగలం.

● ఆలపాటి మధు

అదిరే అదిరే.. జంటే అదిరే!

డైరీలో రోజూ కొత్త పేజీ కనిపించినట్టు ప్రతి శుక్రవారం స్ర్కీన్ మీద కొత్త చిత్రాన్ని కోరుకుంటాడు ప్రేక్షకుడు. సినిమా సినిమాకీ తాజా కథను ఆశించినట్టే, కాంబినేషన్ కూడా కలర్‌ఫుల్‌గా ఉండాలని ఆకాంక్షిస్తాడు. ప్రేక్షకుల నాడిని పట్టుకున్న మేకర్లు నిత్యం నూతన జంటలను తెరమీద ప్రత్యక్షం చేసే ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. త్వరలో థియేటర్లలో సందడి చేయబోయే చిత్రాలు.. అంటే ప్రస్తుతం సెట్స్ మీద ఉన్న చిత్రాల్లో అలాంటి క్రేజీ కాంబినేషన్స్ చాలా ఉన్నాయి. మన హ్యాండ్‌సమ్ హీరోల పక్కన టాలెంటెడ్ బ్యూటీలు పలువురు కనిపించనున్నారు. ఇంతకీ కాంబినేషన్‌లో పక్కాగా కుదిరింది ఎవరు? కనువిందు చేయనుంది ఎవరెవరు..? క్లుప్తంగా...


నయనతార

చిరంజీవి

చిరంజీవి రాజకీయాల్లోకి వెళ్లినప్పుడు... ఆయన సినిమాలు ఇక చేయరేమోనని అభిమానులు ఎంత నిరాశ చెందారో, ఆయనతో కలిసి నటించలేకపోయామని నాయికలు కూడా అంతగానే ఫీలయ్యారు. అయితే ఆయన మళ్లీ సినిమాల్లోకి వచ్చాక, చిరంజీవి 'ఖైదీ నెంబర్ 150'లో ఆ ఛాన్స్‌ను కాజల్ అగర్వాల్ చేజిక్కించుకున్నారు. తాజాగా 'సైరా.. నరసింహారెడ్డి'లో ఆ అవకాశం నయనతారకు దక్కింది. దక్షిణాదిన అన్ని జోనర్ల చిత్రాల్లోనూ మెప్పిస్తూ లేడీ సూపర్‌స్టార్ ఇమేజ్‌ను సొంతం చేసుకుంటోన్న ఈమె పరిశ్రమలో అడుగుపెట్టి పుష్కరం దాటింది. అయితే ఇప్పటిదాకా ఆమె మెగా కాంపౌండ్‌లో ఒక్క హీరోతోనూ సినిమా చేయలేదు. 'సైరా నరసింహారెడ్డి'తో ఆమెకిప్పుడు ఆ కొరత తీరనుంది. మెగాస్టార్‌తో జోడీ కట్టే అవకాశం లభించింది.


మైరా సరీన్

నాగార్జున

మరింత హాట్‌గా..

రామ్‌గోపాల్‌వర్మ, నాగార్జున కాంబినేషన్ అనగానే సెల్యులాయిడ్ మీద సందడి మొదలవుతుంది. వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'శివ'ను తలపించేలా తాజా చిత్రం ఓపెనింగ్ జరిగింది. ఓపెనింగ్ రోజు ప్రెస్‌మీట్ జరిగిన సెట్ మొత్తం సైకిల్ చైన్లను పోలిన ఆకారంతో నిర్మితమవడం విశేషం. నాగార్జున పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తోన్న ఈ చిత్రంలో ఆయన సరసన కొత్త భామ మైరా సరీన్ నటిస్తున్నారు. నాయికలను తెరమీద అందంగా చూపించడంలో వర్మది అందెవేసిన చేయి. అందాల ఆరబోతలో ఏమాత్రం వెనకాడకుండా ఫొటోలకు ఫోజులిస్తోన్న మైరా ఈ తాజా చిత్రంలో ఇంకెంత అందంగా కనిపించనుందో వేచి చూడాల్సిందే మరి.

'సాహో'.. శ్రద్ధా!


శ్రద్ధాకపూర్

ప్రభాస్

'బాహుబలి' విడుదలైన తర్వాత ప్రభాస్‌తో ఒక్కసారి నటించాలని ఉందని చాలా మంది నాయికలు స్వతహాగా సోషల్ మీడియాలో తమ ఇష్టాన్ని వ్యక్తం చేశారు. అయితే 'బాహుబలి' వెనువెంటనే సెట్స్ మీదకు వెళ్లిన 'సాహో'లో ఆ అవకాశాన్ని బాలీవుడ్ భామ శ్రద్ధాకపూర్ దక్కించుకున్నారు. ప్రభాస్‌తో తాను చేస్తున్న సినిమా గురించి, షూటింగ్ ముచ్చట్ల గురించి శ్రద్ధ చాలా శ్రద్ధగా సోషల్ మీడియాలో అప్పుడప్పుడూ పోస్టులు పెడుతూనే ఉన్నారు. అన్నట్టు.. శ్రదా కపూర్ ఉత్తరాదిన కూడా పలు సినిమాలతో బిజీగా ఉన్నారు తెలుగుతో పాటు పలు భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్న సంగతి తెలిసిందే.

మహేష్.. జర కొత్తగా!


అనూ ఇమ్మాన్యుయేల్
కైరా ఆడ్వాణీ

హీరోయిన్ ఎంతటి అందగత్తె అయినా తెరమీద మహేశ్ ఉంటే ప్రేక్షకులు పక్కనున్న వారిని అంత తేలిగ్గా పట్టించుకోరు. మరి కైరా ఆడ్వాణీ సంగతేంటో కాస్త ఆగి చూడాల్సిందే. ఈ బాలీవుడ్ భామకు తెలుగులో ఇదే తొలి చిత్రం. ఈ సినిమా విడుదల కాకముందే ఆమె బోయపాటి సినిమాకు సంతకం చేయడాన్ని బట్టే టాలీవుడ్‌లో ఆమెకు ఏర్పడిన గిరాకిని అర్థం చేసుకోవచ్చు. 'శ్రీమంతుడు' తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో మహేశ్, కైరా జంటగా నటిస్తోన్న 'భరత్ అనే నేను' ఈ వేసవికి విడుదల కానుంది. సో బయట ఎండ వేడి, స్ర్కీన్‌మీద కైరా సెగ కలిపి ఈ సమ్మర్ జర కొత్తగా అనిపిస్తుందేమో చూడాలి. 'భరత్ అనే నేను' తర్వాత వంశీ పైడిపల్లి దర్శకత్వంలో మహేశ్ నటించబోయే చిత్రంలో పూజా హెగ్డే నాయిక. ఇటీవల 'డీజే'తో కుర్రకారును మెప్పించిన ఈ పొడగరి మహేశ్ సరసన చక్కగా సరిపోతుందని అప్పుడే సామాజిక మాధ్యమాల్లో కామెంట్లు జోరందుకోవడం విశేషం. సో మహేశ్ తదుపరి రెండు చిత్రాల్లోనూ కొత్తభామలు కనిపిస్తారన్నమాట.

మహేశ్‌బాబు


సమంత

రామ్‌చరణ్

ఒకరు కాదు.. ఇద్దరు!


రామ్‌చరణ్ ఇప్పుడు మరింత జోరుమీద ఉన్నారు. పెరిగిన గడ్డం, పైకి ఎగకట్టిన లుంగీ, చేతిలో తువ్వాలు.. పక్కా పల్లెటూరి పిల్లగాడిలాగా ఆయన నటిస్తోన్న చిత్రం 'రంగస్థలం'. ఈ సినిమాలో సమంత నాయిక. అటు హీరో రామ్‌చరణ్‌తోనూ, ఇటు దర్శకుడు సుకుమార్‌తోనూ ఆమె పనిచేసిన తొలి సినిమా ఇది. ప్రస్తుతం సెట్స్ మీద ఉన్న చిత్రాల్లో చాలా వైవిధ్యంగా ఉండే చిత్రమిది. ఓ వైపు పెళ్లి పనుల్లో తలమునకలైన సమంత ఆ సమయంలో నటించి న సినిమా కూడా ఇదే. మార్చిలో ఈ చిత్రం విడుదల కానుంది. 'రంగస్థలం' లోనే కాదు.. బోయపాటి శ్రీను దర్శకత్వంలో నటించబోయే సినిమా లోనూ చరణ్ కొత్త జోడీతోనే జతకడుతున్నారు. అందులో కైరా ఆడ్వాణీ నాయిక. బోయపాటికి చరణ్‌తో ఇది తొలి చిత్రం.

ఆయన పేరు అర్జున్.. జోడీ అనూ!

ఒక్కో మెట్టూ ఎక్కి స్టార్‌గా స్థిరపడటం అంటే ఏంటో అనూ ఇమ్మాన్యుయేల్ ఇప్పుడు చక్కగా చెబుతుంది. ఎందుకంటే రాజ్‌తరుణ్ ఆ తర్వాత నాని, తాజాగా పవన్‌కల్యాణ్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈ చిన్నది ఇప్పుడు అల్లు అర్జున్ సరసన నటిస్తున్నారు. 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' అంటూ సీరియస్ లుక్స్‌తో బన్నీ ఇప్పటికే హల్‌చల్ చేయడం మొదలుపెట్టేశారు. వక్కంతం వంశీ దర్శకుడిగా శ్రీకారం చుడుతున్నది కూడా ఈ సినిమాతోనే అన్నది గమనార్హం.


అల్లు అర్జున్

ఎంతో మంది స్టార్ హీరోల సరసన నటించిన తమన్నా 'నా నువ్వే'లో కల్యాణ్‌రామ్ సరసన నటించడం కూడా ఇదే తొలిసారి. కల్యాణ్‌కృష్ణ-రవితేజ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రంలోనూ కొత్త భామ తెలుగు తెరకు పరిచయమవుతోంది. యంగ్ హీరోలు నాగచైతన్య, నాని, శర్వానంద్, వరుణ్, సాయిధరమ్‌తేజ్ తాజా చిత్రాల్లోనూ ఇంతకుముందు కనిపించని భామలే ఫ్రేముల్లో ఉన్నారు. సినిమా ప్రారంభమైనప్పటి నుంచీ ఈ కొత్త కాంబినేషన్ల కోసం ఎదురుచూసే ప్రేక్షకులు, ఒక్కసారి సినిమా హిట్ అయితే హిట్ పెయిర్ కోసం కూడా అంతే ఆతృతతో ఎదురుచూస్తారు. సో వీళ్లల్లో ఎన్ని పెయిర్స్ రిపీట్ అవుతాయో తెలుసుకోవాలంటే ఈ సినిమాలన్నీ విడుదలయ్యేవరకు ఓపిక పట్టాల్సిందే.



భలే... మోహన్‌రంగ


నితిన్
మేఘా ఆకాశ్

నితిన్ హీరోగా నటిస్తున్న 25వ చిత్రానికి 'ఛల్ మోహన్‌రంగ' టైటిల్ ఖరారు చేశారు. కృష్ణచైతన్య దర్శకత్వంలో శ్రేష్ఠ్ మూవీస్, పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా ప్రచార చిత్రాలను (ఫస్ట్‌లుక్ పోస్టర్లు) ఆదివారం పవన్‌కల్యాణ్ ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్రనిర్మాత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ "పవన్‌కల్యాణ్‌గారికి మా చిత్రబృందం తరపున కృతజ్ఞతలు. ఒక్క పాట మినహా సినిమా చిత్రీకరణ పూర్తయింది. బుధవారం నుంచి హైదరాబాద్‌లో ఆ పాటను చిత్రీకరిస్తాం. అలాగే, ప్రేమికుల దినోత్సవం సందర్భంగా బుధవారం సినిమా టీజర్ విడుదల చేస్తాం. ఏప్రిల్ 5న చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం" అన్నారు. ప్రేమతో కూడిన కుటుంబ కథా చిత్రమిదని దర్శకుడు కృష్ణచైతన్య తెలిపారు. మేఘా ఆకాశ్ కథానాయికగా, సీనియర్ నరేశ్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేశ్, సంజయ్ స్వరూప్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మూలకథ: త్రివిక్రమ్, సంగీతం: ఎస్.ఎస్. తమన్, సమర్పణ: శ్రీమతి నిఖితారెడ్డి.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

- వెంకీ అట్లూరి



"పవన్‌కల్యాణ్‌గారి 'తొలిప్రేమ' గౌరవాన్ని కాపాడుతానని భీమవరంలో మెగా అభిమానులకు మాటిచ్చాను. సినిమా సక్సెస్‌తో నా మాట నిలబెట్టుకున్నా" అని వెంకీ అట్లూరి అన్నారు. వరుణ్‌తేజ్, రాశీఖన్నా జంటగా ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'తొలిప్రేమ'. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాత. గతవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం విజయవంతంగా ఆడుతోంది. సినిమాకొస్తున్న స్పందన గురించి దర్శకుడు ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. "నేనీ కథ తయారు చేసుకునేటప్పటికి 'ముకుంద' విడుదల కాలేదు. టీజర్ మాత్రమే విడుదలైంది. టీజర్ చూసి ఇలాంటి హీరో మనకు ఉంటే కథను బాగా చెప్పొచ్చని అనుకున్నా. మెగా ఫ్యామిలీ హీరో కదా! లవ్‌స్టోరీస్ చేస్తాడో లేదో అన్న అనుమానం కలిగింది. కొత్త తరహా కథలు చేయడానికి వరుణ్ సిద్ధంగా ఉన్నాడని 'కంచె' చూశాక తెలిసింది. 'వెన్ హ్యారీ మెట్ శాలీ' సినిమాను బట్టి మనకు తగ్గటు ఓ కథ రాసి 'లోఫర్' షూటింగ్ టైమ్‌లో వరుణ్‌కి కథ చెప్పా. దిల్‌రాజు గారు నిర్మించాల్సిన సినిమా ఇది. ఆయన బిజీగా ఉండడంతో బాపినీడుని కలిసి కథ చెప్పాను. తనకు కూడా నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. అనుకున్నట్లుగానే అన్నీ చక్కగా కుదిరాయి. డిఫరెంట్ లుక్స్‌లో కనిపించడం కోసం హీరోహీరోయిన్లు వెయిట్ తగ్గారు. వరుణ్ గడ్డం పెంచాడు. మరో సందర్భంలో రాశీఖన్నా బొద్దుగా మారింది. 'తొలిప్రేమ' టైటిల్ పెట్టినప్పుడు కొందరు ఏమీ అనలేదు. కొందరైతే 'టైటిల్ పెట్టావ్ సరే! జాగ్రత్తగా తీయ్' అన్నారు. కథ మీద నాకున్న నమ్మకంతోనే ముందుకెళ్లా. ఏ టెక్నీషియన్ అయినా సక్సెస్ కోసం తపన పడుతుంటారు. దేవి థియేటర్‌లో సినిమా చూసినప్పుడు ప్రేక్షకుల స్పందన చూసి మేం కోరుకున్న దాని కంటే ఎక్కువ అప్‌లాజ్ వచ్చిందని ఆనందించాం. సినిమా చూశాక రాఘవేంద్రరావుగారు, ఆర్.నారాయణమూర్తిగారు ఫోన్ చేసి అభినందించడం, కేటీఆర్‌గారు సినిమా చూసి ట్వీట్ చేయడం చాలా ఆనందంగా అనిపించింది. తర్వాతి చిత్రం ప్రసాద్‌గారి బ్యానర్‌లోనే ఉంటుంది" అని అన్నారు.



ప్చ్..

ఓ అచ్చటా లేదు..! ఓ ముచ్చటా లేదు..!

పాండవుల గుడి.. దర్గాలోకి కరగ



రాముడికి.. కృష్ణుడికి.. శివుడికి.. అమ్మవారికి ఆలయాలు సహజం. కానీ.. ద్రౌపదీ సమేత పంచ పాండవులకు ఒక గుడి ఉంది తెలుసా? తెలియకపోతే.. కర్ణాటకలోని ధర్మరాయ స్వామి గుడికి వెళ్లాల్సిందే. పాత బెంగళూరులోని ఈ ఆలయంలో ఏటా నిర్వహించే కరగ ఉత్సవాన్ని విదేశీయులు సైతం వచ్చి ఆసక్తిగా తిలకిస్తారు. ఆ వేడుకల్లో ఆలయ పూజారి మహిళలాగా అలంకరించుకుని కరగను ఊరేగించడం మరో విశేషం. 16వ శతాబ్దంలో కెంపెగౌడ బెంగళూరు నగరాన్ని నిర్మించేటప్పుడు ఈ ఆలయాన్నే కేంద్రస్థానంగా తీసుకున్నాడని చెబుతారు.

ఇదీ నేపథ్యం..

ఈ ఆలయాన్ని ఎవరు నిర్మించారు.. విగ్రహాలను ఎవరు ప్రతిష్ఠించారనే దానికి చారిత్రక ఆధారాలు లేవు. పురాతత్వ శాస్త్రజ్ఞుల ప్రకారం.. ఈ గుడిని 800 ఏళ్ల క్రితం నిర్మించారు. కరగ ఉత్సవానికి సంబంధించి మాత్రం స్థానికులు ఒక కథ చెబుతారు. అదేంటంటే.. మహాభారత యుద్ధం ముగిశాక తిమిరాసురుడనే రాక్షసుడిని అంతమొందించడానికి ద్రౌపది 'వీరకుమారులు' పేరుతో ఒక సైన్యాన్ని తయారు చేసింది. ఆ సైనికులు అసురుడిని సంహరించారు. అనంతరం పాండవులు స్వర్గానికి వెళ్లడానికి సిద్ధం కాగా.. కనీసం ద్రౌపది అయినా అక్కడ ఉండాలని వీరకుమారులు వేడుకున్నారట. అందుకు తిరస్కరించిన ద్రౌపది.. ఏడాదికొకసారి వారి కోసం భూమికి వస్తానని మాట ఇచ్చిందట. దాన్ని పురస్కరించుకునే ఏటా పది రోజులపాటు కరగ ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

దర్గా ప్రాంగణంలోకి కరగ

ఏటా ఘనంగా జరిగే కరగ ఉత్సవం హిందూ ముస్లిం మతసామరస్యానికి కూడా ప్రతీకగా నిలుస్తోంది. కరగను ఊరేగించే సమయంలో తవక్కల్ మస్తాన్ దర్గా ప్రాంగణంలోకి తీసుకెళ్తారు. దీని వెనుక కథ ఏంటంటే.. మస్తాన్‌సాబ్ అనే సాధువు ఒకసారి కరగ ఉత్సవం సమయంలో గాయాలపాలయ్యాడట. అప్పుడు, ధర్మరాయస్వామి ఆలయ పూజారులు పసుపు, కుంకుమలను ఆయన గాయాలకు అద్దడంతో వెంటనే నయమయిందని చెబుతారు. అప్పుడా సాధువు.. తాను మరణించాక కరగ ఉత్సవం తన సమాధి స్థలి వద్ద కొద్దిసేపు ఆగాలని కోరుకున్నాడట.

దర్శనం
Darshanam





పెళ్లైనా సెక్స్‌కి నోచుకోని జపాన్ జంటలు

శృంగారం కంటే నిద్ర ముఖ్యమంటున్న యువతులు.. ఆ అనుభవం లేని 43 శాతం యువత

జపాన్ అంటే పని..! పని అంటే జపాన్! కానీ జపనీయులు జీవితంలో అతి ముఖ్యమైన పనికి దూరమవుతున్నారని సర్వేలు గగ్గోలు పెడుతున్నాయి. పెళ్లి కాని వాళ్లు ఎలా ఉన్నారో.. అయినవాళ్లూ అలాగే బతుకుతున్నారని నిట్టూరుస్తున్నాయి. ఎంత పనిమంతులైనా.. ఎంత సంపాదించినా.. ఎంత అభివృద్ధి చెందినా.. కూసింత కళాపోషణ లేకపోతే- 'ఏమిరా మీ వల్ల ఉపయోగం దేశానికి' అని ప్రశ్నిస్తున్నాయి!!

పని రాక్షసులుగా పేరొందిన జపనీయులు అసలు కార్యాన్ని కూడా మరచిపోతున్నారు. పని ఒత్తిడితో పడక గది సంతోషాలకు దూరమవుతున్నారు. ఆఫీస్‌లో కష్టపడి వచ్చి ఓపిక లేక.. శృంగార జీవితాన్ని ఆస్వాదించలేకపోతున్నారు. ఇక పెళ్లికాని యువతీ యువకులైతే అసలు సెక్స్ ఎందుకు? అని ప్రశ్నిస్తున్నారనీ.. ఒంటిమీదకు 30 ఏళ్లు వస్తున్నా.. సోలో బతుకే సో బెటరు అని గడిపేస్తున్నారని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాప్యులేషన్ అండ్ సోషల్ రీసెర్చ్' సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. టోక్యోలో జంటలు ఎంత బిజీగా బతుకుతున్నాయంటే.. రోడ్డు మీద జీబ్రా క్రాసింగ్‌ల వద్ద మాట్లాడుకుంటున్నారని తెలిపింది. 18 నుంచి 49 ఏళ్ల వయసున్న పెళ్లైన జంటల్లో.. 47.2 శాతం మంది గత నెల రోజుల్లో ఒక్కసారి కూడా సెక్స్‌లో పాల్గొనలేదని చెప్పినట్లు జపాన్ కుటుంబ నియంత్రణ విభాగం నివేదిక వెల్లడించింది. 'జపాన్‌లో పెరుగుతున్న సెక్స్‌లెస్ మ్యారేజ్ ధోరణి ఆందోళన కల్గిస్తోంది' అని పేర్కొంది. సెక్స్ తమకు విసుగు పుట్టించే అంశమని 22 శాతం జపాన్ మహిళలు అభిప్రాయపడ్డారు. ఆఫీస్ నుంచి అలసిపోయి వచ్చే తమకు.. భాగస్వామితో ప్రేమను పంచుకునే ఓపిక ఉండటం లేదని 35.2 శాతం పురుషులు తెలిపారు. జపాన్‌లో దాదాపు సగం మంది జంటలు బొత్తిగా బెడ్ రూమ్ స్పార్క్ లేకుండా బతికేస్తున్నారని సర్వేలు చెబుతున్నాయి.

బాయ్ ఫ్రెండ్ ఉంటే ఫ్రీడమ్‌కు పరిమితులు

18 నుంచి 34 ఏళ్ల లోపు వయసున్న 5 వేల మంది యువతీ యువకులపై గత ఏడాది సర్వే నిర్వహించారు. వారిలో 43% మంది తమకు సెక్స్ అనుభవం లేదని తెలిపారు. 64% మంది తమకు ఎలాంటి రిలేషన్‌షిప్ లేదని చెప్పారు. 'అమ్మాయిలకు మా ప్రేమను వ్యక్తం చేయాలని ఉంటుంది. కానీ వాళ్లు నిరాకరిస్తే భరించడం కష్టం. నాలాగే చాలామంది అబ్బాయిలు ప్రపోజ్ చేయడానికి భయపడుతుంటారు. అందుకే యానిమేషన్ వంటి హాబీలతో సమయం గడుపుతాం' అని అనో మాత్సూయ్ అనే 26 ఏళ్ల కమేడియన్ వెల్లడించాడు. 'సెక్స్ కంటే తినడం, నిద్రపోవడమే నాకు చాలా ఇష్టం. నాకు సెక్స్ అవసరం లేదు. యూనివర్సిటీలో చేరిన తర్వాతే నా తల్లిదండ్రుల నుంచి కాస్త స్వేచ్ఛ దొరికింది. బాయ్‌ఫ్రెండ్ ఉంటే నా ఫ్రీడమ్‌కు పరిమితులు పెడతాడు. అది నాకు ఇష్టం లేదు' అని టోక్యోలో అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న అన్నా పేర్కొంది. జపాన్ యువత పని ఒత్తిడిని తగ్గించుకుని కుటుంబంతో గడిపేలా చేయడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. నెలకు 60 గంటలకు మించి ఓవర్‌టైమ్ చేయడానికి వీల్లేదని నిబంధన విధించింది. అయినా చాలామంది నెలకు వంద గంటలకు పైగా ఓవర్‌టైమ్ చేస్తూనే ఉన్నారు. యువతీ యువకులు ఇలాగే సింగిల్‌గా గడిపేస్తే.. 2060 నాటికి జపాన్ జనాభా 86 మిలియన్లకు పరిమితమైపోతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ ప్రభావం దేశ వర్క్‌ఫోర్స్‌పై పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తోంది.

- సెంట్రల్ డెస్క్

జాతీయ గీతంలో సగం

- **వివక్షతో కూడిన పదాన్ని తొలగించిన సెనేట్**
- **కెనడాలో ఫలించిన మహిళా పోరాటం**

'దేశ పౌరులంటే పురుషులేనా? మేం కాదా? మగాళ్లే నిజమైన దేశభక్తులా? దేశానికి ఆడపిల్లలు గర్వ కారణం కాదా? జాతీయ గీతంలో ఎన్నాళ్లీ వివక్ష?' అని దశాబ్దాలుగా కెనడాలోని మహిళలు చేస్తున్న పోరాటం ఫలించింది. 'ఓ కెనడా..' అంటూ సాగే జాతీయ గీతాన్ని సెనేట్ సవరించింది. పాట రెండో లైన్‌లో 'సన్స్' అన్న పదాన్ని తొలగించి ఆ స్థానంలో 'అస్' అనే పదాన్ని చేర్చింది. 'నీ కుమారులు నిజమైన దేశభక్తులు' అనే అర్థం వచ్చే వాఖ్యాన్ని మార్చి..'మేమంతా నీ నిజమైన దేశ భక్తులం' అనే భావంతో సవరించింది. అంతేకాదు.. మార్పులు చేసిన జాతీయ గీతాన్ని సెనేట్ సభ్యులంతా సగర్వంగా పాడారు. దీంతో కెనడాలోని మహిళా ఉద్యమకారులు సంబరాల్లో మునిగిపోయారు.

వివక్షకు చరమ గీతం

కెనడా జాతీయ గీతంలో వివక్షతో కూడిన పదాన్ని తొలగించడంలో ఫ్రాన్సెస్ రైట్ అనే మహిళా నేత కృషి ఎంతో ఉంది. దక్షిణాఫ్రికాలో పుట్టిన ఆమె.. ఆరేళ్ల వయసులో తల్లిదండ్రుల చేయి పట్టుకుని కెనడాలో అడుగుపెట్టారు. వలసదారులకు నీడ నిచ్చిన కెనడా అంటే ఆమెకు ఎంతో ఇష్టం.. మరెంతో గౌరవం! ప్రతి సందర్భంలోనూ కెనడా జాతీయ గీతాన్ని ఆమె సగర్వంగా పాడేవారు. 1997లో ఓసారి జాతీయ గీతం ఆలపించిన ఫ్రాన్సెస్‌ను ఆమె స్నేహితురాలు నిలదీసింది. 'వివక్షతో కూడిన ఆ జాతీయ గీతాన్ని ఎందుకు పాడుతున్నావ్? అందులో కుమారుల గురించే ఉంటుంది. కుమార్తెల ప్రస్తావన ఉండదు' అని కోపంతో ఊగిపోయింది. ఈ సంఘటన ఫ్రాన్సెస్‌ను ఆలోచింపజేసింది. కొన్నేళ్లకు ఆమె గళమెత్తారు. జాతీయ గీతంలో వివక్షతో కూడిన నాలుగు అక్షరాల పదాన్ని మార్చాలని పోరాడారు. 40 ఏళ్లపాటు ఫ్రాన్సెస్‌లాంటి ఎందరో మహిళల పోరాట ఫలితంగా.. ఎట్టకేలకు కెనడా సెనేట్ జాతీయ గీతాన్ని సవరించింది.

-సెంట్రల్ డెస్క్





బురఖా చాటున కన్నీళ్లు!

- **హజ్ యాత్రలో లైంగిక వేధింపులు!**
- **కదిలిస్తున్న 'మాస్క్ మీ టూ' ఉద్యమం**
- **చేదు అనుభవాలను వెల్లడిస్తున్న ముస్లిం మహిళలు**

పనిచేసే చోట లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా గత అక్టోబరులో మొదలైన 'మీ టూ' ఉద్యమం ప్రపంచమంతా విస్తరించింది. పనిచేసే చోటే కాదు.. ప్రార్థనాలయాలు, పవిత్రక్షేత్రాల్లోనూ మహిళలు ఇబ్బందులు పడుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. మక్కా వంటి పవిత్ర స్థలాల్లో కూడా తాము లైంగిక వేధింపులు ఎదుర్కొన్నామంటూ ముస్లిం మహిళలు తాజాగా గళమెత్తారు. సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోనా ఎల్‌తహావి అనే ఈజిప్టియన్-అమెరికన్ జర్నలిస్ట్ 'మాస్క్ మీ టూ' హ్యాష్‌ట్యాగ్‌తో చేసిన ట్వీట్ సంచలనం సృష్టించింది. 2013లో తాను హజ్ యాత్రకు వెళ్లినప్పుడు ఎదురైన చేదు అనుభవాన్ని ఆమె పంచుకున్నారు. ఆ వెంటనే అసంఖ్యాకంగా మహిళలు స్పందించారు. 'మాస్క్ మీ టూ' హ్యాష్‌ట్యాగ్ 24 గంటల్లోనే 2వేల సార్లు ట్వీట్ అయింది. మక్కా యాత్రకు వెళ్లినప్పుడు ఆ రద్దీలో.. కొందరు పురుషులు తమను అసభ్యంగా తాకుతూ, తడుముతూ వెళ్లడం భరించలేకపోయామని బాధిత మహిళలు ట్వీట్ చేశారు.


ఏది భద్రత?

మహిళలకు పవిత్ర ప్రార్థనాలయాల్లో కూడా భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు పాకిస్థాన్‌కు చెందిన సబికా ఖాన్! హజ్ యాత్రలో తాను లైంగిక వేధింపులు ఎదుర్కొన్నానని ఫేస్‌బుక్‌లో ఆమె చేసిన పోస్ట్ షాక్‌కు గురిచేస్తుంది. "పవిత్ర మక్కా మసీదు మధ్యలో ఉండే 'కాబా' దగ్గర 'తవాఫ్' సమర్పిస్తుండగా ఎవరెవరో తాకుతున్నారు. నన్నెవరో గట్టిగా లాక్కుని నా పిరుదులు తాకే ప్రయత్నం చేశారు. పవిత్ర స్థలాల్లో కూడా మహిళలకు భద్రత లేదా? అని ఏడ్చాను" అని సబికా ఖాన్ చేసిన ఫేస్‌బుక్ పోస్ట్ నెటిజన్లను కలచివేసింది. ఆమె పోస్ట్‌ను 2 వేల మంది షేర్ చేశారు. మరి మహిళల వేదన సౌదీ ప్రభుత్వానికి పట్టదా? అని ప్రశ్నిస్తున్నారు పాకిస్థాన్‌కు చెందిన 37 ఏళ్ల అజీజా! 'నేను, మా అక్క హజ్ యాత్రలో అనేకసార్లు లైంగిక వేధింపులు ఎదుర్కొన్నాం. మహిళలకు భద్రత కల్పించి.. సమస్యలు ఎదురైతే ఫిర్యాదు చేసేలా సౌదీ అరేబియా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి' అని అజీజా కోరుతున్నారు. ప్రార్థనాలయాల్లో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా మొదలైన 'మాస్క్ మీ టూ' ఆందోళనకు ఇరాన్, అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్, సౌదీల్లో మద్దతు లభిస్తోంది. పార్సీ ట్విట్టర్‌లో ఇది టాప్-10 ట్రెండ్స్‌లో ఒకటిగా నిలిచింది.

- సెంట్రల్ డెస్క్

ఇరాన్‌లో కొత్త ఆందోళన

'బురఖా ఆంక్ష కాదు. అది మీకు రక్ష' అని ఇరాన్‌లోని కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాసి ఉంటుంది. కానీ నిండా దుస్తులు, బురఖా ధరించినా వీధుల్లో లైంగిక వేధింపులు తప్పడం లేదని 'మాస్క్ మీ టూ'కు మద్దతు పలుకుతున్న ఇరాన్ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అంతేకాదు టెహ్రాన్‌లోని కూడళ్లలో కొందరు యువతులు బురఖా తీసి నిరసన తెలుపుతున్నారు. దీనిని 'ద గాళ్స్ ఆఫ్ రివల్యూషన్ స్ట్రీట్' ఉద్యమంగా అభివర్ణిస్తున్నారు. ఇలా గత కొన్ని వారాల్లో బురఖాను సవాల్ చేసిన 29 మంది మహిళలను ఇరాన్ అధికారులు అరెస్టు చేశారు.



కూరగాయలు ఇలా భద్రం



పురుగుమందుల అవశేషాలను తొలగించే చిట్కా

మార్కెట్లో మాంచి లేత వంకాయలో.. బెండకాయలో చూసి జాగ్రత్తగా ఏరి తెచ్చుకుని, బాగా కడిగి వండుకుంటాం. కానీ.. కొన్నిసార్లు ముద్ద నోట్లో పెట్టుకోగానే పురుగుమందు వాసన వస్తుంది. ఇది చాలా మందికి ఎదురయ్యే అనుభవమే. పురుగుమందు కొట్టిన కొన్ని రోజుల దాకా కూరగాయలను మార్కెట్‌కు తేకూడదు. ఆ నిబంధనను ఎవరూ పట్టించుకోవట్లేదు. పురుగుమందు చల్లిన 1-2 రోజుల్లోనే వాటిని విక్రయిస్తున్నారు. అలా తెచ్చిన కూరగాయల్లో కొన్ని పురుగుమందు వాసన రాకపోవచ్చుగానీ.. ఆ అవశేషాలు మాత్రం అలాగే ఉంటాయి. మనం ఎంత శుభ్రంగా కడిగినా అవి పోవని.. జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ వర్సిటీ విద్యార్థి సుధాకర్ అధ్యయనంలో తేలింది. జర్నల్ ఆఫ్ ఎంటమాలజీ అండ్ జువాలజీలో సుధాకర్ అధ్యయన ఫలితాలు ప్రచురితమయ్యాయి. దీని ప్రకారం.. కూరగాయలపై ఉండే అవశేషాలను పంపునీళ్లు కేవలం 17 నుంచి 39% మాత్రమే తొలగిస్తున్నాయి. ఈ హానికర రసాయన అవశేషాలను పూర్తిగా తొలగించే మార్గాన్ని కూడా సుధాకర్ వివరించారు. అదేంటంటే.. 4 లీటర్ల నీళ్లల్లో 160 మిల్లీలీటర్ల ఎసిటికామ్లం (వినెగర్‌లో ఉంటుంది), 4 గ్రాముల తినే ఉప్పు, 4 నిమ్మకాయలు, పిండి తీసిన రసం కలిపి.. ఆ ద్రావణంలో కూరగాయలను కడిగితే రసాయన అవశేషాలు 55 నుంచి 76% మేర తొలగిపోతాయని పేర్కొన్నారు. దీనికి ఆయన వెజ్జీవాష్ అని పేరు పెట్టారు. టొమాటో సాగులో ప్రధానంగా రైతులు వాడే ఐదు రకాల క్రిమిసంహారక మందుల ప్రభావాన్ని ఈ వెజ్జీవాష్ తగ్గించినట్టు చెప్పారు. అధ్యయనంలో భాగంగా వెజ్జీవాష్ ప్రభావాన్ని టొమాటోలపై పరీక్షించినట్టు ఆయన తెలిపారు.

వింటర్ ఒలింపిక్స్‌లో రికార్డు బద్దలు

ప్రతి అథ్లెట్‌కూ 37.. గేమ్స్ విలేజ్‌కి లక్షా 10వేల కండోమ్‌ల పంపిణీ

92 దేశాలు.. 2925 అథ్లెట్లతో దక్షిణ కొరియాలో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్-2018 రికార్డు సృష్టించింది. అయితే.. ఈ క్రీడలతో సంబంధం లేకుండా..! వింటర్ ఒలింపిక్స్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో అథ్లెట్లకు కండోమ్స్ సరఫరా చేసిన రికార్డును సొంతం చేసుకుంది. ఒలింపిక్ విలేజ్‌లో అథ్లెట్లకు ఈసారి లక్షా 10 వేల కండోమ్స్‌ని ఉచితంగా అందిస్తున్నారు. ఒక్కో అథ్లెట్‌కు 37 కంటే ఎక్కువ కండోమ్‌లు అందుతాయని కొరియా బయో మెడికల్ రివ్యూ పేర్కొంది. బరుస్సేన్గాక్ అనే కంపెనీ లక్ష కండోమ్‌లు, కొరియన్ ఎయిడ్స్ నియంత్రణ మండలి మరో 10వేల కండోమ్‌లను క్రీడా గ్రామానికి సరఫరా చేసినట్లు వెల్లడించింది. హెచ్ఐవీ వ్యాప్తిని నిరోధించడానికి 1988 సియోల్ ఒలింపిక్స్ నుంచే అథ్లెట్లకు కండోమ్‌లను ఉచితంగా అందించడం మొదలైంది. 2016 సమ్మర్ ఒలింపిక్స్‌లో ఏకంగా నాలుగున్నర లక్షల కండోమ్స్ సరఫరా చేశారు. 'టిండర్' వంటి డేటింగ్ యాప్‌లతో క్రీడా గ్రామాల్లో అథ్లెట్లు చెలరేగిపోవడం సర్వసాధారణంగా మారింది.



ఆంధ్రజ్యోతి

బిజినెస్

ఐదేళ్లలో రూ.20వేల కోట్ల టర్నోవర్: పార్లే

న్యూఢిల్లీ: బిస్కెట్లు, చిరుతిండి ఉత్పత్తుల తయారీ సంస్థ పార్లే భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. వచ్చే ఐదేళ్లలో కంపెనీ టర్నోవర్‌ను రెట్టింపు స్థాయి రూ.20,000 కోట్లకు పెంచాలనుకుంటున్నది. ముమ్ముందు సంవత్సరాల్లో సంస్థ వ్యాపార వృద్ధికి బిస్కెట్లు, స్నాక్స్ ప్రధానంగా దోహదపడనున్నాయని పార్లే ప్రొడక్ట్ కేటగిరీ హెడ్ మయాంక్ షా తెలిపారు. ముమ్ముందు మరిన్ని కొత్త ప్రొడక్టులను మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్న ఆయన చెప్పారు. ప్రస్తుతం సంస్థ టర్నోవర్ రూ.10 వేల కోట్ల స్థాయిలో ఉంది.



గల్ఫ్ సహకార మండలి వ్యాపారవేత్తలతో ప్రధాని మోదీ

యుఎఇ చమురు క్షేత్రంలో ఒవిఎల్‌కు వాటా

ప్రధాని పర్యటన సందర్భంగా సంతకాలు

అబుదాబి : భారత్ తన ఇంధన దౌత్యాన్ని మరింత ఉధృతం చేసింది. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా తమ దేశంలోని ఒక చమురు క్షేత్రంలో భారత కంపెనీలకు 10 శాతం ఈక్విటీ వాటా ఇచ్చేందుకు యుఎఇ అంగీకరించింది. ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జిసి విదేశ్ లిమిటెడ్ (ఒవిఎల్), దాని భాగస్వామ్య సంస్థలు ఈ 10 శాతం వాటాను 60 కోట్ల డాలర్లకు (సుమారు రూ.3,900 కోట్లు) కొనుగోలు చేస్తున్నాయి. ప్రధాని మోదీ, యుఎఇ యువరాజు షేక్ మహ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్ సమక్షంలో ఓఎన్‌జిసి గ్రూప్ ఛైర్మన్ శశి శంకర్, అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ (ఎడిఎన్‌ఒసి) గ్రూప్ సిఇఒ సుల్తాన్ అహ్మద్ అల్ జబర్ ఇందుకు సంబంధించిన ఒప్పందంపై సంతకాలు చేశారు. యుఎఇ చమురు క్షేత్రాల్లో భారత కంపెనీలకు ఈక్విటీ వాటా లభించడం ఇదే మొదటిసారి. యుఎఇలోని జకుం కన్సెషన్ ప్రాంతంలో ఉన్న ఈ చమురు క్షేత్రం నుంచి ప్రస్తుతం ఏటా రెండు కోట్ల టన్నుల (రోజుకు నాలుగు లక్షల పీపాలు) ముడి చమురు ఉత్పత్తి అవుతోంది. ఈ వాటాతో ఒవిఎల్, దాని భాగస్వామ్య సంస్థలకు ఏటా 20 లక్షల టన్నుల ముడి చమురు లభించనుంది. దీంతో భారత ముడి చమురు మార్కెట్లో మరింత వాటా లభిస్తుంది. భారత్ కూడా చమురు సరఫరాలో హామీ లభిస్తుంది. 'మన భాగస్వామ్యంలో ఉచ్ఛస్థితికి ఇది ప్రారంభం' అని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ఒప్పందంతో ఇప్పటి వరకు చమురు రంగంలో అమ్మకందారు-కొనుగోలుదారుగా ఉన్న సంబంధాలు దీర్ఘ కాలిక పెట్టుబడి సంబంధాలుగా మారతాయి.

మరింత ఉత్పత్తి

ప్రస్తుతం రోజుకు నాలుగు లక్షల పీపాలున్న ఈ క్షేత్రం ఉత్పత్తి సామర్థ్యాన్ని 2025 నాటికి 4.5 లక్షలకు పెంచాలని యుఎఇ భావిస్తోంది. ఈ సంవత్సరం మార్చి నుంచి అమల్లోకి వచ్చే ఈ ఒప్పందం 40 సంవత్సరాల పాటు అమల్లో ఉంటుంది. ఈ చమురు క్షేత్రం ఈక్విటీలో 60 శాతం ఎడిఎన్‌ఒసి చేతిలో ఉంటుంది. మిగతా 40 శాతంలో 10 శాతం ఒవిఎల్‌తో సహా విదేశీ కంపెనీల చేతిలో ఉంది. ఈ ఒప్పందం ద్వారా యుఎఇ చమురు, గ్యాస్ రంగాల్లో భారత కంపెనీలకు మరిన్ని పెట్టుబడి అవకాశాలు ఏర్పడతాయని ఓఎన్‌జిసి గ్రూప్ ఛైర్మన్ శంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. పరస్పర ప్రయోజనకరంగా యుఎఇతో ఇంధన భాగస్వామ్యాన్ని పటిష్టం చేసుకోవాలన్న ప్రధాని లక్ష్యానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుందన్నారు. చమురు క్షేత్రంలో వాటాతో పాటు, రైల్వేలు, మానవ వనరులు, ఆర్థిక సేవల రంగాల్లో సహకరించేందుకు కూడా రెండు దేశాలు ప్రధాని పర్యటన సందర్భంగా ఐదు ఒప్పందాలపై సంతకాలు చేశాయి.

హెచ్‌పిసిఎల్ బోర్డులో ఓఎన్‌జిసి నామినీ !

హెచ్‌పిసిఎల్ ఈక్విటీలో మెజారిటీ వాటా కొనుగోలు చేసిన ఓఎన్‌జిసి ఇపుడు ఆ కంపెనీ బోర్డులోనూ తన నామినీని నియమించేందుకు సిద్ధమవుతోంది. మిగతా అనుబంధ సంస్థలైన ఎంఆర్‌పిఎల్, ఓఎన్‌జిసి విదేశ్ లిమిటెడ్ (ఒవిఎల్) తరహాలో త్వరలో ఒకరిని హెచ్‌పిసిఎల్ బోర్డులో తన నామినీగా నియిమించే అవకాశం ఉందని సమాచారం. హెచ్‌పిసిఎల్ బోర్డులోని ప్రస్తుత డైరెక్టర్‌కు తోడు ఈ నామినీని నియమించాలని ఓఎన్‌జిసి భావిస్తోంది.

2020 నాటికి బీమా రంగం

రూ.18.20 లక్షల కోట్లు

▸ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వృద్ధిరేటుతోపాటుగా దేశీయ బీమా రంగం కూడా భారీగా పుంజుకోనుందని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే రెండేళ్లలో (2020కల్లా) భారత బీమా రంగం 28 వేల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని ఆయన అన్నారు. అంటే మన కరెన్సీలో సుమారు రూ.18.20 లక్షల కోట్లు. గత ఏడాది చివరినాటికల్లా ఇండియన్ ఇన్సూరెన్స్ ఇండస్ట్రీ సైజు 8,472 కోట్ల డాలర్లుగా నమోదైంది. హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాసియా బీమా రెగ్యులేటరీ నాలుగో వార్షిక సమావేశం, అంతర్జాతీయ బీమా సదస్సు ముగింపు కార్యక్రమంలో వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2016-17 ఆర్థిక సంవత్సరం చివరినాటికి బీమా సంస్థలు పలు రంగాల్లో పెట్టిన పెట్టుబడుల విలువ రూ.30.76 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. అందులో 2.40 లక్షల కోట్లు మౌలిక సదుపాయాల రంగంలోకి వచ్చాయన్నారు.

వేగంగా బీమా సేవల వ్యాప్తి

బీమా సంస్థల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) పరిమితిని పెంచడంతోపాటు ప్రభుత్వ బీమా పథకాలు దేశంలో ఈ రంగం సేవలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని ఉపరాష్ట్రపతి అన్నారు. మధ్యతరగతి వర్గంతోపాటు ప్రజల ఆదాయ స్థాయి, బీమా ఆవశ్యకతపై అవగాహన పెరుగుతుండటంతో భవిష్యత్‌లో ఈ రంగం భారీగా వృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్త బీమా సేవల వ్యాప్తి 6.2 శాతంగా ఉండగా.. భారత్‌లో మాత్రం కేవలం 3.39 శాతమేనని వెంకయ్య నాయుడు అన్నారు.

చౌక పథకాలు రావాలి..

మారుతున్న కాలానికి అనుగుణంగా బీమా సంస్థలు, నియంత్రణ మండళ్లు కూడా పరివర్తనం చెందాల్సిన అవసరం ఉందన్నారు. మోసపూరిత లావాదేవీలకు చెక్ పెట్టడంతోపాటు సామాన్యులకు అందుబాటు ధరలో బీమా పథకాలను రూపొందించడంపై దృష్టిపెట్టాలన్నారు.పాలసీ హోల్డర్ల సంఖ్య శరవేగంగా పెరుగుతున్న నేపథ్యంలో మోసాలను నిరోధించి, ప్రీమియం చెల్లింపుదారుల ప్రయోజనాలను రక్షించాల్సిన అవసరం ఉందని వెంకయ్యనాయుడు బీమా రంగ ప్రతినిధులకు సూచించారు. నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ స్కీం పేరుతో దేశంలోని 10 కోట్ల కుటుంబాలకు ఏటా రూ.5 లక్షల వరకు హెల్త్ కవరేజీ కల్పించనున్నట్లు బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. ఈ పథకం పేదలకు ఆర్థిక దన్నుగా నిలువనుందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు భారీగా పెరిగాయి. హ్యాకర్లు విలువైన సమాచారం, వ్యక్తిగత వివరాలను దొంగిలించే సంఘటనలు రోజుకోటి వెలుగుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో సైబర్ సెక్యూరిటీ, సైబర్ లయబిలిటీ ఇన్సూరెన్స్ కీలకంగా మారిందని ఉపరాష్ట్రపతి అన్నారు.

బౌన్స్ బ్యాక్‌కు అవకాశం

"స్థూల ఆర్థిక గణాంకాలే ఈ వారంలో మార్కెట్ కదలికలకు కీలకం కానున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం సెలవు కావడం వల్ల ఈ వారంలో నాలుగే ట్రేడింగ్ దినాలుంటాయి."


విజయ్ సింఘానియా
డైరెక్టర్, ట్రేడ్‌స్మార్ట్ ఆన్‌లైన్

మార్కెట్ నాడి

కీలక సూచిలన్నీ ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల ధోరణికి దీటుగా ఎగుడుదిగుడుల పయనం సాగిస్తూ వరుసగా రెండో వారంలో కూడా నష్టాల్లోనే ముగిశాయి. ఈ వారంలో కొంత బౌన్స్‌బ్యాక్ ఏర్పడే ఆస్కారం ఉంది. అయితే బాండ్లపై పెరుగుతున్న రాబడులు, భారీగా పెరిగిన ఆయిల్ ధరలు, వడ్డీరేట్ల పెంపుదల భయాలు కొంత కాలం పాటు ఈక్విటీ మార్కెట్లలో ఆటుపోట్లు కొనసాగేందుకు దోహదపడతాయి. అయితే వీక్లీ మద్దతు స్థాయిల్లో ఎలాంటి మార్పులు లేవు.

ఈ వారంలో కీలక గణాంకాలు వెలువడనున్నాయి. జనవరి నెలకు వినియోగదారుల సూచీ ద్రవ్యోల్బణం గణాంకాలను ప్రభుత్వం సోమవారం ప్రకటిస్తుంది. డిసెంబరు నెల పారిశ్రామికోత్పత్తి గణాంకాలు కూడా అదే రోజు వెలువడనున్నాయి. జనవరి డబ్ల్యుపిఐ గణాంకాలను బుధవారం ప్రకటిస్తారు.

- జపాన్ నాలుగో త్రైమాసికం జిడిపి గణాంకాలను మంగళవారం, అమెరికా వినియోగ సూచీ ద్రవ్యోల్బణం గణాంకాలను బుధవారం, క్రూడాయిల్ ఇన్వెంటరీ గణాంకాలను బుధవారం ప్రకటించనున్నాయి.

ఈ వారం ఫలితాలివే...

బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్రిటానియా ఇండస్ట్రీస్, గెయిల్ (సోమవారం), ఎన్‌బిసిసి, ఎన్‌ఎండిసి (మంగళవారం), గోద్రెజ్, గ్రాసిమ్, జెట్ ఎయిర్‌వేస్, నెస్లె, సన్ ఫార్మా, టాటా పవర్ (బుధవారం).

టెక్నికల్స్ ఇవే...

భిన్న కాలశ్రేణుల్లో నిఫ్టీ మద్దతు జోన్లు విభిన్నంగా ఉన్నాయి. బలమైన మద్దతు స్థాయి 10400 కన్నా నిఫ్టీ ఇప్పటికీ నెలవారీ చార్టుల ప్రకారం 23.6 శాతం ఎగువనే ఉంది. వీక్లీ చార్టుల ప్రకారం నిఫ్టీ గతంలోని బ్రేకౌట్ స్థాయి 10380 కన్నా పైనే ముగియగలిగింది. 1000 డిఎంఎ 10400 కన్నా పైనే ఉంది. ఎగువన 10580-10620 నిరోధ జోన్‌గా ఉంది. నిఫ్టీ ఫ్యూచర్స్ కూడా 2.54 శాతం నష్టంతో 10483 వద్ద ముగిసింది.

- బ్యాంక్ నిఫ్టీ గత వారంలో మరో 3.6 శాతం క్షీణించింది. అయినా కీలక మద్దతు స్థాయి 25430 కన్నా పైనే ముగిసింది. 25860 కీలక నిరోధం.బ్యాంక్ నిఫ్టీ ఫ్యూచర్స్ మరింత అధికంగా 3.68 శాతం నష్టపోయి 25530 వద్ద క్లోజయింది.
- ప్రస్తుత సిరీస్‌లో నిఫ్టీకి 11000 సిఇ, 10500 పిఇ వద్ద గరిష్ఠంగా ఓపెన్ ఇంటరెస్ట్ కనిపిస్తోంది. బ్యాంక్ నిఫ్టీకి 26500 సిఇ, 24500 పిఇ వద్ద ఓపెన్ ఇంటరెస్ట్ ఉంది. ఇండియా విఐఎక్స్ గణనీంగా 26.10 శాతం లాభపడి 19.23 వద్ద ముగిసింది.

రికవరీ బాటలో రియల్ ఎస్టేట్

▸ పుంజుకుంటున్న అమ్మకాలు


▸ ప్రారంభమవుతున్న కొత్త ప్రాజెక్టులు

▸ 99ఎకర్స్.కామ్ సర్వేలో వెల్లడి

ముంబై : పెద్ద నోట్ల రద్దు, వస్తుసేవల పన్ను (జిఎస్‌టి), రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) వంటి విప్లవాత్మక సంస్కరణ అమలు నేపథ్యంలో ప్రభావితమైన రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడిప్పుడే కుదురుకుంటోంది. ప్రాపర్టీ అమ్మకాలు పుంజుకుంటున్నా యి. ధరల్లోనే దిద్దుబాటు లేదా యథాతథ స్థితి కొనసాగుతోందని తాజా సర్వేలో వెల్లడైంది. ప్రాపర్టీ పోర్టల్ 99ఎకర్స్.కామ్ నిర్వహించిన సర్వే ప్రకారం.. దేశంలోని మెట్రోనగరాల్లో ప్రాపర్టీల సగటు ధరల్లో తగ్గుదల లేదా హెచ్చుతగ్గులు లేకుండా ఉన్నాయి. కొన్ని మార్కెట్లలో అమ్మకాలు పుంజుకున్నాయి. పుణె, ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో ప్రాపర్టీల అమ్మకాల పరిమాణం మెరుగుపడింది. ఇక్కడి మార్కెట్లలో ధరల దిద్దుబాటు జరిగింది. ఇక హైదరాబాద్, కోల్‌కతా నగరాల్లో అద్దెలు గత అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో 4 శాతం చొప్పున పెరిగాయి. బెంగళూరు, ముంబైలో పెరుగుదల 3 శాతంగా ఉంది. ఇన్వెంటరీ అధికంగా ఉన్న ఢిల్లీ ఎన్‌సిఆర్, ముంబైలో ధరల దిద్దుబాటు చోటు చేసుకుంది. గురుగ్రామ్, నోయిడా, నవీ ముంబైలో ఈ పరిస్థితి ఉంది. 2017 సంవత్సరంలో రియల్ ఎస్టేట్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు చోటు చేసుకున్నాయని, రెరా, జిఎస్‌టి విషయంలో నెలకొన్న అనిశ్చితి ఫలితంగా గృహాల డిమాండ్, అమ్మకాలు, సప్లయ్‌పై దెబ్బ పడిందని 99ఎకర్స్.కామ్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ నరసింహ జయకుమార్ తెలిపారు. రెరా నేపథ్యంలో కొనుగోలుదారులు వేచిచూసే ధోరణికే ప్రాధాన్యం ఇచ్చినట్టు ఆయన చెప్పారు. రెరా మూలంగా కొనుగోలుదారుల్లో విశ్వాసం పెరిగిందని చెప్పారు. ఇప్పుడు గృహాలకు సంబంధించిన విచారణలు, కొనుగోలు పుంజుకుంటున్నాయని తెలిపారు. బెంగళూరు, పుణె వంటి నగరాల్లో ప్రీమియం ఇళ్ల మార్కెట్ కూడా పూర్వ స్థితికి చేరుకుంటోందని ఆయన చెప్పారు. లగ్జరీ, అల్ట్రా లగ్జరీ సెగ్మెంట్లో ధరలు ఈ ఏడాది మరింత తగ్గవచ్చని, ఇలాంటి ప్రాజెక్టుల పట్ల కొనుగోలుదారుల్లో ఆసక్తి లేకపోవడమే కారణమని జయకుమార్ తెలిపారు. మిగతా కేటగిరీల్లో ధరల్లో పెద్దగా తగ్గుదల ఉండకపోవచ్చని చెప్పారు. కొత్త ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్, ప్రారంభాలు జరుగుతున్న నేపథ్యంలో రానున్న కాలంలో ప్రాపర్టీల ఇన్వెంటరీ పెరిగేందుకు అవకాశం ఉందని జయకుమార్ వివరించారు.



కన్సాలిడేషన్ చాన్స్





టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం గరిష్ఠ స్థాయి 10700 వరకు వెళ్లినా నిలదొక్కుకోలేక బలహీనంగా ముగిసింది. అయితే 10400 వద్ద మైనర్ మద్దతు తీసుకున్నట్టు కనిపిస్తోంది. వారం గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు నడుమ ముగియడం మరింత కన్సాలిడేషన్ ఉంటుందనేందుకు సంకేతం. అయితే అమెరికన్ మార్కెట్లు శుక్రవారంనాడు బలమైన రికవరీ సాధించినందువల్ల దేశీయ మార్కెట్‌లో కూడా రిలీఫ్ అప్‌ట్రెండ్ లేదా రికవరీ ఏర్పడవచ్చు. ఇప్పుడు మాత్రం గరిష్ఠ నిరోధ స్థాయిల్లో పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు...

ప్రధాన నిరోధం 10600 వద్ద మరింత రికవరీ ఏర్పడవచ్చు. గత మూడు సెషన్లుగా ఇండెక్స్ ఇక్కడ స్వల్పనిరోధాన్ని ఎదుర్కొంటోంది. ఆ పైన బలంగా క్లోజయినప్పుడే మరింత పాజిటివ్ ధోరణిలో ట్రేడవుతుంది. మరో ప్రధాన నిరోధం 10700. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఆ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి.

బేరిష్ స్థాయిలు...

10600 వద్ద విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 10500. తక్షణ అప్‌ట్రెండ్ ఆశలు నిలబడాలంటే ఇక్కడ రికవరీ తప్పనిసరి. అంత కన్నా దిగువన క్లోజయితే మరింత కరెక్షన్‌లో ప్రవేశిస్తుంది. మరో ప్రధాన నిరోధం, గత వారంలోని ప్రధాన బాటమ్ 10400.

స్వల్పకాలిక వ్యూహం : ప్రస్తుత స్థాయి 10500 కన్నా పైన అప్రమత్తంగా ఉంటూ తగినంత స్టాప్‌లాస్‌తో ట్రేడర్లు స్వల్పకాలిక బై పొజిషన్లు పరిశీలించవచ్చు.

బ్యాంక్ నిఫ్టీ : ప్రధాన నిరోధం 25800. గతంలో ఏర్పడిన మైనర్ టాప్ ఇది. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది. ఆ పైన బలంగా నిలదొక్కుకుంటే ప్రధాన నిరోధం 26200 దిశగా కదులుతుంది.

పాటర్న్ : 10700 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఉంది. అయితే "ఏటవాలుగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా చాలా దిగువన ఉండడం ప్రధాన అప్‌ట్రెండ్‌కు మరికొంత కాలం పట్టవచ్చుననేందుకు సంకేతం. ప్రస్తుతం మార్కెట్ 20 డిఎంఎ కన్నా దిగువన ఉంది. 50 డిఎంఎ వద్ద పరీక్షకు సమాయత్తం అవుతోంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన క్లోజ్ కావాలి. గత వారం ఓవర్‌బాట్ స్థితి సద్దుబాటు అయినట్టు కనిపిస్తోంది.

టైమ్ : ఈ సూచి ప్రకారం తదుపరి రివర్సల్ గురువారంనాడు ఉంది.

సూచన : స్వల్పకాలిక ట్రేడర్లు/ఇన్వెస్టర్లు బై పొజిషన్లు హోల్డ్ చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

సోమవారం స్థాయిలు..
నిరోధం : 10600, 10700
మద్దతు : 10500, 10420

టాటా స్టీల్ (రూ.685) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..		
రూ.685 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం రూ.720	రెండో నిరోధం రూ.750
రూ.670 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు రూ.640	రెండో మద్దతు రూ.610

ఏషియన్ పెయింట్ (రూ.1132) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..		
రూ.1130 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం రూ.1170	రెండో నిరోధం రూ.1210
రూ.1120 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు రూ.1090	రెండో మద్దతు రూ.1060

■ వాసిరాజు సుందర్ రాజా
www.sundartrends.in


ఎస్‌బిఐలో రూ.20 వేల కోట్ల రుణాల మాఫీ

▸ 2016-17లో రూ.81,683 కోట్లకు పిఎస్‌బిల రైట్ ఆఫ్స్

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2016-17)లో ఎస్‌బిఐ రూ.20,339 కోట్ల రుణ బకాయిలను మాఫీ (రైట్ ఆఫ్) చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పిఎస్‌బి) అత్యధిక రైట్ ఆఫ్‌లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియావే. 2016-17లో పిఎస్‌బిలు మొత్తం రూ.81,683 కోట్ల బకాయిలను కొట్టివేశాయి. 2012-13లో రూ. 27,231 కోట్లుగా నమోదైన పిఎస్‌బిల రైట్ ఆఫ్‌లు గడిచిన ఐదు ఆర్థిక సంవత్సరాల్లో దాదాపు మూడు రెట్ల స్థాయికి చేరుకున్నాయి. 2013-14లో రూ.34,409 కోట్లు, 2014-15లో రూ.49,018 కోట్లు, 2015-16లో రూ.57,585 కోట్లు, 2016-17లో రూ.81,683 కోట్లకు పెరిగాయి. గతసారి ఎస్‌బిఐ తర్వాత అధికంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) రూ.9,205 కోట్లు రైట్‌ఆఫ్ చేసింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.7,346 కోట్లు, కెనరా బ్యాంక్ రూ.5,545 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.4,348 కోట్ల బకాయిలను మాఫీ చేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం (ఏప్రిల్-సెప్టెంబర్ 2017)లో పిఎస్‌బిల రైట్ ఆఫ్‌లు రూ.53,625 కోట్లకు చేరుకున్నాయి.



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	70.00	విజయవాడ	75.00
కరీంనగర్	71.00	గుంటూరు	75.00
వరంగల్	72.00	ఒంగోలు	77.00
మహబూబ్‌నగర్	70.00	చిత్తూరు	65.00
కర్నూలు	70.00	నెల్లూరు	73.00
విశాఖపట్నం	71.00	అనంతపురం	72.00
గోదావరి	74.00		



రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.20		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	361.00	చిత్తూరు	378.00
వరంగల్	363.00	చెన్నై	385.00
విజయవాడ	353.00	నమక్కల్	370.00
గోదావరి	353.00	బెంగళూరు	372.00
విశాఖపట్నం	360.00	ముంబై	397.00

మరో వారం దిగువకే..


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

(ఫిబ్రవరి 12-16 తేదీల మధ్య వారానికి)

గత వారం నిఫ్టీ : 10555 (-306)

నిఫ్టీ గత వారం 10703-10276 నడుమ సంచరించి 306 పాయింట్ల నష్టంతో 10555 వద్ద ముగిసింది. అమెరికన్ మార్కెట్లలో ఏర్పడిన పతనమే ఇందుకు కారణం. ఎనిమిది వారాల వరుస లాభాల అనంతరం రెండో వారంలో కూడా నష్టాలతోనే ముగిసినందు వల్ల మార్కెట్ మరో వారం దిగువకు పయనించే ఆస్కారమే ఉంది.

- శివరాత్రి పర్వదిన సందర్భంగా మంగళవారం సెలవు కావడం వల్ల ఈ వారంలో నాలుగు ట్రేడింగ్ దినాలే ఉంటాయి.
- చంద్రుని కుంభ, మీనరాశుల సంచార సమయంలో నిఫ్టీ పరిధి 10830-11093. ఇండెక్స్ ఈ రెండు స్థాయిలను బ్రేక్ చేసింది. దిగువ టార్గెట్లు 10590, 10330 రెండింటి కన్నా కూడా దిగజారింది.
- స్వల్పకాలిక ట్రెండ్ చాలా బేరిష్‌గా మారింది. మధ్యకాలిక ధోరణిలో బుల్లిష్‌గాను, దీర్ఘకాలిక ధోరణిలో మరింత బుల్లిష్ గాను ఉంది. 10700 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలంలో కూడా బుల్లిష్ అవుతుంది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10824, 10567, 10372, 10043 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- ప్రస్తుతం నిఫ్టీ 100, 200 డిఎంఎల కన్నా పైన ట్రేడవుతోంది. నిఫ్టీ 200 డిఎంఎ కన్నా పైన ఉండడం 50 డిఎంఎ 200 డిఎంఎ కన్నా పైకి రావడం (గోల్డెన్ క్రాస్) దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 10700

బ్రేక్‌డౌన్ స్థాయి : 10200

నిరోధ స్థాయిలు : 10600, 10675, 10750 (10525 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 10300, 10225, 10150 (10375 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

సాధారణంగా మెరుగు (సోమవారానికి)

తిథి : మాఘ బహుళ ద్వాదశి

నక్షత్రం : పూర్వాషాఢ

మృగశిర, చిత్త, ధనిష్ఠ నక్షత్ర జాతకులు, మకర, వృషభ రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 12.30

ధోరణి : గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 11.40 తర్వాత 1.30 వరకు నిస్తేజంగా ట్రేడవుతూ తదుపరి చివరి వరకు తిరిగి మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 11.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 11.45 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 1.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.45 తర్వాత తిరిగి ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 10500, 10535

మద్దతు స్థాయిలు : 10415, 10380

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

గ్రహగతులివే..

- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 2 నుంచి కుంభంలోని శతభిషం పాదం 1 మధ్యలో చంద్ర సంచారం
- మకరంలోని ధనిష్ఠ పాదం 2-4 మధ్యలో రవి సంచారం
- మకరంలోని ధనిష్ఠ పాదం 1-3 మధ్యలో బుధ సంచారం
- కుంభంలోని శతభిషం పాదం 1-2 మధ్యలో శుక్ర సంచారం
- వృశ్చికంలోని అనూరాధ పాదం 4 నుంచి జ్యేష్ఠ పాదం 1 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని మూల పాదం 4లో కర్కాటక నవాంశలో శని సంచారం
- తులలోని విశాఖ పాదం 3లో మీన నవాంశలో బృహస్పతి సంచారం
- మకరంలో రాహువు, కర్కాటకంలో కేతువు కర్కాటక, మకర నవాంశల్లో సంచారం

ఇంట్లో ఎంత బంగారం ఉండొచ్చు?

భారత దేశ సంస్కృతిలో బంగారానికి ఉన్నంత ప్రాముఖ్యత మరే దేశంలోనూ ఉండదు. వీసమెత్తు బంగారమైనా లేకుండా ఏ పెళ్లి పూర్తి కాదనడంలో అతిశయోక్తి లేదు. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలో ఎవరి వద్ద ఎంత బంగారం/బంగారు నగలు ఉంచుకోవచ్చనే దానిపై ఎవరికి స్పష్టమైన అవగాహన లేదు. దీంతో ఆదాయ పన్ను శాఖ అధికారుల దాడుల సమయంలో చాలా మందికి ఒకటే ఆందోళన. దీనికి సంబంధించిన నిబంధనలేమిటో తెలుసుకుందాం..

ఎవరి దగ్గర ఎంత బంగారు నగలు ఉండవచ్చనే దానిపై మే 11, 1994 సంవత్సరంలోనే కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సిబిడిటి) స్పష్టత ఇచ్చింది. డిసెంబరు 1, 2016న దీనికి వివరణ ఇస్తూ మరో ప్రకటన జారీ చేసింది. ఈ నిబంధనల ప్రకారం..

ఎప్పుడు గరిష్ఠ పరిమితి ఉండదంటే ?

- చట్టపరమైన ఆదాయ వనరుల నుంచి కొనుగోలు చేసిన లేదా వారసత్వంగా సంక్రమించిన బంగారం, బంగారు నగలు కలిగి ఉండేందుకు ఎలాంటి పరిమితులు లేవు.
- కొనుగోలు చేసిన బంగారమైతే, వాటి కొనుగోలుకు అయిన ఖర్చులు, ఆదాయ పన్ను రిటర్నుల్లో పేర్కొన్న మీ ఆదాయాన్ని బలపరిచేలా ఉండాలి. ఆ కొనుగోలుకు సంబంధించిన ఇన్వాయిస్ కాపీ కూడా ఉంచుకోవాలి. మరొకరి నుంచి మార్చుకున్నా అసలు ఇన్వాయిస్‌తో పాటు, ఎక్స్ఛేంజ్ ఇన్వాయిస్ కాపీ దగ్గర ఉండాలి.
- బంగారం, ఆభరణాలు వారసత్వంగా పొంది ఉంటే అందుకు సంబంధించిన వీలునామా పత్రం ఉండాలి. వీలునామా ద్వారా మీకు బంగారం, ఆభరణాలు బదిలీ చేసిన వ్యక్తి వెల్త్ టాక్స్ చెల్లింపుదారుడైతే మరింత మంచిది.
- ప్రస్తుతం మన దేశంలో సంపద పన్ను లేదు. అయినా బంగారం సహా మీ సంపద విలువ రూ.30 లక్షలు దాటితే మార్చి 31, 2015 నాటికి ఆ విషయాన్ని మీ ఆదాయ పన్ను రిటర్న్‌లో పేర్కొని ఉండాలి. సోదాల సమయంలో ఐటి అధికారులు అడిగినా ఆ వివరాలు అందజేయవచ్చు. అలాంటి సమాచారం అందజేస్తే అధికారులు వాటిని స్వాధీనం చేసుకోరు.



ఆదాయ మార్గాలు చెప్పలేకపోతే ?

బంగారం, ఆభరణాల కొనుగోలుకు సంబంధించిన ఆదాయ మార్గాలు చెప్పలేకపోతే ఐటి అధికారులు వాటిని స్వాధీనం చేసుకుంటారు. అయితే ఆదాయ వనరులు చెప్పలేకపోయినా ఈ పరిమితులకు లోబడి ఉన్న బంగారం, ఆభరణాలను ఐటి అధికారులు స్వాధీనం చేసుకోరు.

- వివాహిత స్త్రీల వద్ద 500 గ్రాముల వరకు ఉండవచ్చు.
- వివాహం కాని స్త్రీల వద్ద 250 గ్రాముల వరకు అనుమతిస్తారు.
- కుటుంబంలోని పురుషుల వద్ద 100 గ్రాముల వరకు ఉండవచ్చు.
- ఈ పరిమితులు కొనుగోలు చేసిన, వారసత్వంగా వచ్చిన రెండింటికి కలిపి వర్తిస్తాయి. ఈ విషయాన్ని బలపరిచే డాక్యుమెంటరీ సాక్ష్యాధారాలు లేకపోయినా ఈ పరిమితికి లోబడిన ఆభరణాలను ఐటి అధికారులు స్వాధీనం చేసుకోరు.
- అయితే ఈ మినహాయింపు బంగారు నాణేలు, కడ్డీలకు వర్తించదు. ఇవి పైన పేర్కొన్న పరిమితులకు లోబడి ఉన్నా ఐటి అధికారులు స్వాధీనం చేసుకుంటారు.
- ఎవరో బంధుమిత్రుల బంగారాన్ని మన దగ్గర ఉంచుకున్నా పైన పేర్కొన్న పరిమితులు వర్తించవు.
- మీరు కొన్న లేదా మీకు వారసత్వంగా బంగారం లేదా ఆభరణాలు ఆయా పరిమితులకు మించి ఉండి, అందుకు సంబంధించిన ఆధారాలు లేకపోయినా, ఐటి అధికారులకు సంతృప్తికరంగా సమాధానం చెప్పినా స్వాధీనం చేసుకోరు.

ఈ లెక్కన నలుగురు సభ్యులున్న కుటుంబ సభ్యుల దగ్గర ఎలాంటి లెక్కా పత్రం లేకుండా 950 గ్రాముల బంగారం, ఆభరణాలు ఉన్నా ఐటి అధికారులు స్వాధీనం చేసుకోకుండా తప్పించుకోవచ్చు. అదెలాగంటే.....



కుటుంబ సభ్యులు	ఉండదగిన బంగారం (గ్రాముల్లో)
వివాహిత	500
వివాహం కాని స్త్రీ	250
వివాహితుడు	100
వివాహం కాని పురుషుడు	100
మొత్తం	950



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వ్యక్తిగత ఆదాయ పన్ను ప్లాన్ పూర్తయిందా? లేకపోతే వెంటనే ఆ పని పూర్తి చేయండి. వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు ముఖ్యంగా వేతన జీవుల ముందున్న పన్ను ఆదా పెట్టుబడి మార్గాలను 'బిజినెస్ ప్లస్' పాఠకులకు చార్టర్డ్ అకౌంటెంట్ జిసి రెడ్డి వివరిస్తున్నారు.



పన్ను ప్లానింగ్‌కు రెడీ అయ్యారా !

మార్చి నెల దగ్గర పడుతోంది. ఇతర వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటి) చెల్లింపుదారుల మాదిరిగానే వేతన జీవులూ, తమ వార్షిక ఆదాయ వివరాలు సరిచూసుకుని, అందుకు అనుగుణంగా ఐటి రిటర్న్‌లు ఫైల్ చేసేందుకు సిద్ధం కావలసిన సమయమిది. ఐటి చట్టం అనుమతించిన మినహాయింపులతోపాటు పొదుపు పథకాల్లో మదుపు చేసి లేదా ఇతర మార్గాల్లో పన్ను పోటును తగ్గించుకోవచ్చు. వేతన జీవులు తమ పన్ను భారం తగ్గించుకునేందుకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 10, సెక్షన్ 16, చాప్టర్ 6ఎ కింద మూడు మార్గాలు ఉన్నాయి. ఈ సెక్షన్లు, చాప్టర్ ప్రకారం కొన్ని రకాల ఆదాయాలను, ఖర్చులను మొత్తం ఆదాయం నుంచి మినహాయించుకుని పన్ను భారం తగ్గించుకోవచ్చు.

పెట్టుబడుల ఎంపిక

పన్ను ఆదా కోసం అనేక పెట్టుబడి పథకాలు (మార్గాలు) అందుబాటులో ఉన్నాయి. అయితే ఎవరికి వారు తమ అవసరాలు, ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా ఈ పథకాలను ఎంచుకోవాలి. కొత్తగా ఉద్యోగంలో చేరిన యువకులకు కొద్దిగా రిస్కు ఉన్నా మ్యూచువల్ ఫండ్ సంస్థలు అందించే ఇఎల్ఎస్ఎస్ పథకాలు మంచి ఎంపిక కావచ్చు. రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్న ఉద్యోగులకు అసలుకు ఢోకా లేకుండా స్థిరమైన ఆదాయాన్ని ఇచ్చే టాక్స్ సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు లేదా పిపిఎఫ్ మంచి ఎంపికవుతాయి. కాకపోతే పెట్టుబడులను ఎంచుకునే ముందే వాటి లాభ, నష్టాలు బేరీజు వేసుకోవడం మంచిది.

ఆదాయ పన్ను భారం తగ్గించుకునేందుకు అందుబాటులో ఉన్న కొన్ని ముఖ్యమైన పొదుపు పథకాల గురించి చర్చిద్దాం.

ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు (ఇఎల్ఎస్ఎస్)

నష్ట భయం ఎక్కువగా ఉండే ఈ పథకాల్లో రాబడులు స్టాక్ మార్కెట్ తీరుతెన్నులపై ఆధారపడి ఉంటాయి. ఈ పథకాల్లో పెట్టే పెట్టుబడులను కనీసం మూడేళ్ల వరకు కదిలించేందుకు వీలవదు. రిస్కుకు సిద్ధపడే వారికి ఈ పథకాలు బాగా సూటవుతాయి.

పిపిఎఫ్

ఇందులో పెట్టుబడులకు ఏ మాత్రం రిస్కు ఉండదు. స్థిరంగా ఒక మాదిరి రాబడులు ఆశించవచ్చు. ఈ పథకం కాల పరిమితి 15 సంవత్సరాలు. ఏడేళ్ల తర్వాత కొన్ని నిబంధనలకు లోబడి కొంత మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. పన్ను ఆదా కోసం వేతన జీవులకు పిపిఎఫ్ బాగానే సరిపోతుంది.

చాప్టర్ 6ఎ ముఖ్యాంశాలు

- సెక్షన్ 80సి, 80సిసిసి మరియు 80సిసిడి కింద అనుమతించిన పథకాల్లో పొదుపు చేసుకోవడం
- సెక్షన్ 80డి కింద ఆరోగ్య బీమా పథకాల కోసం ఏటా చెల్లించే ప్రీమియంలో రూ.25,000 వరకు మినహాయింపు. సీనియర్ సిటిజన్లయితే రూ.30,000 వరకు మినహాయింపు
- బ్యాంకు, పోస్టాఫీసు పొదుపు ఖాతాల డిపాజిట్లపై వచ్చిన వడ్డీ ఆదాయంలో రూ.10,000 వరకు సెక్షన్ 80టిటిఎ కింద స్థూల ఆదాయం నుంచి మినహాయింప
- మూడు సెక్షన్ల కింద ఈ కింది పథకాల్లో ఏటా రూ.1.5 లక్షల వరకు మదుపు చేయవచ్చు. ఈ మొత్తాన్ని మొత్తం ఆదాయం నుంచి మినహాయించడం ద్వారా పన్ను ఆదా చేసుకోవచ్చు. ఆ పెట్టుబడుల వివరాలు....
- జీవిత బీమా పాలసీలపై చెల్లించే ప్రీమియం
- యాన్యుటీ పథకాల్లో పెట్టుబడులు
- చట్టబద్ధమైన, గుర్తింపు పొందిన పిఎఫ్ పథకాల్లో పెట్టే పెట్టుబడులు
- 15 సంవత్సరాల కాల పరిమితి ఉండే పిపిఎఫ్
- నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్స్
- ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు(ఇఎల్ఎస్ఎస్)
- మ్యూచువల్ ఫండ్స్‌కు చెందిన నోటిఫైడ్ యూనిట్లు
- యుటిఐ లేదా మ్యూచువల్ ఫండ్ సంస్థలు నిర్వహించే నోటిఫైడ్ పెన్షన్ ఫండ్లు
- యుటిఐకి చెందిన రిటైర్‌మెంట్ బెనిఫిట్ యూనిట్ పథకం. కొఠారి పయోనీర్ పెన్షన్ ప్లాన్. రిలయన్స్ రిటైర్‌మెంట్ ఫండ్ వంటి పథకాలు
- స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీల్లో పిల్లల చదువుల కోసం చెల్లించే ట్యూషన్ ఫీజు. ఇది ఇద్దరు పిల్లలకు మాత్రమే పరిమితం. చదివే కోర్సు తప్పనిసరిగా ఫుల్ టైమ్ కోర్సు అయి ఉండాలి.
- గృహ రుణ అసలు చెల్లింపునకు కూడా సెక్షన్ 80 సి కింద రూ.1.5 లక్షల వరకు మినహాయింపు లభిస్తుంది.

ఇపిఎఫ్

సంఘటిత రంగంలో పని చేసే ప్రతి ఉద్యోగికి యాజమాన్యం ద్వారా ఉద్యోగుల భవిష్య నిధి (ఇపిఎఫ్) సదుపాయం లభిస్తుంది. ఉద్యోగంలో చేరిన దగ్గరి నుంచి పదవీ విరమణ వరకు ఈ పథకం కొనసాగుతుంది. ప్రతి నెలా ఉద్యోగి జీతం నుంచి కొంత మొత్తం ఇపిఎఫ్‌లో జమవుతుంది. యాజమాన్యం కూడా తన వాటా కింద కొంత జమ చేస్తుంది. ఈ పథకం ద్వారా కచ్చితమైన మధ్యసమైన రాబడులు ఆశించవచ్చు.

ఎన్ఎస్ఎస్

నేషనల్ సేవింగ్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) పెట్టుబడుల్లోనూ రిస్కు తక్కువ. ఈ పథకం కాల పరిమితి ఐదేళ్లు. రాబడులు మధ్యస్థంగా ఉన్నా ఖచ్చితమైన రాబడులు ఆశించవచ్చు.

యులిప్స్

ఈ పథకాల్లో ఇన్వెస్ట్ చేశాక ఐదేళ్ల వరకు వెనక్కి తీసుకునే అవకాశం లేదు. రాబడులు మధ్యస్థంగా ఉన్నా ఖచ్చితంగా ఉంటాయి. రిస్కు ఎక్కువగా ఉండే ఈ పథకాల్లో పెట్టుబడులు యుక్త వయసులో ఉన్న ఉద్యోగులకు బాగుంటాయి.

సుకన్య సమృద్ధి యోజన పథకం

బాలికల తల్లిదండ్రులు ఈ పథకాని ్న ఎంచుకోవచ్చు. రాబడులు మధ్యస్థంగా ఉంటాయి. పెట్టుబడులకు పెద్దగా రిస్కు కూడా ఉండదు. పుట్టిన దగ్గరి నుంచి 10 సంవత్సరాల వయసు వరకు ఉన్న బాలికల పేరు మీద ఈ ఖాతా ప్రారంభించవచ్చు. ఖాతా ప్రారంభించాక 21 సంవత్సరాల వరకు లేదా ఆమెకు 18 ఏళ్లు నిండాక వివాహం అయ్యే వరకు కొనసాగించవచ్చు. బాలికకు 18 సంవత్సరాలు నిండాక ఉన్నత విద్య కోసం అప్పటి వరకు ఆమె ఖాతాలో పోగైన మొత్తం నుంచి 50 శాతం వెనక్కి తీసుకోవచ్చు.

నేషనల్ పెన్షన్ స్కీమ్

ఈ పథకంలోనూ పెట్టుబడుల భయం తక్కువ. రాబడులు మధ్యస్థంగా ఉన్నా ఖచ్చితంగా ఉంటాయి. సెక్షన్ 80సిసిడి (1బి) కింద ఈ పథకంలో పెట్టుబడుల ద్వారా మరో రూ.50,000కు అదనంగా పన్ను మినహాయింపు పొందవచ్చు. పదవీ విరమణ వరకు ఈ పథకంలో పెట్టుబడులు కొనసాగించవచ్చు.

ఆరోగ్య బీమా

ఆరోగ్య బీమా పాలసీ కోసం చెల్లించే ప్రీమియంలో ఏటా రూ.25,000 వరకు మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ పాలసీ పన్ను చెల్లింపుదారుతోపాటు జీవిత భాగస్వామి, పిల్లలకు మాత్రమే వర్తిస్తుంది. పన్ను చెల్లింపుదారు వయసు 60 సంవత్సరాలు మించితే రూ.30,000 వరకు ప్రీమియంను మినహాయింపు కింద క్లెయిమ్ చేసుకోవచ్చు. తల్లిదండ్రుల కోసం కూడా ఆరోగ్య బీమా పాలసీ తీసుకుంటే మరో రూ.25,000 వరకు తగ్గింపు క్లెయిమ్ చేసుకోవచ్చు.

ఎల్జీ ఎక్విప్‌మెంట్స్



టెక్నికల్స్

ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలు ప్రకటించిన నేపథ్యంలో ఈ షేరులో ఏడు వారాల ఫ్లాట్ బేస్ ప్యాట్రన్ జరిగింది. దీనికి తోడుగా అప్‌వార్డ్ చానల్ బ్రేకౌట్ తర్వాత గత ఏడు వారాలు చానల్‌కు ఎగువనే ట్రేడవుతోంది. చానల్ ఏర్పడటానికి ముందు దాదాపు 22 నెలల పాటు రెక్టాంగిల్ బ్రేకౌట్ జరిగి దాదాపు వంద శాతం రాబడిని గత ఏడాదిన్న కాలంలో ఇచ్చింది. స్వల్ప, దీర్ఘకాలిక సగటులకు ఎగువన ట్రేడవుతోంది. ఆర్ఎస్ఐ వంటి లీడింగ్ ఇండికేటర్ 50 స్థాయిలో బేస్‌ను ఏర్పరిచి బుల్లిష్ జోన్ గత ఏడాది కాలంగా ఉంది. విలియం ఓ నీల్ రిలేటివ్ ప్రైస్ స్ట్రెంత్ కూడా పటిష్ఠంగా 82గా ఉంది. వచ్చే వారం కూడా రూ.325 స్థాయికి ఎగువన ట్రేడవుతూ ఉంటే కొనుగోలు చేయవచ్చు. గత వారం నమోదైన కనీస స్థాయి రూ.267ను స్టాప్‌లాస్‌గా పాటించాలి. స్వల్పకాలిక లక్ష్యం రూ.380. మార్కెట్ కరెక్షన్‌కు లోనయ్యే అవకాశం ఉంది కాబట్టి వచ్చే రెండు నుంచి మూడేళ్ల కాలపరిమితికి ప్రతి పతనంలోనూ కొనుగోలు చేస్తూ అక్యుములేట్ చేయవచ్చు. వచ్చే మూడేళ్లలో లక్ష్యం రూ.750.

ఎయిర్ కంప్రెసర్స్‌ను తయారు చేస్తున్న అగ్రగామి కంపెనీ ఇది. ఆయిల్ లూబ్రికేటెడ్ నుంచి ఆయిల్ ఫ్రీ రోటరీ స్క్రూ కంప్రెసర్లు, డ్రైయర్స్, ఫిల్టర్స్, డౌన్‌స్ట్రీమ్ పరికరాల తయారీ వరకు పూర్తి శ్రేణి కంప్రెస్డ్ ఎయిర్ సొల్యూషన్స్‌ను అందిస్తోంది. ప్రపంచంలో రెండో అతిపెద్ద కంప్రెసర్ కంపెనీగా ఎదిగేందుకు వచ్చే పదేళ్లలో రూ.5,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళికలను సిద్ధం చేసుకుంది. వచ్చే మూడేళ్లలోనే రూ.3,000 కోట్లను పెట్టుబడిగా పెట్టాలని భావిస్తోంది. ఆస్ట్రేలియా, బ్రెజిల్, చైనా, ఇటలీ, అమెరికా, అరబ్ ఎమిరేట్స్‌లో సబ్సిడరీ కంపెనీలున్నాయి. ఇందులో అన్ని సబ్సిడరీలు లాభాలను ఆర్జిస్తున్నాయి. బ్రెజిల్ యూనిట్ నష్టాల నుంచి బయటపడింది. ఈ ఏడాది దేశీయ మార్కెట్లోకి ఆయిల్ ఫ్రీ కంప్రెసర్లను ప్రవేశపెట్టిన తర్వాత వచ్చే ఏడాది అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశ పెట్టాలని యోచిస్తోంది. సెంట్రిఫుగల్ కంప్రెసర్లను అభివృద్ధి పరిచిన కంపెనీ ప్రస్తుతం వాటిని పరీక్షిస్తోంది. వీటిని కూడా వచ్చే ఏడాది మార్కెట్లోకి ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ప్రస్తుతం కంపెనీ అవలంబిస్తున్న వ్యూహంతో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ వృద్ధిని అందిపుచ్చుకుంటోంది. దీనికి తోడుగా వ్యయాలను తగ్గించుకోవాలని భావిస్తోంది.



చైనాలో ఎదురవుతున్న నిర్వహణ సమస్యల కారణంగా అక్కడి కార్యకలాపాలను తగ్గించుకుంటోంది. బ్రెజిల్ యూనిట్ టర్న్ అరౌండ్ దిశగా నడిపించింది. మొత్తం 70 దేశాల్లో మార్కెటింగ్ నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. ప్రస్తుతం దాదాపు సగం రెవెన్యూ అంతర్జాతీయ మార్కెట్ల నుంచే వస్తోంది. గత ఎనిమిదేళ్లుగా సగటున 14.3 శాతం సిఎజిఆర్‌ను సాధిస్తోంది. దీన్ని రెట్టింపు చేయాలన్న ధ్యేయంతో ఉంది. కాగా కంపెనీ ఆటోమోటివ్ డివిజన్ గత మూడు నెలల కాలంలో 24 శాతం వృద్ధిని సాధించింది. మొత్తం రాబడిలో 89 శాతం కంప్రెసర్ల నుంచి, 11 శాతం ఆటో విడిభాగాల ద్వారా వస్తోంది. కాగా కంప్రెసర్ల ఆదాయం ఎక్కువగా కన్‌స్ట్రక్షన్ మైనింగ్ నుంచి గరిష్ఠంగా వచ్చింది. లాభాల్లో 27.47 శాతాన్ని డివిడెండ్ల రూపేణా ఇన్వెస్టర్లకు అందిస్తోంది.

ఫండమెంటల్స్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తృతీయ త్రైమాసికంలో అమ్మకాలు రూ.218 కోట్ల నుంచి రూ.268 కోట్లకు పెరగగా నికర లాభం రూ.13.3 కోట్ల నుంచి 19.4 కోట్లకు పెరిగాయి. దేశీయ మార్కెట్లో అమ్మకాలు 21 శాతం పెరిగాయి. స్థూల లాభ మార్జిన్లు 1.07 శాతం పెరిగి 11 శాతానికి చేరుకున్నాయి. ముడి సరుకుల ధరలు తగ్గటంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో అమ్మకాలు సగటున 25 శాతం పెరుగుతున్నందున వచ్చే త్రైమాసికంలో స్థూల లాభ మార్జిన్లు 16 శాతానికి చేరుకుంటాయని అంచనా. 2019-20 సంవత్సరానికి స్థూల లాభ మార్జిన్లు 17.1 శాతంగా ఉంటాయని అంచనా. ఇపిఎస్ 28 శాతం మేర పెరగగా, రిటర్న్ ఆన్ ఈక్విటీ 17.1 శాతంగా ఉంది. పటిష్ఠమైన ఫలితాల నేపథ్యంలో ఇపిఎస్ స్ట్రెంత్ 91గా ఉంది. అలాగే అక్యుములేషన్ భారీగా జరుగుతోంది. మొత్తం సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 27.82 శాతంగా ఉంది. డిసెంబరు నాటికి ఈ షేరులో మదుపు చేసిన ఎఫ్ఐఐల సంఖ్య 1 నుంచి 53 కు పెరిగింది. మొత్తం 16 మ్యూచువల్ ఫండ్స్ ఇందులో మదుపు చేశాయి. ఎఫ్ఐఐలకు 15.69 శాతం వాటా ఉండగా, మ్యూచువల్ ఫండ్లకు 11.77 శాతం వాటా ఉంది. క్యాన్‌స్లిమ్‌లోని దాదాపు అన్ని అంశాలు ఇందులో ఉన్నాయి.

- టి బ్రహ్మాచారి
హెడ్, అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ మార్కెట్ ఎనలిస్ట్,
హైదరాబాద్ చాప్టర్ tbchary@gmail.com

గమనిక : ఈ శీర్షికలో అందించే రికమండేషన్ల ఆధారంగా జరిపే లావాదేవీలకు ఇన్వెస్టర్లదే పూర్తి బాధ్యత. వారి లాభనష్టాలకు ఆంధ్రజ్యోతి పత్రిక, కాలమిస్ట్ ఎలాంటి బాధ్యత వహించరు. లావాదేవీలు చేపట్టే ముందు మీ వ్యక్తిగత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ సలహా తీసుకోండి.

పంపిన సరుకు వెనక్కు వస్తే ?


గొండాల రాంబాబు

ఏ వ్యాపారంలోనైనా కొన్ని సందర్భాఆల్లో సరుకు వెనక్కు రావటం అనేది సర్వ సాధారణమైన విషయం. దీనికి కారణాలు అనేకం. ఆర్డర్ ఇచ్చిన వస్తువుకు, పంపిన వస్తువుకు వ్యత్యాసం ఉండొచ్చు లేదా పంపిన వస్తువుల నాణ్యతలో తేడాలు ఉండొచ్చు. ఏది ఏమైనా ఒకసారి పంపిన సరుకు ఆ వ్యాపారికి వెనక్కి వచ్చినపుడు దానిని వస్తుసేవల పన్ను (జిఎస్‌టి)లో ఎలా చూపించాలి అనేది అనేక మందికి వచ్చే సందేహం. ఇందులో రెండు రకాలు ఉన్నాయి. మొదటిది సరుకు జిఎస్‌టి అమలులోకి రావటానికి ముందు పంపి వెనక్కు రావటం మాత్రం జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత రావటం, అలాగే సరుకు పంపటం, తిరిగి వెనక్కి పొందటం రెండూ జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత జరగటం.

మొదటి దానిలో ఏదైనా ఒక వస్తువును ఒక వ్యాపారి జూలై 1 కంటే ముందు విక్రయించాడనుకుందాం. దానికి సంబంధించి కట్టాల్సిన వ్యాట్, సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ లేదా సర్వీస్ టాక్స్ మొదలైనవి సరుకు అమ్మకం జరిపే సమయంలో కట్టి పంపాడు. ఈ వస్తువు వాపస్ వచ్చింది మాత్రం జూలై 1 తర్వాత అంటే జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత అనుకుంటే, ఆ సరుకు వెనక్కు పంపిన వ్యక్తి జిఎస్‌టి కింద రిజిస్ట్రేషన్ పొంది ఉంటే దానిని సరఫరాగా భావించి దాని మీద జిఎస్‌టి కట్టి వెనక్కు పంపాలి. అలాగే దానిని పొందిన అసలు వ్యాపారి దానిని ఇన్‌పుట్ కింద భావించి దాని మీద ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకోవచ్చు. ఒకవేళ వెనక్కు పంపిన వ్యక్తికి రిజిస్ట్రేషన్ లేకుంటే సరుకు పంపిన వ్యాపారి దానికి సంబంధించి కట్టిన వ్యాట్ లేదా సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ మొదలైనవి రిఫండ్ తీసుకోవచ్చు. అయితే ఆయా వస్తువులు జనవరి 1, 2017 నుంచి జూన్ 30 తేదీ మధ్య డెలివరీ చేసి ఉండాలి. అలాగే తిరిగి రావటం కూడా జూలై 1 నుంచి డిసెంబరు 31వ తేదీ మధ్య వచ్చి ఉండాలి.

ఇక రెండో విషయానికి వస్తే వస్తువులు పంపటం, తిరిగి రావటం రెండూ జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత అయినట్లయితే, ఆ సరుకు తొలుత పంపిన వ్యాపారి వాపస్ వచ్చిన మేర కొనుగోలుదారునికి క్రెడిట్ నోట్స్ ఇవ్వాల్సి ఉంటుంది (వాపస్ పంపే వ్యక్తికి రిజిస్ట్రేషన్ ఉండి ఉంటే). అట్టి వివరాలను జిఎస్‌టిఆర్ 1 రిటర్న్‌లో చూపాలి. ఒకవేళ వాపసు పంపే వ్యక్తికి రిజిస్ట్రేషన్ లేకుంటే ఏ నెలలో అయితే సరుకు వాపస్ అయ్యిందో ఆ నెలకు సంబంధించిన జిఎస్‌టిఆర్ 1 రిటర్న్‌లో వెనక్కు వచ్చిన సరుకు వివరాలు నింపటం ద్వారా ఆ నెలకు సంబంధించి కట్టాల్సిన టాక్స్ నుంచి ఆ మేర మినహాయింపు పొందవచ్చు.

ఇదీ జీఎస్‌టీ

జిఎస్‌టికి సంబంధించిన వీడియోలను https://goo.gl/bzX8s1 ద్వారా వీక్షించవచ్చు.

గమనిక : ఈ వ్యాసాల ద్వారా ఇస్తున్న సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. పాఠకులు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత చట్టాలు/నిబంధనలను కూలంకషంగా పరిశీలించాలి.



ఏపీకి న్యాయం చేయాలని కోరుతూ కెనడాలో ప్రవాసాంధ్రుల నిరసన


విజయవాడలో ఐటీ నిపుణుల ఆందోళన



చెన్నైలో ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు

కేంద్రాన్ని అడుక్కోవాలా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్రానికి సాయం చేయకుండా జాప్యం చేసేందుకు జాతీయ స్థాయిలో ఆ పార్టీ ఎత్తులు వేస్తుండగా.. రాష్ట్రస్థాయిలో బీజేపీ అసంబద్ధమైన అంకెలను చెబుతోందని ఆరోపించారు. 'జాతీయ రహదారులకు రూ.లక్ష కోట్లు ఇచ్చారా? మూడేళ్లలో ఇచ్చింది రూ.5,900 కోట్లు. అదీ మొత్తంగా కేంద్రం జేబులో నుంచి కాదు. పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) ప్రాజెక్టులు, టోల్ రోడ్ల రూపంలోనే! అలాంటి జాతీయ రహదారుల ప్రాజెక్టులు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర.. ఇలా ప్రతి రాష్ట్రానికీ ఇచ్చారు. ఇళ్ల కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద రూ.7,952 కోట్లు ఇచ్చామన్నారు. మూడేళ్లలో ఇచ్చింది రూ.1038 కోట్లే. పైగా పీఎంఏవై రిందదేశం మొత్తానికీ ఇచ్చారు. అవన్నీ మన రాష్ట్రానికే ఇచ్చినట్లు చెబుతున్నారు. నష్టపోయిన రాష్ట్రానికి ఇస్తామన్న ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చారా? ప్రత్యేక హోదాతో సమానంగా అన్నీ చేస్తామన్న ఆ ప్యాకేజీలో రావలసింది రూ.16,447కోట్లు కాగా.. ఇచ్చింది రూ.400 కోట్లు. పునర్విభజన చట్టంలో ఉన్న 19 హామీలు, నాటి ప్రధాని ఇచ్చిన ఆరు హామీలు అమలు చేశారా? టీడీపీ ఎంపీలు అడిగేది న్యాయ సమ్మతమైనదేనని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, శివసేన, టీఆర్ఎస్, అకాలీదళ్, ఎన్‌సీపీ.. ఇలా అన్ని పార్టీల ఎంపీలు పార్లమెంటు లోపల, బయట రాజకీయాలకు అతీతంగా చెప్పారు. కేంద్రం, ప్రధాని మోదీ ఏపీకి న్యాయం చేయాల్సిందేనన్నారు. కొందరు బీజేపీ ఎంపీలూ చెబుతున్నారు. ఏపీకి జరిగిన అన్యాయం ఇప్పుడు జాతీయ అంశంగా మారింది. బీజేపీని మనం నమ్మగలమా.. మనల్నీ ఇలాగే మోసం చేస్తుందేమోనని అన్ని పార్టీలూ సందేహిస్తున్నాయి' అని తెలిపారు. బీజేపీ నివేదిక సినిమా స్క్రిప్టులా ఉందన్నారు. 'ఎన్‌సీఈఆర్‌టీ రాష్ట్రానికి వచ్చిందని, నెల్లూరులో ఏర్పాటుచేశామని చెప్పారు. ఆ కేంద్రాన్ని ఎప్పుడైనా.. ఎక్కడైనా చూశారా? రాష్ట్రానికి న్యాయం చేశామని ప్రగల్భాలు పలకొద్దు. నిజంగా న్యాయం చేసి ప్రజల విశ్వాసాన్ని పొందండి' అని హితవు పలికారు.

ఆ ఐదూ వదిలేశారు: గల్లా

అమరావతి, పోలవరం, రెవెన్యూ లోటు, ప్రత్యేక ప్యాకేజీ, రైల్వేజోన్‌పై బీజేపీ నేతలు మాట్లాడడం లేదని, ముఖ్యమైన ఈ ఐదు అంశాలను వదిలేసి మిగతావన్నీ చెబుతున్నారని జయదేవ్ అన్నారు. 'అమరావతి నిర్మాణానికి రూ.1.3 లక్షల కోట్లు అవుతుందని అంచనా. అందులో రూ.48 వేల కోట్లు అసెంబ్లీ, సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, రాజ్‌భవన్ తదితరాలతో పాటు మౌలిక వసతుల కల్పనకు ఖర్చవుతుంది. ఇందులో ఇప్పటివరకు రూ.2,500 కోట్లు ఇచ్చామంటున్నారు. ఇంకో రూ.1000 కోట్లే ఇస్తామంటున్నారు. గుంటూరులో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికే రూ.1000 కోట్లయితే.. రాజధానికి కేంద్రం ఇచ్చేది రూ.3,500 కోట్లేనా? పోలవరం జాతీయ ప్రాజెక్టు.. మేమే పూర్తి చేస్తామన్నారు. భూసేకరణ, పునరావాసానికి రూ.33 వేల కోట్లు ఇస్తామని ఇవ్వలేదు. ఇంతవరకూ రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఖర్చూ వెనక్కివ్వలేదు. దుగరాజపట్నం పోర్టుకు ప్రత్యామ్నాయం చూపాలన్నారు. రామాయపట్నంలో పోర్టు పెట్టాలని ఎప్పుడో చెప్పాం. అయినా ఏం చేశారు? కడప ఉక్కు కర్మాగారం సాధ్యం కాదన్న నివేదిక ఎప్పుడొచ్చింది? ఇప్పుడే వచ్చిందా? ఏళ్లతరబడి ఆలోచిస్తూనే ఉంటారా? రైల్వే మంత్రి మాటలను బట్టి రైల్వే జోన్ రాదని తెలుస్తోంది. బుందేల్‌ఖండ్‌కు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కింద రూ.6 వేల కోట్లు ఇచ్చారు. ఏపీలోని ఏడు జిల్లాలకు మూడేళ్ల కాలానికి రూ.1050 కోట్లే ఇచ్చారు. దేశంలో ఒక రాష్ట్రంగా ఏపీకి ఇచ్చినవాటిని చెబితే ఎలా? ఆ సాయమైనా ఊరికే ఇచ్చేదా.. దానమా? ప్రతిసారీ కేంద్రాన్ని అడుక్కోవాలా? భిక్షాపాత్ర పట్టుకుని వెళ్లాలా? న్యాయబద్ధంగా.. దేశంలో భాగంగా ఉన్నందుకు రావలసినవి కూడా అడుక్కోవాలా? ఏమనుకుంటున్నారు అసలు' అని నిలదీశారు.



ఇంకొన్ని రోజులు వేచిచూస్తాం

కేంద్రం చేస్తుందనే విశ్వాసం ఉందా.. ఎంతకాలం వేచిచూస్తారని విలేకరులు అడుగగా.. 'ఇప్పటివరకూ చూశాం. ఇంకొన్ని రోజులు చూస్తాం' అని రామ్మోహన్‌నాయుడు బదులిచ్చారు. మార్చి 5 నుంచి రెండో విడత బడ్జెట్ సమావేశాలు మొదలవుతాయని.. అప్పుడు కేంద్రం ఆర్థిక బిల్లును ప్రవేశపెడుతుందని జయదేవ్ అన్నారు. ఆ బిల్లులో మార్పులు జరిగితేనే కేంద్రాన్ని నమ్మగలమని చెప్పారు. రాష్ట్రానికి రావలసిన వాటిపై స్పష్టంగా కార్యాచరణ ప్రణాళిక ప్రకటించేదాకా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

కుట్రలు వైసీపీవే: రామ్మోహన్

ఉత్తరాంధ్ర ప్రజలు రైల్వేజోన్ కోసం చాలా కాలం నుంచి పోరాటం చేస్తున్నారని, తాము 100 సార్లు తిరిగామని.. బీజేపీ నివేదికలో ఆ ప్రస్తావన ఉందా అని రామ్మోహన్‌నాయుడు ప్రశ్నించారు. 'రాష్ట్ర ప్రజలంతా కేంద్ర బడ్జెట్‌ను నిరాకరించారు. కేంద్ర వైఖరికి నిరసనగా లక్ష పోస్టుకార్డులు ప్రధానికి పంపిస్తామని విజయవాడలో విద్యార్థులు ముందుకొచ్చారు. టీడీపీ ఏదో కుట్ర పన్నుతోందని జగన్ పత్రికలో రాశారు. మిత్రపక్షమని చూడకుండా పార్లమెంటులో పోరాటం చేయడం కుట్రా? నిలదీసి అడగడం కుట్రా? కుట్రలు వైసీపీవే. ఢిల్లీలో బడ్జెట్ బాగుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. ఇక్కడేమో ఎంపీలు రాజీనామాలు చేస్తారన్నారు. అక్కడేమో ప్రధాని చుట్టూ ఆ పార్టీ ఎంపీలే కనిపిస్తున్నారు. సోదర తెలంగాణ ఎంపీలు కూడా ఏపీకి న్యాయం చేయాలన్నారు. వైసీపీ ఎంపీలు మాత్రం మాట్లాడలేదు' అని ధ్వజమెత్తారు. కర్ణాటక మెట్రోకు రూ.17 వేల కోట్లు, మహారాష్ట్రకు వేల కోట్లు కేటాయించి విజయవాడ, విశాఖపట్నం మెట్రోలకు ఏమీ ఇవ్వరా అని ప్రశ్నించారు. 'ఆంధ్ర గుర్తుకురాదా? ప్రపంచంలో అత్యుత్తమ రాజధాని నిర్మించుకోవాలని ఆంధ్రులు కలలు కనకూడదా? ఢిల్లీని తలదన్నే రాజధానికి సాయం చేస్తామని మోదీయే ప్రకటించారు. ఆకలేసినప్పుడే అన్నం పెట్టాలి. అలా కాకుండా చేస్తాం చూస్తామంటే ఎంతకాలం? కేంద్రంపై ఒత్తిడికి ప్రతి ఒక్కరూ కలిసిరావాలి. జాతీయస్థాయి విద్యాసంస్థల ఏర్పాటుకు రాష్ట్రం రూ.12వేల కోట్ల విలువైన భూములిచ్చింది. ఆ సంస్థలకు మౌలిక సదుపాయాల కల్పనకే రూ.11 వేల కోట్లు అవుతుంది. కానీ కేంద్రం ఇప్పటివరకూ ఇచ్చింది కేవలం రూ.450 కోట్లు. భవనాలకు నిధులిచ్చే బాధ్యత కేంద్రానిది కాదా' అని ప్రశ్నించారు.

లోటుపై వైవీ రెడ్డి కమిటీ: కుటుంబరావు

2014-15 నాటికి రాష్ట్ర రెవెన్యూ లోటు రూ.22 వేల కోట్లు అని, దీనిని ఐదేళ్లలో భర్తీచేయాలని 14వ ఆర్థికసంఘం పేర్కొందని కుటుంబరావు తెలిపారు. రెవెన్యూ లోటు ఎంతో తేల్చేందుకు కావాలంటే 14వ ఆర్థిక సంఘం చైర్మన్‌గా పనిచేసిన వై.వి.రెడ్డితోనే ఒక కమిటీ వేయాలన్నారు. 2014-15 నుంచి ఏపీకి ఏం చేశారో లెక్కలు, ఫైళ్లు ఉన్నాయన్నారు. కాగా, కేంద్రం మిగతా రాష్ట్రాలకు చేసినట్లే ఏపీకి చేసిందని, దాన్నేదో ప్రత్యేకంగా చేసినట్లు బీజేపీ చెప్తోందని కళావెంకట్రావు ఆక్షేపించారు.

ఏపీ వాక్ ఫర్ జస్టిస్!

- నవ్యాంధ్రకు న్యాయం చేయాల్సిందే
- టీడీపీ సోషల్ మీడియా ఫోరం డిమాండ్

విజయవాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విభజన చట్టం ప్రకారం నవ్యాంధ్రకు న్యాయం చేయడంతో, కేంద్రం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా ఫోరం విజయవాడలో ఆదివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. బెంగళూరు, చెన్నైతోపాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఫోరం సభ్యులు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి 'ఏపీ వాక్ ఫర్ జస్టిస్' పేరుతో నడక ప్రదర్శన చేశారు. ఏపీకి న్యాయం చేయాలని రాసిన బ్యానర్లు, ప్లకార్డులను ప్రదర్శించారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. టీడీపీ బెంగళూరు సోషల్ మీడియా ఫోరం అధ్యక్షుడు వీరా కనకమేడల తదితరులు పాల్గొన్నారు.

కెనడాలో ప్రవాసాంధ్రుల నిరసన

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కెనడాలో ప్రవాసాంధ్రులు నిరసన తెలిపారు. టొరంటో నగరంలోని ఇండియన్ కాన్సులేట్ వద్ద ప్రవాసాంధ్రులు 'ఏపీ డిమాండ్స్ జస్టిస్' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు. తెలుగు కెనడా అసోసియేషన్ ప్రెసిడెంట్ అనిల్ లింగమనేని, హర్ష పరుచూరి, శ్యాం కందాళ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానికి వ్యతిరేకంగా చెన్నైలో టీడీపీ ధర్నా

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విభజన కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బడ్జెట్‌లో మొండిచెయ్యి చూపడాన్ని నిరసిస్తూ టీడీపీ చెన్నై విభాగం ఆదివారం ధర్నా చేపట్టింది. టీడీపీ గ్రేటర్ చెన్నై కన్వీనర్ డి.చంద్రశేఖర్ నేతృత్వంలో జరిగిన ఈ ధర్నాలో సుమారు 200 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, తెలుగు ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. ఈ ధర్నాలో టీడీపీ నేతలైన మన్నం రవిబాబు, గడిపూడి రాజేష్, నూతలపాటి వెంకటేష్, వై.ఎరుకలయ్య తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పలువురు ప్రముఖులు, బాలకృష్ణ అభిమానుల సంఘం నిర్వాహకులు కూడా ఈ ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఉత్తరాది ప్రాబల్యాన్ని అడ్డుకుంటాం: కేతిరెడ్డి

తెలుగు ప్రజల కష్టాలు తెలుసుకోకుండా, వారికి న్యాయం చేకుండా మొండివైఖరి ప్రదర్శించడం ద్వారా కేంద్రప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, త్వరలోనే దీనిని నిరసిస్తూ ఆందోళనలు చేపట్టనున్నట్లు తమిళనాడు తెలుగు యువశక్తి అధినేత కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి ప్రకటించారు. దక్షిణాదిపై ఉత్తరాది వారు తీవ్రమైన వివక్షను ప్రదర్శిస్తున్నారని, ఉత్తరాది ప్రాబల్యానికి వ్యతిరేకంగా దక్షిణభారతదేశంలోని అన్ని పార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి కేంద్రం మెడలు వంచుతామని ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

బీజేపీ ఆ నోట్ ఎందుకిచ్చిందో...!

- వారు చెప్పినదాంట్లో 10శాతమైనా అయ్యాయా: కేవీపీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ప్రభుత్వం చేసిన దానిపై 27పేజీల విచిత్రమైన నోట్‌ను బీజేపీ ఎందుకిచ్చిందో అర్థం కావడం లేదని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు అన్నారు. వారు చెప్పిన 89శాతంలో కనీసం 10శాతమైనా అయ్యాయో లేదో ప్రజలకు తెలిపాలని డిమాండ్ చేశారు. అందులో పేర్కొన్నవన్నీ అసత్యాలంటూ మిత్రపక్షమైన టీడీపీ మరో నోట్ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆదివారంఢిల్లీలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ బయో టాయిలెట్లు ఇచ్చాం, రైలుకు ఏపీ ఎక్స్‌ప్రెస్ పేరు పెట్టాం...వంటివాటితో పేజీలకు పేజీలు నింపారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం మోదీ వ్యవహరిస్తున్న తీరు ఉత్తర, దక్షిణాలపై చిచ్చుపెట్టే రీతిలో ఉందని కేవీపీ అభిప్రాయపడ్డారు.

ప్రత్యేక హోదాపై ఎందుకు తగ్గారు?: రఘువీరా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి అభ్యర్థిగా ఏపీకి పదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన నరేంద్ర మోదీ ఎందుకు వెనక్కి తగ్గారని ఏపీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ప్రశ్నించారు. విభజన హామీలపై ప్రధానికి ఆదివారం ఆయన మూడు పేజీల లేఖ రాశారు. ఏపీ అభివృద్ధి కోసం విభజన హామీలు ఇస్తే వాటిని నీరుగార్చేలా బీజేపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. 'నెల్లూరు ఎన్నికల సభలో ప్రత్యేక హోదా ఘనత వెంకయ్యకే అని చెప్పారు కదా? 2014 మేనిఫెస్టోలో హోదా అంశం ఉందా.. లేదా? మీ ప్రభుత్వం వచ్చిన తరువాత క్యాబినెట్‌లోనూ దానిపై నిర్ణయం తీసుకున్నారు కదా..?' అంటూ మొత్తం 10పాయింట్లను ఆ లేఖలో లేవనెత్తారు.

బీజేపీ నేతలు రాజీనామా చేయాలి! :సీపీఐ

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన మోసానికి నైతిక బాధ్యత వహిస్తూ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చిన బీజేపీ... ఆ తర్వాత ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబుకు ఆయన 12 ప్రశ్నలతో కూడిన లేఖ రాశారు. పదేళ్ల పాటు ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తామని బీజేపీ చేసిన ప్రకటన వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

తెలియకుంటే ట్యూషన్ పెట్టించుకో!

- జగన్ రాజకీయ అజ్ఞాని: మంత్రి సోమిరెడ్డి

వెంకటాచలం, ఫిబ్రవరి 11 : రాష్ట్రం గురించి అవగాహన లేని వ్యక్తి ప్రతిపక్ష నేతగా ఉండటం ప్రజల దురదృష్టమని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పాలిచెర్లపాడులో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రం పట్ల అవగాహన లేని రాజకీయ అజ్ఞాని జగన్ అని విమర్శించారు. రాష్ట్రం పట్ల, ప్రజల గురించి అవగాహన కావాలంటే ఆయన ట్యూషన్ పెట్టించుకోవాలని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు. రైల్వే జోన్, దుగరాజపట్నం ఓడరేవు, అమరావతికి నిధుల కేటాయింపు వంటి విషయాలు కేంద్ర ప్రభుత్వం చేయాల్సిన పనులు కాగా అందుకు ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష నేత, ముఖ్యమంత్రిని విమర్శించడం హాస్యాస్పదమని అన్నారు. ప్రతిపక్షం వారు తమ పాదయాత్రలకు జనాన్ని తరలించడానికి మద్యం సీసాలు పంపిణీ చేస్తుంటే తాము మాత్రం రైతులకు సాగునీరు పంపిణీ చేస్తున్నామని చురకలు వేశారు.

బడ్జెట్ సమావేశాలకు హాజరుపై త్వరలో నిర్ణయం

- వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

నరసాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యే విషయంపై పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో చర్చించి త్వరలో నిర్ణయాన్ని ప్రకటిస్తామని వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడాన్ని టీడీపీ ఓ వ్యాపారంలా పెట్టుకుందని విమర్శించారు. విభజన చట్టంలోని అంశాలను అమలు చేయకుండా రాష్ట్రానికి కేంద్రం ద్రోహం చేసిందని ఆరోపించారు. కేంద్రంపై నమ్మకం లేనప్పుడు టీడీపీ ఎంపీలు కేబినెట్‌లో మంత్రులుగా ఎందుకు కొనసాగుతున్నారని ఆయన ప్రశ్నించారు.

అబద్ధాలు చెబితే ఊరుకోవద్దు

- లెక్కలు, వాస్తవాలు బయటపెట్టండి
- పోరాటం కొనసాగిద్దాం
- అనవసర ఆరోపణలొద్దు
- చంద్రబాబు స్పష్టీకరణ
- పార్టీ నేతలు, ఎంపీలతో భేటీ

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి సాయం విషయంలో అబద్ధాలు చెబితే ఊరుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీ నేతలు, ఎంపీలకు స్పష్టం చేశారు. వాస్తవాలేమిటో లెక్కలతో సహా ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. రాష్ట్రానికి న్యాయం కోసం పోరాటం కొనసాగిద్దామని తెలిపారు. 'చేసిన సాయం విషయంలో అబద్ధాలు అవసరం లేదు. రాజకీయాలు కూడా అక్కర్లేదు. అసలేం జరిగిందన్న వాస్తవాలు మాత్రం ప్రజలకు తెలియాలి. అదే సమయంలో అనవసరమైన, నిరాధారమైన ఆరోపణలు మాత్రం చేయొద్దు. ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలి. అప్పుడు ప్రజలే నిర్ణయిస్తారు' అని పేర్కొన్నారు. ఆయన ఆదివారమిక్కడ టీడీపీ నేతలతో సమావేశమయ్యారు. పార్టీ ఎంపీలతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రానికి చేసిన సాయంపై బీజేపీ నాయకత్వం విడుదల చేసిన నివేదికపై చర్చ జరిగింది. అవన్నీ తప్పుడు లెక్కలని పార్టీ ఎంపీలు, నేతలు ఆయన దృష్టికి తెచ్చారు. జాతీయ రహదారుల ప్రాజెక్టుల కోసం రూ.లక్ష కోట్లు రాష్ట్రానికి ఇచ్చామనడం హాస్యాస్పదమన్నారు. బీజేపీ నేతల అసత్య ప్రచారానికి తెరదించాలన్నారు. రెవెన్యూ లోటు భర్తీ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరి దారుణంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. '14వ ఆర్థిక సంఘం, కాగ్ కూడా లోటును నిర్ధారించాయి. రాష్ట్ర విభజన జరిగిన 2014-15 బడ్జెట్‌లో రెవెన్యూ లోటు ఎంత ఉంటే అంతా కేంద్రం ఇవ్వాలి. అది రూ.16 వేల కోట్ల పైన ఉందని రాష్ట్ర ప్రభుత్వమే పలుసార్లు చెప్పింది. కానీ ఇప్పుడు అది రూ.4 వేల కోట్లేనని, ఇప్పటికే ఇచ్చింది పోగా..ఇక ఇవ్వాల్సింది రూ.120 కోట్లేనని అనడం దారుణం' అని చెప్పారు. కేంద్ర ఆర్థిక శాఖ అధికారులతో జరిగిన చర్చలో ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పానని కుటుంబరావు పేర్కొన్నారు. ప్రత్యేక హోదాతో సమానంగా ప్యాకేజీ కింద ఇస్తానన్న నిధుల్లో మొదటి ఏడాది రూ.2,580 కోట్లు, రెండో ఏడాది రూ.2,900 కోట్లు, మూడో ఏడాది రూ.3,400 కోట్లు.. ఇలా రాష్ట్రానికి రావాల్సి ఉందని.. వీటినీ ఇవ్వలేదని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ విషయంలోనూ కేంద్రం అనుసరిస్తున్న వైఖరి సరిగా లేదని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

రాష్ట్రాలకు ఇచ్చేది 38మాత్రమే

కేంద్రం ఇటీవలి కాలంలో రాష్ట్రాలకిచ్చే నిధుల పంపిణీ నిష్పత్తిని మార్చింది. అంతకుముందు కేంద్రానికి దేశవ్యాప్తంగా వచ్చే ఆదాయంలో రాష్ట్రాలకు 32 శాతం మాత్రమే ఇచ్చేది. తాము 42 శాతం ఇస్తున్నామని ప్రకటించి ఆ మేరకు అమలు చేస్తోంది. దీనిపై ఈ సమావేశంలో మరో ఆసక్తికర అంశం చర్చకు వచ్చింది. ఇందులోనూ మతలబు ఉందని కుటుంబరావు పేర్కొన్నారు. గతంలో పన్నుల రూపంలో కేంద్రానికి రూ.100 ఆదాయం వస్తే.. దానిలోనుంచి రాష్ట్రానికి వాటా ఇచ్చేవారు. అయితే ఇటీవల కేంద్రం పన్నులు కాకుండా.. సెస్‌ల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచుకుంది. సెస్‌ల ఆదాయంలో రాష్ట్రానికి వాటా ఇవ్వాల్సిన అవసరం లేదు. ఉదాహరణకు మనం ఏదైనా వస్తువు కొనడమో, రెస్టారెంట్లకు వెళ్లినప్పుడో బిల్లు, దానిపై జీఎస్టీతో పాటు.. స్వచ్ఛభారత్ సెస్, కృషి కల్యాణ్ యోజన సెస్ ఇలాంటివి వేస్తుంటారు. మొత్తం ఇలాంటి సెస్‌లు డజనుకు పైగా కేంద్రం వేసింది. దీంతో కేంద్రానికి వచ్చే ప్రతి రూపాయిలో 15 పైసలు వీటి ద్వారానే వస్తోంది. ఆ 15 పైసల్ని తీసేసుకుని.. మిగతా 85 పైసల్లోనే 42 శాతాన్ని రాష్ట్రాలకు ఇస్తోందని కుటుంబరావు వివరించినట్లు సమాచారం. మొత్తం ఆదాయం చూస్తే కేంద్రం ఇస్తోంది 38 శాతమేనన్నమాట. కాగా, కుటుంబరావు, ఇతర అధికారులు మళ్లీ ఢిల్లీ వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో సోమ, మంగళవారాల్లో వారు అక్కడకు వెళ్తున్నారు.


మాట్లాడుతున్న కేంద్రమంత్రి ఆర్‌కె సింగ్, చిత్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు

ఏపీని ఆదుకుంటాం

- నిధులు ఇస్తున్నాం..ఇంకా ఇస్తాం
- కేంద్రమంత్రి ఆర్‌కే సింగ్
- కేంద్రం చేస్తుంటే రాష్ట్రం చెప్పుకుంటోంది: హరిబాబు

మచిలీపట్నం, ఫిబ్రవరి 11:ఆంధ్రప్రదేశ్‌ను అన్నివిధాలా ఆదుకుంటూనే ఉన్నామని, ఎప్పటికప్పుడు కోట్లాది రూపాయల నిధులు విడుదల చేస్తున్నామని కేంద్ర ఇంధన శాఖ సహాయమంత్రి రాజ్‌కుమార్ సింగ్ అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి లక్ష కోట్లు మంజూరు చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు నాలుగు సోలార్ ప్రాజెక్టులు, విజయవాడకు 765 కేవీ హైకెపాసిటీ ట్రాన్స్‌మిషన్ లైన్లు మంజూరయ్యాయన్నారు. రాష్ట్రంలో ఐఐటి, ఐఐఎం, డిఫెన్సు అకాడమీ, బెల్ కంపెనీ ఏర్పాటు చేస్తామని, విభజన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకహోదాపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండా ఇప్పుడు బంద్‌లు, ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని ఆర్కే సింగ్ విమర్శించారు. పోలవరం ముంపు మండలాలను ఏపీలో కలిపిన ఘనత తమదేనని, గిరిజన, సెంట్రల్ విశ్వవిద్యాలయాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించామని వివరించారు. దుగరాజపట్నం, కడప స్టీల్‌ప్లాంట్, విశాఖ రైల్వేజోన్ ఏర్పాటులో కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నాయని ఆర్కే సింగ్ చెప్పారు.

కేంద్ర సాయంపై ప్రచారం చేయండి

కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుంటే ఆ పథకాలను వాడుకుంటూ టీడీపీ బలపడుతోందని ఏపీ బీజేపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు విమర్శించారు. ఆదివారం కృష్ణాజిల్లా మచిలీపట్నంలో పార్లమెంటు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. కేంద్రం చేసిన పనులన్నీ టీడీపీ తమ గొప్పలుగా చెప్పుకుంటోందని విమర్శించారు. ఇకపై చూస్తూ ఊరుకోకుండా కేంద్ర సాయంపై విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. బీజేపీ ఎవరిపైనా ఆధారపడి రాజకీయాలు చేయబోదని ఆయన అన్నారు.

ఏపీకి చాలా చేశాం: సురేశ్‌రెడ్డి

తిరుపతి (యశోదనగర్), ఫిబ్రవరి 11: మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక ఏపీకి చాలా చేశారని..ఇంకా చేస్తారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. తమ విశ్వసనీయతను మిత్రపక్షమైన టీడీపీ ప్రశ్నించడం సరికాదని తిరుపతిలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ అన్నారు. పార్లమెంటు ఆవరణలో ఎంపీ శివప్రసాద్, పోతురాజు వేషధారణలో నిరసన తెలపడాన్ని తప్పుపట్టారు. ఎంపీ గల్లా జయదేవ్‌పైనా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గల్లా అరుణకుమారి మంత్రిగా ఉన్నపుడు భూదందాలు చేసి ప్రజల జీవితాలతో ఆడుకున్నారని, కారుచౌకగా భూములు కొట్టేసిన చరిత్ర వారిదని ఆరోపించారు. ఆస్తులను కాపాడుకోవడానికి జయదేవ్ టీడీపీలో చేరానని విమర్శించారు.

కమలదళం విలవిల!

- బడ్జెట్‌లో మొండిచేయిపై ప్రజాగ్రహం
- సాయం చేయకుండా ప్రజల్లోకి ఎలా వెళ్తాం?
- టీడీపీ వదిలివేస్తే ఇబ్బందే
- అధిష్ఠానానికి బీజేపీ శ్రేణుల సందేశాలు

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ శ్రేణులు అయోమయంలో పడిపోయాయి. కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిన నాటి నుంచి వారికి దిక్కుతోచడంలేదు. రాష్ట్రానికి చిల్లిగవ్వ కూడా విదల్చని బడ్జెట్ బ్రహ్మాండంగా ఉందని ఎలా ప్రచారం చేసుకోవాలో అంతుచిక్కడం లేదు. మిత్రపక్షమైన టీడీపీపై, సీఎం చంద్రబాబుపై తమ ఎమ్మెల్సీ సోము వీర్రాజు చేస్తున్న వ్యాఖ్యలు చూసి తెగతెంపులు చేసుకుంటున్నట్లు భావించాలో.. మైత్రి కొనసాగుతుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు మాటలు విని పొత్తు కొనసాగుతుందని అనుకోవాలో కార్యకర్తలకు అంతు చిక్కడం లేదు. పార్టీ వైఖరేంటో తేల్చుకోలేని స్థితిలో ఉన్న వారు.. గడచిన పది రోజులుగా ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతతో అడుగు ముందుకు వేయలేకపోతున్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు అన్నీ ఇచ్చాం.. ప్రజల్లోకి వెళ్లి వివరించండి' అంటే ఎలా వెళ్లగలమని ప్రశ్నిస్తున్నారు.

టీడీపీ ఎదురుదాడితో..

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాష్ట్రానికి కేంద్రం విడుదల చేసిన నిధులు, మోదీ నిజాయితీ మొదలైనవి వివరిస్తూ ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ నాయకత్వం బీజేపీ శ్రేణులకు సూచించింది. ఆ దిశగా అడుగులు వేద్దామనుకునే సమయంలో కేంద్ర బడ్జెట్ రాష్ట్రంలో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. అందులో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ వామపక్షాలు నిర్వహించిన బంద్‌కు, టీడీపీ నిరసనలకు ప్రజల నుంచి భారీ స్పందన రావడంతో బీజేపీ శ్రేణులు అయోమయంలో పడిపోయాయి. అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై కర్నూలు పార్టీ సభలో సోము వీర్రాజు చేసిన తీవ్ర వ్యాఖ్యలు టీడీపీ శ్రేణులను ఆగ్రహోదగ్రులను చేశాయి. ఇప్పుడు బడ్జెట్ తీరు చూశాక ఇంకాస్త అధికమైంది. టీడీపీ నేతలు నేరుగా ప్రధానినే టార్గెట్ చేయడం మొదలుపెట్టారు. లోక్‌సభలో గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్.. మోదీని నిధులు, పొత్తులపై ప్రశ్నించడంతో రెండు పార్టీల మధ్య దూరాన్ని బాగా పెంచేసింది. రాష్ట్రంలో గ్రామ స్థాయిలో కూడా ఎక్కడ చూసినా ఇదే చర్చ. సామాజిక మాధ్యమాల్లో గల్లా జయదేవ్‌ను హీరోను చేస్తూ సందేశాలు వైరల్ అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వీర్రాజు, బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ టీడీపీపై ఆరోపణలకు దిగారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు హరిబాబు ఢిల్లీలో విలేకరుల సమావేశం పెట్టి కేంద్రం రాష్ట్రానికి లక్షల కోట్లు ఇచ్చిందంటూ 27 పేజీల నివేదికను విడుదల చేశారు. దీనిపై శ్రీకాకుళం ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు ఎదురుదాడికి దిగారు. కేంద్రంపై ప్రజలు సంతృప్తితో ఉన్నారా.. లేదా అనేది పక్కనబెడితే ప్రజల్లో మనపై తీవ్ర వ్యతిరేకత నెలకొందని.. రాష్ట్రంలో ప్రస్తుతమున్న అన్ని పార్టీల్లోకీ టీడీపీనే బలంగా ఉందని ఎక్కువ సందేశాలు వెళ్లాయి. పొత్తు నుంచి విడిపోవాల్సిన అవసరం లేదని.. విభజన హామీలు, ఆర్థిక సహకారం అందిస్తే టీడీపీ కూడా తమను వీడాలన్న ఆలోచన చేయదని ద్వితీయ శ్రేణి నేతలు అభిప్రాయాలు పంపుతున్నారు.



జగన్‌తో పొత్తు యోచనపై బీజేపీ కేడర్‌లో విముఖత వ్యక్తమవుతోంది. ప్రత్యేక హోదా సాధ్యం కాదని కేంద్రం తేల్చిచెప్పాక.. అదే నినాదంతో జగన్ ఎన్నికలకు వెళ్తానంటుంటే ఆయనతో ఎలా జత కలుస్తామని అధిష్ఠానానికి ప్రశ్నలు సంధించారు. జగన్ తీవ్ర అవినీతిలో కూరుకుపోయి ఆ బురద మనకు అంటిస్తే ఎన్నికల్లో ఎలా కడుక్కోగలమని బీజేపీ శ్రేణుల్లో మెజారిటీ అభిప్రాయం వ్యక్తమవుతోంది.

న్యూజిలాండ్ గడ్డపై భారత స్విమ్మర్ రికార్డు


రోహన్

న్యూఢిల్లీ: భారత లాంగ్ డిస్టెన్స్ స్విమ్మర్ రోహన్ మోరె స్వామ్ విదేశీ గడ్డపై రికార్డు విజయంతో అదరగొట్టాడు. పుణెకు చెందిన రోహన్ న్యూజిలాండ్‌లోని ఉత్తర, దక్షిణ ద్వీపాల మధ్యనున్న కుక్ జలసంధిని 8 గంటల 37 నిమిషాల్లో ఈది రికార్డు సృష్టించాడు. రోహన్ ఈదే క్రమంలో తొలి ఐదు గంటలు 19 డిగ్రీల సెల్సియస్‌గా ఉన్న నీటి ఉష్ణోగ్రత.. దక్షిణ ద్వీపం చేరేకొద్దీ 4 డిగ్రీలకు పడిపోయింది. అయినా, ఏమాత్రం వెరవకుండా రోహన్ లక్ష్యాన్ని చేరుకోవడం విశేషం. ఈ ప్రదర్శనతో రోహన్.. కుక్ జలసంధిని ఈదిన తొలి ఆసియావాసిగా ఘనత వహించాడు.

చిత్తుగా ఓడినా అభినందనలు..

సియోల్: వింటర్ ఒలింపిక్స్‌లో భాగంగా సంయుక్త కొరియా తరపున బరిలోకి దిగిన ఐస్ హాకీ ఆటగాళ్లు 0-8తో స్విట్జర్లాండ్ చేతిలో చిత్తుగా ఓడారు. అయితే ఉత్తర కొరియా మీడియా మాత్రం వారు ఓడిన స్కోరు ఇవ్వకుండా ఆహా.. ఓహో అంటూ ఆకాశానికెత్తింది. ఎందుకంటే ఆ మ్యాచ్‌ను కిమ్ జోన్ ఉంగ్ చెల్లెలు కిమ్ యో జోంగ్, దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జో ఇన్ కలిసి చూశారు. ఇది క్రీడా పోటీగా కాకుండా ఓ రాజకీయ వేదికగానే తలపించింది. ఇరు దేశాలకు చెందిన అభిమానులు కూడా మ్యాచ్ సాగుతున్న కొద్దీ తమ ఆటగాళ్లకు విశేషంగా మద్దతు పలికారు.



సింధుకు యోనెక్స్ క్షమాపణ

ముంబై: తన అధికారిక స్పాన్సర్ యోనెక్స్ నుంచి వచ్చిన ఆ మెసేజ్ చూసి బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు జీవితంలో తొలిసారి షాక్‌కు గురై ఉండొచ్చు! కారణం..'గుడ్ బై సింధు. భారత్‌లాంటి పేద దేశానికి చెందిన ఆటగాళ్లు ఇక మా స్పాన్సర్‌షిప్ పొందబోరు. ఇక మా దృష్టంతా జపాన్ యువ క్రీడాకారులపైనే' అన్నది ఆ సమాచార సారాంశం. అది నిజమా.. అని సింధు అనుకునేంతలోపే మరో మెసేజ్. ఆ సమాచారం వాస్తవం కాదని, తమ అకౌంట్ హ్యాక్ అయిందని యోనెక్స్ నుంచి వచ్చిన ఆ మెసేజ్‌తో ఆమె ఊరట చెందింది. తొలి సమాచారంతో వెంటనే స్పందించిన యోనెక్స్..సింధుకు క్షమాపణలు చెప్పింది. 'మా ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ (యోనెక్స్.కామ్)నుంచి మాకు తెలియకుండా పోస్ట్ అయిన ఆ అసంబద్ధ మెసేజ్ కారణంగా యోనెక్స్ అభిమానులందరికీ నిజాయతీగా క్షమాపణలు తెలియజేస్తున్నాం. మా అకౌంట్ హ్యాక్ అయింది. అంతలోనే సమస్య పరిష్కారం అయింది. మా అకౌంట్ మరింత భద్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నాం. భవిష్యత్‌లో ఇలా జరగదు' అని పేర్కొంది.

ఆ రూ. 125 కోట్లు బీసీసీఐ చెల్లించాలి!

దుబాయ్: రెండేళ్ల కిందట.. అంటే 2016 టీ-20 వరల్డ్‌కప్ సందర్భంగా భారత ప్రభుత్వం నుంచి పన్ను మినహాయింపు రూపేణా రావాల్సిన రూ. 125 కోట్లను బీసీసీఐని అడగాలని ఐసీసీ యోచిస్తోంది. 2016 టీ20 వరల్డ్‌కప్‌నకు బీసీసీఐ ఆతిథ్యమిచ్చింది. దాదాపు రూ. 187 కోట్లు వ్యయమైన ఆ టోర్నీకి కేంద్రం నుంచి రూ. 125 కోట్ల పన్ను మినహాయింపు రావాల్సి ఉంది. అయితే ఆ మొత్తాన్ని ప్రభుత్వం మినహాయించకపోవడంతో దానిని బీసీసీఐ బాకీగా ఐసీసీ చూపుతోంది. ప్రభుత్వంనుంచి మినహాయింపు పొందడం ఆతిథ్య బోర్డు బాధ్యత అని, అందువల్ల ఆ రూ. 125 కోట్లు బీసీసీఐ చెల్లించాలని ఐసీసీ అంటోంది.

నిరాశతో ల్యూజ్‌కు శివకేశవన్ గుడ్‌బై



ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా): భారత అథ్లెట్ శివకేశవన్ నిరాశతో ల్యూజ్ క్రీడకు వీడ్కోలు పలికాడు. వింటర్ ఒలింపిక్సే తనకు చివరి టోర్నీ అని ముందే ప్రకటించిన అతడు.. ఈ ఈవెంట్‌లో పతకం సాధించడంలో విఫలమయ్యాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ల్యూజ్ చాంపియన్‌షిప్‌లో కేశవన్ 34వ స్థానంలో నిలిచి నిరాశపరిచాడు. ఆరోసారి ఒలింపిక్స్ బరిలోకి దిగిన 36 ఏళ్ల కేశవన్ కెరీర్‌లో ఒక్క పతకమూ సాధించకుండానే నిష్క్రమించాడు. ఇక ల్యూజ్ ఈవెంట్ లో డేవిడ్ గ్లీషర్ (ఆస్ట్రియా) స్వర్ణం, క్రిస్ మాజ్జెర్ (అమెరికా) రజతం, జొహానెస్ లుడ్విగ్ (జర్మనీ) కాంస్య పతకం గెలుపొందారు.



'రింక్' కపుల్స్!

గాంగ్‌యుంగ్ (దక్షిణకొరియా) : అలెక్సా నీరిమ్, క్రిస్ నీరిమ్..వింటర్ ఒలింపిక్స్ ఫిగర్ స్కేటింగ్‌లో తలపడుతున్న భార్యాభర్తలు. ఈ అమెరికన్ ఫిగర్ స్కేటర్లు 2012లో పోటీలకోసం జోడీ కట్టారు. అనంతరం ఆ క్రీడాబంధం ప్రేమగా మారి పెళ్లికి దారితీసింది. ప్యాంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్‌లో ఫిగర్‌స్కేటింగ్ బరిలో దిగుతున్న ఎనిమిది జోడీలు నిజ జీవితంలోనూ దంపతులు కావడం విశేషం. వారిలో నీరిమ్ జంట ఒకటి. నీరిమ్ జోడీ ఆటకు సంబంధించిన విషయాలన్నీ ప్రాక్టీస్ వరకే. ఒకసారి ఐస్ రింక్‌ను వదిలేశాక స్కేటింగ్ విషయాల ప్రస్తావనేది ఇంట్లో ఉండదు. అంతేనా..ఏవైనా మనస్పర్థలు వచ్చినా వాటిని అప్పటికప్పుడే మరిచిపోతారు. భార్యాభర్తల మధ్య పరస్పర నమ్మకం ఉండాలంటారు ఈ అమెరికన్ జోడీ. ఇదే అభిప్రాయంతో ఉంది మరో జంట రష్యాకు చెందిన వ్లాదిమిర్ మొరజోవ్, ఎవ్‌గినియా తారసోవా.

ఒలింపిక్స్‌పై సైబర్ దాడులు

ప్యాంగ్‌చాంగ్ : వింటర్ ఒలింపిక్స్‌పై సైబర్ దాడులు జరిగిన మాట వాస్తవమేనని క్రీడల నిర్వాహకులు ధ్రువీకరించారు. రెండు రోజుల క్రితం వింటర్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవం రోజు హ్యాకర్స్ సైబర్ దాడులకు పాల్పడ్డారని, అయితే దీనివల్ల ఎటువంటి విపత్కర పరిణామాలు సంభవించలేదని తెలిపారు. సైబర్ దాడులకుగల కారణాలేమిటో తెలియజేయలేదు. ఈ సైబర్ దాడుల వెనుక రష్యా హస్తముందన్న అనుమానాలను కొట్టివేస్తూ భద్రతా కారణాలదృష్ట్యా సైబర్ దాడుల విషయాన్ని బహిర్గతం చేయలేదని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ అధికార ప్రతినిధి మార్క్ ఆడమ్స్ అన్నారు. దీనికి కారకులెవరన్నది ఇపు డే స్పష్టం చేయలేమన్నారు. ప్రారంభోత్సవంనాడు అధికారిక వెబ్‌సైట్, ఇంటర్నెట్‌లపై సైబర్ హ్యాకర్స్ దాడులు చేశారు. తమ అథ్లెట్లపై ఐఓసీ నిషేధమున్న నేపథ్యంలో, తమపై అభాండాలు వేసేందుకు పాశ్చాత్య మీడియా ప్రయత్నిస్తోందని రష్యా పేర్కొంది. సైబర్ దాడులలో తమ ప్రమేయం లేదని స్పష్టం చేసింది.



ఆ ఇద్దరే ఆడాలా?

కోహ్లీ, ధవన్‌పైనే బ్యాటింగ్ భారం సమష్టిగా రాణించకపోతే కష్టమే..

తొలి మూడు వన్డేలు సునాయాసంగా నెగ్గేసరికి భారత జట్టులో లోపాలేమిటో తెలీలేదు. కానీ.. నాలుగో వన్డేలో 'గులాబీ' ముల్లు కాస్త గట్టిగానే గుచ్చుకోవడంతో కోహ్లీ సేనలోని డొల్లతనం బయటపడుతోంది. బ్యాటింగ్ బలమంతా శిఖర్ ధవన్, కెప్టెన్ విరాట్ కోహ్లీలే మోయడం ఎంతవరకు సబబు?

ఇక బౌలింగ్ అందామా.. బౌన్సీ పిచ్‌లపై మణికట్టు మాంత్రికులు చాహల్, కుల్దీప్ యాదవ్ వరుసపెట్టి వికెట్లు తీయడంతో మిగతా వారి గురించి ఆలోచించాల్సిన పనిలేకుండా పోయింది. అయితే నాలుగో వన్డేలో పరిస్థితి మారింది. ఇప్పటిదాకా వణికించిన స్పిన్నర్లు దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ వీరబాదుడుకు ఏం చేయాలో అర్థంకాని పరిస్థితిలో పడ్డారు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

వన్డే సిరీస్‌లో తొలిసారిగా భారత జట్టు తమ బ్యాటింగ్ పటిష్ఠతపై పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. శనివారం జరిగిన నాలుగో వన్డేలో ప్రారంభంలో భారత్ చెలరేగింది. ధవన్, కోహ్లీ ఆటతీరుతో 31.1 ఓవర్లలో 178/2 స్కోరుతో అత్యంత పటిష్ఠంగానే కనిపించింది. చివరకు 50 ఓవర్లు ముగిసేసరికి ఏడు వికెట్లకు 289 పరుగులు మాత్రమే చేయగలిగింది. అంటే ధవన్, కోహ్లీలను మినహాయిస్తే మిగిలిన 16.4 ఓవర్లలో ఐదుగురు బ్యాట్స్‌మెన్ కలిసి చేసింది 111 పరుగులు మాత్రమే. రోహిత్ ఐదు పరుగులకే వెనుదిరిగాడు. అతను ఇప్పటిదాకా ఆడిన నాలుగు వన్డేల్లో చేసింది 40 పరుగులే.. నాలుగో నెంబర్‌లో రహానే తొలి వన్డేలోనే మెరిశాడు. శనివారంనాటి మ్యాచ్‌లో దాదాపు 20 ఓవర్ల ఆట ఉన్న సమయంలో రహానె బరిలోకి వచ్చాడు. ధవన్ ఓవైపు చెలరేగుతున్న వేళ అతడికి సహాయకంగా తను కీలక పాత్ర పోషించాల్సింది. కానీ నిర్లక్ష్యమో.. ఏమరుపాటో తనకు అలవాటు లేని రిస్కీ షాట్‌ను ఎంచుకుని డీప్ స్క్వేర్ లెగ్‌లో క్యాచ్ అవుటయ్యాడు. ఆ తర్వాత.. కెరీర్‌లో నాలుగో వన్డే ఆడుతున్న శ్రేయాస్ అయ్యర్ వేగంగా ఆడే క్రమంలో తడబడినా, ధోనీ ఆడిన తీరు మాత్రం ఎక్కువ మంది అభిమానులను ఆకట్టుకోలేకపోయింది. సిక్సర్‌తో బోణీ చేసిన అతడు ఆ తర్వాత నెమ్మదించాడు. మరో ఎండ్‌లో వికెట్లు పడుతున్నందున జాగ్రత్తగా ఆడి చివరి వరకు క్రీజులో ఉండాలనే ఆలోచన అతడికి ఉండవచ్చు. కానీ నాటౌట్‌గా ఉన్న మహీ 43 బంతుల్లో 42 పరుగులే సాధించడంతో విమర్శకులు సోషల్ మీడియాలో విరుచుకుపడుతున్నారు. కానీ తను కూడా దూకుడుగా ఆడితే భారత్ కనీసం ఆ మాత్రం స్కోరైనా చేసేది కాదని మరో వాదన. మరోవైపు కేప్‌టౌన్‌లో జరిగిన మూడో వన్డేలోనూ కోహ్లీ 160 పరుగులతో చెలరేగగా ధవన్ 76 పరుగులు చేసి బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలిచారు. మిగతావారంతా విఫలమయ్యారు. కానీ ఐదు, ఆరో వన్డేల్లో టాప్ ఆర్డర్‌తో పాటు మిడిలార్డర్ కూడా తమ నెంబర్‌వన్ ఆటను ప్రదర్శించకపోతే ఇప్పటిదాకా జట్టు సాధించిన విజయాలు నిష్ఫలమే అవుతాయి. ఎందుకంటే సఫారీ గడ్డపై చరిత్రాత్మక సిరీస్ కోసం జట్టు మరో విజయం దూరంలోనే ఉంది.

స్పిన్నర్లే ముంచారు..: మూడు వన్డేల్లో ఏకపక్షంగా విజయాలు అందించిన లెగ్ స్పిన్నర్లు చాహల్, కుల్దీప్ వాండరర్స్ మ్యాచ్‌లో ఏమాత్రం ప్రభావం చూపించలేకపోయారు. రెండుసార్లు వర్షం రావడంతో అవుట్ ఫీల్డ్ చిత్తడిగా మారింది. బంతి తడవడంతో వీరి బౌలింగ్ భిన్నంగా మారింది. ఏమాత్రం టర్న్ కాకపోవడంతో డివిల్లీర్స్, మిల్లర్, క్లాసెన్, ఫెహ్లుక్వాయో దుమ్మురేపారు. వీరిద్దరి బౌలింగ్‌ను ఎంతగా బాదారంటే 11.3 ఓవర్లలోనే 119 పరుగులు సాధించారు. వీరు మూడు వికెట్లు మాత్రమే తీయగలిగారు. చాహల్ వైడ్లు, నోబాల్‌తో అదనంగా పరుగులు సమర్పించుకున్నాడు. ఇక ఈ స్థాయిలో పరుగులు ధారాళంగా సమర్పిస్తున్నా కెప్టెన్ కోహ్లీ డెత్ ఓవర్లలోనూ చాహల్, కుల్దీప్‌లనే కొనసాగించడం విమర్శలకు దారి తీసింది. ఆఖర్లో చెలరేగే భువనేశ్వర్, బుమ్రాలకు చెరో ఓవర్ ఉన్నా కూడా వారి వైపు చూడలేదు. దీనికి తోడు మిల్లర్ ఇచ్చిన క్యాచ్‌లను వదిలేయడం కూడా కొంపముంచింది.

నాలుగో వన్డేలో ఝలక్

జొహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో తొలి సిరీస్‌పై కన్నేసిన భారత జట్టుకు నాలుగో వన్డేలో షాక్ తగిలింది. హ్యాట్రిక్ విజయాలతో జోరుమీదున్న భారత జట్టును శనివారం జరిగిన నాలుగో వన్డేలో దక్షిణాఫ్రికా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 5 వికెట్ల తేడాతో ఓడించింది. దీంతో ఆరు వన్డేల సిరీస్‌లో ఆ జట్టు 3-1తో నిలిచింది. 290 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 7.2 ఓవర్లలో 43/1 స్కోరుతో ఉన్న దశలో వర్షం కారణంగా రెండు గంటలపాటు మ్యాచ్ ఆగింది. దీంతో లక్ష్యం 28 ఓవర్లలో 202 పరుగులకు కుదించారు. డివిల్లీర్స్ (26) తక్కువ పరుగులకే వెనుదిరిగినా మిల్లర్ (39), క్లాసెన్ (43 నాటౌట్), ఫెహ్లుక్వాయో (5 బంతుల్లో 3 సిక్సర్లతో 23 నాటౌట్) యధేచ్ఛగా చెలరేగారు. స్పిన్నర్లు కుల్దీప్, చాహల్ ఈ మ్యాచ్‌లో ప్రభావం చూపలేకపోయారు. అంతకుముందు భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 289 పరుగులు చేసింది.

సంక్షిప్త స్కోర్లు: భారత్ 289/7 (ధవన్ 109, కోహ్లీ 75), **దక్షిణాఫ్రికా 25.3 ఓవర్లలో 207/5** (క్లాసెన్ 43 నాటౌట్, మిల్లర్ 39).



మాకు గెలిచే అర్హత లేదు



శనివారంనాటి వన్డేలో ఓవర్లు తగ్గించేసరికి అది టీ-20 మ్యాచ్‌లా మారింది. మాకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయాం. అందుకే మాకు గెలిచే అర్హత లేదు

\- విరాట్ కోహ్లీ

ఆ క్యాచే పట్టుంటే...

'నాలుగో వన్డేలో ఓటమికి పలు కారణాలున్నాయి. ముఖ్యంగా వర్షం అంతరాయం కలిగించడం దెబ్బతీసింది. మైదానంలో తడి కారణంగా స్పిన్నర్లు బంతిని టర్న్ చేయలేకపోయారు. అలాగే డేవిడ్ మిల్లర్ ఇచ్చిన క్యాచ్‌ను శ్రేయాస్ అయ్యర్ వదిలేయడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది'

\- శిఖర్ ధవన్

విరాట్ నిర్ణయం ఆశ్చర్యపరిచింది..

'డెత్ ఓవర్లలోనూ పేసర్లు భువనేశ్వర్, బుమ్రాలను కెప్టెన్ కోహ్లీ పక్కనపెట్టడం ఆశ్చర్యపరిచింది. వారిద్దరితో చివర్లో రెండు ఓవర్లు వేయిస్తారేమోనని నేను, మిల్లర్ భావించాం. కానీ అలా జరగలేదు'

\- క్లాసెన్

మృత్యుంజయుడు మోరిస్!



ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా): మంచు పర్వతాల్లో ఏ క్రీడైనా ప్రమాదకరం. అందునా స్నోబోర్డింగ్‌లో స్లోప్‌స్టైల్ ఈవెంట్ ప్రాణాంతకం. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా అంతేసంగతులు. కెనడాకు చెందిన ప్రఖ్యాత స్నోబోర్డు రైడర్, 24 ఏళ్ల మార్క్ మెక్ మోరిస్ 11 నెలల క్రితం మృత్యువు అంచులదాకా వెళ్లాడు. 2017 మార్చిలో కెనడాలోని సస్కాచెవన్‌లో స్నోబోర్డ్ విన్యాసంలో చెట్టును ఢీకొన్నాడు. 17 ఎముకలు విరిగాయి. ఊపిరితిత్తులు, ప్లీహం ఇంకా పలు అవయవాలు దెబ్బతిన్నాయి. ఆసుపత్రిలో ఒంటినిండా బ్యాండేజీలు, పైపులు. బతకడం కష్టమేనని వైద్యులు ప్రకటించారు. అలాంటి స్థితినుంచి కోలుకొన్న మరొక స్కీయర్ ఎవరైనా అయితే ఇక స్నోబోర్డింగ్‌కు రాంరాం చెప్పేస్తారు. కానీ మెక్‌మోరిస్ ఆ ప్రమాదానికి వెరవలేదు. మళ్లీ స్నోబోర్డింగ్‌బాట పట్టాడు. ఈ వింటర్ ఒలింపిక్స్‌లో పురుషుల స్లోప్‌స్టైల్ స్నోబోర్డింగ్‌లో కాంస్య పతకం కొల్లగొట్టాడు. కాంస్య పతకం గెలుపొందిన క్షణాన మోరిస్ స్పందిస్తూ.. 'గతం గురించి నేను ఎక్కువగా ఆలోచించను. కానీ ఈ రోజు నేను ఇక్కడ మళ్లీ స్నోబోర్డుతో ఉండడం ఎంతో గొప్ప అనుభూతి ఇస్తోంది' అని అన్నాడు. 2014 సోచి గేమ్స్‌లోనూ మూడోస్థానంలో నిలిచిన మోరిస్..ఎక్స్ గేమ్స్‌లో సాధించిన స్వర్ణ పతకాలకైతే లెక్కేలేదు. ప్రమాదం నుంచి కోలుకొన్నాక 2017 నవంబరులో బీజింగ్‌లో జరిగిన ప్రపంచకప్‌లో విజేతగా నిలిచాడు. ప్యాంగ్‌చాంగ్ కాంస్యం తనకు స్వర్ణంతో సమానమని మోరిస్ చెప్పాడు.

చేతన్ జోడీకి డబుల్స్ టైటిల్



బెంగళూరు: వెటరన్ షట్లర్ చేతన్ ఆనంద్ ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సత్తాచాటాడు. మరో సీనియర్ ఆటగాడు దిజుతో కలిసి చేతన్ పురుషుల డబుల్స్‌లో చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం ఇక్కడ జరిగిన ఫైనల్లో చేతన్-దిజు జంట 21-18, 21-16తో అర్జున్-గౌస్ ద్వయంపై గెలిచింది.

సౌరవ్‌దే ఇండియన్ ఓపెన్



ముంబై: భారత స్క్వాష్ స్టార్ సౌరవ్ ఘోషల్ సొంతగడ్డపై టైటిల్‌తో సత్తాచాటాడు. ఇండియన్ ఓపెన్‌లో అతడు విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో టాప్‌సీడ్ సౌరవ్ 11-9, 5-11, 6-11, 11-7, 12-10తో స్విట్జర్లాండ్‌కు చెందిన రెండోసీడ్ నికోలస్ ముల్లర్‌పై విజయం సాధించి ట్రోఫీ అందుకున్నాడు.

'చైనా'లో తొలి భారత గోల్ఫర్


షర్మిల

న్యూఢిల్లీ: భారత మహిళా గోల్ఫర్ షర్మిల నికోలెట్ ప్రతిష్ఠాత్మక చైనా లేడీస్ పీజీఏ టూర్ ఈవెంట్‌కు అర్హత సాధించింది. ఈ మెగా టోర్నీ అర్హత కోసం నిర్వహించిన పోటీలో షర్మిల చివరి రెండు రౌండ్లను విజయవంతంగా అధిగమించింది. దీంతో చైనా ఎల్‌పీజీఏ టూర్‌కు అర్హత సాధించిన తొలి భారత గోల్ఫర్‌గా షర్మిల రికార్డు సృష్టించింది. బెంగళూరుకు చెందిన 26 ఏళ్ల షర్మిల కెరీర్‌లో ఇప్పటిదాకా 11 ప్రొఫెషనల్ విజయాలు నమోదుచేసింది.

71 మంది దుర్మరణం?



రష్యాలో కూలిన విమానం

మాస్కో నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ప్రమాదం

మాస్కో, ఫిబ్రవరి 11: రష్యాలో 65 మంది ప్రయాణికులతో వెళుతున్న విమానం ఒకటి కూలిపోయింది. రాజధాని మాస్కోలోని విమానాశ్రయం నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం జరిగింది. ఆరుగురు విమాన సిబ్బంది, ప్రయాణికులు బతికి బయటపడే అవకాశం లేదని భావిస్తున్నారు. ఓర్స్క్ నగరానికి వెళుతుండగా మాస్కోకు చేరువలోని రేమన్స్కై జిల్లాలో ప్రమాదానికి గురైంది. మాస్కోలోని రెండో అతి పెద్ద విమానాశ్రయం డొమోడెడొవొ నుంచి టేకాఫ్ అయిన రెండు నిమిషాలకే రాడార్ల పరిధి నుంచి మాయమైంది. విమానం కాలుతూ పడిపోవడాన్ని చూశామని ఆ ప్రాంతానికి చెందిన పలువురు తెలిపారు. విమాన శకలాలు సుదూర ప్రాంతాల్లో సైతం పడ్డాయి. వాహనాల్లో ఘటనా స్థలానికి చేరుకోవడం అసాధ్యంగా ఉంది. దీంతో 150 మంది సహాయక సిబ్బంది కాలినడకనే వెళ్లారు. రష్యాలో ఇటీవల రికార్డుస్థాయి హిమపాతం నమోదువుతోంది. ప్రమాదానికి కారణం వాతావరణ పరిస్థితులా, మానవ తప్పిదమా అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గురైన విమానం అంటొనొవ్ యాన్-148 రష్యాకు చెందిన సరతొవ్ ఎయిర్‌లైన్స్‌కు చెందినది. ఏడేళ్ల కిందట రష్యాలోనే తయారైంది. ఏడాది కిందటే మరో సంస్థ నుంచి సరతొవ్ ఎయిర్ లైన్స్ కొనుగోలు చేసింది. ప్రమాదంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. కాలం చెల్లిన విమానాలను నడుపుతుండడంతో రష్యాలో ఈ తరహా ప్రమాదాలు తరచు జరుగుతున్నాయి.



విమాన శకలం

గాలిలో ప్రాణాలు

- ఎదురెదురుగా విమానాలు.. రెండింటి మధ్య దూరం 100 అడుగులే
- 27 వేల అడుగుల ఎత్తులో ఘటన.. అలారం మోగడంతో తప్పిన ముప్పు

ముంబై, ఫిబ్రవరి 11: 27 వేల అడుగుల ఎత్తులో వెళ్తున్న రెండు విమానాలు ఆకాశంలో ఎదురెదురుగా 'ఢీ'కొనబోయాయి. రెండు విమానాల మధ్య దూరం 100 అడుగులు ఉండగా ప్రమాద నివారణ అలారం మోగడంతో పెను ప్రమాదాన్ని నివారించారు పైలెట్లు. ఆ క్షణకాలంలో పైలెట్లు ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ఘోరమే జరిగిపోయేది. ఈ ఘటనపై విమాన ప్రమాద దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేపట్టింది. ఈ నెల 7 న రాత్రి 8 గంటల సమయంలో విస్తారా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం 152 మంది ప్రయాణికులతో ఢిల్లీ నుంచి పూణె వెళ్తోంది. అదే సమయంలో ఎయిరిండియాకు చెందిన విమానం 109 ప్రయాణికులతో ముంబై నుంచి భోపాల్ వెళ్తోంది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) నుంచి అందిన సూచనల ప్రకారం ఎయిర్ ఇండియా విమానం 27 వేల అడుగుల ఎత్తులో వెళ్తోంది. విస్తారా మాత్రం 29 వేల అడుగుల ఎత్తులో వెళ్లాల్సి ఉంది. ఆ విమాన పైలెట్లు ఈ సూచన పాటించకుండా 27 వేల అడుగుల ఎత్తులో వెళ్తుండటంతో ఈ ఘటన చోటు చేసుకుంది.

ఉగ్ర దాడిలో మరో నలుగురి మృతి

సైనిక శిబిరంలో క్వార్టర్ల వద్ద మృతదేహాల గుర్తింపు.. ఆరుకు చేరిన మృతుల సంఖ్య

- అమరులైన మరో జేసీవో, ఇద్దరు జవాన్లు
- మహిళలు, పిల్లలు సహా 10మందికి గాయాలు

జమ్మూ, ఫిబ్రవరి 11: జమ్మూలోని సుంజువాన్ సైనిక శిబిరంపై ఉగ్ర దాడి ఘటనలో మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జేసీవో, ఇద్దరు జవాన్లు, ఓ జవాను తండ్రి మృతదేహాలను సైనిక శిబిరంలోని సిబ్బంది క్వార్టర్ల పరిసరాల్లో ఆదివారం కనుగొన్నారు. వీరిని హవల్దార్ హబీబు-ఉల్లా ఖురొషి, నాయక్ మంజూర్ అహ్మద్, లాన్స్ నాయక్ మహమ్మద్ ఇక్బాల్, ఇక్బాల్ తండ్రిగా గుర్తించారు. శనివారం వేకువజామున భారీగా సాయుధులైన జైషే మహమ్మద్ ఉగ్రవాదులు సైనిక శిబిరంలోకి చొరబడి విచక్షణారహితంగా కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. సిబ్బంది క్వార్టర్లు ఉన్న వెనుక వైపు కంచెను కత్తిరించి ప్రవేశించారు. ఉగ్ర దాడిని ఎదురొడ్డే ప్రయత్నంలో ఇద్దరు సుబేదార్లు మదన్‌లాల్ చౌదరి, అష్రఫ్ మీర్ అమరులయ్యారు. వీరి మృతదేహాలను శనివారం రాత్రే గుర్తించారు. వెనువెంటనే ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగి ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. దీంతో ఉగ్రవాదులు ఎటూ కదల్లేక కాల్పులను ఆపి వేర్వేరు క్వార్టర్లలో నక్కారు. క్వార్టర్లలోని సైనిక సిబ్బంది కుటుంబసభ్యులను బుల్లెట్‌ప్రూఫ్ వాహనాల్లో భద్ర తా దళాలు సురక్షిత ప్రదేశానికి తరలించడం ప్రారంభించా యి. శనివారం రాత్రికల్లా ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. వీరి నుంచి ఏకే-56 రైఫిల్స్, గ్రెనేడ్ లాంచర్, గ్రెనేడ్లు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కూడా ఆర్మీ కుటుంబాల తరలింపు, ఆపరేషన్ కొనసాగింది. సువిశాలమైన క్వార్టర్ల ప్రాంతంలో గాలిస్తుండగా జేసీవో, ఇద్దరు జవాన్లు, ఓ జవాను తండ్రి మృతదేహాలను గుర్తించారు. దీంతో ఉగ్ర దాడిలో మరణించిన వారి సంఖ్య ఆరుకు చేరింది. ఆరుగురు మహిళలు, పిల్లలు సహా పది మంది గాయపడ్డారు. ముష్కరులను మట్టుబెట్టడానికి ఆపరేషన్ కొనసాగుతోందని, కొన్ని గంటల్లోనే విజయవంతంగా ముగుస్తుందని హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఉగ్ర దాడిని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఖండించారు. ప్రజలంతా సైనికులకు, వారి కుటుంబాలకు మద్దతుగా నిలబడాలని కోరారు. భద్రతా దళాలపై తరచూ దాడులు జరగడం విచారకరమని యశ్వంత్ సిన్హా అన్నారు. ఇటువంటి దాడులు ఉగ్రవాదుల విషయంలో కేంద్రం చేపట్టిన చర్యలు ఫలితాన్నివ్వలేదని సూచిస్తాయన్నారు. కాగా, రజౌరి, పూంఛ్ జిల్లాల్లో ఎల్‌ఓసీ వెంబడి గ్రామాలపై పాక్ సైన్యం నాలుగో రోజు కాల్పులకు తెగబడింది. జేకేఎల్‌ఎఫ్ వ్యవస్థాపకుడు మహమ్మద్ మక్బూల్ భట్ వర్ధంతి సందర్భంగా శ్రీనగర్, కుప్వారా జిల్లాల్లో ముందు జాగ్రత్తగా అధికారులు ఆంక్షలు విధించారు.



సుంజువాన్ సైనిక శిబిరంపై ఉగ్రదాడిని నిరసిస్తూ ఆదివారం జమ్మూలో పాకిస్థాన్ జెండాను తగులబెడుతున్న హిందూ నేషనలిస్ట్ డోగ్రా ఫ్రంట్, శివసేన కార్యకర్తలు

భద్రతా దళాలకు ప్రజల బాసట

సైనిక శిబిరం వద్ద మిలిటరీ ఆపరేషన్ ఆదివారం రెండో రోజుకి చేరింది. జమ్మూలోని సైనిక్ కాలనీ ప్రజలు ఇక్కడ పహారా విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు, పారా మిలిటరీ సిబ్బంది, విలేకరులకు టీ, ఫలహారం, భోజనం సమకూరుస్తున్నారు. ఆ కాలనీ ప్రజలంతా కలిసి భద్రతా సిబ్బందికి బాసటగా నిలవడం ప్రశంసలు అందుకుంటోంది.

ఒట్టి చేతులతో పోరాడాడు

బిడ్డ, బంధువులను కాపాడిన సుబేదార్ చౌదరి

ఎదురుగా భారీగా సాయుధులైన ముష్కరులు... ఇటు ఒట్టి చేతులతో సుబేదార్ మదన్ లాల్ చౌదరి! ఉగ్రవాదుల తుపాకుల నుంచి తూటాలు దూసుకొస్తున్నా.. ఛాతీలోకి దిగబడుతున్నా.. రక్తమోడుతున్నా చౌదరి చలించలేదు. ఉగ్రవాదులకు ఎదురొడ్డి నిలిచి.. క్వార్టర్‌లోకి చొరబడకుండా అడ్డుపడ్డాడు. భార్య, కూతురు, బంధువుల ప్రా ణాలు కాపాడాడు. కుటుంబసభ్యులు క్వార్టర్ వెనుక వైపు నుంచి పారిపోయే వరకు ఉగ్రవాదులను నిలువరించాడు. కూతురు నేహ (20)కు కాలిలో బుల్లెట్ దిగింది. మరదలు పరంజీత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చౌదరి వీరోచితంగా పోరాడి ఉండకపోతే ఉగ్రవాదులు అతని కుటుంబసభ్యులు అందరి ప్రాణాలూ తీసి ఉండేవారు.

గత ప్రభుత్వాలు సాధించింది శూన్యం: మోదీ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

భారతదేశంలో గత 70 ఏళ్ల పాలనా విధానాలతో.. అభివృద్ధి లేమితో, అవినీతి, కుంభకోణాలతో ప్రజలు విసుగెత్తిపోయి మార్పు కోరుకుంటున్నారని.. వారి నమ్మకాన్ని తాము వమ్ము చేయనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ దుష్పరిపాలన, అవినీతి, కుంభకోణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా దేశ పరువు ప్రతిష్ఠలు దెబ్బతిన్నాయని.. ఆ ముద్రను పోగొట్టడానికి తమ ప్రభుత్వం కష్టపడి పనిచేస్తోందన్నారు. ఒమాన్ రాజధాని మస్కట్‌లోని సుల్తాన్ ఖబూస్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రవాస భారతీయుల సభలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఆకాంక్షల మేరకు, పేదల్లోకెల్లా పేదలూ తమ కలలను నెరవేర్చుకోగలిగే నూతన భారత్ దిశగా తాము కృషి చేస్తున్నామని, అందుకోసం నిజాయతీగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని తెలిపారు. గతంలో ఖజానాకు ఎంత నష్టం వాటిల్లిందని అడిగేవారని.. ఇప్పుడు ఎంత వచ్చిందని అడుగుతున్నారని, దీని కంటే ఇంకేం మార్పు కావాలని మోదీ అన్నారు. గత 70 ఏళ్లలో దేశంలో అభివృద్ధి జరగలేదని.. డ్యామ్‌లు కడితే కాలువలు లేవని.. తీగలు ఉంటే విద్యుత్ లేదని.. రోడ్లు లేవని మోదీ విమర్శించారు. తమ ప్రభుత్వం భారత్ మాల క్రింద సమగ్ర రహదారుల వ్యవస్థను ఏర్పాటు చేసి 53 వేల కిలోమీటర్ల హైవేలను నిర్మిస్తోందని, 11 నగరాలలో మెట్రో రైళ్ల పనులు జరుగుతున్నాయని, సాగర మాల క్రింద 110 జలమార్గాలను గుర్తించామని చెప్పారు. గత ఏడు దశాబ్దాల పాలనలో దేశంలో కేవలం 450 విమానాలుండగా.. గత ఒక్క సంవత్సరంలో మాత్రమే భారత దేశం 900 విమానాలకు ఆర్డర్లు ఇచ్చిందని చెప్పారు. ప్రభుత్వపరంగా ఒమాన్‌లో ఒక రాయబారి మాత్రమే ఉంటారని కానీ దేశం పక్షాన ప్రతి ఒక్క భారతీయుడు రాయబారేనని అన్నారు.

నవభారతం నిర్మిస్తాం..

'భారత్‌లోని 125 కోట్ల జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు యువతే. సాంకేతికతతో యువతకు సాధికారత కల్పించి.. నవభారతాన్ని సాకారం చేస్తాం' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లో పర్యటించారు. దుబాయ్‌లో జరిగిన ప్రపంచ ప్రభుత్వాల సదస్సులో ప్రసంగించారు. యూఏఈలో నివసిస్తున్న ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. ఆ దేశ ఉపాధ్యక్షుడు, ప్రధాని, దుబాయ్ పాలకుడు షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఆయా సందర్భాల్లో మాట్లాడుతూ.. సుపరిపాలనకు సాంకేతికతను జోడిస్తే.. సమాన వృద్ధి, అందరి అభివృద్ధి అన్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధ), నానో టెక్నాలజీ, సైబర్ భద్రత, క్లౌడ్ కంప్యూటింగ్‌లో నాయకత్వం సాధించేందుకు భారత్ కృషిచేస్తోందని తెలిపారు. సైబర్‌స్పేస్ ఉగ్ర ఛాందసవాదం వ్యాప్తికి దోహదపడుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. 'మానవజాతి ప్రకృతిని జయించడానికి టెక్నాలజీని సాధనంగా ఉపయోగించుకుంటోంది. అదే సమయంలో ఆ ప్రకృతిపైనే పోరాటానికి దిగే పొరపాటు చేస్తోంది. ప్రకృతితో విభేదించకుండా దానితో సహజీవనం చేసే మార్గాన్ని కనుగొనాలి' అని ప్రధాని అన్నారు. అబూదాబీలో తొలిసారి ఓ హిందూ ఆలయం నిర్మితం కానుంది. బొచసన్ వాసి శ్రీ అక్షర్ పురుషోత్తం స్వామి నారాయణ్ సంస్థాన్ (బీఏపీఎస్) ఆధ్వర్యంలో నిర్మితమయ్యే ఆలయానికి మోదీ శంకుస్థాపన చేశారు. ప్రపంచ ప్రభుత్వాల సదస్సు సందర్భంగా ఫ్రెంచ్ ప్రధాని ఎడ్వర్డ్ ఫిలిప్‌తో మోదీ భేటీ అయ్యారు.



మోదీని స్వాగతిస్తున్న అబుధాబి యువ రాజు నహ్యాన్

నీట్‌లో ఉత్తీర్ణులైతేనే విదేశాల్లో మెడిసిన్!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: భారత్‌లో మెడిసిన్ చేయాలంటే 'నీట్'లో ఉత్తీర్ణత సాధించాలి. విదేశాల్లో మెడిసిన్ చేయాలంటే ఎలాంటి పరీక్ష అవసరం లేదు. కానీ ఇకపై విదేశాల్లో మెడిసిన్ చదవాలనుకున్న వారికీ నీట్ తప్పనిసరి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం కార్యాచరణ సిద్ధం చేసినట్టు అధికారులు చెబుతున్నారు. నీట్‌లో ఉత్తీర్ణత సాధించి విదేశాల్లో మెడిసిన్ చేసి వస్తే ప్రాక్టీసు చేసుకునేందుకు భారతీయ వైద్య మండలి అనుమతి ఇచ్చేలా మార్పులు చేయనున్నట్లు తెలిపారు.

నీట్ వయోపరిమితిపై ఆందోళన

హైదరాబాద్/అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం సీబీఎస్‌ఈ విడుదల చేసిన నీట్ నోటిఫికేషన్‌లో వయోపరిమితి విధింపుపై వైద్య విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యను అభ్యసించేందుకు వయో పరిమితి ఎందుకని ప్రశ్నిస్తున్నారు. నోటిఫికేషన్‌లో.. 1993, మే 7 నుంచి 2002 జనవరి 1 మధ్య పుట్టిన జనరల్ విద్యార్థులు, 1988 మే 7 నుంచి 2002 జనవరి 1 మధ్య పుట్టిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులు నీట్‌కు అర్హులని పేర్కొన్నారు. గతేడాది కూడా ఇలాంటి నిబంధనే విధించినప్పుడు విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. చదువుకు వయోపరిమితి ఏంటని కోర్టు ప్రశ్నించింది. దీంతో దరఖాస్తు చివరి తేదీకి ఒకరోజు ముందు దాన్ని ఎత్తివేస్తూ దరఖాస్తు గడువును పొడిగించారు. అయితే, మళ్లీ ఈ ఏడాది వయోపరిమితి విధించడం గమనార్హం. ఈ అంశంపై ఆందోళనబాట పట్టేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు.

బాబ్రీపై రాజీ లేదు

- కూల్చినా అది మసీదు స్థలమే: ముస్లిం పర్సనల్ లా బోర్డు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బాబ్రీ మసీదు స్థలం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు స్పష్టం చేసింది. మసీదు స్థలానికి ప్రత్యామ్నాయం లేదని, మసీదు నిర్మాణాన్ని కూల్చివేసినా స్థలం మసీదుకు చెందినదిగానే పరిగణిస్తామని బోర్డు ప్రతినిధులు స్పష్టం చేశారు. కూల్చిన స్థలంలోనే మసీదు నిర్మించే వరకు పోరాటం చేయాల్సిందేనని తీర్మానించారు. హైదరాబాద్‌లోని ఒవైసీ ఆస్పత్రి ప్రాంగణం సాలార్ ఎ మిల్లత్ ఆడిటోరియంలో బోర్డు అధ్యక్షుడు మౌలానా మహ్మద్ రబేహసనీ నద్వీ ఆధ్వర్యంలో జరిగిన 26వ ప్లీనరీ ఆదివారం ముగిసింది.

బోర్డు నుంచి మౌలానా సల్మాన్ నద్వీ నిష్క్రమణ

బాబ్రీ మసీదు వివాదాన్ని కోర్టు బయట పరిష్కరించుకునేందుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు పండిట్ రవిశంకర్‌తో సంప్రదింపులు జరిపిన ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వర్కింగ్ కమిటీ సభ్యుడు మౌలానా సల్మాన్ నద్వీ బోర్డు నుంచి నిష్క్రమించారు.

నవ్వుపై జీఎస్‌టీ లేదు: రేణుకా చౌదరి



పణజీ, ఫిబ్రవరి 11: ప్రధాని మోదీ 'రామాయణ' వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి మరోసారి విరుచుకుపడ్డారు. 'ఎలా నవ్వాలి.. ఎప్పుడు నవ్వాలి అని.. నవ్వుపై జీఎస్‌టీ లేదు. నవ్వేందుకు నాకెవరి అనుమతీ అవసరం లేదు' అని పణజీలో అన్నారు. తాను ఐదు దఫాలుగా రాజ్యసభ ఎంపీగా కొనసాగుతున్నానని.. అలాంటి తనను మోదీ ఓ నెగెటివ్ పాత్రతో పోల్చారని.. ఇది మహిళల పట్ల ఆయన దృక్పథాన్ని చాటుతోందన్నారు.

కేసు పెండింగ్.. నో పోటీ!

- తీవ్ర నేరారోపణలపై విచారణ జరుగుతున్నా
- ఎన్నికల్లో పోటీకి అనుమతించరాదు
- చట్టసవరణకు ప్రభుత్వం నడుం బిగించాలి
- సుప్రీంకోర్టులో ఎన్నికల కమిషన్ అఫిడవిట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: తీవ్ర నేరాల్లో దోషిగా తేలిన వారు ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు! ఇది ప్రస్తుతం ఉన్న చట్టం. తమపై ఎన్ని కేసులున్నా.. దోషిగా తేలనందున దర్జాగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నవారెందరో. ఈ ధోరణిని మార్చేందుకు ఎన్నికల కమిషన్ నడుంబిగించింది. నేరం రుజువైనవారే కాక తీవ్రస్థాయిలో నేరారోపణలు ఎదుర్కొంటున్నవారు కూడా ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తోంది. ఎన్నికలకు కనీసం ఆరు నెలల ముందు కేసు నమోదై... నిందితులకు కనీసం ఐదేళ్లు జైలు శిక్ష పడేలా కోర్టులో అభియోగాలు నమోదైతే.. వారిని ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంచేలా చట్టసవరణ చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించినట్టు తెలుపుతూ సుప్రీం కోర్టుకు ఒక అఫిడవిట్ సమర్పించింది. వ్యవస్థలో మార్పు రావడానికి తాము చేస్తున్న ప్రతిపాదనలకు చట్టపరంగా ప్రభుత్వ మద్దతు అవసరమని పేర్కొంది. దోషులుగా తేలిన వారిని నిర్దిష్ట కాలం వరకూ ఎన్నికల్లో పోటీ చేయకుండా చూస్తున్నప్పుడు.. సదరు వ్యక్తులు ఆ సమయంలో రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసేందుకు ఎందుకు అనుమతిస్తున్నారంటూ అశ్విని కుమార్ ఉపాధ్యాయ అనే న్యాయవాది గతంలో సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్‌ను విచారణకు స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం.. ఈ దిశగా ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలంటూ జనవరి 8న కేంద్రాన్ని, ఈసీని కోరడంతో.. ఈసీ ఈ అఫిడవిట్ దాఖలు చేసింది. రాజకీయపార్టీల రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసే అధికారం కూడా తమకు ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్లు అందులో తెలిపింది. తమ వద్ద చాలా పార్టీలు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నాయిగానీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, అందుకే పార్టీల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసే అధికారం కల్పించేలా ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951కు సవరణ చేయాలని 20 ఏళ్ల నుంచీ కేంద్రాన్ని కోరుతున్నా ఈ దిశగా చర్యలు తీసుకోలేదని చెప్పింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై సోమవారం విచారణ జరపనుంది.

వేలకోట్లు గల్లంతు!



భారీగా కరెన్సీ ముద్రణ.. ఆర్‌బీఐకి పూర్తిగా చేరని నోట్లు.. ఆర్‌టీఐ పిటిషన్‌తో వెల్లడి

ముంబై, ఫిబ్రవరి 11: పెద్ద నోట్లను కేంద్రం ఎందుకు రద్దు చేసింది? నల్లధనాన్ని వెలుగులోకి తెచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. కానీ, ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. ప్రభుత్వ సంస్థలే వేలకోట్ల డబ్బు గల్లంతు కావడానికి కారణమయ్యాయి. మనోరంజన్ రాయ్ అనే సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) కార్యకర్త ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. 2000-2011 మధ్య కాలంలో నోట్ల ముద్రణ, వాటి చలామణికి సంబంధించి ఆర్‌బీఐ, కరెన్సీ ముద్రణ సంస్థల నుంచి సమాచారం సేకరించిన రాయ్.. భారీగా నోట్లు గల్లంతు అయినట్లు గుర్తించారు. దీంతో, ఆ మొత్తం ఎక్కడికెళ్లిందో, దానికి బాధ్యులెవరో తేల్చాలంటూ 2015లో బాంబే హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఏకంగా ప్రధానమంత్రి, ఆర్థిక, హోంమంత్రులను అందులో ప్రతివాదులుగా చేర్చారు. కాగా, పిటిషన్ నుంచి ఈ మూడు పేర్లు ఉపసంహరించుకోవాలని అప్పటి అదనపు సొలిసిటర్ జనరల్ అనిల్ సింగ్.. రాయ్‌ను కోరారు. చివరికి ఆ పిల్‌ను 2016 ఆగస్టు 23న బాంబే హైకోర్టు దీన్ని కొట్టేసింది. కానీ, వేల కోట్ల ధనం దారి మళ్లిందంటూ.. రాయ్ రివ్యూ పిటిషన్ వేశారు. దీనిపై సోమవారం విచారణ జరగనుంది. యాదృచ్ఛికమో, వ్యూహాత్మకమోగానీ.. రాయ్ పిటిషన్‌ను కోర్టు కొట్టేసిన (2016 ఆగస్టు 23) సుమారు 75 రోజుల తర్వాత ప్రధాని మోదీ నోటి నుంచి పెద్ద నోట్ల రద్దు ప్రకటన రావడం విశేషం.

పాత నోట్లను ప్రాసెస్ చేస్తున్నాం: ఆర్‌బీఐ

పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో తమ వద్దకు వచ్చిన కరెన్సీ నోట్ల విలువను, వాటి యథార్థతను(జన్యూన్) పరిశీలిస్తున్నామని రిజర్వు బ్యాంకు ప్రకటించింది. 2017 జూన్ 30 నాటికి రూ.15.28 లక్షల కోట్లు వచ్చాయని, వాటిని ప్రాసెస్ చేస్తున్నామని తెలిపింది.

'కామా' విలువ రూ.32 కోట్లు!

కామా లేక చట్టంలో గందరగోళం.. దాని ఆధారంగా కోర్టుకెక్కిన ఉద్యోగులు

- ఆలస్యంగా కళ్లు తెరిచిన అధికారులు

న్యూయార్క్, ఫిబ్రవరి 11: ఆక్స్‌ఫర్డ్ కామా(,).. దీన్ని అమెరికాలోని ఓఖరస్ట్ డెయిరీ యాజమాన్యం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది. అమెరికాలోని ఓ చట్టంలో ఆక్స్‌ఫర్డ్ కామా లేకపోవడంతో ఈ డెయిరీ యజమాన్యం రూ.32 కోట్ల భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. అమెరికాలోని మెయిన్ రాష్ట్రంలోని పోర్ట్‌లాండ్‌లో ఓఖరస్ట్ డెయిరీ ప్రధాన కార్యాలయం ఉంది. 2014లో కంపెనీకి చెందిన ముగ్గురు ట్రక్ డ్రైవర్లు తాము నాలుగేళ్లుగా ఓవర్ టైమ్ చేశామని, దానికి సంబంధించిన బకాయిలు చెల్లించేందుకు యాజమాన్యం నిరాకరిస్తోందంటూ కోర్టును ఆశ్రయించారు. మెయిన్ రాష్ట్ర చట్టాల ప్రకారం.. ఏ ఉద్యోగి అయినా 40 గంటల పాటు నిర్విరామంగా విధుల్లో ఉంటే ఆ తర్వాత పనిచేసే ప్రతి గంటకూ ఒకటిన్నర రెట్లు వేతనం చెల్లించాలి. అయితే ఆహార పదార్థాలను శుద్ధి చేసే.. నిల్వ చేసే పరిశ్రమల్లో పనిచేసే మార్కెటింగ్, స్టోరింగ్, ప్యాకింగ్ ఉద్యోగులకు, వ్యవసాయ ఉత్పత్తులు, మాంసం, చేపలతోపాటు త్వరగా పాడయ్యే ఆహారపదార్థాలను పంపిణీ చేసే విభాగాల్లో పనిచేసే వారికి ఈ చట్టం వర్తించదు. ఈ చట్టంలోని ఓ వాక్యంలో అస్పష్టతను ఆసరాగా చేసుకుని ఆ సంస్థలో పనిచేసే ట్రక్ డ్రైవర్లు కోర్టును ఆశ్రయించారు. చట్టంలో.. 'ప్యాకింగ్ ఫర్ షిప్‌మెంట్ ఆర్ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ అగ్రికల్చరల్ ప్రొడ్యూసెస్, మీట్ అండ్ ఫిష్ ప్రొడెక్ట్స్, పెరిషబుల్ ఫుడ్స్' అని ఉంది. దీని ప్రకారం రవాణా కోసం ఆహారపదార్థాలను ప్యాకింగ్ చేసే విభాగంలోని ఉద్యోగులకు మినహాయింపు ఇస్తున్నట్లు అర్థం వస్తుందే తప్ప తమను మినహాయించినట్లు చట్టంలో లేదని డ్రైవర్లు కోర్టులో వాదించారు. కోర్టు కూడా వీరి వాదనతో ఏకీభవించింది. దీంతో యాజమాన్యం ఆ ముగ్గురికి రూ.32 కోట్లు చెల్లించింది. అనంతరం కోర్టు సూచనల మేరకు మెయిన్ రాష్ట్ర అధికారులు గత ఏడాది చట్టంలో ఆక్స్‌ఫర్డ్ కామాను చేరుస్తూ చట్ట సవరణ చేశారు.

కిస్ చేస్తావా.. సెక్స్ అంటే తెలుసా?!

- రసాభాసగా రియాలిటీ షో.. నిర్వాహకులపై యువతుల ఆగ్రహం

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజధాని బెంగళూరులో ఆదివారం జరిగిన ఓ రియాలిటీ షో రసాభాసగా మారింది. మహారాణి అమ్మణ్ణి కళాశాల ప్రాంగణంలో ఓ చానల్ రియాలిటీ షో ఆడిషన్స్ నిర్వహించగా, నగరంతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన వెయ్యిమందికిపైగా యువతులు హాజరయ్యారు. ఒక్కొక్కరినే నిర్వాహకులు వేదికపైకి ఆహ్వానించారు. ఓ విద్యార్థినిని నీకేం తెలుసని ప్రశ్నించగా.. డ్యాన్స్, సింగింగ్ వచ్చంటూ సమాధానమిచ్చింది. ఇది పాటలు, డ్యాన్సుల పోటీ కాదన్న నిర్వాహకులు అంతలోనే.. నీకు సెక్స్ అంటే తెలుసా..? నాతో సెక్స్ చేస్తావా.. ఈ కుర్రాడిని కిస్ చేస్తావా..? అంటూ ప్రశ్నించారు. దీంతో కంగుతిన్న ఆ యువతి కళాశాల ప్రాంగణంలోకి వచ్చి గొడవ చేసింది. అక్కడే ఉన్న యువతుల తల్లిదండ్రులు, సోదరులు ఒక్కసారిగా నిర్వాహకులపై విరుచుకుపడ్డారు. అంతలోనే పోలీసులు రంగప్రవేశం చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు.

2019 ఎన్నికల్లో పోటీ : సుమన్

రింగురోడ్డు(విజయనగరం), ఫిబ్రవరి 11: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తానని, అయితే, ఏ పార్టీ నుంచి బరిలోకి దిగేదీ త్వరలోనే ప్రకటిస్తానని సినీ హీరో సుమన్ వెల్లడించారు. విజయనగరంలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి ఆదివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నానని చెప్పారు. అన్నం పెట్టే రైతులకు ఎవరు న్యాయం చేస్తేవారికే ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టాలని ప్రజలకు పిలుపు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆరోగ్యం, ఉచిత విద్య, అందరికీ ఉపాధి కల్పించే నేతను ఎన్నుకోవాలని సూచించనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం తాను 'అమ్మమ్మ గారింట్లో' అనే చిత్రంలో పోలీసు ఆఫీసరుగా నటిస్తున్నానని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.